# శ్రీసాంబ పంచాశిక



'శ్రీపాదుక' ఆచార్య కొల్లూరు అవతారశర్మ

శ్రీ సాంబ పంచాశికా



వ్యాఖ్యాత

'శ్రీపాదుక' ఆచార్య కొల్లూరు అవతారశర్మ

# శ్రీ సాంబ పంచాశికా





శ్రీ సూర్యనారాయణస్వామి వారి కళ్యాణమూర్తులు



శ్రీ సూర్యనారాయణస్వామి వారి నావికోత్సవము

# శ్రీ సాంబ పంచాశికా






శ్రీ శ్యామా (మాతంగి) శ్రీ లలితాదేవి శ్రీ వార్తాళి (వారాహి)

## శ్రీ సాంబ పంచాశికా

# వారణాసిలోని ద్వాదశాదిత్యులు




**1. ఓం లోలార్కాదిత్యాయనమః**
తులసీఘాట్, లోలార్క్ కుండ్



**2. ఓం విమలాదిత్యాయనమః**
ఖారీకువా



**3. ఓం సాంబాదిత్యాయనమః**
సూర్యకుండ్



**4. ఓం ఉత్తరార్కాదిత్యాయనమః**
బకరియాకుండ్



**5. ఓం కేశవాదిత్యాయనమః**
ఆదికేశవ మందిరం



**6. ఓం ఖఖోల్కాదిత్యాయనమః**
మత్స్యోదరి, కామేశ్వర మందిరం

## శ్రీ సాంబ పంచాశికా

# వారణాసిలోని ద్వాదశాదిత్యులు



**7. ఓం అరుణాదిత్యాయనమః**

త్రిలోచనేశ్వర మందిరం




**8. ఓం మయూఖాదిత్యాయనమః**

మంగళగౌరి మందిరం



**9. యమాదిత్యాయనమః**

సంకటాఘాట్



**10. గంగాదిత్యాయనమః**

లలితాఘాట్



**11. ఓం వృద్ధాదిత్యాయనమః**

మీర్ ఘాట్



**12. ఓం ద్రౌపదాదిత్యాయనమః**

సూర్యహనుమాన్ ప్రక్కన, అన్నపూర్ణ గల్లి

# శ్రీ మేధా దక్షిణామూర్తి



ఓం వటమూల నివాసాయ జ్ఞానముద్రాధరాయ చ ।
ఛిన్న సంశయ శిష్యాయ దక్షిణామూర్తయే నమః ॥

# శ్రీ లక్ష్మీహయగ్రీవాయనమః



ఓం శంఖ చక్ర మహాముద్రా పుస్తకాఢ్యం చతుర్భుజం ।
సంపూర్ణ చంద్ర సంకాశం హయగ్రీవ ముపాస్మహే ॥

శ్రీ సాంబ పంచాశికా

# సాంబపంచాశికా

మూలం

**శ్రీసాంబకవి**



**సుమారు 60 సం॥ల క్రితం నాటి**
**శ్రీ సూర్యనారాయణస్వామి వారి అలంకార రూపం**

వ్యాఖ్యాత : **"శ్రీపాదుక" ఆచార్య కొల్లూరు అవతార శర్మ**

కాశీవాసి

# కృతిసమర్పణమ్



సాంబాదిత్య స్తుతిరియమభూత్ 'సాంబపంచాశికా'ఖ్యా
మందాక్రాన్తా మమ మతిగతా సర్వశాస్త్రార్థగర్భా
హేతుంచాత్రాఽనవరతకృపాం హర్షవల్లీశ్వరస్య
మన్వానోహం మమకృతిసుతా మర్పయామ్యస్య హస్తే॥



'కాశీవాసి'

# శ్రీసాంబపంచాశికా

మూలం

## శ్రీసాంబకవి

వ్యాఖ్యానం

'సాహిత్యవిద్యాప్రవీణ','రాష్ట్రభాషాప్రవీణ' 'సంస్కృతభాషాకోవిద'

'విద్యావారిధి(పి. హెచ్.డి.) వ్యాకరణ శిక్షాశాస్త్రములు.

## "శ్రీపాదుక" ఆచార్య కొల్లూరు అవతార శర్మ

ఎం.ఏ. (సంస్కృతం)., ఎం.ఏ.(తెలుగు), బి.యస్.సి., బి.ఇడి., పి .హెచ్.డి.

అలంకారశాస్త్రము., ఆంధ్రవిశ్వవిద్యాలయ స్వర్ణపతక గ్రహీత,

శ్రీపీఠపురస్కారగ్రహీత, శ్రీకల్యాణానందభారతీపురస్కారసమ్మానితుడు,

విశ్రాంత సంస్కృతాచార్యులు,

కాశీవాసి

అన్నిహక్కులు గ్రంథకర్తవి.

మార్చి 2019

ప్రతులు : 1000

ప్రతులకు : ఇప్పిలి ప్రభాకరరావు,
అరసవల్లి - 532 401
ఫోన్ నెం. : 9848429513, 7013002875

ముద్రణ : శ్రీ కృష్ణా గ్రాఫిక్స్, శ్రీకాకుళం, 9440002025

## సూర్యకుణ్డము - వారణాశి



## సాంబాదిత్యుడు - వారణాశి





శ్రీశ్రీశ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థానం
Office : 42/372-4, Bhagyanagar Colony, Kadapa - 516 002 Ph : 08562 245201
Office : 1-10-176/B, Beside Varun Motors, Begumpet, Hyderabad. 500016 (T.S)
Phone : 040-27766992 / 3 E-mail : sripushpagirimottoffice@gmail.com



శ్రీ విద్యా శంకర భారతి మహాస్వామి

శ్రీ విద్యా శంకర ప్రసన్నః

సత్యస్య వచనం శ్రేయః సత్యాదపి హితంవదేత్ యద్భూతహితమత్యన్తమ్ ఏతత్ సత్యం మతం మమ

**సాంబ పంచాశికా** అను ఈ గ్రంధం జగసాక్షి ఐన శ్రీ సూర్య నారాయణుని యొక్క పరబ్రహ్మ తత్వమును తెలుపుచున్నది.ఈ గ్రంధము శ్రీ కృష్ణుడి కుమారుడైన సాంబుడు తనకు వచ్చిన కుష్టు రోగమును తొలగించుకొనుటకు శ్రీకృష్ణుడి ఆదేశానుసారంగా సుర్యారాధన చేసినట్టు వ్యక్తమౌచున్నది.సాంబుడు శ్రీ సూర్య పరమాత్మను 50 శ్లోకములతో స్తుతించుటయే ఈ **సాంబ పంచాశికా.**ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్ అను వేద వచన ప్రమాణంగా సుర్యారాధన వలన సమస్త మానవాళికీ ఆయురారోగ్యములు కలుగుననడంలోఎట్టి సందేహము లేదు .అట్టి సూర్య భగవానుడి సుప్రసిద్ధ క్షేత్రమైన అరసవెల్లి మన ఆంధ్రరాష్ట్రంలో లో ఉండటం మన అదృష్టం.

అట్టి దేవాలయ ఆనువంశిక అర్చకత్వమును వంశ పరంపరాగతం గా శ్రీవిద్యా , సూర్యోపాసన దీక్షలలో నిష్ణాతులైన శ్రీ ఇప్పిలి బాల సుబ్రమణ్యశాస్త్రి గారి సంకల్పం ఈ గ్రంధం , వారి హఠాన్మరణం తరువాత మిగిలిన శేషవ్యాఖ్యానమును కాశీవాసులైన శ్రీ కొల్లూరు అవతార శర్మ గారు శ్రీ పాదుకా అను వ్యాఖ్యతో సంపూర్ణ పరచడం సుర్యానుగ్రహం .వారిరువురూ ఈ గ్రంధం ద్వారా సమస్త మానవాళికీ సుర్యానుగ్రహాన్నిపంచారు .అట్టి హితం చేకూర్చిన ఇప్పిలి వంశస్తులకు కొల్లూరి అవతార శర్మ గారికి శ్రీ శారదా చంద్రమౌళీశ్వరుల యొక్క పరిపూర్ణ ఆశీర్వాద బలంచే ఇతోధిక గ్రంధములు అందించాలని అశీర్వదిస్తున్నాము.

ఇతి నారాయణ స్మృతయః

శ్రీ

శ్రీ శ్రీ శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థానం

తేది : 05-04-2019

క్షేత్రం : భాగ్యనగరం

Om Namo Venkatesaya

**Prof. B. VISWANADH**, M.A., Ph.D., D.Litt.,
**DIRECTOR**
**ANNAMACHARYA PROJECT**
**TIRUMALA TIRUPATI DEVASTHANAMS**
**TIRUPATI - 517 501 - A.P.**

☎ Office : 0877 - 2264500
Mobile : +91 76740 14277 (O)
+91 94154 47563 (P)
e-mail : viswanadhbhu@gmail.com

Date ............02.08.2019

## సాంబ పంచాశికా

శ్రీ ఆచార్య కొల్లూరు అవతారశర్మగారు కాశీవాసిగా నుతికెక్కి తాను నిత్యము ఉపాసించే రుద్రాంకితుడు భగవానునిపై రచన చేసారు. శ్రీ శర్మగారి వ్యాఖ్యానం ద్వారా సాధారణ భక్తులతో పాటు పండితులను సైతం ఆలోచింపజేస్తూ జీవాత్మ పరమాత్మల గురించి సవివరంగా తెలియచేసి కృతకృత్యులయ్యారు. "అన్నిమంత్రములు ఇందే ఆవహించెను" అన్నట్లుగా వీరి ప్రతి అక్షరములోను, పదములోను ఆధ్యాత్మికత వుట్టిపడుతుంది.

ఆదిత్య తత్త్వాన్ని శర్మగారు వచించిన తీరు రుద్రతేజస్సుతో కూడి వున్నాయి. ఈ సాంబపంచాశికా (50 శ్లోకాలు) సాక్షాత్తు శ్రీ కృష్ణునికి–జాంబవతికి కలిగిన కుమారుడైన సాంబుడు తనకు కలిగిన అనారోగ్యానికి శ్రీ కృష్ణుని ఆదేశంతో కాశీలో ఆదిత్యునికి నివేదించినట్లు, తద్వారా రోగవిముక్తుడైనట్లు తెలుస్తున్నది. శ్రీ సాంబపంచాశికాలోని పదిశ్లోకాలు శ్రీ కృష్ణుడు సాంబునికి యుపదేశించినట్లు తెలుస్తుంది. తదుపరి శ్లోకాలలో చిదాదిత్యదేవుని సాంబుడు ముగ్ధమనోహరంగా కీర్తించాడు.

"సర్వాఙ్గీణ: సకల వపుషామన్తరేయోన్తరాత్మా" పరమాత్మ స్వరూపుడైన ఆదిత్యుని స్వర్వప్రాణులలో నీవే అంతరాత్మగా, సర్వాంతర్యామివై ప్రకాశించుచున్ననూ, విచక్షణాజ్ఞాన శూన్యులైన అజ్ఞానులకు అరణికట్టెయందున్న అగ్నివలె కనబడుతున్నట్లు కీర్తించారు. జ్యోతిరూపమున అగ్నివలె కనబడుతున్నట్లు కీర్తించారు. జ్యోతిరూపమున ప్రకాశించు వాడైన ఆదిత్యునికి సాష్టాంగ నమస్కారములు తెలియజేశాడు వినమ్రతతో సాంబుడు.

స్తోతాస్తుత్య: స్తుతిరితి భవాన్ అనే శ్లోకంలో ఆదిత్యుడు సృష్టి స్థితిలయకర్తృత్వములను నిర్వహించుటకు ఆవిర్భవించిన వాడుగా కీర్తింపబడ్డాడు. – సప్తసప్తి గురించి శర్మగారు వివరిస్తు 'సప్త సప్తి' సప్తాశ్వములు గలవాడు. సూర్యదేవుడు. సూర్యదేవుని యొక్క విశ్వరూపము సప్తసంఖ్యాసమన్వితముగా ప్రవచించబడిన వైనము అత్యద్భుతము. సప్తతాళములు, సప్తసముద్రములు, సప్తర్షులు, సప్తనగములు, సప్తద్వీపాలు, సప్తఆధులు, సప్తబీజములు, సప్తఛందస్సులు, సప్త భూతములు, సప్తస్వరములు వంటి సప్త సంఖ్యాకముల గురించి ఇందులో సోదాహరణగా తెలియచేశారు శర్మగారు.

శర్మగారు చివరిగా శ్రీ సాంబుడు గారిని వ్యాసుడు, శుక బ్రహ్మలవంటి మహామహితాత్ముల తో పోల్చారు. రససిద్ధుడుగా ఖ్యాతినిపొందిన సాంబుని సాంబ పంచాశికా అనే స్తుతికావ్యమును 'ఆనందామృతరసకలశం' గా లోకానికందిచారు శ్రీ అవతారశర్మగారు.

ఈ గ్రంథం యావత్ భారతంలో సర్వభాషాకోవిదులను కూడా అలరిస్తున్నది అన్నది అతిశయోక్తి గాదు. సాంబపంచాశికా ను జగత్తుకందించిన శ్రీ శర్మగారిని తిరుమల శ్రీ లక్ష్మీసమేత శ్రీనివాసుడు, శ్రీవిశాలాక్షీసమేత కాశీవిశ్వేశ్వరుడు సకల శోభితామూర్తిగా వినుతికెక్కేవిధంగా ఆశీర్వదించుగాక.

ఇట్లు
బుధజన విధేయుడు

काशी हिन्दू विश्वविद्यालय BANARAS HINDU UNIVERSITY
AN INSTITUTION OF NATIONAL IMPORTANCE ESTABLISHED BY AN ACT OF PARLIAMENT

**ఆచార్య. భారతుల శారదాసుందరి**
**అధ్యక్షులు-తెలుగు విభాగం**
**కాశీ హిందూ విశ్వవిద్యాలయం**
**వారణాసి.**

ది.31-7-2019

# మానసోల్లాసము

శ్రీపాదుకాసముల్లసితమైన 'సాంబపంచాశిక'ను నేను సాంతము పరిశీలించి ధన్యురాలనయ్యాను. నాకీ అవకాశమును సముపకల్పించిన 'కాశీవాసి' శ్రీపాదుక. ఆచార్య కొల్లూరు అవతారశర్మ గారికి ముందుగా కృతజ్ఞతాభివందనములను సమర్పిస్తూ నా 'స్పందన'ను అక్షరరూపంలో ఇలా ఆవిష్కరిస్తున్నాను. సరే!

శ్రీశర్మగారు నాకు గురుకల్పులు. వారు తమ శ్రీపాదుకా వ్యాఖ్యకు క్లుప్తంగా అభిప్రాయమును వ్రాయగోరినారు. వారి వచనము నాకు శిరోధార్యము. వారి యాదేశము మేరకు వారి వ్యాఖ్యానమునకు స్వాభిప్రాయమును వెలువరించే సాహసం చేస్తున్నాను.

'సాంబపంచాశిక'- ఇది సాంబుని కృతి. కాశీస్థుడైన సాంబాదిత్యుని నుతి. మందాక్రాన్త దాని ఛందోగతి. దానికి కాశీవాసి శ్రీపాదుకా వివృతి. దానికి నా అభిమతిని జోడించే సుగతి. యథామతి రెండు మాటలు వ్రాసే ప్రయత్నం చేస్తాను.

సాంబాదిత్యస్తుతి ప్రతిపాద్యమని చెప్పుకున్నాం. సాంబుడు శ్రీకృష్ణునికి జాంబవతికి జన్మించిన పుత్రుడు. జితమన్మథాకారుడు. తండ్రియాదేశమున కాశీకి వచ్చి ఆదిత్యునారాధించి కృతకృత్యుడైనాడు. ఈ వృత్తాంతము కాశీఖండములో కనిపిస్తుంది. సాంబుడు బహుశాస్త్రవిదుడు. ఈ విషయమాతని స్తుతిలో ప్రత్యక్షరదర్శనంగా సుస్పష్టమవుతుంది. జగన్నాథపండితుడు చెప్పినట్లు యిందలి ప్రతిశబ్దము రసాత్మకమైన ఒక మహాకావ్యమే! రససిద్ధినిపొందిన మా గురువర్యులు అవతారశర్మగారివంటి తపశ్శాలురు, ఉపాసకులకు మాత్రమే సాంబపంచాశికకు వ్యాఖ్యానము చేసే అర్హత ఉంటుందని నా అభిప్రాయము. మంత్ర, తంత్ర, ఉపాసనారహస్య గర్భితమైన ఈ స్తుతికావ్యం శ్రీపాదుకా వ్యాఖ్యానం ద్వారా అస్మదాదులకు ప్రవేశయోగ్యమైంది. వ్యాఖ్యానంవల్ల సాంబుని హృదయం- అంటే, తానుపాసించిన ఆదిత్యమూర్తి, గ్రహాధినాథుడైన లౌకికాదిత్యమూర్తి మాత్రమే కాదు, హృదాకాశములో ఉపాసకులకు వారి యోగ్యతానుసారముగా దర్శనమననుగ్రహించే పరమాత్మ, పరబ్రహ్మ స్వరూపుడైన చిద్భానుమూర్తి యని- ప్రతిశ్లోకంలో, ప్రతిపదంలో, ప్రత్యక్షరంలో సుస్పష్టం చేయబడినది. దీనికి కారణం స్వగురు దేవతానుగ్రహలబ్ధమైన యత్కించిత్పరిజ్ఞానలేశమే తప్ప తనదైన పాండితీప్రాభవము కానేకాదంటారు శ్రీపాదుక. అది వారి హృదయం.అస్తు.

తమ శ్రీపాదుకా వాఖ్యాసమలంకృతమైన రచనను అరసవల్లి సూర్యనారాయణమూర్తికి అంకితమిచ్చినట్లు చెప్పుకున్న తొలిశ్లోకంలోనే వారీవిషయాన్ని అద్భుతంగా ప్రస్తావిస్తారు. ఆ కృతిసమర్పణశ్లోకం యొక్క ఆకృతి మందాక్రాన్తా వృత్తం. సాంబకవి స్తుతి పూర్తిగా మందాక్రాన్తలో నడిస్తే శ్రీపాదుకా సమర్పణకూడా మందాక్రాన్తలోనే జరిగింది. ఇందులో మందాక్రాంతా పదవిశ్లేషణం అద్భుతమైన శ్రీపాదుకా పదవిన్యాసంగా గోచరస్తుంది. మందాక్రాంతా శబ్దాన్ని వారు 'భగవత్కృపచే మందుడనైన నాయందాక్రమింపజేయబడిన (మందే మయి ఆక్రాన్తా) అనియు, మందేన మయా ఆక్రాన్తా- అనగా మందుడనైన నాచే సంపూర్ణముగా సంక్రమించబడిన వ్యాఖ్య అనిన్నీ, మందాక్రాంతకు

సాటి అదే అని అనన్వయాన్ని తమ వినయాభివ్యక్తిద్యోతకంగా దర్శింపజేస్తారు. మందాక్రాంతమని నిర్వచించినా పంచలక్షణపరిపుష్టితో వ్యాఖ్యానము సాంతము సలక్షణంగా సాగింది.

ఇది శ్రీపాదుకాముద్రాంకితమైన తొలిపద్యమైతే, శ్రీపాదుకా పదవిన్యాసరూపంగా వ్యాఖ్యానమంతా శ్రీశారదా పదమంజీరశిఞ్జానమే! పరదేవతాకృపాసింధువీచికా సమున్మేషమే! సాంబాదిత్యమరీచిదీధితీ సముల్లాసమే! వ్యాఖ్యానమాద్యంతమూ అనేకానేక నిగూఢ మార్మిక మంత్రశాస్త్రరహస్యవివేచనములతో, చక్కని చిక్కని శబ్దశాస్త్ర విశ్లేషణలతో, జిజ్ఞాసువులకు, రసజ్ఞులైన సహృదయులకు సమగ్రముగ స్వాంతసంతర్పణము చేస్తుందనే విషయం పాఠకులకందరకు విదితము కాగలదు.

మొదటిశ్లోకములో చిద్భానుని 'దోలాలీల్లోసిత హృదయ'త్వము, రెండవ శ్లోకములో 'శబ్దార్థత్వవివర్తమాన పరమజ్యోతిగా నతడు నడిపిస్తున్న విద్యాస్యందనోన్నయనము', మూడవ శ్లోకములో జాగ్రత్స్వప్నసుషుప్తులలో విశ్వతైజసప్రాజ్ఞులుగా తురీయుడైన ప్రత్యగాత్మగా హృదాకాశంలో ప్రకాశిస్తున్న చిదాదిత్యుణ్ణి-'జీవాదిత్యం తమహమతనుం చిన్నభస్థం నమామి'-అని సంభావించిన సాంబకవి హృదయాన్ని తెనుసుకోవాలంటే, శ్రీపాదుకనాశ్రయించవలసినదే! ఇది గ్రంథాది.

మధ్యగతములైన రెండుమూడు శ్లోకాలను దర్శిద్దాం. 'యత్తద్వేద్యం...'అనే 23వశ్లోకంలో శరణాగతి చేసిన తనచే అప్రయత్నంగా సాంతము సజావుగా కృతిని నడిపిస్తున్న ఆదిత్యదేవుని అపారకృపావిలాసాన్ని సాంబకవి వర్ణించిన వైనము, 'యే పాతాళోదధి...'అనే 25వ శ్లోకంలో ఆదిత్యుని విశ్వరూపము సప్తసంఖ్యానంతో సమన్వయిస్తూ అవతారశర్మగారు చేసిన వ్యాఖ్యానం వారి అపారపాండితీప్రాభవముతోకూడిన నైఘంటుకపరిచయముతో చేసిన భావానువాదము యెంతటి పండితునైనను శ్లాఘాశిరకంపమునకు వివశుని గావిస్తుందనడమతిశయోక్తి కాబోదు.'సోమం పూర్ణామృతచరుం..'అనే 29వశ్లోక వాఖ్యానంలో 'బ్రహ్మాణ్డాంతర్గృహపతి' గా వర్ణింపబడిన ఆదిత్యమూర్తిలో 'కాశీవాసి'గా వానప్రస్థాశ్రమంలోనున్న తమ స్వస్వరూపాన్ని తలపింపచేశారనిపిస్తుంది.

గ్రంథాంతాన్నికూడా కొద్దిగాపరామర్శిస్తే శ్రీపాదుకాపదవిన్యాసాన్ని సాంతము సందర్శించినవారమౌతాం. చివరగా 49వశ్లోకంలో తనకుపాసనకు సహకరించిన ఇంద్రియములకు ముక్తిని ప్రసాదించవలసినదిగా సాంబుదాదిత్యుని అభ్యర్థించుటలోని ఔచిత్యచమత్కారములను, 50వ శ్లోకములో తన కృతికి సంబంధించిన కర్తృత్వభోక్తృత్వములు ఆదిత్యమూర్తివేయని, తాను నిమిత్తమాత్రుడనని తెలియజేసిన వైనము, 52వశ్లోకములో సేతుబంధస్థితిని, దివ్యకరణబంధాద్యుపాసనారహస్యములను, ఇలా యెన్నెన్నో విషయాలను ప్రతిపదంలో విశదీకరిస్తూ శ్రీశర్మగారు వాఖ్యానాన్ననరిస్తూ తనననుగమిస్తున్న సహృదయపాఠకులందరను సాంబునివలె సుశ్రీమంతులై, శ్రద్ధాభక్తిసమన్వితులై, చరమశ్లోకోపవర్ణితమైన ఫలశ్రుతిని, అనగా సాంబాదిత్యుని అనుగ్రహముచే శుకబ్రహ్మవలె నేరుగా మార్తాణ్డమణ్డలమును ప్రవేశించి సాయుజ్యముక్తిని పొందుటకు అర్హతనుపకల్పించి, సుకృతులైనారని చెప్పవచ్చు. సాంబనుకవి చివరగా- 'పరమరహస్య శ్లోకపంచాదశద్వైషా...'అనే చరమశ్లోకములో తన పంచాశత్(50)శ్లోకపరిమితమైన ఈ స్తోత్రము శ్రద్ధాళువులైన భక్తులను తల్లివలె అక్కునకు చేర్చుకుని ముక్తిననుగ్రహిస్తుందని చెప్పబడినది.

ఆవిధమైన భక్తిశ్రద్ధాప్రపత్తులతో అర్థజ్ఞానసమన్వితమైన, సమగ్రమైన సంస్తుతి చేయదలచినవారికి శ్రీపాదుకావ్యాఖ్యాసమాశ్రయణము తప్ప గత్యంతరములేదని నా నిశ్చితాభిప్రాయము.

ఇట్లు,

విబుధజనవిధేయ,

(సం)శారదాసుందరి భాగవతుల.

**ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు**
తెలుగు విభాగం
కాశీ హిందూ విశ్వవిద్యాలయం
వారణాసి. ది.15-07-2019.

# హృల్లేఖ

త్రిసంధ్యల్లో అంతరిక్షాన్ని చూచిన ప్రతివాడు నవనవోన్మేషమైన దర్శనలాలసతో పులకించి, "శక్యమంబరమారుహ్య మేఘసోపానపంక్తిభిః కుటజార్జునమాలాభిః అలంకర్తుం దివాకరమ్" అని వాల్మీకిహృదయస్థుడైన రాముడౌతాడు. సూర్యమండలాకర్షణకు లోనైన మయూరుడు ఏకంగా శతకమే వ్రాశాడు. విశ్వనాథ 'వెలుగు మరొక్క పేరఖిలవిద్యలకు' అంటూ సూర్యుణ్ణి వేదనారాయణునిగా కీర్తించాడు. సూర్యకిరణాలను, రథాన్ని, సారథిని, అశ్వాలను, మండలాన్ని మంత్రద్రష్టలైన ఋషులే కాదు, మహాకవులుసైతం ఊర్ధ్వగమనాభిలాషులై సూర్యోపాసన చేశారు. అఘనిఘ్నత, ప్రాణజ్ఞానదాతృత్వం, కాలాద్యవచ్ఛిన్నత, మోక్షప్రదాతృత్వము వంటి లక్షణాలతో సూర్యుణ్ణి భావనచేసి ఉపాసించి కవులు మయూరాలై నర్తించారు. ఋషులు మంత్రగ్రామద్రష్టలై, పక్షులై ఆకాశంలో ఎగిరి నక్షత్రమండలం చేరుకున్నారు. 'అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయామృతమశ్నుతే' అన్న ఉపనిషత్ సత్యాన్ని ఉపాసించేవారంతా సూర్యోపాసకులే.

ఆధ్యాత్మికజీవితము ఒక లోచూపు. గుప్తజీవనం. సాధకప్రవరులైన శ్రీఅవతారశర్మగారి లేఖినినుండి జాలువారిన ఈ అమృతవాఖ్యానం పరితృలోకోద్ధారకారకం.

సాంబపంచాశికలోని మొదటిపదిశ్లోకాలు శ్రీకృష్ణునివని చెబుతారు. తండ్రీతనయుల సన్నుతితో సంతుష్టుడైన దినకరుడు పరితృలోకానికి శుభంకరుడు. ఈస్తోత్రవ్యాఖ్యానంలో శ్రీకొల్లూరు అవతారశర్మగారు సంపూర్ణంగా భావుకులయ్యారు. ఎందుకంటే తాము నిత్యమూ ఉపాసించే భర్గతేజములోనిదే కదా ఆదిత్యతేజం!

సాధారణంగా వ్యాఖ్యానమంటే-
"సరళాజ్జటిలం జ్ఞానం స్థూలాత్సూక్ష్మం తథైవ చ।
పూర్వజ్ఞాతాదవిజ్ఞానం లక్ష్యాల్లక్షణమేవ చ।
అనిశ్చితాద్వినిర్ణీతం పూర్ణాదాంశికమేవ చ।
శిక్షకేణ ప్రయుజ్యేత బోధస్య గతిరష్టధా"-జటిలమైన జ్ఞానాన్ని సరళంగా అందించటం, స్థూలసూక్ష్మపరిశీలనశక్తి కలిగియుండుట, పూర్వులు తెలిపిన విషయాలపట్ల అవగాహన, లక్ష్యలక్షణ పరిజ్ఞానం, అనిశ్చితంగా కనిపించే విషయంపట్ల అవగాహనతో నిశ్చయించే బుద్ధి, పరిపూర్ణ విషయాన్ని అంశాలవారీగా వివరించే నేర్పు ఉండాలి.

పరిపూర్ణమైన అనుభవం వాఖ్యాతకు ఉండాలి. అవతారశర్మగారి వ్యాఖ్యానంలో ఈ లక్షణాలన్నీ పుష్కలంగా ఉన్నాయి. ప్రతిశ్లోకానికి అవతారిక, అన్వయం, ప్రతిపదార్థం, భావం చెప్పి 'శ్రీపాదుక' పేరుతో విశేషాల్ని తన దర్శనాన్ని జోడించి చెప్పారు. చివరి పేరాలో పాఠాలు, శ్లోకాలు అధికమా? లభ్యమయ్యే ఏ ప్రతులలో ఉంది?వంటి విషయాలను చర్చించారు.

ప్రతిశ్లోకానికి సమకూర్చిన అవతారిక ఆశ్లోకంలోని విషయాన్ని తెలుపుతుంది. ఇది తెలుగువ్యాఖ్యానకారులు ఎవరో ఒకరిద్దరు తప్ప ఎవరూ పాటించని పద్ధతి. కాని అత్యవసరమైన పద్ధతి. శ్రీశర్మగారి వ్యాఖ్యానం సాధారణ భక్తపాఠకుల్ని ఉద్దేశించి రాసిందే అయినప్పటికీ పండితపామరరంజకంగా సాగింది. సహజంగానే పండితులైన శర్మగారు వారివ్యాఖ్యానంలోకూడ ఆ పాండిత్యాన్ని అప్రయత్నసిద్ధంగానే హత్తారు. శబ్దార్థోభయవైచిత్రుల్ని ఆధారం చేసుకొని జీవాత్మపరమాత్మలపైన వ్యాఖ్యానాన్ని చేశారు. ఉదా॥తొలి శ్లోకం.

అధ్యాత్మవిద్యను 'ఆపోశన'పట్టిన శ్రీశర్మగారికి ప్రతిఅక్షరము మంత్రంగానే కనిపిస్తుంది. ప్రతిపదము దైవనామంగానే గోచరిస్తుంది. ప్రతివాక్యము శ్రుతివాక్యంగానే శ్రుతమవుతుంది. శ్రుతిస్మృతిశాస్త్రపురాణరహస్యద్వారాలు శర్మగారి హస్తస్పర్శతో సులభంగానే తెరుచుకొని పఠితను లోనికి ప్రవేశపెడతాయి. అద్వయపరబ్రహ్మస్వరూపునిగ చిచ్ఛక్తితో ప్రకాశింపచేసే చిద్భానునిగా, ప్రాపంచిక ̐చేతనావర్తిగా, హృదాకాశవర్తిగా, ప్రాణశక్తిగా, చిదాకాశజ్యోతిగా, పరబ్రహ్మగా, పిండాండరక్షకునిగా, ప్రత్యక్షదైవంగా, శబ్దబ్రహ్మగా, అర్థప్రదాతగా,ముక్త్యనుగ్రహదాతగా వరేణ్యమైన భర్గమనే తేజస్సుతో కూడినవానినిగా బహుముఖాలుగా పరచుకున్న ఆదిత్యతత్త్వాన్ని శ్రీశర్మగారు వ్యాఖ్యానించి చెప్పారు.

శబ్దప్రపంచంగా ప్రకటితమై, వాగ్రూపంగా ప్రస్తరించిన దినకరుని విమర్శాంశను, అర్థవివర్తమును (7,8,9 శ్లోకాలలో) వివరించిన శర్మగారి వ్యాఖ్యానప్రతిభకు ఎంతటివారైనా కైమోడ్పులు చెల్లించవలసినదే!

ఈ వ్యాఖ్యానంలో కనిపించే ఎన్నెన్ని శ్రుతివాక్యాలు! ఎన్నెన్ని ఉపనిషత్సుధామయ వాక్యార్థాలు! అన్నీ పాఠకతరణోపాయాలే! భక్తజనార్తిభంజకాలే! మందాక్రాన్త వృత్తంలో రచింపబడిన ఈ సాంబస్తుతి తెలుగునాట అంత ప్రసిద్ధం కాదు. దానిక్కారణం ఆదిత్యహృదయం, సూర్యశతకం (మయూరుడు) తెలుగు హృదయాల్ని పాలించటమే. అయితే మా అవతారశర్మగారి వ్యాఖ్యానంతో ఈస్తోత్రం తెలుగునాట బహుళవ్యాప్తి చెందగలదు. చదివి అనుష్ఠించి, పాఠకులందరూ జరావ్యాధివిముక్తులు కావటమే కాకుండ, భవరోగవిముక్తులు కావాలని వ్యాఖ్యాత అభీష్టం నెరవేరాలని కోరుకుంటున్నాను.

'సహనావవతు। సహ నౌ భునక్తు। సహ వీర్యం కరవావహై।'

సం॥ 'ఆచార్య' బి. వేంకటేశ్వర్లు

# అవధానసరస్వతీ పీఠం



**అవధాన సహస్రఫణి-బృహద్ద్విసహస్రావధాని**
**బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణిశర్మ** ఎం.ఏ.,పిహెచ్ డి
## చైర్మన్ మేనేజింగ్ ట్రస్టీ

**శ్రీమహాగణాధిపతయేనమః**

## విజయతే కాశీవాసీ

**ది.14-08-2019**

మొన్నటి కొల్లూరు అవతారశర్మ గారు-

నిన్నటి శ్రీపాదుక-

నేటి కాశీవాసి-...ఏమైనా త్రిదశులు. మూడు దశల దేవతాతుల్యులు.

మీరు శ్రీ సాంబకవిగారి 'శ్రీ సాంబపంచాశికా' ను ఆంధ్రీకరించడం తెలుగువారి అదృష్టం. శ్రీ శర్మగారూ! మన పరిచయ సౌగంధ్యానికి కూడా ముప్ఫై యేళ్ళకు పైగా - త్రిదశత్వం దాటింది. సహజంగా శ్రీదేవతా చరణారవింద మిళిందతా లక్షణం మీది. సర్వకాల సర్వావస్థలయందూ అమ్మవారినే ధ్యానిస్తూ- తదాలాప-తత్పూజా-తత్సేవనా-తత్పరాయణతా తాదాత్మ్యం మీ దంపతులకు సహజాత పారిజాత పరీమళం.

ఈ తెలుగుసేత చాలా బాగుంది. 'ఈ పద్యాలను సవరించండి' అని మీరనడంతో తత్ స్పర్శచేత 'ధన్యమాత్మానం మన్యే'. ఆస్తికులకు - ఆయురారోగ్య కాంక్షులకు - సారస్వతవ్రతులకు ఇది కడు ఉపాదేయమైనది.

మందాక్రాన్తా : సాంబస్యేయం తరణి కవితా విశ్వనాథశ్చ శ్రోతా
గంగాహ్యేషా తరణికవితా భాసమానాఽసమానా।
స్వీకర్తాఽసౌ కృతిపతిరహో హర్షవల్లీనివాసః
'కాశీవాసీ' స జయతుతరాం కారణైస్తైశ్చతుర్భిః॥

స్వాదు వాదములతో
సం.డా॥మాడుగుల నాగఫణిశర్మ
సెల్ 98497 44556

---

సర్వే నెం.42, శారదాబాద్.(ఎన్.ఎ.సి.) హైటెక్స్ రోడ్. హైదరాబాద్-500084. తెలంగాణ. ఇండియా.
ఫోన్ 040-23116277, 23116499.సెల్- 9849744556, 9989773849
E-mail: nagaphanisarmamadugula@gmail.com,Web:www.avadhanasaraswathipeetham.com

*Sri V. Seshaphani Sarma*
*Department of Telugu*
*Sri Satyasai Higher Secondary School*
*Vidya Giri- Prasanthinilayam-515134*
*Anantapur District Andhra Pradesh*
*E Mail:seshaphanisharma@ssshss.org.in*

# ఓం శ్రీసాయిరామ్

అస్మత్ప్రియమిత్రులు శ్రీపాదుకోపజ్ఞ శ్రీ కొల్లూరు అవతారశర్మగారు పంపిన సాంబాదిత్యపంచాశికాకృతిని చదివి చాలా ఆనందించితిని. కారణం- అతి ప్రాచీనము, మహిమాన్వితము, గంభీరార్థద్యోతకము, మధురమనోజ్ఞము అయిన ఈ కృతిని చూచుట నాకిదే ప్రథమము. అన్వయక్రమమున ప్రతిపదార్థతాత్పర్యములుండుటచే సులభగ్రాహ్యమగుచున్నదిగాని లేనిచో శ్లోకములనన్వయించుకొనుటే కష్టము. 'శ్రీపాదుకా' వ్యాఖ్య అందలి గంభీర భావములను పట్టిచూపినదిగాని లేనిచో అట్టి భావములు స్ఫురించుటకూడ అసంభవము.

శ్రుతిస్మృతులు, తంత్రగ్రంథములు, మంత్రశాస్త్రము, శిక్షావ్యాకరణాదులు తెలిసియుండుటే గాక, ఉపాసనాబలముకూడ కలిగి పరిణతినందిన శ్రీ అవతారశర్మగారీకృతికి విపులవ్యాఖ్యను సంతరించుట ఆంధ్రుల భాగ్యము. వ్యాఖ్యతో శ్లోకభావమును క్షుణ్ణముగా తెలుసుకున్న పాఠకునకు అనువాదపద్యము సులభగ్రాహ్యమై ఆనందమునినుమడింప జేయుచున్నది. **మూలకృతివలె 'శ్రీపాదుకానువాదకృతి'కూడ నిత్యానుసంధానయోగ్యమై భాస్కరానుగ్రహహేతువై ఆయురారోగ్య భాగ్యములను, భక్తిజ్ఞానకైవల్యములను ఒసగగలదని భావిస్తున్నాను.**

నిరంతర సత్కర్మానుష్ఠానపరాయణులై అనేకసత్కృతికర్తలై పావనజీవనమొనర్చుచున్న 'కాశీవాసి' అవతారశర్మగారికి ఇతోధిక శ్రేయములనాకాంక్షిస్తూ సెలవు తీసికొనుచున్నాను.

**సం. వింజమూరి శేషఫణిశర్మ**
**విశ్రాంత-ఆంధ్రోపన్యాసకుడు.**

**ప్రశాంతినిలయం**
**వికారి**
**శ్రావణ శుక్ల త్రయోదశి**
**13-8-2019.**

Sivaya Gurava Namaha Sri Maatre Namaha Sri Vishnurupaya Namasivaya

**Samavedam Shanmukha Sarma**
***Managing Trustee***



ఈ గ్రంథం ఒక అరుదైన స్తోత్రరూప శాస్త్రం. మా గురుదేవులు శ్రీ మహాదేవానందనాథులు ఏనాడో కాశ్మీర దేశానికి వెళ్ళినప్పుడు తీసుకువచ్చిన దేవనాగరిలిపిలోని 'సాంబపంచాశికా' గ్రంథాన్ని, నాకు ప్రసాదించారు. అందులోని శ్లోకాలు, వ్యాఖ్యను అధ్యయనం చేసి ప్రవచనాలలో చెప్పే భాగ్యం నాకు లభించింది. ఆ తరువాత దీని మహిమానుభవం కూడా పొందగలిగాను. ఇప్పుడే తెలుగు లిపిలో ఉన్న సద్గ్రంథాన్ని చూడడమే కాక, మహనీయులు కాశీవాసి బ్రహ్మశ్రీ కొల్లూరు అవతారశర్మగారి శ్రీపాదుకా వ్యాఖ్యను చదివి ఎంతో ఆనందించాను. వేదవాఖ్య ప్రముఖులతో ఉదాత్తంగా ఉంది ఈ భాష్యరచన.

ఉపనిషత్తులలో చెప్పబడిన 'అంతరాదిత్యోపాసన, తత్త్వదృష్టితో తెలియబడే 'చిత్‌సూర్య' విజ్ఞానం ఈ 54 శ్లోకాల గ్రంథంలోని అద్భుతం. మయూరుని సూర్యశతకంతో పాటు, ఇది కూడా ఆదిత్య వాఙ్మయరాశిలో ఒక అనర్ఘరత్నం. ఈ గ్రంథాన్ని వెలువరించడంలో శ్రద్ధాభక్తులను ప్రకటించి శ్రమించిన పెద్దలు బ్రహ్మశ్రీ ఇప్పిలి ప్రభాకరరావు గారికి అభినందన పూర్వక నమోవాకములు. పరంపరగా అరసవల్లీ క్షేత్రస్థిత సూర్యభగవానుని ఆరాధిస్తున్న వీరి ఆదిత్యప్రపత్తి ఈ గ్రంథ ప్రచురణ ద్వారా పరిపూర్ణమైనది అనడంలో సందేహం లేదు.

సాధికారికమైన సంప్రదాయ బద్ధమైన అద్భుత వ్యాఖ్యానంగా ఈ 'శ్రీపాదుక' ను అభివర్ణించవచ్చు.

ఉపాసకులకు, జిజ్ఞాసువులకు మాత్రమేకాక సాహిత్య తత్త్వవివేచనా రసజ్ఞులకు సైతం ఆనందాన్నీ, పరమార్థాన్నీ ప్రసాదించగలిగే సద్గ్రంథమిది. ఈ గ్రంథ ప్రచురణతో అశేష అస్తికజనానికీ, విజ్ఞులకు మహోపకారం చేసినందుకు ప్రత్యేక అభివందనాలు.

ధన్యవాదాలతో
బుధజనవిధేయుడు

12-02-2019
హైదరాబాద్

**సామవేదం షణ్ముఖశర్మ**

**RUSHIPEETHAM CHARITABLE TRUST**
(Regd.Trust)
Sri Lalitha Dhamam, Plot No.299/300, Phase - I, Saket Colony, ECIL Post, Secunderabad -500 062.
Ph: 040 - 27132550. email: samavedamshanmukhasarma@gmail.com
www.saamavedam.org

శ్రీ గురు శ్శరణమ్

అభినవ వ్యాస
పౌరాణిక సార్వభౌమ
సవ్యసాచి

☎ : 27632159

# మల్లాది చన్ద్రశేఖర శాస్త్రి

శ్రీ శృంగేరి జగద్గురు మహాసంస్థాన
మరియు
శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానముల ఆస్థాన విద్వాంసులు



## నౌమి చిద్భానుం

సూర్యారాధన అతి ప్రాచీనమైనది, సద్య:ఫలవంతమైనది కూడా. సూర్యారాధన విషయకములైన అంశములు అనేక పురాణేతిహాసములందు కానవచ్చును. సుర్యభగవానుడు త్రిమూర్త్యాత్మకుడని, ప్రత్యక్ష దైవమని మన ప్రగాఢ విశ్వాసము. మహాభారతమున కూడా అరణ్యవాస పర్వములో సూర్యారాధన చేసి ధర్మారాజు అక్షయ పాత్ర పొందినట్లు, అదేవిధముగా హనుమంతుడు సూర్యుని వద్ద విద్యనభ్యసించినట్లు మనకు తెలుసు.

సనాతన ధర్మములోని విశేషమేమిటంటే మనము యే దేవతారాధన చేసినా ఆ దేవతావైశిష్ట్యమును కొనియాడుచు, నిరాకార, నిరంజన, సచ్చిదానంద పరబ్రహ్మమని, పరమాత్మయని ప్రశంస కనబడును. అనగా, సాధకుని స్థితిననుసరించి, ఉపాస్యదేవత నామ, రూపములు భేదములే కానీ ఉపాసించబడు సత్య వస్తువు మాత్రము ఒక్కటే.

ప్రకృతములో 'సాంబ పంచాశికా' నామముతో చేయబడిన సూర్య స్తుతి కాశీఖండములోనిది. ఇది ఏబది శ్లోకముల స్తోత్రము. కథాపరముగా శ్రీ కృష్ణస్వామి తన కుమారుడైన సాంబునకు అతని కుష్టరోగ పరిహారమునకై సూర్యారాధనను ఆదేశించిన సందర్భములోనది. ఈ స్తోత్రమునకు ఇతర వ్యాఖ్యలున్నప్పటికిని, తన సాధనాబలముతో కాశీవాసులైన శ్రీ కొల్లూరు అవతార శర్మగారు తమదైన శైలిలో పండిత పామర జనామోదముగా సరళ సుభగముగా అద్వైత పరముగా వ్యాఖ్య వ్రాసారు. ఈ వ్యాఖ్యలోని మరొక ప్రత్యేకత సంప్రదాయ పద్ధతిని అనుసరించి అవతారిక, అన్వయము, ప్రతిపదార్థ తాత్పర్యములు అట్లే ఆయా శ్లోకాలలోని విశేషాంశములు తెలియజేయటం.

సాధారణముగా ఒక గ్రంథములోని విశేషాంశాలు తొలిపలుకులలో ఉటంకిస్తుంటారు. ఈ గ్రంథములో 'శ్రీపాదుక' పేర విస్తారమైన విశేష వ్యాఖ్య ఉండటం వలన వాని ప్రస్తావన పునరుక్తి మాత్రమే అవుతుంది. అట్లే స్తుతి కావ్య లక్షణములు, ఇతర వ్యాఖ్యాతలు ప్రస్తావించిన ముఖ్యాంశములను, పురాణములలో ముఖ్యముగా వరాహపురాణాంతర్గత విషయములను సవిస్తరముగా చెప్పియున్నారు. అయిననూ కొన్ని పదప్రయోగాలను మాత్రము ప్రస్తావిస్తాను.

H.No.: 1-10-1/13, స్ట్రీట్ నెం.6, అశోక్ నగర్, హైదరాబాద్ - 500020.

ఇటువంటి వాటిని గుర్తించి, సరియగు రీతిలో పాఠకులు గమనించినచో ఈ గ్రంథము యొక్క నిజహృదయం ద్యోతకమౌతుంది. తొలి శ్లోకములోనే "నౌమి చిద్భానుం" అని మన 'హృస్థితుడని' చెప్పారు. శుద్ధమైన అద్వైత భావన. ప్రకటముగానే రెండవ శ్లోకములో 'తస్మై పరబ్రహ్మణే' అన్నారు. నాల్గవ శ్లోకము భావసహితముగా నిత్యపారాయణ యోగ్యమైనది. 'చిద్భానుని'గా ఆరాధిస్తున్నప్పుడు మరి ఈ దృశ్యమాన ప్రపంచము తన కన్న భిన్నమో అని ప్రశ్న ఉదయించును. అందుకే పిండాండ బ్రహ్మాండముల ఏకత్వము, లక్షణములు, స్థూల కారణాదికములు, అవస్థాత్రయ లక్షణములు ఇట్లు అనేక వేదాంత విషయములతో పరిపుష్టమైనది.

శ్రీ అవతార శర్మగారు తమ సాధన, అనుష్ఠాన బలిమి వలన ఇట్టి సప్రమాణికమైన, సాధికారికమైన వ్యాఖ్య వెలయించుటకు సమర్థులు. ఇందులోని అంశములను ఆకళింపు చేసికొనుట పాఠకుల వంతు. ఇంతటి అమూల్య గ్రంథమును వెలువరించినందుకు శర్మగారిని అభినందిస్తు, ఇకముందు కూడా అనేక సద్గ్రంథములు వారు వెలయించాలని, దానికి ఆ పరమాత్మ వారికి ఆయురారోగ్యైశ్వర్య భాగ్యాలు కలగజేయాలని దత్తుని ప్రార్థిస్తున్నాను.

అరసువెల్లి మహాక్షేత్రస్థ శ్రీ సూర్యనారాయణ మూర్తి పాదారాధక వంశస్థులు శ్రీ ఇప్పిలి ప్రభాకర రావుగారు వారి కుటుంబ సభ్యులు ఎంతో శ్రమకోర్చి ఈ అమూల్య గ్రంథాన్ని సవ్యాఖ్యానంగా అందిస్తున్నందుకు మనసా అభినందిస్తున్నాను.

భవదీయుడు,

(మల్లాది చన్ద్రశేఖర శాస్త్రి)



## శ్రీమాన్ ఆరవెల్లి లక్ష్మీనారాయణాచార్యులవారి అభిప్రాయం

ప్రపుల్లాబ్జహస్తం ప్రరోచంతమర్కం
త్రయీవేద్యమాద్యంత శూన్యం దినేశం।
మహేంద్రప్రతిష్ఠాక్రియా సుప్రసన్నం
తమాదిత్య మారోగ్యదాతారమీడే॥

బ్రహ్మశ్రీ కొల్లూరు అవతారశర్మగారు (శ్రీపాదుక) బ్రహ్మశ్రీ కొల్లూరు లక్ష్మణమూర్తిశర్మగారి సుపుత్రులు శుద్ధవైదికాచార సంపన్నులు. బ్రహ్మచర్యగార్హస్పత్య ధర్మములను నిర్వర్తించి నేడు వానప్రస్థ ఆశ్రమియై వారణాసి యందు (మోక్షపురి) నివసించుచు భక్తజన హితార్థమై బోధనలు చేయుచు, జీవితమును ధన్యపరచుకొన్నవారు. ప్రస్తుతము 'సాంబపంచాశిక'ను శ్రీ క్షేమరాజీయ వ్యాఖ్యననుసరించి (పెక్కువ్యాఖ్యలను చూచి) సలక్షణముగా రచించి లోకమున కర్పించిన మహానుభావుడు.

ఈ పంచాశికను శ్రద్ధతో పఠించి శ్రీశ్రీశ్రీ సూర్యభగవానుని వచోరూప అర్ఘ్యప్రదానముతో సేవించి కృతకృత్యులు కావల్సిందిగా మనవి చేయుచున్నాను.
జయంతి తేసుకృతినోరససిద్ధాః కవీశ్వరాః ।
నాస్తి ఏషాం యశః కాయే జరామరణజంభయమ్ ॥

॥ ఇతిశమ్ ॥

**శ్రీమాన్ ఆరవెల్లి లక్ష్మీనారాయణాచార్యులు**
విశ్రాంత సంస్కృత ఆగమ ఉపాధ్యాయులు
శ్రీ సూర్యదేవస్థానం

అరసవల్లి
తే 18.01.2019 ది.



శ్రీః

సాంబపంచాశిక గూర్చి వ్రాయడానికి ముందు ఆముఖం వ్రాయాలి. ఏమనగా చి॥ రాజశేఖరశర్మ సూర్య సంబంధ స్తోత్రాల గూర్చి “ఇంటర్‌నెట్” లో పరిశీలించుచుండగా – ఈ “సాంబపంచాశిక” లభ్యమయింది. దానిని మాకు అనగా

1. నేను 2. ఇప్పిలి బాలసుబ్రహ్మణ్యశాస్త్రి 3. ఇప్పిలి ప్రభాకరరావులకు చూపించగా మేము దానికి ఏ విధంగా నైనా తెలుగులోనికి అనువదించి భక్త లోకానికి అందించాలని అనుకున్నాము.

వెంటనే కార్యరూపములో ప్రవేశించాము. నేను చదువుతుండంగా, సుబ్రహ్మణ్యశాస్త్రి తెలుగులో చెప్పగా ప్రభాకరరావు వ్రాయడం ప్రారంభమయింది.

ఇంకొక విషయమేమనగా ఈ గ్రంథం నాగరిలిపి లో ఉంది. దీనికి క్షేమరాజుగారు సంస్కృతంలో వ్యాఖ్యానం వ్రాశారు. అదే మాకు ఈ ప్రయాత్నానికి ఆధారం. ఇంకా వాఖ్యానకర్త ఈ గ్రంథంలో గల పది పద్యాలను భగవాన్ శ్రీకృష్ణులువారు చెపుతూ శ్రీ సాంబులవారికి రోగ నివృత్తికై శ్రీ సూర్యదేవుని ఉపాసించు అని ఉపదేశించినట్లుగా ఉటకించారు.

ఆ విధంగా ప్రారంభించి మేము ఐదు పద్యములకు తెలుగులో వ్రాఖ్య వ్రాయ ప్రారంభించాము. కాని దుర్విధిననుసరించి బాలసుబ్రహ్మణ్యశాస్త్రి గారు దివంగతులు అగుటచే ప్రయత్నం ఆగింది.

కొన్ని మాసముల తరువాత మా సుబ్రహ్మణ్యశాస్త్రి మిత్రులు, కలిసి చదువుకున్న వారు శ్రీ కొల్లూరు అవతారశర్మగారు. ఇది వరకు మయూర సూర్యశతకానికి వ్యాఖ్యానాదులు రచించి అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారికి అంకితమిచ్చినారు. ఆ విషయము మా చి॥ ప్రభాకరరావుకు గుర్తురాగా

ఆయనను సంప్రతించగా "తప్పక చేద్దాము, మా మిత్రుడు ప్రారంభించిన కృతిని పూర్తి చేయుట మిత్రునిగా నా బాధ్యత " అని వారు భరోసా ఈయగా, వెంటనే మేము ముందుగా సిద్ధపరచిన దస్త్రము వారికి పంపినాము.

ఇట ఒక ప్రస్తావన. శ్రీ అవతారశర్మగారు వానప్రస్థంలో కాశీవాసం చేస్తున్నారు. అయినా పట్టుదలగా శ్రమతో రాత్రివేళలో భూతద్దం పెట్టుకొని వ్రాస్తూ దానిని "వాట్సప్" లో మాకు శ్రీకాకుళం పంపగా దానిని ప్రింటవుట్ తీసి ఒక సంపుటముగా తయారుచేసినాము. బ్రహ్మశ్రీ శర్మగారు వేరొక కార్యక్రమములో నిమగ్నులయినా ఈ ప్రయత్నంలో లోపం లేకుండా సంపూర్తి గావించారు.

చి॥ ప్రభాకరరావు వానిని 5,6 జిరాక్స్ కాపీలు తీయించి. పెద్దపెద్ద వారికి చూపి వారివారి అభిప్రాయాలు సంపాదనకు బహు శ్రమ పడ్డారు.

1. పుష్పగిరి పీఠాధిపతులు. 2. బ్రహ్మశ్రీ మల్లాది చంద్రశేఖర శాస్త్రిగారు. 3. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మగారు. 4. శ్రీమాన్ ఆరవెల్లి లక్ష్మీనారాయణాచార్యులు గారు వారి వారి భావపరంపరలను ఇచ్చినారు. ముఖ్యంగా ఈ విషయంలో పెద్దపెద్ద మహానుభావులను చంద్రశేఖరశాస్త్రి గారి వంటి వారి దర్శన భాగ్యాలు కలగడం అదృష్టం.

ఇక గ్రంథం విషయం అద్వైతసిద్ధాంత ప్రతిపాదికమయినవి. ఈ విషయం గూర్చి ఒకసారి బ్రహ్మశ్రీ షణ్ముఖశర్మగారు తన ప్రవచనాలలో ఉటంకించినట్లుగా మా చి॥ రాజశేఖరశర్మతో చెప్పినట్లుగా ప్రేరణ అయినది. ఈ విషయంలో వ్రాయడానికి చర్చించడానికి నా బుద్ధి విశేషం చాలనందున విజ్ఞులు ఈ గ్రంథస్థ విషయం ఆకళింపు చేసికొని తరించవలెనని నా మనవి.

ఇట్లు

క్యాంపు : భువనేశ్వర్ **భాస్కరభట్ల నరసయ్యశర్మ**

తేది : 8-4-2019 (విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు)

# ఉపోద్ఘాతం - పరిచయం

దాదాపు రెండు దశాబ్దాల క్రితం బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మగారి 'సాంబపంచాశిక' ప్రవచనం స్ఫూర్తితో ఈ బృహత్సాహసం ప్రారంభమైంది. 2016 సం॥ మొదట్లో సాధారణంగా జరిగే ఆధ్యాత్మిక చర్చలో సౌరసంబంధిత విషయాల్లో మా పెద్దబ్బాయి చి॥రాజశేఖరశర్మ 'సాంబపంచాశిక' ప్రస్తావన తేవడం, ఆతరువాత అంతర్జాలంలో ప్రయత్నించి, సుమారు రెండు శతాబ్దాల క్రిందటి క్షేమరాజ విరచిత సంస్కృత వ్యాఖ్య ప్రతిని తీసి ఇవ్వటం జరిగి దానిపై మాకుటుంబ సభ్యులం చర్చించటం జరిగింది. మాకు వంశపారంపర్యంగా సంక్రమించిన అరసవల్లి శ్రీసూర్యనారాయణస్వామి వారి అర్చనాది కైంకర్యములు చేస్తున్నందున, మా పూర్వజుల సౌరసంబంధ విషయాలను సేకరించటం, రచించటం, ప్రచురించటం, ఆచరించటం జరుగుతూ వస్తున్నది. ఆ ప్రేరణతోనే మా అన్నగారు సంస్కృత పండితులు. విశ్రాంత సంస్కృతోపాధ్యాయులు కీ॥శే బ్రహ్మశ్రీ ఇప్పిలి బాలసూర్య సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ప్రోత్సహించగా భాషాప్రవీణ, శ్రీ విద్యోపాసకులు, సహస్రానేక (30,000లకు పైగా) చండీ సప్త శతీసాంగపారాయణలు చేసి సహస్రానేక శిష్యులకు స్వస్థత చేకూర్చి, ఉపదేశించి, సాంగోపాంగ శ్రీచక్రనవావరణార్చనలో పద్ధతి చెప్పి చేయించుటలో నిష్ణాతులు, మా కుటుంబానికి అత్యంతాప్తులు, గురువులు, శ్రేయోభిలాషులు అయిన బ్రహ్మశ్రీ భాస్కరభట్ల నరసయ్యశర్మగారి సహాయంతో ఈ 'సాంబపంచాశిక' కు తెలుగులో అర్థ, తాత్పార్య, వ్యాఖ్యలతో పుస్తక ప్రచురణకు శ్రీకారం చుట్టబడింది.

శ్రీ సూర్యనారాయణ స్వామిపై ఇప్పటివరకు అత్యంత ప్రాచుర్యం కల్గిన మయూర శతకమే ముఖ్యంగా తెలుగు వ్యాఖ్యతో వెలువడింది. బహుళజనాదరణ పొందింది. సాధకుల కోర్కెలను నెరవేరుస్తూ వస్తున్నది.

ఈ 'సాంబపంచాశిక' గూడ అంతటి మహత్తు కల్గినది. దీనికి తెలుగులో వ్యాఖ్యగాని, అర్ధతాత్పర్య వివరణ గాని ఇంతవరకు వెలువడినట్లు కానరాదు.

శ్రీ కృష్ణుని పుత్రుడు శ్రీ సాంబుడు తనకు శాపవశాన సంక్రమించిన తీవ్ర అనారోగ్యాన్ని బాపుకొనుటకు, నారదముని ప్రేరణవల్ల, తన తండ్రి శ్రీ కృష్ణుని ఉపదేశంతో, ద్వాపర యుగాన ఈ 'సాంబపంచాశిక' రచించినట్లుగా శాస్త్ర ప్రమాణం. దీని పారాయణ ద్వారా రోగనివారణ, మోక్ష ప్రాప్తి కల్గిందని శ్రీ సాంబుని ప్రత్యక్షానుభవ ఉక్తి.

ఈ వ్యాఖ్య వ్రాసుకుంటున్న సమయంలోనే 2016 డిశంబరు 21 వ తేదీన ఊహించని విధంగా స్వర్గస్తులయ్యారు మా అన్నగారు. వీరి దేహత్యాగ విషయంగా రెండుమాటలు.

**అనాయాసేన మరణం వినాదైన్యేన జీవనం ।**
**దేహాంతే తవ సాయుజ్యం దేహిమే పరమేశ్వరి ॥**

అనే సూక్తి వీరి విషయంలో అక్షరసత్యం. ఎందుకంటే, ప్రతిదినం మాదిరిగానే ఉదయాహ్నికం ముగించుకొని, అలవాటు ప్రకారం శ్రీ సూర్యనారాయణ స్వామికి ప్రదక్షిణ నమస్కారాలు గావించి తీర్థం స్వీకరించి, ఆలయంలో ఉండగానే అనారోగ్యలక్షణం గుర్తించి పరుగున స్వగృహం వచ్చి, మడి బట్ట మార్చుకొని, భార్యబిడ్డలకు అనారోగ్యం గురించి తెలియచేసి 10ని॥ వ్యవధిలోనే దేహత్యాగం చేశారు. మా యింటి కులదేవత శ్రీ రాజరాజేశ్వర పీఠదర్శనం కూడ జరుగలేదు. అంతిమ సంస్కారం జరుగుటలో జాప్యం చూసి మా కుటుంబ సభ్యులు ఆయన మనోగతాన్ని విశ్లేషించి, ఆఖరికోరికగా అమ్మవారి దర్శనం కాలేదని గ్రహించి శ్రీ లలితా సహస్రనామ ప్రతిని సమర్పించగానే ఆ ప్రక్రియ పూర్తికావటం ఒక చిత్రం.

కీ.శే. బ్రహ్మశ్రీ బాల సూర్యసుబ్రహ్మణ్య శాస్త్రి గారి ఆఖరి ప్రయత్నమైన ఈ 'సాంబపంచాశిక' తెలుగుసేత కొంతవెనుకబడింది. వారి పాండిత్య ప్రకర్షమాకు కొరవడింది. దీనిని ముందుకు తీసుకు వెళ్ళటానికి పరిపరి విధ ఆలోచనలు, ప్రయత్నాలు, కొనసాగినా కృతకృత్యులం కాలేకపోయాము. కీ.శే. బాలసూర్యసుబ్రహ్మణ్యశాస్త్రిగారి సుపుత్రుడు చి॥ ఫణీంద్రశర్మ శ్రీ శాస్త్రిగారు ఈ విషయమై, వారి స్నేహితులు సహచర సంస్కృతాధ్యాయి అనేక గ్రంథరచయిత, కాశీవాసి, శ్రీపాదుక, కొల్లూరు అవతార శర్మగారితో సంప్రదించిన విషయాన్ని గుర్తుచేసినందున వారి సహాయసహకారాలను కోరాలని నిశ్చయించిన మా కుటుంబ సభ్యులము ఆ దిశగా ప్రయత్నం చేశాము.

మా ఈ ప్రయత్నానికి ఎంతో సంతోషించి తన మిత్రుడు తలపెట్టిన ఈ బృహత్కార్యం తను సంతోషంతో పూర్తి చేస్తానని, మిత్రుని కోరిక నెరవేరుస్తానని అంగీకరించి అతి త్వరగా దాదాపు రెండువందల పేజీల అవతారిక, శ్లోకము, అన్వయం, ప్రతిపదార్థం, భావం మరియు శ్రీ పాదుక వ్యాఖ్య, పూర్వకవుల శైలిలో ఈ 55 శ్లోకాల 'సాంబపంచాశిక' కు గొప్ప అవగాహనతో లోతైన విషయ వివరణతో చేసి, ఆస్తిక లోకానికి ఎంతో మేలు చేశారు. వీరు వ్రాసిన,

మయూరుని సూర్య శతక వ్యాఖ్య, కామేశ్వరీవ్రతకల్పం, బాలాత్రిపురసుందరీ లఘుస్తుతి మొదలైన అమూల్య గ్రంథాలు శ్రీ అవతార శర్మగారి బహుముఖ ప్రతిభకు ప్రతీకలు.

అటువంటి శ్రీ విద్యోపాసకులు, బహుముఖ ప్రజ్ఞాశాలి. కాశీవాసి, శ్రీ పాదుక, శ్రీ కొల్లూరు అవతార శర్మగారి సహాయ సహకారములు శ్రీ సూర్యనారాయణస్వామి వారి కరుణా కటాక్షములకు సర్వదా, సర్వథా సత్పాత్రములు.

బ్రహ్మశ్రీ కొల్లూరు అవతారశర్మ గారు ఉద్యోగ విరమణానంతరం దశాబ్దకాలంగా కాశీముముక్షు భవనంలో నివాస మేర్పర్చుకొని, కాశీవాసి అయి 2016వ సం॥లో పంచముఖ శివలింగ ప్రతిష్ట చేసి గత మూడు సం॥ నుంచి వార్షికోత్సవాలను నిర్వహిస్తూ, తొమ్మిది కోట్ల, రామనామజపం 100కోట్ల జయాంజనేయజపం, కోట్ల శివపంచాక్షరీ జపములు జరిపిస్తూ శిష్య, బంధు, స్నేహితులను కాశీకి రావించి రోజుల తరబడి వారికి వసతి భోజన సౌకర్యాలందిస్తూ ముక్తి కాంక్షిగా ఉన్నారు. వారితో ఈ విధంగా సాన్నిహిత్యం ఏర్పడడం అదృష్టంగా భావిస్తున్నాను. దాదాపు 36 రచనలు చేసి, ముద్రించి ఉచితంగా పంపిణీ చేస్తున్న నిత్యకృషీ వలుడు శ్రీశర్మగారు తన ఆదాయంలోని సింహ భాగాన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలకు వెచ్చించడం. ఇతరుల నుంచి సేవాసహాయం తప్ప ఏమీ ఆశించక పోవడం ఆయన నియమ నిష్ఠలకు, అతి సామాన్యవ్యక్తిత్వానికి ఒక కొలబద్ద. శ్రీ శర్మగారు బహుముఖ ప్రజ్ఞాశాలి. గొప్ప ఆశుకవి, గొప్పధారణ శక్తి కలవారు.

శ్రీ శర్మగారు ఈ గ్రంథాన్ని 2018 శరన్నవరాత్రాంతం పూర్తిచేసి అందచేయగా, ముద్రణ, తప్పొప్పుల దిద్దుబాట్లు, ముద్రరాక్షసాలను సరిచూచుటకు ఎక్కువ సమయం తీసుకొని శుద్ధప్రతిని శ్రీ శర్మగారి పరిశీలనార్థం అందచేయటం జరిగింది.

అదే విధంగా శుద్ధ ప్రతిని కొందరు పెద్దలకు చూపించి వారి అభిప్రాయాలను కోరడం జరిగింది. వారిలో కొందరు మా అభ్యర్థనను మన్నించి, సహృదయంతో తమ ఆశీరాభినందనములను అందజేసిన శ్రీశ్రీశ్రీ పుష్పగిరి పీఠాధీశ్వరులు శ్రీ విద్యాశంకరభారతీ స్వామి వారికి, తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రోజెక్ట్ సంచాలకులు ఆచార్య విశ్వనాథం గారికి, కాశీ విశ్వవిద్యాలయాంధ్ర విభాగాధ్యక్ష ఆచార్య భారతుల శారదాసుందరి ఆచార్య

బి. వేంకటేశ్వరరావు గారికి, అవధాన సహస్రఫణి బృహద్ద్విసహస్రావధాని బ్రహ్మశ్రీ మా. నాగఫణిశర్మ గారికి, విద్వత్కని మిత్రులు,ఆత్మీయులు శ్రీ వింజమూరి శేషఫణిగారికి, విద్వద్బృందారకులు, ఋషి పీఠ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మగారికి, పౌరాణిక సార్వభౌమ బ్రహ్మశ్రీ మల్లాది చంద్రశేఖరశాస్త్రి గారికి, ఆప్తులు శ్రేయోభిలాషులు శ్రీమాన్ ఆరవెల్లి లక్ష్మీనారాయణాచార్యులు గారికి, సామయిక సోదరులు సహృదయులు శ్రీ భాస్కరభట్ల నరసయ్యశర్మ, అరసవల్లి వార్ల శ్రీముఖములు కూడ ఇందులో జతపరచడమైనది.

ఈ అమూల్య గ్రంథరాజాన్ని బుధజనులకు, అవగాహనాపరులకు సౌరోపాసకులకు, విలువ గుర్తించిన ఆస్తికులకు ఉచితంగా అందజేయాలని మా సంకల్పం.

**కర్తా కారయితా చైవ ప్రేరకశ్చానుమోదకః ।**
**సుకృతే దుష్కృతే చైవ చత్వారో సమభాగినః ॥** అన్న ఆర్యోక్తి ప్రకారం

మా యీ సుదీర్ఘ ప్రయాణంలో మాకుటుంబ సభ్యులతో పాటు బంధువులు, స్నేహితులు, ఇతరులు ఆర్థికంగాను, ఇతర విధాలుగాను వెన్ను తట్టి ప్రోత్సహించి. ఈ సత్కార్యంలో పాలు పంచుకున్నందుకు, శ్రీ సాంబునిచే నుతించబడిన, ప్రత్యక్ష దైవతమైన, అరసవల్లి పురీవాసుడైన శ్రీ సూర్యనారాయణమూర్తి దివ్య కటాక్ష వీక్షణాలు ఎల్ల వేళలా ప్రసరించాలని కోరుతున్నాము.

నా చిరకాల మిత్రుడు, సోదరతుల్యుడు, అన్నివిషయాలలో నా వెన్నుతట్టి, అండదండగా ఉంటూ, హైదరాబాదు, విజయవాడ, కాశీలలో నాకు అత్యంత సహకారిగా, ఆర్థికంగా, నాకు చేయూతనిస్తూ వస్తున్న మా అన్నగారి శిష్యులు చి॥ బుడమగుంట వేంకటరామకుమార్‌కు ఆశీఃపూర్వక అభినందనలు.

ఈ గ్రంథాన్ని అందంగా ముద్రించి, మా కృషిలో విశేషభాగస్వామ్యం వహించిన శ్రీకాకుళం శ్రీ కృష్ణా గ్రాఫిక్స్ యజమాని శ్రీ మావూరు కృష్ణారావుగార్కి ఆశీఃపూర్వక అభినందనలు.

॥ ఇతిశమ్ ॥

అరసవల్లి
31-12-2019
వికారి పుష్య శుద్ధ పంచమీ
జయవారం

బుధజనవిధేయులు
**ఇప్పిలి ప్రభాకరరావు**
**మరియు**
**ఇప్పిలి వారి కుటుంబీకులు.**

# విషయసూచిక


| శ్లోకము | విషయము | | పుట |
|---|---|---|---|
| | ముందుమాట | ---- ---- ---- ---- ---- ---- | 25 |
| 01 | పుష్ణన్ దేవాన్ | ---- ---- ---- ---- ---- ---- | 28 |
| 02 | శబ్దార్థత్వ | ---- ---- ---- ---- ---- ---- | 32 |
| 03 | యస్మాత్సర్వం | ---- ---- ---- ---- ---- ---- | 43 |
| 04 | ఓమిత్యన్తర్నదతి | ---- ---- ---- ---- ---- ---- | 49 |
| 05 | యస్స్వక్చక్షుః | ---- ---- ---- ---- ---- ---- | 56 |
| 06 | యా సా మిత్రా | ---- ---- ---- ---- ---- ---- | 60 |
| 07 | ఊర్ధ్వాధస్తాదతను | ---- ---- ---- ---- ---- ---- | 67 |
| 08 | న బ్రహ్మాణ్డ | ---- ---- ---- ---- ---- ---- | 71 |
| 09 | యత్రారూఢం | ---- ---- ---- ---- ---- ---- | 75 |
| 10 | యస్మిన్ సోమః | ---- ---- ---- ---- ---- ---- | 79 |
| 11 | ఐంద్రీమాశాం | ---- ---- ---- ---- ---- ---- | 85 |
| 12 | ధ్యాత్వా బ్రహ్మ | ---- ---- ---- ---- ---- ---- | 89 |
| 13 | త్వాం స్తోష్యామి | ---- ---- ---- ---- ---- ---- | 93 |
| 14 | యోనాద్యన్తో | ---- ---- ---- ---- ---- ---- | 97 |
| 15 | తత్త్వాఖ్యానే | ---- ---- ---- ---- ---- ---- | 102 |
| 16 | సర్వాఙ్గీణః | ---- ---- ---- ---- ---- ---- | 106 |
| 17 | స్తోతా స్తుత్యః | ---- ---- ---- ---- ---- ---- | 110 |
| 18 | జ్ఞానం నాన్తః | ---- ---- ---- ---- ---- ---- | 113 |
| 19 | హార్దంహన్తి | ---- ---- ---- ---- ---- ---- | 116 |
| 20 | తామాసాద్య | ---- ---- ---- ---- ---- ---- | 120 |
| 21 | అగ్నీషోమావఖిల | ---- ---- ---- ---- ---- ---- | 123 |
| 22 | స్థూలత్వం తే | ---- ---- ---- ---- ---- ---- | 127 |
| 23 | యత్తద్వేద్యం | ---- ---- ---- ---- ---- ---- | 131 |
| 24 | ప్రాతస్సంధ్యా | ---- ---- ---- ---- ---- ---- | 137 |
| 25 | యే పాతాలోదధి | ---- ---- ---- ---- ---- ---- | 142 |
| 26 | దివ్యజ్యోతి | ---- ---- ---- ---- ---- ---- | 151 |

| | | | |
|---|---|---|---|
| 27 | అగ్నీషోమౌ | ---- ---- ---- ---- ---- ---- | 154 |
| 28 | గర్భాధాన | ---- ---- ---- ---- ---- ---- | 158 |
| 29 | సోమంపూర్ణామృత | ---- ---- ---- ---- ---- ---- | 162 |
| 30 | కృత్వా నక్తం దివ | ---- ---- ---- ---- ---- ---- | 166 |
| 31 | తత్త్వాలోకే | ---- ---- ---- ---- ---- ---- | 170 |
| 32 | ఆబ్రహ్మేదం | ---- ---- ---- ---- ---- ---- | 175 |
| 33 | శ్రిత్వా నిత్యోపచిత | ---- ---- ---- ---- ---- ---- | 180 |
| 34 | లోకాస్సర్వే | ---- ---- ---- ---- ---- ---- | 184 |
| 35 | సంకల్పేచ్ఛా | ---- ---- ---- ---- ---- ---- | 188 |
| 36 | సత్యం భూయో | ---- ---- ---- ---- ---- ---- | 193 |
| 37 | సౌషుమ్నేన | ---- ---- ---- ---- ---- ---- | 198 |
| 38 | మందాక్రాన్తే | ---- ---- ---- ---- ---- ---- | 201 |
| 39 | యేన గ్రాసీకృత | ---- ---- ---- ---- ---- ---- | 204 |
| 40 | ఆసంసారోపచిత | ---- ---- ---- ---- ---- ---- | 209 |
| 41 | సత్యాసత్య | ---- ---- ---- ---- ---- ---- | 211 |
| 42 | యావద్దేహం | ---- ---- ---- ---- ---- ---- | 214 |
| 43 | విశ్వప్రాణగ్రసన | ---- ---- ---- ---- ---- ---- | 217 |
| 44 | శబ్దాగారం | ---- ---- ---- ---- ---- ---- | 220 |
| 45 | నాశం నాస్మచ్చరణ | ---- ---- ---- ---- ---- ---- | 224 |
| 46 | ఆస్తాం జన్మ | ---- ---- ---- ---- ---- ---- | 227 |
| 47 | యేచారోగ్యం | ---- ---- ---- ---- ---- ---- | 230 |
| 48 | అప్రత్యక్ష త్రిదశ | ---- ---- ---- ---- ---- ---- | 233 |
| 49 | హిత్వా హిత్వా | ---- ---- ---- ---- ---- ---- | 236 |
| 50 | కిం త్వన్నామో | ---- ---- ---- ---- ---- ---- | 239 |
| 51 | యా పంథానం | ---- ---- ---- ---- ---- ---- | 243 |
| 52 | స్థిత్వా కించిన్మన | ---- ---- ---- ---- ---- ---- | 246 |
| 53 | సర్వాత్మత్వం | ---- ---- ---- ---- ---- ---- | 250 |
| 54 | భక్తిశ్రద్ధా | ---- ---- ---- ---- ---- ---- | 253 |
| 55 | ఇతి పరమరహస్య.. | ---- ---- ---- ---- ---- ---- | 256 |

# ముందుమాట

మిత్రుడు బాలసుబ్రహ్మణ్యశాస్త్రి సంకల్పించిన సూర్యస్తుతి (సాంబపంచాశికా వ్యాఖ్య) అతని పరాన్మరణించే కొనసాగలేదు. దానిని పూర్తిగా వెలువరించవలసినదిగా అతని కుమారులు నన్ను కోరిన మీదట నేను సరేనన్నాను. ఇతఃపూర్వం మయూర కవి వ్రాసిన సూర్యశతకాన్ని అరసవల్లి సూర్యనారాయణమూర్తికే అంకిత మిచ్చేను. కాశీవాసినైనందుకు **సాంబాదిత్యస్తవమును** కూడ ఆయనే యీ విధంగా వ్యాఖ్యానము చేయమని నట్లుగా ఆదేశించాడని భావించి యథామతి **'శ్రీ పాదుకా' వ్యాఖ్యను** ప్రారంభించి, ఆ సాంబాదిత్యుని అనుగ్రహంచేత 12 రోజులలో పూర్తి చేయిగలిగాను. సరే!

గ్రంథాన్ని గురించి రెండుమాటలు. గ్రంథం పేరు **'సాంబపంచాశిక'** పంచాశిక అనగా యేబది శ్లోకముల గ్రంథము. శ్రీ కృష్ణునికి జాంబవతి యందు కలిగిన కుమారుడు - **సాంబుడు.** ఇతడు తనకు సంప్రాప్తించిన కుష్ఠురోగమును బాపుకొనుటకై తండ్రియగు కృష్ణుని చే నాదేశింపబడి కాశీనగరంలో ఆదిత్యునారాధించి నట్లు కాశీఖండము నందును, మోక్షపురియైన మధురలో సూర్యభగవానునారాధించినట్లు వరాహపురాణము నందును ఐతిహ్యములు ప్రస్తావింపబడినవి. ఉదర సంబంధ వ్యాధిని పోగొట్టుకొనుటకై సూర్యారాధన చేసినట్లు **"సాంబపంచాశిక'** కాశ్మీరప్రతిలో నుట్టంకింప బడినది. సాంబుడు సూర్యునారాధించి రోగముక్తుడైనాడనేది పిండితార్థము. అతని ఆరాధనలో భాగంగా అతడు యేబది శ్లోకములలో గావించిన సూర్యస్తుతి యే **'సాంబపంచాశిక'** యని సారాంశముగా గ్రహింపవచ్చును.

అనంతశయనంగారు ముద్రించిన సాంబపంచాశికా వ్యాఖ్యాన గ్రంథానికి ఉపోద్ఘాతం వ్రాస్తూ శ్రీ కె. సాంబశివ శాస్త్రి గారు ఈ గ్రంథములోని

' దశశ్లోకి' అనగా మొదటి పదిశ్లోకములు సాంబునకు శ్రీకృష్ణుడు సూత్రప్రాయముగా చేసిన యుపదేశమని, భక్తిశ్రద్ధలతో సాంబుడు మరినలుబది శ్లోకములును దానికి చేర్చి ' సాంబపంచాశిక' ను రచించి సూర్యభగవానుని సాక్షాత్కార, సాయుజ్యములను పొంది ధన్యుడైనట్లును చెప్పబడి యున్నారు. రెండుప్రతులలోని రెండు గ్రంథారంభ శ్లోకములు చివరనున్న ఫలస్తుతి శ్లోకములు మూడు చెరసి 55 శ్లోకముల గ్రంథము సాంబుని పేరు మీదుగా ' సాంబపంచాశిక' అని ప్రచారములోనికి వచ్చినది. దీనికి **రాజానక క్షేమరాజకృత** వ్యాఖ్యనము ఉత్తరభారతములో ప్రసిద్ధముగా గోచరించును.

దానిలో క్షేమరాజు సాంబుని శ్రీకృష్ణుని కుమారుడని మాత్రమే చెప్పక, అతనిని '**సమస్తాగమ మహామ్నాయ రహస్యవిదునిగ, మహాయోగి సహస్ర సంప్రదాయపూర్ణునిగా** ప్రశంసిస్తూ, అతడు లోకానుగ్రహ కాంక్షతో ఈ స్తుతిని ప్రారంభిస్తున్నట్లు తెలిపియున్నాడు.

స్తోత్రమంతయు శ్రవణసుభగము, మధురముగా గానము చేసి తరించుట కనువైన ' **మందాక్రాన్త**' వృత్తములలో సాగినది. కాగా సాంబకృతమైన **సూర్యస్తుతి** గ్రంథప్రతిపాద్య విషయము. ఇది ప్రధానముగా యేబది శ్లోకములలో నున్నందున "**ప్రాధాన్యేన వ్యపదేశాః భవన్తి**" అనే నానుడి ననుసరించి దీనికి '**సాంబపంచాశిక**' అనే ప్రసిద్ధి కలిగినది. దీనిలో మొత్తం 55శ్లోకములున్నాయి. సాంబుడు నుతించినది, భౌతికంగా కనిపిస్తున్న సూర్యమండలాన్ని కాదు. దానికాత్మభూతమైన ఆదిత్య భగవానుని **పరబ్రహ్మతత్త్వమును** – అనే విషయం గ్రంథావలోకనము వలన తెలుస్తుంది. దీనిని తెలుగు వారికి పరిచయం చేయడం ప్రస్తుత వ్యాఖ్యానము యొక్క ప్రధానోద్దేశ్యము. సంప్రదాయపద్ధతిలో ప్రతిశ్లోకానికి అవతారిక, అన్వయము, అన్వయక్రమములో ప్రతిపదార్థము, భావము, విశేషములను తెలియచేసే **శ్రీపాదుకా** వ్యాఖ్యానముగా అయిదంశములు వివరించబడినాయి. చివరగా **అనువాదపద్యములు** కూడ భావానుగుణముగా జోడింపబడినవి.

జిజ్ఞాసువులకు ఈ వ్యాఖ్యాన మే మాత్రముపకరించినా కృతికర్త సుకృతుడైనట్లే! జనబాహుళ్యమునకు సులభముగా నవగాహన కలగడం కోసం సరళమైన గచ్ఛద్వ్యవహారిక భాషనాశ్రయించడం జరిగింది.

మా అభ్యర్తనను మన్నించి, సహృదయతతో తమ ఆశీరభినందనములను అందజేసిన శ్రీశ్రీశ్రీ పుష్పగిరి పీఠాధీశ్వరులు శ్రీ విద్యాశంకరభారతీ స్వామి వారికి, తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రోజెక్ట్ సంచాలకులు ఆచార్య విశ్వనాథం గారికి, కాశీ విశ్వవిద్యాలయాంధ్ర విభాగాధ్యక్ష ఆచార్య భారతుల శారదాసుందరి ఆచార్య బి. వేంకటేశ్వరరావు గారికి, అవధాన సహస్రఫణి బృహద్ద్విసహస్రావధాని బ్రహ్మశ్రీ మా. నాగఫణిశర్మ గారికి, విద్వత్కవి మిత్రులు,ఆత్మీయులు శ్రీ వింజమూరి శేషఫణిశర్మ గారికి, విద్వద్బృందారకులు, ఋషి పీఠ వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మగారికి, పౌరాణిక సార్వభౌమ బ్రహ్మశ్రీ మల్లాది చంద్రశేఖరశాస్త్రి గారికి, ఆప్తులు శ్రేయోభిలాషులు శ్రీమాన్ ఆరవెల్లి లక్ష్మీనారాయణాచార్యులు గారికి, సామయిక సోదరులు సహృదయులు శ్రీ భాస్కరభట్ల నరసయ్యశర్మ, అరసవల్లి వార్లకు ప్రత్యేకముగా మా కృతజ్ఞతాభివందనములను తెలియజేయుచున్నాము.

పాఠకులు సహృదయతతో దీనినాదరించి, సూర్యభగవానుని, అర్థజ్ఞాన పురస్సరముగా సాంబనిర్దిష్ట మార్గములో సంభావించి తరింపగలరని ఆకాంక్షిస్తూ

(కాశీవాసి)

వారణాసి,

విళంబి, ఫాల్గున బ॥విదియా శుక్రవారం.

# ప్రథమ శ్లోకము

**అవతారిక :** ఈ శ్లోకంలో సాంబుడు తానారాధిస్తున్న సూర్యభగవానుడు **'సరత్యాకాశే ఇతి సూర్యః'**– అనే వ్యుత్పత్తి ననుసరించి, బాహిరమైన ఆకాశములో సంచరించే సూర్యుడు కాడు. చిదాకాశంలోఉదయించి శరీరమంతటా జ్ఞానప్రకాశాన్ని ప్రసరింపచేస్తున్న **'చిద్భానుడు'** – అతడు **'ఏకమేవాద్వితీయం బ్రహ్మ'** – అని ప్రతిపాదింపబడిన **'అద్వయ పరబ్రహ్మస్వరూపుడు'** అనే విషయాన్ని తెలియచేస్తున్నాడు.

**శ్లో॥ పుష్ణన్ దేవానమృతవిసరైః ఇందుమాస్రావ్య సమ్యక్**
**భాభిః స్వాభీ రసయతి రసం యః పరం నిత్యమేవ**
**క్షీణం క్షీణం పునరపి చ తం పూరయత్యేవ మీదృక్**
**దోలాలీలోల్లసితహృదయం నౌమి చిద్భానుమేకమ్ ॥**

**అన్వయము** – యః స్వాభిః భాభిః నిత్యమేవ ఇందుం సమ్యక్ ఆస్రావ్య, అమృతవిసరైః దేవాన్ పుష్ణన్ రసం రసయతి, (తస్మాత్) క్షీణం క్షీణం తం (ఇందుం) పునరపి పూరయతి; (ఈదృక్) దోలాలీలోల్లసిత హృదయం ఏకం చిద్భానుం నౌమి॥.

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| యః | – ఏ సూర్యభగవానుడు |
| స్వాభిః భాభిః | – తన కిరణములచే |
| నిత్యమేవ | – ఎల్లప్పుడు (నిరంతరాయముగా) |
| ఇందుం సమ్యక్ ఆస్రావ్య | – చంద్రుని లెస్సగా ద్రవింపచేసి |
| అమృతవిసరైః | – (ఆవిధముగా స్రవించిన) అమృత నిష్యందముతో |

| | |
|---|---|
| దేవాన్ పుష్ణన్ | – దేవతలను పోషిస్తూ (దేవతలకు పుష్టిని కలుగజేస్తూ) |
| రసం రసయతి | – (వారికి) ఓజస్తేజములను కలిగించుచున్నాడో |
| (తస్మాత్) | – ఈ విధముగా చంద్రుని నిరంతరము ద్రవింపచేయుచున్నందున |
| క్షీణం క్షీణం | – క్షణ క్షణముకు క్షీణిస్తున్న |
| (ఇందుం) | – అమృతనిధానమైన ఆ చంద్రుని |
| పునరపి పూరయతి | – మరల మరల పూర్ణునిగా చేయిచున్నాడో |
| ఈదృక్ దోలాలీలోల్లసిత హృదయం | – ఈ విధముగా స్రవింపచేయుట, మరల నింపుట అనే ఊగిసలాట(లీల) చే వికసించిన హృదయముకల |
| ఏకం చిద్భానుమ్ | – ఏకైక పరబ్రహ్మ స్వరూపముగా చిదాకాశములో వెలుగొందుచున్న సూర్యభగవానుని |
| నౌమి | – నమస్కరించుచున్నాను. |

**భావము :-** తనదైన కిరణప్రసారముచే నిరంతరాయంగా అమృతనిధానమైన చంద్రుని ద్రవింపచేస్తూ, ఆ అమృత ప్రవాహముచే దేవతలకు పుష్టిని, ఓజస్తేజములను సమకూరుస్తూ, ఈ ప్రక్రియలో అనుక్షణము క్షీణిస్తున్న చంద్రమండలాన్ని మరల మరల అమృతంతో నింపుతూ, ఈ విధముగా స్రావణ పూరణములనే ఊగిసలాటతో కూడిన హేలా లీలావిలాసము కల అద్వయ పరబ్రహ్మస్వరూపుడైన చిత్సూర్యునకు అనగా నా చిదాకాశములో నిత్యము వెలుగొందుచున్న ఆదిత్యభగవానునికి నమస్కరించుచున్నాను అనిభావము.

**శ్రీపాదుక :- 'నౌమి చిద్భానుమేకమ్'** – అనే పదాలు సాంబుడు ప్రధానంగా సంభావించిన ఆదిత్యుని స్వరూపాన్ని తెలియజేస్తాయి. కాగా, ఆయన తన చిదాకాశంలో ధ్యానయోగంలో దర్శించిన సూర్యభగవానుడు **'ఏకం సత్'** అని వేదప్రతిపాద్యమైన అ7ద్వయపరబ్రహ్మస్వరూపుడే తప్ప భౌతికంగా తేజోమయగోళంగా కనిపిస్తున్న దినమణి కాదని స్పష్టంగా తెలుస్తుంది.

'నీవు నాకన్న ఉత్కృష్టమైనవాడవు. నీకంటె నేను అల్పుడను'– అనే భావాన్ని అభివ్యక్తీకరించే అంజలి సంపుటీకరణముద్ర (చేతులు జోడించుట)కు **నమస్కారమని** వ్యవహారము. ఈ విధమైన భావనతో సాంబుడు తన సూర్యోపాసనను స్తోత్రరూపంలో సంభావించి ప్రారంభిస్తున్నాడని భావం.

మొదటి మూడు పాదాలలో ఆ భానుడెటువంటివాడో వివరిస్తాడు. ఆయన తన కిరణాళిచే అమృతఖనియైన చంద్రుని కరిగించి ద్రవింప చేస్తాడట. అలా చంద్రుని నుండి కళారూపంలో జాలువారిన అమృతాన్ని దేవతలంతా వంతులవారీగా పానం చేస్తూ ఉంటారట. **" పర్యాయపీతస్య సురైర్హిమాంశోః కళాక్షయః శ్లాఘ్యతరో హి వృద్ధేః"** – అనగా దేవతలచే వంతులవారీగా పానము చేయబడుచున్నందున చంద్రునికి వాటిల్లిన కళాక్షీణత శుక్లపక్షమున అతనికి సమకూరే కళావృద్ధికన్న గొప్పదంటాడు కాళిదాసమహాకవి. (రఘువంశం–5వ సర్గ).

సూర్యభగవానుడు తన కిరణప్రసారముచే చంద్రుని కరిగించి క్షీణింపజేసినట్లే, **"పరం రసం రసయతి నిత్యమేవ"** అనునిత్యము ఉత్కృష్టమైన అమృతరసమును స్రవింపజేసి, ఆ చంద్రుని షోడశకళా పరిపూర్ణుని చేయుచున్నాడని రెండవపాదంలో తెలియ జేయబడినది. ఈ విధంగ చంద్రునిలో వృద్ధిక్షయములను కల్పిస్తూ, అమృత భోజనులైన దేవతలకు

ఆహారమునుపకల్పిస్తూ, వారికి ఓజస్తేజములను, తుష్టినీ పుష్టినీ సమకూర్చి పోషిస్తున్నాడు- అని భావం.

ఈ విధంగా తానహర్నిశములు అవిశ్రాంతముగా ఆకాశమార్గములో చరిస్తూ జగత్పోషణ చేయుచున్నాడని భావము. నిరాలంబమైన వియత్పథంలో ఉదయాస్తమయముల ద్వారా కాలకారకుడై జనులకు కావలసిన ఆహార ప్రకల్పనముతో పాటుగా విశ్రాంతిని కూడా సముపకల్పిస్తూ సూర్యదేవుడు జగద్రక్షణముగావిస్తున్నాడని భావము.

ఈ విధమైన ఉదాయస్తమయ రూపమైన నిమ్నోన్నతమైన వియత్సంచారము అతనికి హేలాలీలావిలాసమని **"దోలాలీలోల్లసితహృదయ"** మనే పదం ప్రతిబోధిస్తున్నది. బాహిరమైన ప్రపంచంలో ఆకాశమార్గంలో నిమ్నోన్నతంగా ఉదయాస్తమయాలను దర్శింపజేస్తూ, లోకాలను సంరక్షిస్తున్నట్లే, దహరాకాశంలో (ఉచ్ఛ్వాస నిశ్వాసముల రూపంలో) చిద్భానుడుగా ఉదయాస్తమయములను కల్పిస్తూ కుణ్డలినీ రూపంలో సుషుమ్నాపథంలో ప్రాణశక్తిగా ఆదిత్యదేవుడు సంచరిస్తూ , ప్రాణులను సంరక్షిస్తున్నాడనే భావాన్ని **"చిద్భానుః"** అనే పదం తెలియజేస్తున్నదని గ్రహించాలి. ఇలా బహిరంతర ప్రపంచములను పాలించే చిదానంద స్వరూపమైన పరబ్రహ్మ పరమాత్మయే తానారాధించే సూర్యభగవానుడని సాంబకవి యొక్క అంతరంగమని ఈ ప్రారంభశ్లోకంలో గ్రంథప్రతిపాద్యమైన విషయసంకేతము స్పష్టముగా నిర్దేశింపబడినది.

(ఈ శ్లోకము క్షేమరాజవ్యాఖ్యాసమలంకృతమైన కాశ్మీరప్రతిలోనున్నది. ఆనందాశ్రమగ్రంథమాలవారు ముద్రించిన ప్రాచీనప్రతిలో లేదు.)

## అనువాద పద్యము

**సీ॥** ఎవ్వాడు కిరణాళి నిందుని కరిగించి-
సుధచేత పోషించు సురగణముల
కరిగిన చంద్రుని కరుణామయుండయి
మరల పూర్ణుని జేసి మాన్యుడగునొ
కరిగించి పూరించి కమనీయ లీలల-
నూగిసలాటల నూరడించి
జీవుని జీవాల దేవుల జీవింప-
జేయు నెవ్వడిటుల చిత్రగతుల

గీ॥ నట్టి చిద్భాను నాదిత్యు నంబరమణి
నాంతరమ్మున దలచి నే నర్చ జేతు
సాంబకవివర్యు కవితల సరణినరసి
అతడె ఆయురారోగ్యములన్ని యిచ్చు॥

---0---

## 2వ శ్లోకము

**అవతారిక:-** ఈ రెండవ శ్లోకంలో కూడా కావ్యార్థ ప్రతిపాదనం నిర్దేశించబడింది. కొన్ని పుస్తకాలలో ఇదే ప్రారంభశ్లోకంగా కనిపిస్తుంది. దీనిలో ఆదిత్యభగవానుడు వేద, జీవ, దేవతా, పరబ్రహ్మ స్వరూపుడుగా వెలుగొందుతూ, ప్రణవస్వరూపంలో ప్రకాశిస్తూ, ఆయా ఉపాధులను (వేద, జీవ, దేవతా సమూహములను) చిద్భానుడుగా తన చిచ్ఛక్తితో ప్రకాశింప చేయుచున్నాడని కీర్తింపబడుచున్నాడు.

**శ్లో॥ శబ్దార్థత్వవివర్తమాన పరమజ్యోతీరుచో గోపతేః**
**ఉద్గీథో౽భ్యుదితః పురో౽రుణతయా యస్య త్రయీమణ్డలే**
**భాస్వద్వర్ణపదక్రమేరితతమః సప్తస్వరాశ్వైర్వియద్**
**విద్యాస్యందనమున్నయన్నివ నమస్తస్మై పరబ్రహ్మణే॥**

**అన్వయము:-** యః శబ్దార్థత్వ వివర్తమాన పరమజ్యోతీరుచః; యస్య త్రయీమండలం భాస్వద్వర్ణ పదక్రమేరిత తమః; గోపతేః సప్తస్వరాశ్వైః వియద్విద్యాస్యందనం ఉన్నయన్ ఉద్గీథః అరుణతయా పురః అభ్యుదితః, తస్మై పరబ్రహ్మణే నమః॥

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| యః | - యే సూర్య భగవానుడు |
| శబ్దార్థత్వ వివర్తమాన పరమజ్యోతీరుచః | - శబ్దార్థతత్త్వములైన నామరూపముల వివర్తముగా భాసించు ప్రపంచమును పరంజ్యోతిగా ప్రకాశింపజేయుచున్న ఋఙ్మండలము (కిరణాళి) కలవాడో |
| యస్య | - యే ఆదిత్యదేవుని యొక్క |
| త్రయీమణ్డలం | - ఋగ్యజుస్సామాత్మకమై వర్తులాకారమున ప్రకాశించు మణ్డలస్వరూపము |
| భాస్వద్వర్ణపదక్రమేరిత తమః | - ప్రకాశించుచున్న శబ్దార్థ పరిజ్ఞానముచే క్రమముగా బాహ్యాంభ్యంతర తమస్సులను పారద్రోలు చున్నదై |
| గోపతే: | - బాహిరముగా కిరణములకు, ఆంతరముగా ఇంద్రియములకు పాలకుడైన ఆతనియొక్క |

| | |
|---|---|
| సప్తస్వరాశ్వై: | – సప్తస్వరాత్మకములైన సప్తాశ్వములచే |
| వియత్ | – బాహ్యాభ్యంతరాకాశములలో |
| విద్యాస్యందనమున్నయన్ | – విద్యారథమునూర్ధ్వగతితో నడుపుచున్నదై |
| ఉద్గీథ: | – ప్రణవమే |
| అరుణతయా | – (సారథియగు) అరుణునిగా |
| పురః | – ఎదుట |
| అభ్యుదితః అస్తి | – ఉదయించుచున్నదో |
| తస్మై పరబ్రహ్మణే నమః | – అట్టి పరబ్రహ్మస్వరూపమునకు నమస్కారము |

**భావము :-** పరబ్రహ్మ స్వరూపుడైన యే సూర్య దేవుడు శబ్దార్థముల వివర్తరూపమైన జగద్రూపమున జ్యోతిర్మయుడై ప్రకాశించుచున్నాడో, ఋగ్యజుస్సామాత్మకమైన ఎవని వర్తులాకార జ్యోతిర్మండలము బాహ్యాభ్యంతరములైన అంధకారములను తన ప్రక్రమ ప్రసారములచే పారద్రోలచున్నదో, ఎవనియొక్క సప్తస్వరాత్మకములైన సప్తాశ్వములచే, బాహ్యాభ్యంతరాకాశముల రెంటను విద్యారథము నూర్ధ్వగతి ప్రణవమే సారథియగు అరుణునిగా నవతరించి ఊర్ధ్వంగా నడుపుచూ కట్టెదుట సాక్షాత్కరించుచున్నదో, అట్టి పరబ్రహ్మ స్వరూపుడైన ఆదిత్య భగవానునకు నమస్కారమని భావము.

**శ్రీపాదుక:-** సంప్రదాయముననుసరించి ఈ రెండవ శ్లోకమునే ప్రారంభశ్లోకముగా సంభావించవలసి యున్నది. మొదటి శ్లోకము కేవలస్తుతి లేక మంగళశ్లోకముగా నెన్నదగియున్నది. ఏలనన స్తుతి కావ్యములలో గ్రంథారంభశ్లోకములో స్తుతికర్త తాను నుతించిన దేవతాస్వరూపమును సమగ్రముగా సంగ్రహముగా నిర్దేశించుట సంప్రదాయము. తదుపరి

గ్రంథమంతయు గ్రంథారంభశ్లోకమునకు వ్యాఖ్యాన రూపమై యుండును. ఇది ప్రామాణికమైన స్తోత్రకావ్యరచనా సంప్రదాయము. భక్తుడు దేవతా ప్రీతికొరకై స్తోత్రము చేయును. సంతోషించిన ఆ ఇష్టదేవత అతనికభీష్టములననుగ్రహించును. కాగా, అభీష్టసిద్ధికై దేవతలను సంతోషపరచుటకు అతని గుణగానము చేయుట స్తుతి లేదా స్తోత్ర మనబడును. ఈ గుణకీర్తనము ఆదేవతకు అహెూ! నేనింతవాడనా! నా గుణముల నిట్లాశ్చర్య పరచువిధముగా కీర్తించుచున్నాడు కదా! నేనితని యభీష్టమును తప్పక నెరవేర్చవలసియున్నది" – అని సంతోషించునట్లుగా గుణగానము చేయుట స్తుతి లేక స్తోత్రమని స్తోత్రలక్షణము – **"యా వాక్యవృత్తి గుణసంకీర్తనేన దేవతాయాః 'అహెూ! అహ' మితి ఆశ్చర్యబుద్ధి జననీస్తుతిః – వై చిత్ర్యప్రతిపాదనమాశ్చర్యహేతుః"** అని శాస్త్రకర్తలచే నిర్దేశించబడినది. స్తోత్రము దేవతలనబ్బుర పరచునట్లు శబ్దార్థవైభవమును కలిగియుండవలెను. ఈ విధమైన ఆశ్చర్యకరమైన శబ్దార్థవైభవము కలిగి, దానితో పాటుగా స్తుత్యారంభములోనే సమగ్రమైన దేవతా స్వరూపమునుపవర్ణించుట స్తుతి సంప్రదాయము.

స్తుతికర్తయైన సాంబుడు రూపలావణ్య సంపన్నుడైన శ్రీకృష్ణుని సుతుడు మాత్రమే కాదు సమస్తాగమ మహామ్నాయ రహస్యవిదుడు, మహాయోగి సంప్రదాయపూర్ణ పరిజ్ఞాతయని రాజానక క్షేమరాజు తన వ్యాఖ్యారంభములో నతనిని ప్రశంసించి యున్నాడు. అట్టి సాంబుడు " **స్వాత్మవివస్వత్స్తుతిం జగతః అనుగ్రహాయ వక్తుముపక్రమతే"** – అంటే లోకానుగ్రహంకోసమని తనవలె లోకులందరు సూర్యభగవానుని యనుగ్రహమును పొందవలెనని ఈ విధముగా స్తోత్రమునుపదేశరూపముగా లోకమునకు వెల్లడి చేసినట్లు పేర్కొనినాడు.

సర్వామ్నాయాగమ రహస్యములను, మహాయోగి సంప్రదాయము నెఱిగినవాడును అగు సాంబుడు ఆర్తితో చేసిన యీ స్తవమునకు ఆదిత్యభగవానుడబ్బురపడి వెంటనే అతనికి సాక్షాత్కరించి సాంబుని అనుగ్రహించి తరింప చేయుటయే గాక అతని యీ స్తుతిని–

**“సాంబ! పంచాశకైః శ్లోకైః– వేదగుహ్యపదాక్షరైః**

**యత్ స్తుతోఽహం త్వయా వీర! తేన తుష్టోఽస్మి తే సదా॥”–**

– అనగా – “ఓ సాంబా! సకల నిగమాగమరహస్య గర్భితములైన మంత్ర బీజాక్షరములతో 50 శ్లోకములతో నీచే సంస్తుతించబడిన నేను నీ యెడ సదా సర్వదా సర్వథా ప్రసన్నుడనైనానని ముక్త కంఠముతోప్రశంసించినట్లు వరాహపురాణములో నుట్టంకించబడినది.

సమస్త వేదశాస్త్ర పారంగతుడైన ఆదిత్యదేవునికే ఆశ్చర్యము కలిగించిన సాంబుని పాండితీ ప్రాభవము ఈ స్తోత్రకావ్యములో పదపదములో కనిపిస్తుంది. దానిని యథాశక్తి, యథామతి వివరించుకునే ప్రయత్నం చేసుకుందాం!

సంప్రదాయవిదుడైన సాంబుడీ యారంభశ్లోకంలో సూత్రప్రాయంగా సూర్యభగవానుని కీర్తించి, దీనికి వ్యాఖ్యాప్రాయముగా మిగిలిన శ్లోకములను వెలార్చినట్లు చెప్పుకున్నాం. స్తుతి లక్షణంలో మనం వివరించుకున్నట్లుగా ఈశ్లోకంలో గ్రంథప్రధానప్రతిపాద్య విషయమైన సూర్యస్తుతి శబ్దార్థోభయ వైచిత్ర్యములను సంతరించుకొన్నదై సర్వవేదశాస్త్రపరాయణుడు ప్రత్యక్షనారాయణుడైన సూర్యభగవానుని కెంతయో ప్రీతిభాజనమైనదనే విషయం స్పష్టంగా తెలుస్తుంది.

సూత్రప్రస్థానంలో బ్రహ్మసూత్ర సారసంగ్రహము **‘చతుస్సూత్రి’** అనగా మొదటి నాలుగు సూత్రములలో వ్యాస భగవానుడుపదేశించినాడు.

అదే విధముగా ఈ ప్రారంభశ్లోకములో తాను సంభావించిన సూర్యభగవానుని, వేద, జీవ, దేవతా, పరబ్రహ్మరూపములైన చతుర్విధ స్వరూపములను సూత్రప్రాయముగా సుస్పష్టముగా సాంబమహాకవి నిర్దేశించినాడు. మిగిలిన స్తోత్రమంతయు దీనికి భాష్యమే యనదగినది.

సూర్యుని యొక్క చతుర్విధ వివర్తస్వరూపములను ఒకే ఒక్క పద విన్యాసముతో ప్రదర్శించడమనే ఈ రచనాశిల్పము నిజముగా అహో! యని ఆదిత్య భగవానునే ఆశ్చర్యచకితుని గావించినదని చెప్పవచ్చును. ఈ ఒక్కశ్లోకమే పై చెప్పబడిన వేద,జీవ,దేవతా పరబ్రహ్మ ప్రతిపాదకమైన నాలుగు స్వరూపాలతో ఆదిత్యుని విరాడ్రూపాన్ని దర్శింపచేస్తుంది. ఇది శబ్దార్థోభయగత రామణీయకము. దీనినే కావ్యశాస్త్ర పరిభాషలో చమత్కారమంటారు. కాగా ఆవృత్తి చేసుకొంటే ఈ ఒక్క శ్లోకమే నాలుగు రూపాలను సమన్వయం చేస్తూ నాలుగు శ్లోకాలుగా ప్రతిభాసిస్తుంది. ఒకే సూర్యుడు జాగ్రదవస్థలో విశ్వవ్యాపియైన **హిరణ్యగర్భుడుగా,** వేద ప్రతిపాద్యుడై శ్రోత్రగ్రాహ్యులైన వేద పారగులకు **వేదస్వరూపునిగా** కనిపిస్తాడు. అతడే ధ్యానయోగుల మానసములో **బ్రహ్మముగా,** సాధకప్రవరులకు **యజమానునిగా,** సుషుప్తిలో సాక్షీ భూతమైన జీవుడుగా, జాగ్రత్ స్వప్న సుషుప్త్యవస్థ మూడింటికి సత్తాస్ఫూర్తిని కలిగించే తురీయము నిర్గుణమునైన పరబ్రహ్మముగా వారివారి దర్శన యోగ్యతల కనుగుణంగా సాక్షాత్కరిస్తూ ఉంటాడు. ఇలా నాలుగు విధములైన సమన్వయం ఈ శ్లోకంలో గోచరిస్తుంది.

**'నమస్తస్మై పరబ్రహ్మణే'** – పరబ్రహ్మస్వరూపుడైన సూర్యభగవానుకి నమస్కారమని ప్రధానవాక్యము. సాంబుడీ శ్లోకంలో తాను సంభావించిన, చిద్భానుణ్ణి పరబ్రహ్మముగా ప్రధానంగా కీర్తించినాడనేది సుస్పష్టం బ్రహ్మణే

అనే శబ్దానికి **'బృహతే' 'బృంహణాయ'** అని రెండర్థాలను సంభావించవచ్చు. బృహచ్ఛబ్దానికి వ్యాపించినదని అర్థము. బృంహణమనగా విస్తరింపజేయడమని అర్థం. విశ్వమును సృజించి విస్తరింపజేసి, అణువణువున తానే వ్యాపించి, సర్వము తానేయైన తత్త్వము **పరబ్రహ్మము.**

ఈ తత్త్వమునే మన తెలుగన్న పోతన్న తన భాగవతములో **'ఎవ్వనిచే జనించు------'** అనే పద్యంలో సంభావించినాడు. సూర్యభగవానుడు ఉదయిస్తూనే బహిరంతర తమస్సులను అనగా లోకపు చీకటులను మనలోని అజ్ఞానాంధకారమును పారద్రోలి, బాహిరంగా జగత్తును ఆంతరంగా ప్రత్యగాత్మను ప్రకాశింప జేస్తున్నాడని భావము. తన ప్రకాశం జగమంతా వ్యాపించినట్లుగా, జ్ఞాన స్వరూపుడై చైతన్య స్వరూపంతో సాధకుల శరీరమంతా నిండి జీవ వ్యాపారములను నిత్యము నడిపిస్తూ తుదకు **'సోఽహం'** సమాధిస్థితి ననుగ్రహించి ఆత్మజ్ఞానాన్ని ప్రకటింప జేసి తరింపజేస్తాడు. **'తరతిశోకమాత్మవిత్'** ఈ విధమైన ఆత్మజ్ఞాని సర్వదుఃఖ వినిర్ముక్తుడై సదాచిదానందముననుభవిస్తూ జీవన్ముక్తుడై తుదకు సూర్యమండలాన్ని భేదించి పునరావృత్తి రహితమైన శాశ్వత పరబ్రహ్మములో లీనమౌతాడని ఉపనిషదుద్బోధ. ఆదిత్యదేవుడు కాలస్వరూపుడై జగద్రథాన్ని నడిపిస్తున్నట్లుగానే, ప్రాణస్వరూపుడై **ప్రత్యగాత్మగా** శరీరమనే రథాన్ని కూడా నడిపిస్తున్నాడని గ్రహించాలి.

ఉద్గీథమనగా ప్రణవము. అన్నిటికీ మూలము శబ్దబ్రహ్మ ప్రణవమే. శబ్దప్రపంచమంతా ప్రణవమునుండియే ఆవిర్భవించినది. **'ప్రణవశ్ఛందసామివ'** – అని కాళిదాససూక్తి. వేదములకు ఆది మూలం ఓంకారము. సాధకలోకమంతా కన్నుతెరచిన ప్రథమసమున్మేషంలో సందర్శించేది ఉదయాదిత్యుని ప్రకాశమునే. కావుననే వారు ఉద్యదాదిత్యుణ్ణి

విశ్వాత్మగా **'సూర్య ఆత్మా జగతస్తస్థుషశ్చ'** – అని ఎలుగెత్తి సర్వోత్కృష్టునిగా సంకీర్తిస్తారు. **" ఉత్కృష్టతయా గీయితే ఇతి ఉద్గీథః"** అనే వ్యుత్పత్తిననుసరించి ఉద్గీథ శబ్దం ఆదిమూలమైన ప్రణవానికి వలె ఆదిదేవుడైన ఆదిత్యునకు కూడా అన్వయిస్తుంది. ప్రణవము ఆదిత్యుడు రెండూ బొమ్మబొరుసుల్లా ఒకే తత్త్వానికి చెందినవనే విషయం గ్రహించాలి. శబ్దబ్రహ్మమైన ఉద్గీథమే సూర్యభగవానుడు. ఆతని ప్రభామండలమే జ్యోతిర్మయమై శబ్దప్రపంచంగా వివర్తం చెందింది. కావుననే సూర్యుణ్ణి త్రయీమయుడని, ఆతని మరీచి మండలాన్ని త్రయీమండలమని వ్యవహరిస్తారు. ఋగ్యజుస్సామవేదాల సమాహారమునకే **'త్రయీ'** అని వ్యవహారం. కాగా శబ్దబ్రహ్మస్వరూపమైన ఉద్గీథమే సూర్యుడని పిండితార్థం.

సూర్యకిరణాలు సప్తవర్ణాత్మకములని సిద్ధాన్తీకరింపబడినది. వర్ణశబ్దము రంగును, అక్షరాన్నీ కూడా బోధిస్తుంది. కాగా, సూర్యకిరణాలు ఏడురంగుల సమాహారముతో కనిపిస్తున్న సమస్త జగత్తునూ, **'సరిగమపదని'** లనే సప్తస్వరవర్ణములో శబ్ద ప్రపంచాన్నీ ప్రకాశింప చేస్తున్నాయి. ఈ సప్తవర్ణములనే సప్తాశ్వములుగా సంభావించింది వేదం. కాగా సూర్యభగవానుడు సప్తాశ్వరథారూఢుడై సమస్త జగత్తులను (లౌకిక, వైదిక ప్రపంచాలను) ప్రకాశింపజేస్తున్నాడని భావం. అసలైన జగత్తత్త్వాన్ని ప్రకాశింపజేసే మూలము శబ్దమే నంటాడు దండి మహాకవి–

**ఇదమంధం తమః కృత్స్నం– జాయేత భువనత్రయమ్।**
**యది శబ్దాహ్వయం జ్యోతిరాసంసారం న దీప్యతే॥**

(ఉద్గీథమనే ప్రణవముచేత శబ్దము లేదా నాదమనే వేదజ్యోతి వెలిగింపబడకపోయినట్లయితే ఈ ముల్లోకములూ అజ్ఞానాంధకార బంధురములై

నిస్తేజముగా నుండేవి – అనిభావం.) ఈ విధంగా ఆదిత్యదేవుడు గోపతియై అనగా ఇంద్రియములకు ప్రచోదకుడై శరీరమనే రథాన్ని, కిరణాధిపతిగా జగద్రథాన్ని, అరుణరూప ధారియై ప్రణవస్వరూపంలో నడిపిస్తూ అనుదినము మన కట్టెదుట కనబడి మనలననుగ్రహిస్తున్నాడని సూర్యపరంగా అర్థం చెప్పుకోవచ్చు.

ఇదేవిధంగా ఇదే శబ్దములతో ఆయనను వేద స్వరూపుడుగా కూడా దర్శించవచ్చు. **'ఋక్ – ఋచౌ– ఋచః'** ఇత్యాదిగా ఋక్శబ్దాన్ని గ్రహిస్తే **– శబ్దార్థత్వ వివర్తమాన పరమ జ్యోతీఋచః –** శబ్దార్థముల యొక్క వివర్తమైన జగత్తును ప్రకాశింపజేసే ఋక్స్వరూప మైన జ్యోతిర్మండలము కల ఆ సూర్యభగవానుడు, ఇంద్రియాలను శాసిస్తూ, సప్తస్వరములనే అశ్వములను అనూరుడుగా ఆవిర్భవించిన ప్రణవ స్వరూపంతో ఆకాశమార్గంలోను, ఆంతరంగా వేదవిద్యారథాన్ని చిదాకాశంలోను నడిపిస్తున్నవాడై శబ్దబ్రహ్మ స్వరూపంగా అనుగ్రహిస్తున్నాడు. అట్టి త్రయీమయుడైన పరబ్రహ్మమూర్తికి నమస్కారమని అన్వయం చెప్పవచ్చు.

**'హిరణ్య గర్భరూప వేద చతుష్టయాభిమాని దేవతాత్మనే పరబ్రహ్మణే నమః'** అని వేదపరంగా అన్వయం చెప్పుకోవాలి. ఆ వేదాత్మ శబ్దార్థత్వ వివర్తమాన పరంజ్యోతి. పరంజ్యోతి జగత్కారణమైనట్లే ఈ ఋక్ జ్యోతి శబ్దప్రపంచాన్ని ప్రకాశింప చేస్తుంది. గోపతి శబ్దానికి గవాం సర్వశబ్దానాం పతిః అన్వయం చెప్పుకోవాలి. ఆ వేదాత్మ ఉచ్చారణసమయంలో త్రయీమండలంగా ఉద్గీథంగా, అంటే ప్రణవంగా ఆవిర్భవించి పాఠకుల హృదయాకాశంలో సప్తచ్ఛందములే సప్తాశ్వములుగా సప్తవర్ణములతో (అ–ఇ–ఉ ఏ ఐ ఓ ఔ) అనే ప్రధానస్వరములే సప్తాశ్వములని కూడా అన్వయం చెప్పుకోవచ్చు. విద్యారథాన్ని ఉద్గీథమనే అరుణుని సారధ్యంతో

నడిపిస్తున్నాడని భావం. పరబ్రహ్మమే లోకరక్షణార్థమై వేదరూపంలో వివర్తనము చెంది ఉద్గీథము అంటే ప్రణవముగా విద్యారథాన్ని హృదయాకాశంలో నడిపిస్తున్నదని తాత్పర్యం గ్రహించాలి.

ఈ ఆదిత్యస్తుతికి జీవరూపంగా కూడా సమన్వయం చెప్పుకోవచ్చు. జీవుడు అధ్యాత్మముగా భావిస్తే ప్రాజ్ఞుడు లేదా యజమానుడుగా, అధి దైవంగా సంభావిస్తే అవ్యాకృత కారణాత్మగా సంకర్షణుడైన జీవుడుగా సాత్త్వతులు చెప్పుదురు. శబ్దార్థత్వ వివర్తమాన పరమజ్యోతి పరబ్రహ్మ ఉద్గీథ (ప్రణవ) రూపమున సారథియై చిదాకాశమున ప్రత్యగాత్మగా, నెవడు విద్యా (జ్ఞాన) రూపమున రథమును ఊర్ధ్వముఖముగా నడుపుచున్నాడో, అట్టి పరబ్రహ్మస్వరూపుడు ప్రత్యగాత్మ స్వరూపుడునైన ఆదిత్యదేవునకు నమస్కారమని జీవపరంగా సమన్వయమును సంభావించవచ్చును.

**పరబ్రహ్మపరంగా సమన్వయం –**

పరబ్రహ్మమేయైన యే సూర్యభగవానుని ప్రథమసమున్మేషము ఉద్గీథము అనగా ప్రణవ రూపాన్ని సంతరించుకున్నదో – **'అహంబ్రహ్మాస్మి'** అనే అనుభవమహావాక్యపు నిధిధ్యాసనములో సాధకుడు సోஉహం సమాధి నిష్ఠుడై ఉద్గీథమును ప్రణవముగా అనగా ఓంకార నాదంగా దర్శిస్తాడు. ఈ విషయం–

**శ్లో॥సకారం చ హకారం చ లోపయిత్వా ప్రయోజయేత్।**

**సంధిం వై పూర్వరూపాఖ్యం తతోஉసౌ ప్రణవో భవేత్ ॥**–అని

చెప్పబడింది. సోஉహం సమాధిలో తత్పదార్థ ప్రతీకమైన సకారము అహంపదార్థ ప్రతీకయైన హకారము తిరోహితములై శుద్ధప్రణవం **'ఓం'** గా సాక్షాత్కరిస్తుంది. అది ఆదిత్యుని ప్రథమోన్మేషమైన ఉద్గీథము. అదియే ఋగ్యజుస్సామాత్మక త్రయీమండలంగా దేదీప్యమానంగా సప్తవర్ణస్వరాత్మకమై

ప్రకాశిస్తూ విద్యారథంగా బాహిరంగా, వియన్మార్గంలోను, ఆంతరంగా దహరాకాశంలోను, అరుణ సారథిచే నడుపబడుతూ ఉంటుంది. ఇక్కడ గోపతి శబ్దానికి రోచిష్పతి (కిరణాధీశుడు) గీష్పతిశబ్దార్థ సమాహారమైన త్రయీమండలాధిపతి అనంత జ్ఞాన స్వరూపమైన పరబ్రహ్మమేనని అర్థం చెప్పుకోవాలి. జ్ఞానస్వరూపుడైన పరబ్రహ్మమాదిత్యుని యొక్క చిచ్ఛక్తియేనని **"జ్ఞానశక్తిః పరాహ్యేషా తపత్యాదిత్య విగ్రహా"** సర్వాతీతముగా పరబ్రహ్మమై ప్రకాశించు భర్గమైన తేజస్సు ఆదిత్యుని చిచ్ఛక్తిగా ప్రకాశిస్తున్నదని స్వతంత్రతంత్రం. (స్వ.తం.10-499) ఈ విధంగా పరబ్రహ్మ పరంగా ఆదిత్యునికి సమన్వయాన్ని సంభావించవచ్చు.

ఆదిత్య-వేద-జీవ-పరబ్రహ్మ పరంగా ఒకే శ్లోకమున ఒకే పదగుంఫనము సూత్రప్రాయముగ సమన్వయించునటుల వర్ణించుట శబ్దార్థోభయగత చమత్కారముగా చెప్పనొప్పును. **'శబ్దార్థత్వ వివర్తమానపరమ జ్యోతీరుక్త్వము, ఉద్గీథారుణునిచే విద్యాస్యందన నేతృత్వము వియన్మార్గమున సప్తస్వరాశ్వ ప్రచాలిత రథగమనము చతుర్విధ సమన్వయములలో** సమానముగా నన్వయించుచు స్తుతి లక్షణమును పరిపోషించినవి. అరుణ సారథిత్వము ఆదిత్యతత్త్వమును, ప్రప్రథమముగానుదయించు ప్రణవము లేదా ఉద్గీథము వేదతత్త్వమును, **యస్యవిద్యేతి-విద్యాస్యందనోన్నయనం** జీవతత్త్వమును, పరబ్రహ్మణే నమః అను చోట 'పరబ్రహ్మణే'యను పదము నిర్గుణపరబ్రహ్మ లింగమును ప్రతిబోధిస్తాయి.

జాగ్రదవస్థలోని విశ్వాత్మ ఆదిత్యుడు. స్వప్నావస్థలోని తైజసాత్మ హిరణ్యగర్భుడు, సుషుప్తిలోని ప్రాజ్ఞుడే జీవుడు, తురీయావస్థలో సాక్షీభూతుడు నిర్గుణపరబ్రహ్మమైన చిదాత్మ. అతడే చిద్భానుడు. సాత్త్వతులు ఈయవస్థా చతుష్టయమును **అనిరుద్ధ - ప్రద్యుమ్న - సంకర్షణ - వాసుదేవులనే** చతుర్వ్యూహములతో భావించి సాత్త్వత మతానుసారంగా కూడా అన్వయమును

భావించుచు వ్యాఖ్యానించిరి. ఈ విషయములన్నియు గ్రంథారంభ శ్లోకమున సూత్ర ప్రాయముగా నిర్దేశించబడినవై తరువాత శ్లోకములలో వివరణరూపమున వ్యాఖ్యానింపబడినవి.

## అనువాద పద్యము

**సీ॥ వాగర్థ సువివర్త వాఙ్మయ జ్యోతియై-**
**అంబర మణియౌచు నలరు నెవడు**
**ఉదితమౌ యుద్గీథ మురుపురోఽరుణదీప్తి**
**వేదత్రయంబౌచు వెల్గు నెవడు**
**ఘనవర్ణ శుభపద క్రమముల దమి జీల్చు**
**సప్తస్వరాశ్వరా గాప్తి నెవడు**
**వియదేక పథమున విద్యారథంబూని**
**ప్రణవసారథియైన రథికుడెవడు**

**గీ॥ అట్టి వేదస్వరూపుడై యర్కు డలరు**
**పరముడాత డిలను పరబ్రహ్మ మతడె**
**సర్వప్రాణుల జీవన సాధనముగ**
**వెలుగు చిద్భానున కగుత వేయి నతులు॥**

**---0---**

## 3వ శ్లోకము

**అవతారిక**: – ప్రారంభశ్లోకములో ప్రధానముగా జాగ్రదవస్థకు సాక్షియైన విశ్వాత్మగా ఆదిత్యుని సంస్తుతించి ఈ శ్లోకములో స్వప్నావస్థాగతుడైన వేదాత్మయైన హిరణ్యగర్భుని స్వప్నావస్థితిని వర్ణించుచున్నాడు.

శ్లో॥ యస్మాత్సర్వం ప్రసరతితరాం జ్ఞప్తికర్తృస్వభావాత్
రూపైర్బాహ్యైర్విషయరచితైరావృతి ర్యస్య నాస్తి
శబ్దార్థాభ్యాం వితథమివ యస్తథ్యరూపం విధత్తే
జీవాదిత్యం తమహమతనుం చిన్నభస్థం నమామి ॥

**అన్వయము:** జ్ఞప్తికర్తృ స్వభావాత్ యస్మాత్ సర్వం ప్రసరతితరామ్, యస్య విషయరచితైః, బాహ్యైః రూపైః ఆవృతిర్నాస్తి, యః శబ్దార్థా భ్యాం తథ్యరూపం వితథమివ విధత్తే, తం చిన్నభస్థం అతనుం జీవాదిత్యం నమామి ॥

**ప్రతిపదార్థము:-**

జ్ఞప్తికర్తృ స్వభావాత్ - జ్ఞాన క్రియాశక్తుల సమాహారమే తన స్వభావము లేదా నైజముకల

యస్మాత్ - యే సూర్యభగవానుని నుండి

సర్వం - సమస్త (పాంచభౌతిక)మైన చరాచర ప్రపంచము

ప్రసరతి తరామ్ - అతిశయించి (విశేషముగా) ప్రసరించుచున్నదో (నడచుచున్నదో)

విషయరచితైః - శబ్దాదులైన విషయములచే నిర్మింపబడిన లేదా సృష్టింపబడి

బాహ్యైః రూపైః - బాహిరములైన రూపములచే ప్రకటింపబడిన (అనగా సమష్టి వ్యష్టి స్థూలాది రూపములో ప్రకటింపబడిన)

యస్య - ఎవనికి అనగా జీవునిగా ప్రత్యగాత్మయైన హిరణ్యగర్భునిగా

ఆవృతిః నాస్తి - జ్ఞానైశ్వర్యాదులచే తిరోభావము లేదో

| | | |
|---|---|---|
| యః | – | హిరణ్యగర్భునికి ప్రతిరూపమైన యే ఆదిత్యునిచే |
| తథ్యరూపం | – | తనదైన నిత్యసత్యస్వరూపమును |
| శబ్దార్థాభ్యాం | – | నామరూపాత్మకములైన శబ్దార్థములచే |
| వితథమివ | – | మిథ్యారూపమైన జగత్తుగా |
| విధత్తే | – | సృష్టించుచున్నాడో (కనబరచుచున్నాడో) |
| చిన్నభస్థం | – | చిదాకాశమున వెలుగొందు చున్నవాడును (పరబ్రహ్మమగుటచే) |
| అతను: | – | స్థూలసూక్ష్మాది శరీరములతో –ఇదమిత్థముగా నిర్దేశింప శక్యముకాని వాడును అగు |
| తం జీవాదిత్యం | – | జీవాత్మగాప్రాణులన్నిటిలో ప్రకాశించుచున్న ఆ ఏకైక చిద్భానుని |
| అహం నమామి | – | నేను నమస్కరించుచున్నాను. |

**భావము:-** జ్ఞప్తి కర్తృత్వములు అనే తన స్వాభావికములైన వ్యాపారములచే అనుదినము ఈ పాంచభౌతికమైన చరాచర ప్రపంచమును ప్రకటింపచేయుచున్న వాడును, నామరూపాత్మకములైన శబ్దార్థాది విషయజాతముచే, బాహిరములైన సమష్టి, వ్యష్టి, స్థూల సూక్ష్మ కారణోపాధులుగా గోచరించుచున్న ప్రత్యగాత్మ స్వరూపుడైన యెవనికి జ్ఞానైశ్వర్యాద్యహంకారములచే తిరోధానము లేదో, ఎవడు తనదైన సత్యస్వరూపమును మిథ్యారూపమైన జగద్రూపముగా పరిణమింప చేసి ప్రవర్తింపజేయుచున్నాడో, పరబ్రహ్మముగా, జీవాత్మగా చిదాకాశమున వెలుగొందు – ఆ జీవాదిత్యునకు నమస్కరించుచున్నానని భావము.

**శ్రీపాదుక:-"తత్సృష్ట్వా తదేవాను ప్రావిశత్ "** పరబ్రహ్మకు తన సంకల్పముచే జగత్తును సృష్టించి దానిలో తానే అంతటా నిండి నిబిడీకృతుడై జగద్వ్యాపారమును నడిపిస్తున్నాడని శ్రుతివచనము. ఆవిధముగా అంతర్యామిగా జీవాదిత్యునిగా సర్వము తానేయై వెలుగొందుచున్న జీవాదిత్యుని దర్శించి నమస్కరించాలని గ్రంథకర్త తన దర్శనానుభవాన్ని ఈ శ్లోకములో తెలియజేసినాడు.

అంతర్యామియైపరమాత్మ ఉపాధిలో హిరణ్యగర్భుడుగా స్థూలరూపంలో, జాగ్రదవస్థలో విశ్వుడుగా, స్వప్నావస్థలో సూక్ష్మరూపంలో జీవుడుగా, ప్రపంచాన్నను భవిస్తూ ఉంటాడు. అట్టి జీవాత్మ స్వరూపుడైన ఆదిత్యుని స్వరూపాన్ని సంభావించి సాంబకవి అతనికీ శ్లోకంలో తన ప్రణతిని సమర్పిస్తున్నాడని గ్రహించాలి.

**" చిన్నభస్థం అతనుం జీవాదిత్య మహం నమామి "** అనగా అశరీరుడై కేవల చిదాభాసుడుగా దహరాకాశంలో జీవరూపుడుగా వెలుగొందుచున్న ఆదిత్యదేవునికి నమస్కరించుచున్నాను, అనేది ప్రధానమైన శ్లోకతురీయ పాదము. దీనితో అన్వయించే పైమూడు పాదాలలో చిదాకాశంలో చిత్స్వరూపుడుగా వెలుగొందుచున్న సూర్యభగవానుని యొక్క స్వరూప స్వభావములు కీర్తింపబడినాయి.

మొదటిపాదంలో పరబ్రహ్మస్వరూపుడైన సూర్యుని స్వభావము జ్ఞప్తి కర్త ృత్వములనే రెండు భావములుగా కీర్తించబడినది. పరబ్రహ్మముగా సూర్యుడు సృష్టి స్థితి లయ తిరోధానానుగ్రహములనే పంచకృత్యములను నిర్వర్తిస్తూ ఉంటాడు. ఇది అతని లీలాహేల.

**'సోఽ_కామయత - బహుస్యాం ప్రజాయేయేతి'** - అని శ్రుతి. 'బ్రహ్మము' సంకల్పించింది. బహురూపములుగా తానే అభివ్యక్తము కావాలని.

ఆవిధముగా చరాచరజగత్తును సృజించి అంతర్యామిగా అణువణువున తానే ప్రవేశించినదని సృష్టి సంకల్పమును శ్రుతి వివరిస్తుంది. కాగా, సృష్టికి మూలము పరమాత్మ లేదా పరబ్రహ్మము యొక్క సంకల్పము లేదా 'ఇచ్ఛాశక్తి'యని తెలుస్తుంది. ఆది మధ్యాంతములకతీతముగా పరబ్రహ్మము పై పంచకృత్యములను నిర్వర్తిస్తూనే ఉంటుంది – అది దాని స్వభావము. ఈ స్వభావమునకు ప్రధానాంశములు రెండే రెండు. అవి జ్ఞప్తి (జ్ఞానము) కర్తృత్వములని మొదటిపాదంలో **' జ్ఞప్తికర్తృస్వభావాత్'** అని చెప్పబడింది. జ్ఞప్తియనగా జ్ఞానశక్తి కర్తృత్వమనగా క్రియాశక్తి **"ఇచ్ఛామాత్రం ప్రభోః సృష్టిః"** – అనగా సృష్టికార్యము పరమాత్మయొక్క ఇచ్ఛాశక్తియేనని భావము. అతని ఇచ్ఛ లేదా సంకల్పమునకు నిదానము అనగా మూలము అతనియొక్క గతజ్ఞానానుభవము. అదే జ్ఞప్తి లేక జ్ఞానము. సంకల్పానుగుణంగా అదే కర్తృత్వస్వభావముగా క్రియాశక్తిగా పరిణమించి, అతనిని సృష్టికార్యానికి ఉన్ముఖుణ్ణిగా ప్రయత్నశీలునిగా చేస్తుంది . తత్ఫలితంగా (తస్మాత్) అతని నుండి, **(సర్వం ప్రసరతితరామ్)** సమస్తమైన చరాచరప్రపంచం బహిర్గతమవుతుంది.

ఈ విధంగా **'ఏకం సత్'** – ఒక్కటి మాత్రమే స్వభావమైయున్న పరమాత్మ, జ్ఞానసంస్కారముచే ఇచ్ఛాశక్తి ప్రభావముచే కార్యశక్తిగా ప్రచోదితమై నానా చరాచర రూపములతో బహురూపములుగా ప్రస్తరించి ప్రపంచంగా పరిణమిస్తున్నది. ఒకే పరమాత్మ సర్వము తానేయై బహువిధములు ప్రస్తరించి ప్రపంచంగా పరివ్యాప్తమై ప్రకాశిస్తున్నా, దానికి జ్ఞానైశ్వర్యాహంకారాది బాహిరములైన గుణములచే ఆవృతి ఆవరింపబడుట లేదా కప్పివేత ఉండదు. అనగా తనదైన జ్ఞాతృత్వ కర్తృత్వాహంకారమమకారములుండవు. వానిచే తానావరింపబడక వానికతీతంగా సాక్షిభూతంగా ప్రత్యగాత్మ (**ప్రత్యక్**

– వేరుగావిడివడి సాక్షిగా దర్శించేది)గా ఉంటుంది. ఈ విషయం రెండవపాదంలో **'బాహ్యైః, విషయ విరచితైః రూపైః యస్య ఆవృతి ర్వాప్తి '** – అనే పదముల ద్వారా సంస్తుతింపబడినదిగా గ్రహించాలి.

సత్యము, నిత్యము, అనాది, అనంతము సర్వాతీతమునైన పరబ్రహ్మ విశ్వమంతా వ్యాపించి విరాట్టుగా వ్యవహరింపబడుచున్నది. అదేపరిచ్ఛిన్నమైన ఉపాధిని ప్రవేశించినపుడు జీవాత్మగాపిలువబడు చున్నది. ఉపాధిగతమైనందున నశ్వరమైన ఉపాధి నశించిన కారణంగా వినాశిగా మనలను భ్రమింపజేస్తున్నది. తత్త్వతః జీవాత్మ నిత్యమే. కావుననే అది పరమాత్మస్వరూపుడైన హిరణ్యగర్భునిగా **"హిరణ్యగర్భః సమవర్తతాౖ గ్రే .......** ' ఇత్యాదిగా కీర్తించబడినది.

ఈవిషయాన్నిమూడవపాదంలోని **" యః శబ్దార్థాభ్యాం తథ్యరూపం (ఆత్మానం) వితథమివ విధత్తే"** – అనగా ఎవడు నామరూపాత్మకములైన శబ్దార్థములచే తన నిత్యమైన నిజస్వరూపాన్ని అసత్యమైన మిథ్యారూపంగా ప్రకటిస్తున్నాడో" – అనే పదసమాహృతమైన వాక్యం తెలియజేస్తుంది. ఒకే బ్రహ్మము చరాచరమైన అనంతరూపాలతో ప్రపంచంగా ప్రస్తరించి, ఆ బహురూపాలకు ప్రత్యేకములైన శబ్దార్థాలతో నామరూపాలను కల్పించి, అవన్నీ తననుండే ఆవిర్భవించినందున వానికి **'యద్భృజ్జన్యం తత్తదనిత్యం'** – పుట్టినదెల్ల గిట్టితీరవలెనను న్యాయముననుసరించి అనిత్యత్వము నాపాదించి మిథ్యాత్వమునుపకల్పించుచున్నాడని తెలియజేయబడినది.

జీవాదిత్యుడుగా తనలో చిదాభాసుడుగా హృదాకాశంలో వెలుగొందుచున్న ఆదిత్యభగవానుడు కేవలము ఉపాధినిష్ఠుడు కాడు పరమాత్మయే ననే విషయాన్ని **"అతనుం"** అనే పదము అభివ్యక్తము చేస్తున్నది. సాంబుడు చిదాకాశములోను పాసించిన జీవాదిత్యుడు తనుమాత్ర పరిచ్ఛిన్నమైన జీవునికన్న భిన్నమైన సర్వవ్యాపి, సర్వజ్ఞము సర్వశక్తిమంతమునైన పరబ్రహ్మమేనని పిండితార్థము.

## అనువాద పద్యము

**సీ॥** జ్ఞప్తిత్వ కర్తృత్వ జగముల పనులను-
నిర్వహించునెవడు నిండి జగతి
నామరూపాత్మక నానావిధ పదార్థ-
జాతజీవోపాధి జాతములను
ప్రణవస్వరూపుడై ప్రత్యగాత్మగ నిల్చి-
నడుపునెవ్వడు నిత్య నర్తనముల
సత్య రూపముతోడ సర్వ జగమ్ముల-
మిథ్యగా నడపెడి మేటి భర్త

**గీ॥** బాహిరాకాశమున వెల్గు బ్రహ్మమనగ
ఆంతరమ్మున నిలిచి, చిదర్కుడగుచు
జగతి సృష్టించి జీవమై జగము నడుపు
నట్టి చిద్బ్రహ్మ మూర్తికే నంజలింతు॥

---0---

## 4వ శ్లోకము

**అవతారిక :-** హృదాకాశములో చిదాభాసుడుగా, ప్రణవ స్వరూపుడుగా భాసిస్తూ, సుషుమ్నాపథంలో ప్రణవ స్వరూపుడైన జీవాదిత్యుడు ప్రాణాపానములను క్రమబద్ధీకరిస్తూ, పశ్యన్తీ వాగ్రూపంలో నాదబ్రహ్మముగా ప్రాణశక్తిగా చరాచర ప్రాణులను సంరక్షిస్తున్న పరమాదిత్యుని ప్రస్తుతశ్లోకములో సాంబుడిలా ప్రస్తుతించుచున్నాడు.

**శ్లో॥** ఓమిత్యన్తర్నదతి నియతం యః ప్రతిప్రాణి శబ్దో
వాణీ యస్మాత్ప్రసరతి పరా శబ్దతన్మాత్రగర్భా
ప్రాణాపానే వహతి చ సమో యో మిథో గ్రాససక్తౌ
దేహస్థం తం సపది పరమాదిత్యమాద్యం ప్రపద్యే ॥

**అన్వయము:-** యః ప్రతిప్రాణి నియతం ఓమితి శబ్దః అన్తర్నదతి, యస్మాత్ శబ్ద తన్మాత్ర గర్భా పరావాణీ ప్రసరతి, యశ్చమిథః గ్రాససక్తే ప్రాణాపానౌ సమౌవహతి, సపది దేహస్థం తమాద్యం పరమాదిత్యం ప్రపద్యే॥

**ప్రతిపదార్థము:-**

| | | |
|---|---|---|
| యః | - | యే జీవాదిత్యుడు |
| ప్రతిప్రాణి | - | చరాచరములైన ప్రాణులన్నింటను |
| నియతం | - | నిరన్తరము |
| ఓమితి శబ్ద: | - | 'ఓం' అనెడి నాద బ్రహ్మముగా |
| అన్తర్నదతి | - | హృన్మధ్యములో నినదించుచున్నాడో |
| యస్మాత్ | - | ఎవనినుండి |
| శబ్దతన్మాత్రగర్భా | - | శబ్దతన్మాత్రయైన 'పశ్యన్తి' గా ప్రకటితము కానున్న |
| పరావాణీ | - | పరారూపమైన వాక్కు |
| ప్రసరతి | - | ప్రభవిల్లుచున్నదో, |
| చ | - | మరియు |
| యః | - | ఎవడు |
| మిథః | - | పరస్పరము అనగా ఒకదానినొకటి |
| గ్రాససక్తౌ | - | కబళించుట యందు ప్రవర్తించుచున్న |
| ప్రాణాపానౌ | - | ప్రాణ, అపాన వాయువులను |
| సమౌ | - | సమానముగా సంచరించునవిగా నియంత్రించుచూ |
| వహతి | - | ధరించుచున్నాడో ( క్రమబద్ధీకరించుచున్నాడో ) |
| దేహస్థం | - | అంతర్యామిగా శరీరమున వెలుగొందుతున్న |

ఆద్యతం పరమాదిత్యం - ఆదిదేవుడైన పరమాత్మగా ప్రకాశించుచున్న ఆదిత్యభగవానుని

సపది - శీఘ్రముగా

ప్రపద్యే - ప్రపత్తి పురస్సరముగా భజించుచున్నాను

**భావము**:- యే సూర్య భగవానుడు జీవాదిత్య రూపములో చరాచరప్రాణులన్నింటిలో సుషుమ్నామార్గములో నిరంతరాయముగా ప్రాణశక్తిగా సంచరిస్తూ ఓమనే ప్రణవనాదబ్రహ్మముగా, హృన్మధ్యములో నినదించుచున్నాడో ఓంకారనాదముగా ప్రతిధ్వనించుచున్నాడో, యెవని నుండి శబ్దతన్మాత్రయైన **'పశ్యన్తి'** గా ప్రకటితముకానున్న **'పరా'** వాక్కు ప్రభవిల్లి ప్రసరించుచున్నదో - మఱియు నెవడు, ఒక దానినొకటి కబళించుటకై నిరంతరము ఉద్యమించుచున్న ప్రాణాపానవాయువులను ఒకదానినొకటి మించకుండా సమానముగా క్రమబద్ధీకరించు చున్నవాడై ప్రాణికోటిని సదా సంరక్షించుచున్నాడో -అంతర్యామిగా శరీరమున నిట్లు వెలుగొందుచున్న సనాతన పరబ్రహ్మస్వరూపుడైన పరమాదిత్యునికి ప్రపత్తి పూర్వకముగా ప్రణమిల్లుచున్నానని భావము.

**శ్రీపాదుక:-** పూర్వశ్లోకములో జీవాదిత్యుడుగా వర్ణింపబడిన పరబ్రహ్మస్వరూపుడైన ఆదిత్యదేవుడు అంతర్యామిగా పరమాత్మ స్వరూపమున ప్రాణశక్తిగా నిర్వర్తించు రక్షణ వ్యాపారములను సాంబుడీ శ్లోకములో ప్రస్తుతించినాడు.

తాను హృదాకాశములో చిద్భానునిగా స్తుతించిన జీవాదిత్యుడు కేవలము పరిచ్ఛిన్నమైన ఉపాధి లేక శరీరమునకు మాత్రమే,నశ్వరమైన శరీరముతో పాటుగా నశించు వాడుకాదు, అతడనాది, సనాతనుడైన పరమాత్మయై ప్రస్తుతము అంతర్యామియైన చిద్భానుడుగా దర్శనానుగ్రహమును

చేయుటయే గాక ప్రాణశక్తియై ప్రాణసంరక్షణము గావించుచున్నాడని శ్లోకము యొక్క ఉత్తరార్థములో అనగా 3,4 పాదములలో నిర్దేశింపబడినది. **'దేహస్థం పరమాదిత్యం ఆద్యం ప్రపద్యే'** అను వాక్యమీయర్థమును సూత్రప్రాయముగా తెలియజేయుచున్నదని గ్రహించాలి. ఆద్యపదము – **'సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్ ' , 'హిరణ్యగర్భస్సమవర్తతాగ్రే' –** ఇత్యాది శ్రుతిప్రతిపాద్యమైన ఆద్యబ్రహ్మ తత్త్వమును తెలియజేస్తుంది.

**'సరత్యాకాశే'** అనే వ్యుత్పత్తిననుసరించి ఆకాశములో సంచరించే వాడు సూర్యుడనే ప్రసిద్ధి యేర్పడినది. బాహిరంగా ఆదిత్యభగవానుడు మహాకాశంలో చరిస్తూ లోకములను ప్రకాశింప చేస్తున్నట్లుగానే దేహస్థుడైన జీవాదిత్యుడు చిదాకాశంలో సుషుమ్నా మార్గంలో సంచరిస్తూ అంతర్యామిగా చిదాభాసుడుగా ప్రాణశక్తిగా శరీరాన్ని సంరక్షిస్తున్నాడని గ్రహించాలి. భక్తి ప్రపత్తులతో నిత్యమునాయనను భజించిన వారి యోగక్షేమములనాయనే సంరక్షిస్తూ ఉంటాడు. నిరంతరమాయనను హృదయంలో ధ్యానించే అభియుక్తులను అనగా జ్ఞానులైన భక్తులను యోగక్షేమనిర్వహణము ద్వారా ఆయనే సంరక్షిస్తాడని ప్రతిజ్ఞాపూర్వకంగా భరోసానిస్తాడు భగవానుడు. 'తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్" అనే దాతని కంఠోక్తి. అందుకే తురీయపాదంలో సాంబుడు ఆదిత్యనారాయణుని 'సపది ప్రపద్యే' శీఘ్రముగా ఆశ్రయిస్తున్నానంటాడు. అలా ఆశ్రయిస్తే లభించేవి అనగా ఆయనమనకనుగ్రహించేవి యోగక్షేమములు. **'అప్రాప్తస్యప్రాప్తిర్యోగః** – అంటే అత్యంత దుర్లభమైన పరమ పురుషార్థమును అనగా మోక్షము యొక్క ప్రాప్తి యోగమనబడుతుంది. ఆ మోక్షము కూడా తురీయమైన భగవత్సాయుజ్యమే అనగా భగవానునిలో లీనమై తరించడమేననే విషయాన్ని యోగశబ్దం తెలియజేస్తుంది.

యోగమనగా 'కలయిక' అనగా భగవత్సాయుజ్యము అనగా భగవానునిలో లయించుట అని భావము. జీవాదిత్యుడుగా మనలోనే లయించి మనలోని అవిద్యా మోహములను తొలగించి ప్రాణశక్తిగా హృన్మధ్యగతుడై నిరంతరం మనను సంరక్షిస్తున్న పరమకరుణామయుడు జీవాదిత్యుడు. అందుకే ఆ చిద్భానుని, అత్యంత సన్నిహితుని మనకోసం మననాశ్రయించి తరింపచేయుటకు సిద్ధముగా నున్న అతనినాశ్రయించి సేవించడం మన తక్షణ కర్తవ్యమనే విషయాన్ని "**సపది – శీఘ్రమ్**" అనే పదం తెలియజేస్తుంది.

నిరంతరాయంగా ఆ జీవాదిత్యమూర్తి నిర్వహించే క్షేమప్రక్రియను సాంబుడు మూడు పాదాల్లో ఒక మహోపదేశంగా మనకు అనుగ్రహిస్తాడు. సత్యజ్ఞానానంతమైన పరబ్రహ్మము తానే సర్వమై సదా దర్శనమిస్తున్నా గురూపదేశం వినా మనం దాన్ని దర్శించలేము, దర్శించిన 'తత్త్వమసి–అదే నీవనే' ఉపదేశవాక్యము వినా,**'అహం బ్రహ్మాస్మి'**– నేనే ఆ పరబ్రహ్మముననే అనుభవజ్ఞానాన్ని పొందటం వీలు పడదు. ఈ విషయాన్ని శ్రుతిమాత – **'సర్వంఖల్విదం బ్రహ్మ' , 'అయమాత్మా పరంబ్రహ్మ' 'తత్త్వమసి' 'అహంబ్రహ్మాస్మి'** ఇత్యాది మహావాక్యాలద్వారా మనకనుగ్రహించిన సంవిద్రూపమైన జ్ఞానాన్ని సద్గురు సమాశ్రయణము ద్వారా మాత్రమే పొందగలము. పరమకారుణికులైన సద్గురువులు కొందరు తమకు తాముగనే అర్హత ననుగ్రహించి శిష్యులకు జ్ఞానోపదేశము చేసి వారిని తరింప చేస్తూ ఉంటారు. అట్టి కోవకు చెందిన సాంబసద్గురుడు ఈ ఆదిత్యస్తవము ద్వారా మనకు వేదాత్మ, చిదాత్మ, పరమాత్మయైన సూర్యభగవానుని స్వస్వరూపమునుపదేశిస్తున్నట్లు గ్రహించాలి. మరల మన విచారణలో భాగంగా ఆదిత్యదేవుడనుగ్రహించే క్షేమమును సాంబోపదిష్టమార్గంలో దర్శించే ప్రయత్నం చేసుకుందాం.

వేదములకు ప్రాణము ఉద్గీథము లేదా ప్రణవమని పూర్వం చెప్పుకున్నాం. ప్రణవము కేవల శబ్ద ప్రపంచమునకే కాక సర్వజగత్తుకు కూడా ప్రాణశక్తియై జగద్వ్యాపారమును జ్ఞానశక్తిగా, నాదరూపముగా, వరేణ్యమైన భర్గశక్తిగా, క్రియాశక్తిరూపంలో జగద్వ్యాపారములను నడిపిస్తూ, ప్రచోదయిత్రీ శక్తిగా ప్రకాశిస్తూ ఉంటుంది. సావిత్రమైన సూర్యునియొక్క ఈ అనుగ్రహము ప్రథమపాదంలో – **"యః ఓమితి శబ్దః నియతం ప్రతిప్రాణి అన్తర్నదతి"** అనే పదసమాహారము ద్వారా – ఎవడు ప్రణవరూపములో నాదబ్రహ్మముగా నిరంతరము ప్రాణులన్నింటిలో హంసల (శ్వాస) రూపములో **'హంసస్సోఽహ'** మని నిరంతరము నినదించుచున్నాడో – అని నిర్దేశింపబడినది. **'సోఽహమ్'** లోని ప్రాణశక్తి స్వరములను (అచ్చులను) మాత్రమే గ్రహిస్తే 'ఓమ్' అనే ప్రణవము లభిస్తుంది. అనగా ప్రాణులన్నిటిలోను హంస (శ్వాస)ల రూపంలో సూర్యుడే ప్రణవంగా అనుక్షణము ప్రతిధ్వనిస్తూ జీవశక్తిని ప్రసాదిస్తున్నాడని సారాంశముగా గ్రహించాలి.

ప్రాణశక్తిగా ప్రతిధ్వనిస్తున్న ప్రణవనాదము నుండి జీవజగద్వ్యాపారముల నిర్వహించే శబ్దశక్తి పరా, పశ్యన్తి, మధ్యమా, వైఖరులుగా చతుర్ముఖీనముగా వివర్తము చెంది, జీవ జగత్కార్యములను నిర్వహిస్తూ ఉంటుంది. దీనిలో పరా–పశ్యన్తిలు రెండును యోగి మానసైక వేద్యములు. వాని వివర్తములు అను నాదములైన మధ్యమా వైఖరులు, లౌకిక శబ్దార్థవ్యాపారములద్వారా జీవజగద్వ్యాపారములను నిర్వర్తిస్తూ ఉంటాయి. ఇంకా యీ ప్రాణశక్తి స్వరూపమైన ప్రణవము ప్రాణాపానములను నియంత్రిస్తూ ప్రాణులను సంరక్షిస్తూ ఉంటుంది. స్వేచ్ఛాచారులైన రెండు వృషభములకు ముకుతాడు వేసి శాకటికుడు (బండివాడు)

వానిని సరియైన మార్గంలో నడిపిస్తున్నట్లుగా, ప్రాణశక్తియు ప్రణవాత్మకుడునైన జీవాదిత్యుడు ప్రాణాపానములనునియంత్రించి, జీవవ్యాపారములను నడిపిస్తాడు. ప్రాణాపానములు పరస్పరము ఆకర్షించుకుంటూ ఒకదానినొకటి కబళించే ప్రయత్నం చేస్తూ ఉంటాయి. ప్రాణము స్వస్థానమైన హృద్దేశమునకు, అపాన వాయువును అపానము గుదస్థానానికి, ప్రాణవాయువును ఆకర్షిస్తూ ఉంటాయి. వానిని నియంత్రించక పోయినట్లయిన ప్రాణులు మరణిస్తాయి. కావున జీవాదిత్యమూర్తి అంతర్యామియై సదా ప్రాణాయామ పరాయణుడుగా వాటిని నియంత్రిస్తూ ఉంటాడని **"యః మిథః గ్రాససక్తౌ ప్రాణాపానౌ సమౌ వహతి"** – అని మూడవపాదంలో చెప్పబడినది. ఈ విధముగా దేహస్థితుడై ముువ్విధములుగా మన యోగక్షేమములను నిర్వహించుచున్న పరమాత్మ స్వరూపుడైన జీవాదిత్యుని ప్రపత్తిపూర్వకముగా **సోఽహం** భావముతో సేవిస్తున్నానని, నాలుగవ పాదం యొక్క అర్థాన్ని సమన్వయించుకోవాలి. కాగా, ప్రథమ పాద ప్రతిపాద్యమైన ప్రణవనాదం తత్పదార్థాన్ని, ద్వితీయపాదమైన శబ్దతన్మాత్ర గర్భితమైన పరావాక్కు **'త్వం'** పదార్థాన్ని, జీవాదిత్యుడుగా ప్రాణాయామ పరాయణుడై జీవవ్యాపారములను నియంత్రించి, నిర్వర్తిస్తున్న ఆదిత్యభగవానుని ప్రపత్తి పూర్వక సంభావనము మహావాక్యముల యొక్క అనుభవాత్మకమైన ధ్యానయోగ సమన్వయాన్ని తెలియజేస్తున్నాయని భావము.

గీతాస్మృతి ఇదే విషయాన్ని 4వ అధ్యాయం 29వ శ్లోకంలో **'ప్రాణాపాన గతీరుద్ధ్వా ప్రాణాయామ పరాయణః "** అని నిర్దేశించినది.

## అనువాద పద్యము

సీ॥ ఓంకృతి నెవ్వాడు నూదుచు నినదించు-
ప్రాణుల సౌషుమ్న పథము నందు
శబ్ద తన్మాత్రగా సంచరించియు పర-
రూపునంది యుపరి రూపుదాల్చి
పశ్యంతి పేరిట బరగుచు నడుపును-
జీవనక్రియలకు జీవనముగ
ఒండొరుల కబళ నోద్యుక్తి నిచరియించు-
ప్రాణమపానంబు పరిహరింప

గీ॥ జేసి జీవుల రక్షించు జీవభాను
నతని పరముని పరచిత్పరార్కమూర్తి
చిద్గగనచారి శరణము చేరి నేను
భవము నవలీల దాటెద భయము వీడి॥

---0---

## 5వ శ్లోకము

**అవతారిక:-** ప్రత్యక్షదైవంగా ప్రకాశిస్తూ బ్రహ్మాణ్డమును, చిద్భానుడుగా అంతర్యామియై పిణ్డాణ్డములను సంరక్షిస్తున్న ఏకాత్మ స్వరూపుడైన మార్తాండుని స్వరూపమీ శ్లోకమున వివరింపబడుచున్నది.

**శ్లో॥ యస్త్వక్చక్షుఃశ్రవణరసనాఘ్రాణపాణ్యంఘ్రివాణీ
పాయూపస్థస్థితిరపి మనోబుద్ధ్యహంకారమూర్తిః
తిష్ఠత్యన్తర్బహిరపి జగద్భాసయన్ ద్వాదశాత్మా
మార్తాణ్డం తం సకలకరణాధారమేకం ప్రపద్యే॥**

**అన్వయము:-** ద్వాదశాత్మా యః బహిః- త్వక్ - చక్షుః - శ్రవణ - రసనా - ఘ్రాణ - పాణి - అంఘ్రి - వాణీ - పాయు - ఉపస్థ స్థితిః అపి,

అంతః – మనః బుద్ధి అహంకార మూర్తిః తిష్ఠతి, బహిరన్తరపి జగత్ భాసయన్ తిష్ఠతి, సకలకరణాధారం ఏకం తం మార్తాణ్డం ప్రపద్యే

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| ద్వాదశాత్మా | – ధాతృ అర్యమ, మిత్ర, వరుణ, ఈశ, భగ, ఇంద్ర, వివస్వాన్, పూష, పర్జన్య, త్వష్టృ, విష్ణువులనెడి ద్వాదశాదిత్య రూపములతో |
| యః బహిః | – ఏ సూర్యభగవానుడు బాహిరముగా |
| త్వక్చక్షుః శ్రవణరసనాఘ్రాణ | – చర్మ చక్షు శ్రవణజిహ్వాఘ్రాణము లనెడి పంచ జ్ఞానేంద్రియములయందు |
| పాణ్యంఘ్రివాణీపాయూపస్థితాః అపి | – పాణి, పాద, వాక్ పాయూపస్థలనే కర్మేంద్రియములందును వానికాధార భూతుడుగా ప్రకాశింప చేయుచున్నవాడై కూడా |
| అన్తః మనోబుద్ధ్యహంకారమూర్తిః | – లోపల మనోబుద్ధ్యహంకారముల స్వరూపంతో జ్ఞానశక్తిగా |
| బహిరన్తరపి | – బాహిరముగా, ఆంతరముగానున్న |
| జగత్ భాసయన్ తిష్ఠతి | – ప్రపంచమును ప్రకాశింప చేయుచున్నాడో |
| సకలకరణాధారం | – సూత్రాత్మగా క్రియా శక్తిగా సకల జ్ఞానకర్మేంద్రియాన్తః కరణముల కాధారమైన |
| తమేకం మార్తాణ్డం | – ఆయా ఇంద్రియ వ్యాపార నిర్వాహకుడుగా ద్వాదశాత్మకుడుగా జగచ్చక్రమును ప్రకాశింపజేయుచున్నను సూత్రాత్మగా క్రియాశక్తిగా ఒక్కడే యైన మార్తాణ్డుని |
| ప్రపద్యే | – ప్రపత్తి పూర్వకముగా భజించుచున్నాను. |

**భావము :-** ద్వాదశాత్మకుడైన యే మార్తాండుడు పంచజ్ఞానేంద్రియములకు పంచ కర్మేంద్రియములకు క్రియాశక్తిగా అధిష్ఠానమై మనోబుద్ధ్యహంకారములను జ్ఞానశక్తిగా నడిపిస్తూ, సూత్రాత్మగా సర్వేంద్రియవ్యాపారములను ప్రవర్తింపచేయుచున్నవాడై బాహిరంగా, ఆంతరముగా బ్రహ్మాండ పిండాణ్డములను ద్వాదశ మూర్తులలో ప్రకాశింప చేయుచున్నాడో అట్టి సూత్రాత్మయగు చిద్భానుని భజించుచున్నానని భావము.

**శ్రీపాదుక :-** ఈ శ్లోకములో చిద్భానుని యొక్క అధ్యాత్మ, అధి దైవిక తత్త్వములు నిర్దేశింపబడినాయి. తొలుత ఆయన – **"త్వక్చక్షుఃశ్రవణ రసనాఘ్రాణపాణ్యంఘ్రివాణీపాయూపస్థస్థితిః"** – అని జ్ఞానేంద్రియ కర్మేంద్రియ పంచకముల కధిష్ఠానముగా వర్ణింప బడినాడు. ఇది యితని బాహిరముగా భాసిస్తున్న అధ్యాత్మ స్వరూపము. ఆయన ఇంద్రియముల కధిష్ఠానముగా జ్ఞానశక్తిచే సర్వేంద్రియములను ప్రకాశింపచేస్తూ ఉంటాడు. ఆయనే మరల 'మనోబుద్ధ్యహంకార మూర్తి' యై ఆంతరముగా సూత్రాత్మగా, తనదైన క్రియాశక్తిచే సర్వేంద్రియ వ్యాపారములను ద్వాదశాత్మకుడుగా నడిపిస్తూ ఉంటాడు.

మూడవపాదంలో ఆయనే బాహ్య జగత్తును అధిదేవుడై కాలాత్మకుడుగా పండ్రెండు రాశులలో సంక్రమిస్తూ, రాశిచక్రాన్ని ద్వాదశాదిత్యుల రూపంలో జగచ్చక్రాన్ని ప్రవర్తింప చేస్తూ ఉంటాడు. ఇలా అంతరంగా సకలేంద్రియములకు ఇంద్రియ వ్యాపారములకు అధ్యాత్మగా, బాహిరంగా జగచ్చక్రాన్ని, కాలాత్మకుడై రాశిచక్రాన్ని ప్రవర్తింపజేస్తూ అధిదేవతగా, ఒకే మార్తాండుడు ప్రవర్తింప చేయుచున్నాడనే విషయమీ శ్లోకంలో ప్రస్తుతించ బడినట్లు గ్రహించాలి. నాలుగవ పాదంలో చిద్భానుడుగా ప్రకాశిస్తున్న ఆ పరమాత్మ మార్తాండ శబ్దముచే కీర్తింపబడడం విశేషం. " మృతానాం(వేద్యైకరూపతయా శవప్రాయాణాం) అణ్డానాం (దేహప్రాణాది పిణ్డానాం) అయమనుప్రాణకః మార్తాణ్డః" చిద్భానుః " – అని మార్తాణ్డశబ్దం వ్యాఖ్యానింపబడినది. ప్రాణశక్తిగా ఆంతరంగా చిదాదిత్యుడే జీవాత్మకుడుగా ప్రకాశించకుంటే, ప్రాణిజాతమంతా శవప్రాయముగనే అచేతనంగా చచ్చుపడిపోతుందని భావం. కాగా జీవశక్తి లేదా ప్రాణశక్తియే సూర్యభగవానుడని తాత్పర్యం.

ఈ విధముగా సకలలోకైక వ్యాపార కారణత్వమును, సర్వప్రాణ్యుజ్జీవకత్వమును బాహిరంగా ఆంతరంగా బ్రహ్మాణ్డ పిండాండములను ప్రవర్తింపచేస్తున్నాడనే విషయాన్నీ మార్తాణ్డశబ్దం ప్రతిబోధిస్తున్నదని గ్రహించాలి. మేషాది రాశులలో ఆయా మాసాలకధి దేవతగా చిద్భానుని ద్వాదశమూర్తులు -

**ధాతార్యమాచ మిత్రశ్చ వరుణే శౌ భగస్తథా**

**ఇంద్రో వివస్వాన్ పూషాచ పర్జన్య త్వష్ట్ర విష్ణవః॥** అని ప్రశంసింప బడినాయి. విశ్వాత్మగా జీవాత్మగా సమాహారంగా సర్వాత్మగా సూర్యుణ్ణి వేదం - **"సూర్య ఆత్మా జగతస్తస్థుషశ్చ"** అని కీర్తించింది. కాగా విశ్వాత్మయైన సూర్యుడు లోకసంస్థితి కారకుడని తాత్పర్యము.

## అనువాద పద్యము

**సీ॥** పంచ పంచేంద్రియ వ్యాపార కారణం-
బగుచు నెవ్వాడిల బాహిరమున
ఆంతరంబున మనోహంకార చిత్తాది-
వికసనమ్మొనరించి వెలుగుచుండు
అంతఃకరణముల నాంతర జగతిలో-
ద్వాదశాత్మకుడయి దనరజేయు
సర్వాత్మకుండయి సకల కరణముల-
కాధారభూతుడై యలరుచుండు

**గీ॥** అట్టి మార్తాండమూర్తి నేనాశ్రయింప
నాక్షణంబున నఘవ్రాత మంతరించి
బాహిరాంతర శౌచంబు పరిఢవిల్లి
మోక్షమార్గము కనిపించె వీక్షణమున॥

---0---

# 6వ శ్లోకము

**అవతారిక:-** పూర్వ శ్లోకములో ప్రత్యక్షదైవంగా ప్రకాశిస్తూ బాహిరంగా బ్రహ్మాణ్డమును ఆంతరముగా పిండాణ్డమును సంరక్షిస్తున్న ఆదిత్యుని ప్రకాశాంశను వర్ణించి, ప్రస్తుత శ్లోకములో శబ్దప్రపంచముగా ప్రకటితమై వాగ్రూపముగా ప్రస్తరించిన ఆతని విమర్శాంశను సాంబుడు ప్రస్తుతించుచున్నాడు.

**శ్లో॥ యా సా మిత్రావరుణసదనాదుచ్చరన్తీ త్రిషష్టిం**
**వర్ణానత్ర ప్రకటకరణైః ప్రాణసంగాత్ప్రసూతాన్**
**తాం పశ్యన్తీం ప్రథమముదితాం మధ్యమాం బుద్ధిసంస్థాం**
**వాచం వక్త్రే కరణవిశదాం వైఖరీం చ ప్రపద్యే॥**

**అన్వయము:-** యాసా (వాణీ) (తాల్వాది స్థాన ప్రయత్న రూప) ప్రాణసంగాత్ ప్రసృతాన్ త్రిషష్టిం వర్ణాన్ అత్ర మిత్రావరుణసదనాత్ ప్రకటకరణైః ఉచ్చరన్తీ (స్థితాస్తి) తాం ప్రథమముదితాం పశ్యన్తీం వాచం, బుద్ధి సంస్థాం మధ్యమాం (వాచం), చ వక్త్రే కరణవిశదాం వైఖరీం (వాచం) చ ప్రపద్యే (అహమిత్యధ్యాహార్యమ్)

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| అహం | - సాంబుడనబడే ఈ నేను |
| యాసా (పరావాణీ) | - పరమాత్మయొక్క ఉద్గీథరూపమైన ఏపరా వాక్కు |
| ప్రాణసంగాత్ప్రసూతాన్ | - ఆయాకంఠతాల్వాది స్థానముల యందు ప్రయత్నరూపమైన ప్రాణశక్తిసంగముచే వెలువడిన |
| త్రిషష్టిం వర్ణాన్ | - అరువది మూడు వర్ణములను |
| అత్ర | - ఈ శరీరమునందు |

మిత్రావరుణసదనాత్ - సూర్యవరుణుల కధివాసమైన (మూలాధారాది సహస్రారపరివ్యాప్తమైన అగ్నీషోమాత్మకమైన ఈ చిచ్ఛరీరమునుండి)

ప్రకటకరణైః - ఇంద్రియములచే ప్రకటింపబడినదై

ఉచ్చరన్తీ(స్థితాఽస్తి) - వాగ్రూపమున వర్ణసంఘాతముగా నుచ్చరింపబడుచున్నదో

ప్రథమముదితాం - ప్రప్రథమముగానుత్పన్నమైన

పశ్యన్తీం వాచం - పశ్యన్తియనెడు వాక్కును

ప్రపద్యే - ప్రపత్తితో ప్రణమిల్లుచున్నాను

బుద్ధిసంస్థాం - బుద్ధిలో నుండి ప్రకాశించుచున్న

మధ్యమాంవాచం - మధ్యమయను వాక్కును

ప్రపద్యే - భజించుచున్నాను

చ వక్త్రే - మరియు నటులనే (వాగింద్రియాధిష్ఠానమైన) నోటి యందు

కరణవిశదాం - జిహ్వాదంతతాల్వోష్ఠాది కరణముల సంఘాతముచే శబ్దముల రూపములోప్రకటింపబడుచున్న

వైఖరీం వాచం - వైఖరియను వాక్కును

ప్రపద్యే - ప్రశ్రయపురస్సరముగా ప్రణమిల్లుచున్నాను.

**భావము** :-అగ్నీషోమాత్మకమైన ఈ శరీరమునందు స్వసంకల్పానుగుణముగా ప్రాణశక్తి ప్రచోదితమై శబ్దరూపమున ప్రభవించిన పరావాక్కు తొలుదొలుత పశ్యన్తిగా, పిమ్మట బుద్ధి ప్రచోదితమై మధ్యమగా తదుపరి ముఖమున అనగా వాగింద్రియ నిధానమైన నోటిలోనికంఠతాల్వోష్ఠదన్తాదులయందు ప్రయత్న సంఘాతముచే శబ్దోచ్చారణ

రూపమున వైఖరిగా ప్రభవిల్లుచున్నది. ఆదిత్యుని యొక్క ఉద్గీథరూపమే పరాపశ్యన్తీ మధ్యమా వైఖరులుగా సాధకుల యోగ్యతననుసరించి సాక్షాత్కరిస్తుంది. పరాపశ్యన్తిలు రెండును యోగిహృద్ధ్యానగమ్యములు మధ్యమ వైఖరులు అస్మదాదులకు బుద్ధిగోచరములు. భక్తి ప్రపత్తుల కనుగుణంగా చిద్భానుని యొక్క వాణీస్వరూపము సాధకులకనుభవగోచరమవుతుందని భావము.

**శ్రీపాదుక:-** చిద్భానుని యొక్క విమర్శాంశ శబ్దస్వరూపంగా ప్రణవాత్మకంగా సర్వత్ర వెలుగొందుతూ సర్వమును ప్రకాశింపజేస్తున్నా దాన్ని కొందరు సిద్ధయోగులు మాత్రమే సమగ్రముగా దర్శింపగలరు. ఆ శబ్దము పరా, పశ్యన్తి, మధ్యమ, వైఖరి అని నాల్గువిధములుగా ప్రకటితమౌతున్నా దాని యొక్క వైఖరీ స్వరూపాన్ని మాత్రమే ప్రాణులు శ్రవణేంద్రియ ప్రత్యక్షానుభవరూపంలో దర్శిస్తాయని శ్రుతి. –

**మం॥ చత్వారి వాక్పరిమితా పదాని।**
**తాని విదుర్బ్రాహ్మణా యే మనీషిణః**
**గుహాత్రీణి నిహితా నేంగయన్తి**
**తురీయం వాచో మనుష్యా వదన్తి॥** అనే శ్లోకమంత్రం సూచిస్తుంది.

ప్రణవాత్మకుడైన ఆదిత్య పరబ్రహ్మము యొక్క వివర్తములే చతుర్విథ వాక్ప్రస్తారములుగా భావించి,– వానికి ప్రపత్తి పురస్సరముగా కవి ప్రణమిల్లుట ఈ శ్లోకంలో కనిపిస్తుంది. ఆదృష్టిలో ఇది నాదోపాసన లేదా ప్రణవాదిత్యోపాసన. లేదా ఆదిత్యుని యొక్క అధిదైవికమైన విమర్శాంశకు సంబంధించిన ఉపాసనమని చెప్పవచ్చు ఈ ఉపాసనలో భాగంగా మొదటి రెండు పాదాల్లో శబ్దబ్రహ్మము యొక్క పరావాక్స్వరూపావిర్భావము వర్ణింపబడింది. ఆ పరావాక్కు మిత్రా వరుణ సదనము నుండి యావిర్భవించి ఆయా కరణముల యందు ప్రాణశక్తి ప్రచోదనము చేత అరువది మూడు వర్ణములను ఉచ్చారణ పురస్సరముగా ప్రకటిస్తుందని ప్రథమార్థభావము.

తంత్ర శాస్త్రంలో కుండలిని సుషుమ్నాపథంలో మూలాధారము నుండి ప్రయాణం ప్రారంభించి సహస్రారపర్యన్తము చిచ్ఛక్తిగా తేజోరూపమున ప్రసరిస్తుందని చెప్పబడినది. దానినే చిద్భానుని యొక్క ప్రాణశక్తిగా సాంబకవి సంభావించేడనే విషయాన్ని **'మిత్రావరుణ సదనాదుచ్చరంతీ'** అనే సమస్తపదం తెలియచేస్తుంది. కులపథము లేదా సుషుమ్నామార్గములోని, మూలాధార స్వాధిష్ఠానములు అగ్నిమండలముగా, మణిపూర అనాహతములు వరుణమండలముగా, విశుద్ధి ఆజ్ఞాసహస్రారములు సోమమండలముగా చెప్పబడినవి. **"మిత్రః అగ్నిః, అత్ర ఆదిత్యరూపత్వాన్మిత్ర శబ్దః"** అని వ్యాఖ్యానము. అలాగే వరుణ శబ్దానికి **'వరుణః సోమః జలాభిమానిత్వాత్'** అని వ్యాఖ్యానింపబడినందున **'మిత్రావరుణసదనమ్'** అనగా సుషుమ్నా పథమనే అర్థం సిద్ధిస్తుంది. **ఉత్+చరన్తీ=ఉచ్చరన్తీ** అనగా ఊర్ధ్వముఖముగా ప్రయాణించునది అనే అర్థాన్ని భావించినట్లయితే **'మిత్రావరుణసదనాదుచ్చరన్తీ'** అనే పదానికి మూలాధారమునుండి ప్రభవించి ఊర్ధ్వముఖంగా ప్రయాణిస్తున్న కుణ్డలిని అనే చిదాదిత్యుని చిచ్ఛక్తి వాగ్రూపంలో పరా పశ్యన్తి మధ్యమా వైఖరుల రూపంలో దర్శనమిస్తుందని అవతగమవుతుంది. ఈ ప్రక్రియ శిక్షా గ్రంథాల్లో –

**ఆత్మా బుద్ధ్యా సమేత్యర్థాన్ మనోయుంక్తే వివక్షయా।**
**మనః కాయాగ్నిమాహన్తి స ప్రేరయతి మారుతమ్।**
**మరుతస్తూరసి చరన్ మంద్రం జనయతి స్వరమ్ ॥**– అనగా ఆత్మబుద్ధిసంయోగము వల్ల మనస్సులో సంకల్పముదయించి తదనుసారముగా మనస్సు (స్వాధిష్ఠానగతమైన అంతర్వహ్నినుద్దీపింప చేయగా, అది హృద్గతమైన ప్రాణవాయువును ప్రేరేపించగా, ఆ ప్రాణశక్తి నాభినుండి మంద్రస్వరమును జనింప చేస్తుంది. అది వాగింద్రియములను అనగా కంఠతాలుజిహ్వాదన్తాది స్థానములను స్పృశిస్తూ వివిధములైన వర్ణములను ఉచ్చరింపజేస్తుందని వివరింపబడింది. ఈ విధమైన శబ్దోత్పత్తి ప్రక్రియలో కుణ్డలినీ శక్తిరూపమైన వాగ్దేవీ స్వరూప వివర్తములే పరా, పశ్యన్తి, మధ్యమ, వైఖరులనే పేరిట శిక్షా–యోగ గ్రంథాల్లో పేర్కొనబడినాయి.

ప్రప్రథమముగానుదయించిన జ్యోతీరూపమైన పరావాక్కు అత్యంత సూక్ష్మతర'మైనది. అది కేవలము యోగిమానస ప్రత్యక్షము. దాని వివర్తమేయైన పశ్యన్తి సూక్ష్మ స్వరూపముతో యత్కించిదనుభవములో యోగులచే మాత్రమే సందర్శింపబడుతుంది. దాని స్వరూపము–

**అవిభాగాత్తు పశ్యన్తీ సర్వతః సంహృతక్రమా।**

**స్వరూపజ్యోతీరేవాన్తః సూక్ష్మా వాగనపాయినీ॥**

అని నిర్దేశింపబడినది. మన స్సంకల్పజనితమై సూక్ష్మమగు జ్యోతీ రూపముగా నుదయించిన పశ్యన్తి బుద్ధి సంయోగమున ప్రాణశక్తిచే ప్రేరేపింపబడినదై మధ్యమగా ప్రవర్తిస్తుంది.

శ్లో॥ **కేవలం బుద్ధ్యుపాదానాత్ క్రమరూపానుపాతినీ।**

**ప్రాణవృత్తి మతిక్రమ్య మధ్యమా వాక్ప్రవర్తతే॥**

ఇది ఆన్తఃకరణములో అస్మదాదులకు కూడా అనుభవగోచరమవుతుంది. **"మధ్యే అన్తఃకరణే ప్రవర్తమానా మధ్యమా"** అనగా హృన్మధ్య భాగములో నావిర్భవిస్తున్నట్లు అనుభవములో కనిపిస్తున్న కారణముగా దీనికి 'మధ్యమ' అనే వ్యవహారమేర్పడింది.

మధ్యమయే పిమ్మట నోటిలోని జిహ్వామూల, కంఠతాల్వాది స్థానముల యందు బాహ్యాభ్యంతర ప్రయత్నములచే ప్రాణశక్తిప్రచోదితమై వర్ణ,పదసమాహృత శబ్దముల రూపమున వైఖరిగా వినిర్గతమవుతున్నదని వైఖరీ లక్షణము

శ్లో॥ **'స్థానేషు వివృతే వాయౌ కృతవర్ణపరిగ్రహా**

**వైఖరీవాక్ ప్రయోక్తౄణాం ప్రాణవృత్తినిబన్ధనా॥** అని నిర్వచింపబడినది. ఈ విధముగా అగ్నీషోమాత్మకమైన మిత్రావరుణ సదనము నుండి నాల్గు విధములుగా ప్రస్తరించి, తుదకు త్రిషష్టి అనగా 63 వర్ణముల సంఘాతముగా వైఖరీరూపమున ఉచ్చరింపబడుచున్న చిదాదిత్యుని చిచ్ఛక్తికి

ప్రణమిల్లుతున్నానని తాత్పర్యార్థము. శీక్షా వ్యాకరణ గ్రంథములలో త్రిషష్టి వర్ణముల యొక్క పరిగణనము-

**స్వరా ద్వావింశతిశ్చైవ స్పర్శానాం పంచవింశతిః।**

**యాదయః శాదయశ్చాష్టౌ చత్వారశ్చ యమాః స్మృతాః।**

**అను స్వారో విసర్గశ్చ ఁక ఁప ఇతి పరాశ్రయౌ ।**

**త ఏతే గదితావర్ణాః త్రిషష్టిరిహ సూరిభిః॥** అని నిర్దేశింప బడినది. ప్రాణస్వరములైన అజ్వర్ణములు 22, అవి హ్రస్వ దీర్ఘ ప్లుతములైన అ ఇ ఉ ఋ లు (4×3=12) ఌకారము (దీర్ఘప్లుతాత్మకము)(2) ఏ ఐ ఓ ఔ లు దీర్ఘప్లుతములు (4×2=8) వెరసి 12+2+8=22 గను కాదయో మావసానాః స్పర్శాః - అను పాణినీయనిర్దేశించి 'క-చ-ట-త-ప వర్గము లైదింటిలోని ప్రతివర్గకు ఐదేసిచొప్పున (5×5=25) వర్ణములు, య-ర-ల-వ-శ-ష-స-హ లు (8) యమవర్ణములు (4) అనుస్వార, విసర్గ జిహ్వామూల(ఁక) ఉపధ్మానీయము (ఁప)లు నాలుగు వెరసి 22+ 25+ 8+ 4+ 4 =63 వర్ణములతో కూడిన వర్ణపద సంఘాతరూపముగా వైఖరీవాక్కు ప్రకటిత మగుచున్నదని భావము.

రెండవ పాదములో **'వర్ణానత్ర'** అను పదముల స్థానములో **'వర్ణానన్తః'** అను పాఠము కనిపించుచున్నది. **'వర్ణానన్తః ప్రకటకరణైః ప్రాణసంగాత్ ప్రసూతే'** - అనే యీ పాఠాంతరాన్ని గ్రహించిన పక్షంలో - పరావాక్కు అగ్నీషోమాత్మకమైన మిత్రావరుణ సదనము నుండి నిర్గమించి ప్రాణశక్తి ప్రచోదితమై 'ఉచ్చరన్తీ' కుణ్డలినిగా ఊర్ధ్వముఖముగా ప్రసరిస్తూ 'పశ్యన్తి' గా అంతర్వాహినిగా యత్కించిద్విస్ఫుటితమై మధ్యమగా, త్రిషష్టివర్ణ సంఘాత రూపముతో సుస్పష్టమైన వైఖరిగా అభివ్యక్త మౌతున్నదనే అర్థం సిద్ధిస్తుంది. ఆగమాంతరములలో యీ ప్రక్రియయే

**" చితి ప్రత్యవమర్శాత్మా పరావాక్ స్వరసోదితా।**
**సైషా సారతయా చోక్తా హృదయం పరమేష్ఠినః॥**
**సూక్ష్మా కుణ్డలినీ మధ్యే జ్యోతిర్మాత్రాత్యణీయసీ।**
**అశ్రోత్రవిషయా తస్మాదుద్గచ్ఛత్యూర్ధ్వగామినీ॥**
**స్వయంప్రకాశా పశ్యన్తీ సుషుమ్నా మాశ్రితా భవేత్।**
**సైవ హృత్పంకజం ప్రాప్య మధ్యమా నాదరూపిణీ॥**
**అన్తః సంజల్పమాత్రా స్యాదవిభక్తోర్ధ్వగామినీ**
**సైవోరఃకంఠతాలుస్థా శిరోఘ్రాణద్విజోపమా॥**
**జిహ్వామూలోష్ఠనిష్ప్యూత కృతవర్ణపరిగ్రహా।**
**శబ్దప్రపంచజననీ శ్రోత్రగ్రాహ్యా తు వైఖరీ॥**

చిద్భానునియొక్క చిచ్ఛక్తియొక్క విమర్శాంశ పరావాక్‌గా బ్రహ్మగారియొక్క హృదయమైన వాణీరూపముగా రసమయిగా ప్రకాశిస్తూ ఉంటుంది. అదే సూక్ష్మతరమైన కుణ్డలనిగా జ్యోతీరూపమున అన్తఃకరణమున పశ్యన్తిగా ప్రకాశించి, తనదైన స్వప్రకాశంతో ఊర్ధ్వముఖంగా తన ప్రస్థానమును ప్రారంభిస్తుంది. ఇది కేవలము యోగిమానస ప్రత్యక్షమైనది. మన బోంట్లకు వినిపించదు. సాధకులకు సిద్ధయోగులకు అమృతానంద నిష్యంద సందోహాన్ని కలుగజేస్తుందని–**"ప్రకాశమానా ప్రథమే ప్రయాణే–ప్రతి ప్రయాణేష్యమృతాయమానా" –** అని కీర్తించబడినది. తరువాత నిదియే స్వయంప్రకాశముచే సుషుమ్నా మార్గమున నూర్ధ్వముఖంగా ప్రయాణిస్తున్నట్లు 'పశ్యన్తి'గా దర్శింపబడుచున్నదై అనాహతంలో హృన్మధ్యంలో మధ్యమానాదముగా అనుభవవేద్యమౌతుంది.

నాదరూపమున నదియే ఊర్ధ్వముఖీనమై ఉరః, కంఠ, తాలు, శిరోఘ్రాణ, జిహ్వామూల – ఓష్ఠాది స్థానములందు శ్రవణేంద్రియజన్యప్రత్యక్షమైన వర్ణపదసంఘాతాత్మకమైన శబ్దప్రపంచజననిగా వైఖరిగా ప్రకటితమగుచున్నదని – వివరించబడినది. ఈ విధముగా వాణీరూపములో

సాక్షాత్కరించి వాగ్వ్యాపారమును నిర్వహించి జగత్పరిపాలనము గావించుచున్న శబ్దబ్రహ్మాత్మకమైన చిదాదిత్యుని చిచ్ఛక్తికి ప్రణామమని పిండితార్థముగా గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥** **ఆదిత్యదేవుని యా విమర్శాంశయే-**
**పరవాక్కుగా లోన పాదుకొనియు**
**మిత్ర వరుణులదౌ సత్రము వీడుచు-**
**వర్ణత్రిషష్టిని వాక్కులలర**
**పశ్యన్తిగా తొలి ప్రాభవమందియు-**
**యోగులకగుపించు యోగదృష్టి**
**వాగింద్రియస్థాన వాయుకరణముల-**
**సంఘట్టితంబయి సాధ్యమగును**

**గీ॥** **అదియె వైఖరి యయ్యదె యర్కతేజ**
**మదియె శబ్దప్రపంచపుటాది మూల**
**మదియె వాగాదిక్రియలకు నాటపట్టు**
**తరణి గాంచెద దానిని శరణుజొచ్చి॥**

---0---

# 7వ శ్లోకము

**అవతారిక :** చిద్భానుని విమర్శాంశయొక్క శబ్దవివర్తమును ప్రస్తుతించినపిమ్మట అర్థవివర్తమును మూడు శ్లోకములలో ప్రస్తుతించుటకారంభించుచున్నాడు.

**శ్లో॥ ఊర్ధ్వాధస్తాదతను భువనాన్యన్తరా సన్నివిష్టా**
**నానానాడీ ప్రసవగహనా సర్వభూతాన్తరస్థా**
**ప్రాణాపానగ్రసననిరతైః ప్రాప్యతే బ్రహ్మనాడీ**
**సా నః శ్వేతా భవతు పరమాదిత్యమూర్తిః ప్రసన్నా॥**

**అన్వయః-** ఊర్ధ్వాధస్తాత్ అతను భువనాని అన్తరా సన్నివిష్టా; నానానాడీ ప్రసవగహనా, సర్వభూతాన్తరస్థా యా బ్రహ్మనాడీ (రూపిణీ) శ్వేతా పరమాదిత్యమూర్తిః ప్రాణాపానగ్రసననిరతైః (యోగిభిః) ప్రాప్యతే; సా నః ప్రసన్నా భవతు

**ప్రతిపదార్థము:-**

| | | |
|---|---|---|
| ఊర్ధ్వాధస్తాత్ | - | (మధ్యమలోకమైన భూలోకమునకు)పైన క్రిందనున్న |
| అతను భువనాని | - | అనేకలోకముల |
| అన్తరా సన్నివిష్టా | - | లోపల లెస్సగా నెలకొని యున్నదియు(మరియు) |
| నానానాడి ప్రసవగహనా | - | బహువిధములైన నాడీమండలములకు (72000 నాడులకు) మూలమై మిక్కిలి గంభీరమైనదై |
| సర్వభూతాన్తరాత్మా | - | సమస్త ప్రాణులలో అంతర్యామిగా ఆత్మస్థానీయముగా నున్నదియు నగు |
| యా బ్రహ్మనాడీ | - | యే బ్రహ్మనాడి (యని వ్యవహరింపబడుచున్న) |
| శ్వేతా | - | తెల్లని స్వచ్ఛమైన |
| పరమాదిత్యమూర్తిః | - | చిద్భాను స్వరూపము |
| ప్రాణాపానగ్రసననిరతైః (యోగిభిః) | - | ప్రాణాపానములను కబళించుట యనెడి ప్రాణాయామ ప్రక్రియ యందు నిరంతరము నిర్మగ్నులై యున్న యోగులచే (మాత్రమే) |

ప్రాప్యతే - పొందబడుచున్నదో

సా - ఆచిద్భానుమూర్తి

నః ప్రసన్నా భవతు - మనకు ప్రసన్నమగు గాక

**భావము :-** భువరాది సప్త ఊర్ధ్వలోకములకు, అతలాది సప్త అధోలోకములకు మధ్యనున్న భూలోకమున లెస్సగా ప్రకాశించుచున్నదియు, సమస్త ప్రాణులలో అంతరాత్మగా ప్రకాశించి బహువిధములైన నాడీమండలములనుత్తేజ పరచుచున్న బ్రహ్మనాడీ రూపమగు స్వచ్ఛమైన చిదాదిత్యమూర్తి పరస్పర గ్రసనశీలమైన ప్రాణాపానములను ప్రాణాయామముచే నియంత్రించి నిగ్రహించుట యందు సదా నిష్ఠగల యోగీశ్వరులచే మాత్రమే పొందబడుచున్నాడో అట్టి శ్వేతవర్ణముకల చిదాదిత్యమూర్తి మనయెడ ప్రసన్నుడగుగాక! యని భావము

**శ్రీ పాదుక:-** ఈ శ్లోకమున మధ్యమలోకవర్తియగు చిద్భానునియొక్క ప్రపత్తి వర్ణింపబడినది. ఆ మూర్తి **శ్వేతా** అనగా స్వచ్ఛమైనది. అనగా జ్ఞానశక్తిస్వరూపము కావుననే కైవల్యప్రదమైనదని భావము. **'జ్ఞానాదేవహికైవల్యమ్'** అని కదా శాస్త్రప్రవచనము. **'ఊర్ధ్వాధస్తాదతనుభువనాన్యంతరా సన్నివిష్టా'** అను ప్రథమపాదము చిద్భానుని మధ్యమలోకసంస్థితిని తెలియపరచును.

బ్రహ్మాండములో మధ్యమలోకమైన భూలోకమునకు పైన భువర్లోక–సువర్లోక–మహర్లోక– జనోలోక–తపోలోక–సత్యలోకములు, క్రింద అతల, వితల, సుతల, తలాతల, రసాతల, పాతాళము లోకములు కలవని చెప్పుదురు. ఇవన్నియు **'అతను'** అనగా అపరిచ్ఛిన్న పరిమాణము కలవి. ఇది సువిశాలములైన ఊర్ధ్వ అధోలోకములకు నడుమ మధ్యమలోకమైన మనుష్యలోకమున అనగా భూలోకమున ప్రకాశించుచున్న చిదాదిత్యమూర్తి అని అతని విరాట్ప్రపంచప్రకాశకత్వము తెలియజేయబడినది.

ఆంతరముగా పిణ్డాణ్డములో 72000 నాడులు 18 కేంద్రములనుండి శరీరమంతటా వ్యాపించి బ్రహ్మనాడీమార్గంలో సుషుమ్నాపథంలో

బిందుకేంద్రము 'ఆజ్ఞాస్థానగతుడైన చిత్ప్రకాశ ప్రజ్ఞచే నియంత్రింప బడుచున్నట్లు తంత్రయోగ శాస్త్రములు చెప్పుచున్నవి. బిందుస్థానముకు క్రిందగా ఆజ్ఞ, లంబిక, విశుద్ధి, అనాహత, మణిపూర,స్వాధిష్ఠానములు, అను సప్త (7) నాడీకేంద్రములు, ఊర్ధ్వభాగములో అర్ధచంద్ర, రోధిని, నాద,నాదాంత, శక్తి, వ్యాపిక, సమన, ఉన్మన, మహాబిందు, సహస్రారములనే 10 జ్ఞానకేంద్రములున్నాయి. వీనినన్నింటినీ హృదాకాశంలో సంచరిస్తున్న చిదాదిత్యప్రభ నియంత్రిస్తూ ఉంటుంది. ఈ నాడీ కేంద్రములను నియంత్రిస్తున్న జీవాదిత్యుని చిత్ప్రభా సమున్మేషమే సుషుమ్నాపథము. బ్రహ్మనాడిగా చిద్భానునికి పర్యాయముగా శ్లోకంలో ప్రస్తావించబడిందని గ్రహించాలి. అదియే ప్రాణులన్నింటిలో ప్రసరించే సమస్త నాడులకు ప్రభవమైన బ్రహ్మనాడి యనే విషయం రెండవపాదంలోని **'నానానాడీప్రసవగహనా సర్వభూతాంతరాత్మా'** అనే పదాలు తెలియజేస్తాయి. ఆ బ్రహ్మనాడీగత చిదాదిత్యుని ప్రభాసమున్మేషమును ప్రాణాపాన గ్రసనమనగా వానిని నియంత్రించు ప్రాణాయామ పరాయణులైన యోగులు మాత్రమే దర్శింపగలుగుతారనే విషయం మూడవపాదంలో – **'ప్రాణాపానగ్రసననిరతైః ప్రాప్యతే'** అని చెప్పబడినది.

చివరగా నాలుగవపాదంలో అట్టి పరమాదిత్యమూర్తి మనకు ప్రసన్నుడై యనుగ్రహప్రదాత కావాలనే ఆశంస. **"సా నః శ్వేతా భవతు పరమాదిత్యమూర్తిః ప్రసన్నా"** అని తెలియజేయబడింది. చిద్భాను ప్రకాశము జ్ఞానకేంద్రములు లేదా నాడీకేంద్రము లన్నింటను బ్రహ్మనాడీ ప్రకాశముగా అనుస్యూతముగా మాలికలో దారమువలె ప్రకాశిస్తూ వానిని ఉద్దీపింపచేస్తూ, ఆంతరమైన అవిద్య లేదా అజ్ఞానాంధకారమును పారద్రోలి, శ్వేతకాంతి కలదై జ్ఞానమును తద్వారా మోక్షమును, నాడీశుద్ధి తద్వారా ఆరోగ్యమును అనుగ్రహిస్తుందని సారాంశము.

ఈ విధంగా బాహిరంగా, ఆంతరంగా బ్రహ్మాండ పిణ్డాణ్డ పరివ్యాప్తమైన శుభ్రమైన చిదాదిత్యమూర్తి బాహ్యాంతర ప్రపంచములను అనుగ్రహిస్తున్న వైనమీ శ్లోకంలో ప్రస్తుతించబడినదని గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥** పైన క్రిందనునున్న పదునాల్గు భువనాల-
లోపలనెలకొన్న లోనినాడి
బ్రహ్మనాడి యగుచు బహువిధ సంచారు-
లైన నాడులకును ఆదిమూల
మగుచు నాదిత్యుండు ఆంతరంబున వెల్గి-
యొండొరులను మ్రింగ నోసరిల్లు
ప్రాణమపానమ్ము త్రాణమ్మునొనరించి-
యోగ మార్గగమిగ యోగివరుల

**గీ॥** దహరమనియెడు నభమున దనరుచుండి
చింతలను బాపి చిద్భాను డాంతరమున
సాంబసన్నుతమూర్తి యా శాంతమూర్తి
శాంతిసౌఖ్యము లిడుగాక సర్వులకును॥

---0---

## 8వ శ్లోకము

**అవతారిక:-** పై శ్లోకమున ప్రస్తుతించబడిన పరమాదిత్య మూర్తినే మరల యీ శ్లోకమున కూడ మనలననుగ్రహింప వలసినదని కవి ప్రార్థించుచున్నాడు.

**శ్లో॥** న బ్రహ్మాణ్డవ్యవహితపథా, నాతిశీతోష్ణరూపా।
నోవా నక్తందివగమమితా ఽ_తాపనీ యాఽ_పరాహుః।
వైకుంఠీయా తనురివ రవేః రాజతే మండలస్థా
సా నః శ్వేతా భవతు పరమాదిత్యమూర్తిః ప్రసన్నా॥

**అన్వయము:-** యా బ్రహ్మాణ్డ వ్యవహిత పథాన (భవతి), (యా)అతి శీతోష్ణరూపా న, యా నక్తందివగమమితా న (భవతి) యా అతాపనీ యా అపరాహుః (భవతి), యా రవేః మండలస్థా వైకుంఠీయా తనురివరాజతే, సా శ్వేతా పరమాదిత్యమూర్తిః నః ప్రసన్నా భవతు

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| యా | – యేజీవాదిత్యమూర్తి (చిదాదిత్యుడు) |
| న బ్రహ్మాణ్డవ్యవహిత పథా: | – బ్రహ్మాణ్డమునకు భిన్నమైన మార్గమున చరించువాడు కాదో (అనగా బ్రహ్మాణ్డమార్గసంచారియో) |
| యా | – యే చిద్భానుమూర్తి |
| అతిశీతోష్ణరూపా న | – అత్యంత శీతస్వభావము లేదా ఉష్ణస్వరూపముకలదికాదో |
| యా | – యే చిదాదిత్యమూర్తి |
| నక్తందివగమమితా న | – రేయింబవళ్ల నేర్పరుచుటకు మాత్రమే పరిమితమైన గమనము కలది కాదో |
| చ | – మరియు |
| అతాపనీయా | – మిక్కిలి తాపమును కలిగించునదికాదో |
| అపరాహుః | – రాహువు యొక్క గ్రసనమునకు లోబడనిదో (రాహువుచే కబళింపబడదో) |
| రవేః మండలస్థా | – సూర్యమండల మధ్యస్థమై |
| వైకుంఠీయాతనురివ | – (త్రివిక్రమావతారమునందలి) వైకుంఠనారాయణ శరీరము వలె |
| సా శ్వేతా పరమాదిత్య మూర్తిః | – అట్టి స్వచ్ఛమైన పరమాదిత్యుని తేజోమయ స్వరూపము |
| నః ప్రసన్నా భవతు | – మన యెడ ప్రసన్నమై యను గ్రహించుగాక. (అని పూర్వశ్లోకాన్వయమునే ఇచ్చట కూడా అను సంధానించుకొనవలెను.) |

**భావము:-** సర్వోత్కృష్టముగా శ్వేతవర్ణముతో ప్రకాశించు చిద్భానుస్వరూపము బ్రహ్మాణ్డముకన్న అవ్యవహితమైనది, జాజ్జ్వల్యమానముగా ప్రకాశించుచున్నను శీతాతపాధిక్యములు లేనిదై సమశీతోష్ణముగా నుండును.

తేయింబవల్ల నేర్పరుచుచుకూడ కాలచక్రపరిధికతీతముగా నుండి సంతాపమును కలిగించు రాహువుచే గ్రసింపబడదు. అనగా రాహువుచే కబళింపబడదని భావము. ఇంకను త్రివిక్రమ ప్రక్రమావసరమున వామనమూర్తిగా గోచరించు విష్ణుమూర్తివలె, ఆదిత్యమణ్డలమధ్యగతమై విరాజిల్లుచుండును. అట్టి చిద్భానుని పరమాదిత్యమూర్తి తనదైన చిత్ప్రకాశముతో ప్రసన్నుడై మనలననుగ్రహించాలని సాంబకవి మంగళాశాసనము.

**శ్రీపాదుకః-** ఆదిత్యమణ్డలమధ్యగతముగా బాహిరంగా, ఆంతరంగా భాసిస్తున్న చిద్భానునియొక్క నిర్మల ప్రకాశము మనయెడ ప్రసన్నమై మనలననుగ్రహించాలని కవి యొక్క ఆశంస లేదా ఆకాంక్ష ప్రధానవాక్యము. ఇది ఈ శ్లోకమునకు పూర్వశ్లోకమునకు సమానంగా అన్వయించే చతుర్థపాదము. జీవాదిత్యునియొక్క ఆ చిదాభాస స్వరూపము పై మూడు పాదములలో శ్లిష్టపదసంఘటితమై బ్రహ్మాణ్డపిణ్డాణ్డములలో భాసించే పరమాదిత్య జీవాదిత్యులకిరువురకు సమానంగా అన్వయించేలా వివరించబడడం విశేషంగా గ్రహించాలి.

బాహిరమైన పరమాదిత్యమూర్తి బ్రహ్మాణ్డమున కవ్యవహితుడు. జీవాదిత్యమూర్తి బ్రహ్మాణ్డముతో వ్యవహితుడు. అనగా బ్రహ్మాణ్డముకన్న భిన్నముగ హృదాకాశములో ప్రకాశించువాడని భావం.

బహిరాదిత్యమూర్తి ప్రచణ్డమార్తాండమూర్తి తపనుడు, కాలకర్త రాహుగ్రస్తమూర్తి. జీవాదిత్యుడు తద్భిన్నముగ సమశీతోష్ణకాంతితో పరమానందకరుడు, జగదానందకారకుడు, కాలకక్ష్యకతీతమై రాహువునకు అగ్రాహ్యుడుగా ఆంతరంగా ప్రకాశిస్తూ ఉంటాడు. సూర్యమండలాంతర్వర్తియైన పరమాదిత్యమూర్తి వామనుడే త్రివిక్రమ ప్రక్రమముచే భూనభోంతరాళములను వ్యాపించిన విష్ణుమూర్తివలె సమస్తలోకములను ప్రకాశింపచేయుచు, జగదానందకరుడైనట్లుగనే

దహరాకాశసంచారియైన జీవాదిత్యమూర్తి చిద్భానుడు కూడ తన ప్రకాశముచే సుషుమ్నాపథమున చరిస్తూ, సమస్త నాడీ మండలములను అమృత నిష్యందముచే ఆప్లావితము చేస్తూ, జీవానందకరుడగుచున్నాడని గ్రహించాలి. ఇలా పరమాదిత్య జీవాదిత్యుల జగదానంద జీవానందకారకానుగ్రహములు శ్లిష్టపదసమాయోజనముద్వారా వర్ణించబడడం ఈ శ్లోకంలోని విశేషంగా గ్రహించాలి. ఈ శ్లేషాలంకారం **'వైకుంఠీయాతనురివ'** - అని ఉపమాగర్భితము కావడం మరో సాహితీ సౌరభంగా చెప్పుకోవచ్చు.

బాహిరంగా ఆదిత్యస్వరూపమెుకప్పుడు ప్రచణ్డమార్తాణ్డునిగా ప్రకాశించినా స్వభావతః ఆ మూర్తి ప్రసన్నమూర్తియే. భక్తానుగ్రహతత్పరమైనదే యనే విషయం రెండుశ్లోకాలలో నిర్బద్ధమై సుబద్ధంగా స్పష్టీకరింపబడినదని కవి హృదయమభివ్యక్తమవుతున్నది.

## అనువాద పద్యము

**సీ॥** బ్రహ్మము తానయ్యు బ్రహ్మాణ్డ పథమున-
చిద్భాను రూపుడై చిత్త మందు
భాసిల్లు చుండియు బ్రహ్మాణ్డ పిణ్డాణ్డ-
ములనిండి రాజిల్లు మూర్తి విభుత
త్రైవిక్రమంబుతో తా తేజరిల్లుచు-
వైకుంఠ తనువుతో వాటమెుప్ప
వెల్లవెలుగు వేల్పు వేడిమి వీడుచు-
శీతోష్ణ సమభావ శీర్ణకాంతి

**గీ॥** బాహిరంబగు జగముల భాసనింపి
ఆంతరమ్మున జేయును స్వాత్మబోధ
చిత్త మలరించు చిద్భాను చేతనంబు
దానినర్చింప మనజన్మ ధన్యమగును॥

---0---

# 9వ శ్లోకము

అవతారిక: – స్థూల సూక్ష్మరూపాలలో బాహిరంగా అంతరంగా అవతరించి బాహ్యాభ్యంతరాంధకారములను నిర్మూలించి జగజ్జీవులకు ప్రకాశముక్తులననుగ్రహిస్తున్న పరమాదిత్యుని సూక్ష్మ బృహద్రూపములను సమాహృతముగా సంకీర్తించుచున్నాడు.

**శ్లో॥ యత్రారూఢం త్రిగుణవపుషి బ్రహ్మ తద్బిన్దురూపం।**
**యోగీంద్రాణాం యదపి పరమం భాతి నిర్వాణమార్గః।**
**త్రయ్యాధారః ప్రణవ ఇతి యన్మణ్డలం చణ్డరశ్మేః**
**అన్తఃసూక్ష్మం బహిరపి బృహన్ముక్తయేఽహం ప్రపన్నః ॥**

**అన్వయము:-** త్రిగుణవపుషి యత్ర తత్ బిన్దురూపం బ్రహ్మ ఆరూఢం, యదపి యోగీంద్రాణాం పరమం నిర్వాణమార్గః భాతి, యత్ త్రయ్యాధారః ప్రణవః ఇత్యుచ్యతే, యచ్చ అన్తః సూక్ష్మం, బహిః బృహత్ వర్తతే, చణ్డరశ్మేః తన్మణ్డలం అహం ముక్తయే ప్రపన్నః॥

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| యత్ర త్రిగుణవపుషి | – సత్త్వరజస్తమోగుణాత్మకమైన యే శరీరమునందు |
| బిన్దురూపం | – బిన్దుస్వరూపముతో |
| తద్బ్రహ్మ | – సర్వజగత్కారణరూపముగా ప్రసిద్ధమైన ఆ పరబ్రహ్మము |
| ఆరూఢం | – సుస్థితమై నెలకొనియున్నదో, |
| యత్ | – ఏ పరబ్రహ్మము |
| యోగీంద్రాణాం అపి | – యోగీశ్వరులకుకూడ |
| పరమం | – సర్వోత్కృష్టమైన |
| నిర్వాణమార్గః భాతి | – మోక్షపథముగా ప్రకాశించుచున్నదో |

| | |
|---|---|
| యత్ | – ఏది |
| త్రయ్యాధారః | – ఋగ్యజుస్సామాత్మకమైన వేదమునకు మూలాధారమైన |
| ప్రణవః ఇత్యుచ్యతే | – ఓంకారనాదముగా చెప్పబడుచున్నదో |
| చ యత్ | – మరియు నేది |
| అన్తస్సూక్ష్మం | – ఆంతరమున అత్యంత సూక్ష్మతరమైనదిగను |
| బహిః | – వెలుపల |
| బృహదపి | – మహద్రూపమున (ప్రపంచముగా ప్రస్తరించినదో) |
| తత్ | – ఆవిధమైన |
| చణ్డరశ్మేః | – చణ్డకిరణుడగు సూర్యునియొక్క |
| మణ్డలం | – మణ్డలమును |
| అహం | – నేను, |
| ముక్తయే | – మోక్ష ప్రాప్తికొరకు |
| ప్రపన్నః | – శరణుపొందినాను. |

**భావము:-** త్రిగుణాత్మకుడైన యే పరమాదిత్యుని మండల స్వరూప శరీరమునందు, జగత్కారణమైన పరబ్రహ్మము బిందురూపమున సువ్యవస్థితమై యున్నదో, యేది యోగసిద్ధులకు కూడ, సర్వోత్కృష్టమైన మోక్షమార్గముగా ప్రకాశించుచున్నదో, మరియు యే చణ్డభానుని మణ్డలము ఋగ్యజుస్సామాత్మకమైన వేదమున కాధారమైన ప్రణవనాదముగా చెప్పబడినదో, ఆంతరమున సూక్ష్మతరమైనదిగా, బాహిరముగా విస్తృత పరివ్యాప్త ప్రపంచముగా ప్రకాశించుచున్నదో, ఆయాదిత్యమణ్డలమును ముక్తికొరకు నేను శరణముగా నాశ్రయించుచున్నానని భావము.

**శ్రీపాదుక:- "చణ్డరశ్మేః అన్తఃసూక్ష్మం, బహిరపిబృహత్ యన్మణ్డలం తత్ ముక్తయే అహం ప్రపద్యే"** - అనగా చణ్డకిరణుడైన సూర్యునియొక్క ఆన్తరముగా నతి సూక్ష్మముగను, బాహిరముగా అతి విస్తారముగా వ్యాపించిన యే మణ్డలముకలదో దానిని మోక్షము కొరకు నేను శరణముగా నాశ్రయించుచున్నాను. - అని భావము. పై నున్న రెండున్నర శ్లోకపాదములు ఆ సూర్యమణ్డల తత్త్వమును వివరిస్తాయి. నిగమాగమ తత్త్వరహస్యవిదుడైన సాంబుడు మోక్షకామియై ప్రధానముగా ఆదిత్యోపాసన చేసినాడనే విషయాన్ని మనం ప్రధానంగా గ్రహించాలి. సవత్సకధేను న్యాయముచేత అతని స్తుతికి ప్రసన్నుడైన ఆదిత్యుడు మోక్షముతో పాటుగా వ్యాధి వినిర్ముక్తిని కూడ ఆనుషంగికముగాననుగ్రహించినాడని తాత్పర్యము. సరే-

సాంబుడు సర్వత్ర ఆదిత్యుని అధిదైవిక అధ్యాత్మతత్త్వములను సమానముగా సంకీర్తన చేయడం మనకు కనిపిస్తుంది. ఈ రెండుతత్త్వముల సమాహారస్వరూపమే సాయుజ్యరూపమైన అద్వైతముక్తి. అందులకై ఈ శ్లోకమున కవి ఆదిత్యమణ్డలముయొక్క ఈ తత్త్వముల రెండింటినీ కీర్తించి, మోక్షార్థియై దానిని శరణముగా నాశ్రయించుచున్నట్లు సంస్తుతించినాడు.

ఆయన చణ్డరశ్మి. సుతీక్ష్ణమైన కిరణప్రసారము కలవాడు. కావుననే చిదాకాశమునుకూడ చిద్భానుడుగా ప్రవేశించి, ప్రకాశింపచేసి అవిద్యను తొలగించి, జ్ఞానప్రకాశనముద్వారా మోక్షకారకుడగు చున్నాడు. **"అణుపరిమాణం మన ఇతి తార్కికాః"** చిత్ - అనగా మనస్సు. అది అణుపరిమాణము కలది. బృహదాకాశంలో సూర్యుడులా ఆంతరమైన చిదాకాశంలో అతి సూక్ష్మరూపంలో సంచరిస్తూ, తన చిత్ప్రకాశంతో అనాద్యనంతమై అనుస్యూతంగా జీవుణ్ణావరించి అజ్ఞానంలో ముంచెత్తుతున్న అవిద్యాంధకారాన్ని పటాపంచలు చేసి, అతనికి జ్ఞానప్రదాతగా ముక్తినను గ్రహిస్తాడు చిద్భానుడు. అతని యొక్క ఆమండలము **'అన్తః సూక్ష్మం'** అని తెలుపబడింది. ఇది అతని యొక్క అధ్యాత్మమైన సూక్ష్మరూపము. అతని బృహద్రూపము **"బహిరపి బృహత్"** అని కీర్తింపబడినది. అతని యొక్క బాహిరమైన స్థూల రూపమే పరిదృశ్యమానమైన బృహదాదిత్యమణ్డలము. దాని పరిమాణము

**"నవయోజనసాహస్రవిగ్రహోఽర్కస్యమణ్డలమ్"** అనగా తొమ్మిదివేల యోజనాల నిడివిగలది ఆదిత్యమణ్డలమని చెప్పబడినది. ఆయన చణ్డరశ్మిగా ప్రళయాన్తమున జగత్సంహారమును చేయుచున్నాడు. ఈ విధంగా ఆయన అధిదైవికాధ్యాత్మ రూపములతో ముక్తిప్రదాన సామర్థ్యము కలవాడు కావుననే, సాంబుడాతనిని మోక్షార్థియై ఆశ్రయించినాడని భావము.

ఈ విధమైన చండకిరణుని రశ్మిమండలము యొక్క సర్వోత్కృష్టమైన తత్త్వము మొదటి రెండున్నర పాదములలో వివరింపబడినది. సత్త్వరజస్తమోగుణాత్మకమైన చిదాదిత్యుని రశ్మిమణ్డలమునందు శబ్దబ్రహ్మము బిన్దురూపమున అనగా అనభివ్యక్తమైన సూక్ష్మరూపముతో ప్రతిష్ఠితమై యున్నదని ప్రథమపాదార్థము. సృష్టి-స్థితి లయములు అకార ఉకార మకారములు తద్గతములైన ఋగ్యజుస్సామవేదములు, పిణ్డాణ్డములోని ప్రాణాపానసమానములు. ఈ త్రికములన్నియు బిన్దువులో అవిభక్త ప్రకాశస్వరూపములో నుండును. కాగా ఈ విధమైన బిన్దురూపకారణ బ్రహ్మమున కధిష్ఠానము ఆదిత్యుని యొక్క రశ్మిమణ్డలమని భావము.

రెండవ పాదములో ఇదే రశ్మిమణ్డలము యోగీశ్వరులకు నిర్వాణ మార్గముగా మోక్షసాధనమగుచున్నది. యోగులుత్తమ మధ్యములని రెండు విధములుగా నుందురు. వారిలో జ్ఞాని సత్తములైన ఉత్తములైన యోగి పుంగవులుకీ యాదిత్యమణ్డలము బాహిరముగానే బుద్ధివృత్తిలో బ్రహ్మాత్మనా భాసించి వారికి మోక్షపథమును చూపి ముక్తులను గావించును. వారు సోఽహంభావముతో జీవన్ముక్తులై ఆత్మనిష్ఠులుగా ఆత్మారాములుగా నుందురు. రెండవ తెగకు చెందిన సిద్ధయోగులు మధ్యమతరగతికి చెందినవారు. వారికి ఈ రశ్మిమణ్డల అర్చిరాది మార్గమును జూపి బ్రహ్మలోకమునకు చేర్చును. ఇంకనునిది త్రయ్యాధారమైన ప్రణవమే అనగా ఋగ్యజుస్సామాదులకు మూలములైన అ-ఉ-మ లనే ప్రణవ బీజముల సమాహారమే అయిన ప్రణవస్వరూపమేనని **"త్రయ్యాధారః ప్రణవః"** - అని నిర్దేశింపబడినది **'ప్రకృష్టేన నూయతే (విమృశ్యతే) పరం పారమేశ్వర స్వరూపం యేన ఇతి ప్రణవః** అనగా పరమేశ్వర స్వరూపమును చక్కగా

విశదపరచునదని ప్రణవశబ్దము నిర్వచింపబడినది. ఈ విధమైన ఆదిత్యమణ్డలమును ప్రణవ పర్యాయముగా సంభావించి **'ముక్తయేప్రపద్యే'** అనాద్యవిద్యానాశరూపమైన జీవన్ముక్తికై శరణముగా నాశ్రయించుచున్నానని భావము

## అనువాద పద్యము

**సీ॥** ఏబ్రహ్మ మీ మేన నీడుగా బిందువై-
యారూఢి తోడుత నలరుచుండు
యోగమార్గంబున యోగీశ్వరులలీల-
పరమనిర్వాణమౌ చరమగతిగ
వేదవేద్యంబైన వేదాది ప్రణవమ్ము-
నుపదేశమొనరించి యుద్ధరించు
అణువుల కణువుగా నతిమహత్తుగనేది-
యాంతరబాహ్యమ్ము లలర జేయు

**గీ॥** నట్టి చిద్భాను తేజము నాంతరమున
బాహిరమ్మున భర్గమౌ భవ్య తేజ
మనగ నొప్పెడు దానినే నాశ్రయించి
మోక్ష పదమును బొందెద నీక్షణంబ॥

---0---

# 10 వ శ్లోకము

**అవతారిక:** చిద్భానుని యొక్క మణ్డలమును బాహిరముగా సంభావించి ఈ శ్లోకమున అమృతనిధానము, ఆనందస్వరూపమునైన దాని ఆంతరతత్త్వమును ప్రస్తుతించుచున్నాడు

**శ్లో॥ యస్మిన్ సోమః సురపితృనరైరన్వహం పీయమానో**
**క్షీణః క్షీణః ప్రవిశతి యతో వర్ధతే చాపి భూయః**
**యస్మిన్ వేదా మధుని సరఘాకారవద్భాన్తి చాగ్రే**
**తచ్చణ్డాంశోరమృతమమితం మణ్డలస్థం ప్రపద్యే॥**

**అన్వయము:-** సురపితృనరైః అన్వహం పీయమానః సోమః క్షీణః క్షీణః యస్మిన్ ప్రవిశతి, యతశ్చాపి భూయః వర్ధతే, చ యస్మిన్ వేదాః మధుని సరఘాకారవద్ అగ్రే భాన్తి, తచ్చణ్డాంశోః మణ్డలస్థం అమితం అమృతం ప్రపద్యే॥

**ప్రతిపదార్థము:**

సురపితృనరైః – దేవ పితృమనుష్యలోకవాసులచే
అన్వహం పీయమానః – నిరంతరాయముగా త్రాగబడుచున్న
సోమః – అమృత నిధానముగా కీర్తించబడుచున్న చంద్రుడు
క్షీణః క్షీణః – పునః పునః క్షీణించుచున్నవాడై
యస్మిన్ – యే ఆదిత్యమణ్డలమునందు
ప్రవిశతి – ప్రవేశించుచున్నాడో
చ – మరియు
యతః – దేని నుండి
భూయోఽపి – మరల
వర్ధతే – వృద్ధిని పొందుచున్నాడో,
చ – మఱియు
యస్మిన్ – దేనియందు ప్రత్యక్షముగా (ఎదురుగా)
వేదాః – వేదములు
మధుని సరఘాకారవత్ – తేనెపట్టుచుట్టును తేనెటీగలు నిరంతరముగా ఆనందముతో భ్రమించునట్లుగా

భాన్తి - ప్రకాశించుచున్నవో
చణ్డాంశోః మణ్డలస్థం - ఆదిత్యమణ్డలమధ్యగతమైన (అనగా ఆనందామృత స్వరూపుడగు ఆదిత్యుని)
అమిత మమృతం - అంతులేని అమృతనిధానమును
ప్రపద్యే - శరణముగా నాశ్రయించు చున్నానని భావము

**భావము :** దేవపితృ మనుష్యలోకవాసులచే నిరంతరము కళారూపమున అమృతము త్రాగబడుచున్న కారణముగా ఆ చంద్రుడు క్రమముగా క్షీణించి, క్షీణించి, తుదకాదిత్య మండలమధ్యమున అనంతముగా భాసించు అమృతమును ఆశ్రయించి మరల షోడశకళాప్రపూర్ణుడుగా ఆవిర్భవిస్తాడు. ఆ యాదిత్య మండలాంతర్గతమైన అమృతాదిత్యమూర్తి కెదురుగా వేదములు సరఘాకారములో అను నిత్యము ప్రకాశిస్తూ ఉంటాయి. ఈ విధముగా చంద్రుని యొక్క పరిపూర్ణత్వమునకు, వేద ప్రకాశకత్వమునకు ప్రధానకారణముగా వేదములలో కీర్తించబడుచున్న అమృతాదిత్యమూర్తిని ప్రపత్తి పూర్వకముగా శరణ్యునిగా నాశ్రయించుచున్నానని భావము.

**శ్రీపాదుక :** ఈ శ్లోకమున చిదాదిత్య మండలము యొక్క అమందానందామృత సందోహనిధానమైన పరమాదిత్యుని సూక్ష్మరూపము యొక్క మాహాత్మ్యముపవర్ణింపబడినది. చిద్భానుమణ్డల మధ్యభాగమున పరమానంద నిష్యంది అమృతము అమితముగా పుష్కలముగా నున్నదని ఆయమృతమును తాను శరణముగా నాశ్రయించుచున్నానని- కవి ప్రధాన వాక్యముగా **'తచ్చణ్డాంశోః అమృతమమితం మణ్డలస్థం ప్రపద్యే'** - అని నాలుగవ పాదమున ప్రతిపాదించి దాని మాహాత్మ్యమును మొదటి రెండు పాదములలో వర్ణించెను. దేవ పితృ మనుష్యలోకములు మూడింటిలో నున్న ప్రాణులు చంద్రమణ్డలగతమైన అమృతమును అహర్నిశములు త్రాగి విషయాన్ని **'ఆప్తకామస్య కా స్పృహా'** అనే వాక్యంలో అభివ్యక్తీకరించేరని

జీవవ్యాపార నిర్వహణ దక్షములగుచున్నవి. నిరంతరాయంగా వానిచే తనలోని యమృతము త్రాగ బడుటచే చంద్రుడు క్రమక్రమముగా క్షీణించి కళావిహీనుడై సూర్యమణ్డలమును ప్రవేశించి దాని మధ్యనున్న అమితామృత నిధానమును గ్రహించి మరల షోడశకళా ప్రపూర్ణుడుగా వెలుగొందుచున్నాడు.

ఆదిత్యమండలము తరగని అమృత నిధానము. ఆచండాంశు మండల మధ్యస్థమగు అమృతమును శరణు జొచ్చుచున్నానని ప్రధానవాక్యముగా చెప్పబడినది. అమృతమును శరణుజొచ్చుట యేమి అను సంశయము సగటుమనిషికి కలుగుట సహజము. **'చండాంశోః అమితమమృతం మండలస్థం ప్రపద్యే'** అను ఈ ప్రధాన ప్రతిపాద్యమైన అమితామృతము లేదా అనంతామృతము పరబ్రహ్మస్వరూపమైన ఆదిత్యమూర్తియే అతడు మధుస్వరూపుడు ఆమధువే అమృతము. అమృతమే మధువు. ఉభయస్వరూపమే ఆదిత్యుడని శ్రుతివచనము. ఈ విషయాన్ని బృహదారణ్యక శ్రుతి స్పష్టంగా – **"అయమాదిత్యః సర్వేషాం భూతానాం మధు మధ్వాదిత్యస్య సర్వాణి భూతాని. మధు యశ్చాయమస్మిన్నాదిత్యే తేజోమయోஉమృతమయః పురుషోஉయశ్చాయ మధ్యాత్మం చాక్షుస్తేజోమయోஉమృతమయః పురుషః అయమేవయోஉయ మాత్మేదమమృత మిదం బ్రహ్మేదగ్ సర్వమ్'**

**(బృ.ఆ.అధ్యా-4(బ్రాహ్మణం-5 మం 5)**సృష్టిలోనున్న సర్వజీవరాసులకు ఆదిత్యుడే మధువు. అతనికి సర్వప్రాణులు మధురూపములే. సూర్యునిలో తేజోరూపుడుగా అమృతమూర్తిగా ఉన్న పరమపురుషుడే జీవునిలోకూడా వెలుగొందుచున్నాడు. ఇరువురిలోను ఒకే పరమాత్మ అమృతుడుగా నుంటున్నదని భావం. బృహదారణ్యక శ్రుతిప్రతిపాద్యమైన ఈ మధువిద్యా ప్రకరణముతో సమన్వయించుకుంటే సాంబకవి యొక్క అమృతప్రపత్తి సమంజసముగానే కనిపిస్తుంది. కాగా అమృత శబ్దానికి అమృతాదిత్య

పరబ్రహ్మమూర్తి యని అర్థంగా గ్రహించాలి. తాను మధువిద్యా ప్రసంగాన్ని సంభావించినట్లుగా మూడవపాదంలో "యస్మిన్ అగ్రే వేదాః మధుని సరఘాకారవద్భాన్తి" అని మధు – సరఘా శబ్ద ప్రయోగాలచే ధ్వనింపచేశాడు. మహాకవి. కాగా సూర్యమండలమున కెదురుగా వేదములు మధువును ముందుగా తేనెపట్టు అభివ్యక్తీకరించునట్లుగా ప్రకాశిస్తున్న వని వర్ణిస్తాడు. తైత్తరీయ బ్రాహ్మణములోని – **"ఇయం వావ సరఘా" (తై బ్రా 3-10-10)** అనే మంత్రాన్నుదాహరిస్తూ సౌందర్య అమృతనిధానమగు చంద్రుడు సరఘ తేనెపట్టుతో ఉపమించబడినాడు. సరఘుకు అగ్ని స్థానముగను బైందవమగు త్రికోణము **'సారఘము'** అనగా సరఘ (తేనెపట్టు) నుండి పుట్టిన తేనె, అదియే సుధాసింధువుగా వ్యాఖ్యానింపబడినది. సారఘమైన మధునిష్యందమే సుధాసముద్రమని చెప్పబడుటచే మధువునకు అమృతమునకు అభేదము.

చంద్రుడు సూర్యమణ్డలము నాశ్రయించి ఆదిత్యదేవునిచే ననుగ్రహింపబడిన అమృతకిరణములచే షోడశకళాప్రపూర్ణుడుగా, అమృతాంశుడుగా, ప్రాణులకు జీవనదాతగా రూపొందినాడు. వంతులవారీగా అతనిలోని అమృతమును దేవతలు, పితరులు, మనుష్యులు జీవనాధారముగా గ్రహిస్తూ ఉంటారని పురాణ ప్రవచనం. **"అపరపక్ష ప్రతిపదారభ్య పంచదివసం దేవాశ్చంద్రం భక్షయన్తి. పంచదివసం పితరః। పంచదివసమృషయో మనుష్యాః భక్షయన్తీతి పురాణాదౌ సిద్ధమ్"** బహుళపాడ్యమి మొదలు అమావాస్య వరకు మొదటి 5 రోజులు దేవతలు, తరువాత 5 రోజులు పితరులు, చివరి 5 రోజులు మానవులు, మహర్షులు చంద్రగతమైన అమృతాన్ని గ్రహిస్తారని పురాణాల్లో చెప్పబడినదని భావం. ఈ విధంగా కృష్ణపక్షంలో క్రమక్రమంగా క్షీణించిన చంద్రుడు సూర్యమండల మధ్యస్థమైన సుధానిధానము నుండి అమృతాన్ని గ్రహించి శుక్లపక్ష పూర్ణిమనాటికి పరిపూర్ణమణ్డలుడౌతాడు.

ఆదిత్యుడే దేవతలకు మధురూపమైన అమృతమని, వేదాలు దివ్యశరీరాలతో సరఘ అనగా తేనెపట్టుకు తేనెటీగలు చుట్టుముట్టి తిరుగుతున్నట్లుగా సూర్యమండలమున కెదురుగా నలుదిక్కులలో వ్యాపించి ఉంటాయని ఛాందోగ్యశ్రుతి – **" అసావాదిత్యో దేవమధు పుత్రాస్తస్య యే ప్రాంచో రశ్మయః తా ఏవాస్య ప్రాచ్యో మధునాడ్యః ఋచ ఏవ మధుకృతః ఋగ్వేద ఏవ పుష్పమ్......."** అనగా ఆదిత్యుడే దేవతలకమృతము. అతనికిరణములే అతని పుత్రులు. వారే తూర్పు దిక్కున ఋక్కులుగా మధుమక్షిక(తేనెటీగ)లుగా వ్యాపించి యున్నారు. వాని పుష్పమే ఋగ్వేదము....... ఈ విధముగ తేనెటీగలు 'సరఘ' అనగా తేనెపట్టును చుట్టుముట్టినట్లుగా నాలుగు వేదముల మంత్రములు, ఆ యా సంహితలు పుష్పాలుగా ఆదిత్యమణ్డలముకెదురుగా వ్యాపించి యున్నవని ఛాందోగ్యోపనిషత్తులోని తృతీయ ప్రపాఠకములో చెప్పబడిన విషయాన్ని వేదపారగుడైన సాంబుడీ శ్లోక తృతీయపాదంలో – **"యస్మిన్నగ్రే వేదాః మధుని సరఘాకారవద్ భాన్తి"** అని సంగ్రహించాడని గ్రహించాలి. కావుననే వేదములకు ఆధారకేంద్రమైన ఆదిత్యమణ్డలాన్ని ప్రారంభములో ఉద్గీథమని ప్రణవంగా సంస్తుతించాడు.

కాగా దేవ పితృ మనుష్యులచే నిరంతరముగా గ్రోలబడుచుండిన అమృతాంశుడైన చంద్రుని వృద్ధిక్షయములకు వేదములు సరఘాకారములో ప్రకాశించుటకును సూర్యమండల మధ్యమున అమృతనిధానముగా భాసించు అమృతాదిత్య మూర్తియే కారణమనియు అతనిని సాంబుడు శరణు పొందినాడని సార సంగ్రహముగా తెలియదగియున్నది.

## అనువాద పద్యము

**సీ॥** సుర పితృ నరులచే నరమరలేకుండ-
నబ్జు డాపీతుడై యన్వహంబు
నెవ్వాని కిరణాల నేపుగాక్షీణత-
బాసితా వర్ధిల్లు భాసచేత
ఏసూర్య దేవునకెదురుగా వేదాలు-
సరఘను మధుపాలసరణి వోలె
నిలచి నుతుల తోడ నిత్యవిధి యనంగ-
పారాయణము సేయు పావనములు

**గీ॥** అట్టి చండాంశు మండల మాశ్రయించి
యచట నిస్సీమముగ నున్న యమృతధార
తనివి దీరగ త్రాగి నే ధన్యుడగుదు
నిశ్చయంబిది సూర్యాజ్ఞ నిజము నిజము॥

---0---

## 11వ శ్లోకము

**అవతారిక:-** పూర్వశ్లోకములలో వైదిక పరిభాషననుసరించి సూర్యుని పరబ్రహ్మస్వరూపమును అమృతానంద రసమయుడుగా సంస్తుతించి పిమ్మట **'ఇతిహాస పురాణాభ్యాం వేదం సముపబృంహయేత్'** త్తనెడి సంప్రదాయమునను సరించి, కావ్యభాషలో శ్లేషోపమాధ్వన్యభివ్యక్తి రూపమునఆదిత్యుని విశ్వరూపమును వామనావతారమూర్తితో నుపమించుచు సంస్తుతించుచున్నాడు.

**శ్లో॥ ఐంద్రీమాశాం పృథుకవపుషా పూరయిత్వా క్రమేణ**
**క్రాన్తాః సప్త ప్రకటహరిణా యేన పాదేన లోకాః।**
**కృత్వా ధ్వాన్తం విగళితబలివ్యక్తి పాతాళలీనం**
**విశ్వాలోకః స జయతి రవిః సత్త్వమేవోర్ధ్వరశ్మిః॥**

**అన్వయం :-** యేన పృథుకవపుషా, ప్రకటహరిణా, విగళితబలివ్యక్తి ధ్వాంతం పాతాళలీనం కృత్వా (తథా) ఐంద్రీమాశాం క్రమేణ పూరయిత్వా సప్తలోకాః (ఏకేనైవ) పాదేన క్రాన్తాః, సః విశ్వ–ఆలోకః సత్త్వమ్ ఏవ ఊర్ధ్వరశ్మిః రవిః జయతి॥

**ప్రతిపదార్థం:**

| | | |
|---|---|---|
| యేన | – | ఏ సూర్య భగవానునిచే |
| పృథుకవపుషా | – | వామనాకృతిచే |
| విగళితబలివ్యక్తి | – | బలిచక్రవర్తియొుక్క (రాక్షసరూపమగు) స్వభావము నశింపచేయబడినదై |
| ధ్వాన్తం | – | అతని యొుక్క అవిద్యాంధకారమును |
| పాతాళలీనం కృత్వా | – | పాతాళమునకణగద్రొక్కి దానిలో లయింపజేసి |
| (ఏకేనైవ) పాదేన | – | రెండవ పాదమొుక్క దానిచేతనే |
| ఐంద్రీమాశాం పూరయిత్వా | – | తూర్పుదిక్కునాక్రమించి |
| క్రమేణ | – | క్రమక్రమముగా |
| సప్తలోకాః | – | సప్తభువనములు |
| క్రాన్తాః | – | ఆక్రమింపబడినవో |
| విశ్వాలోకః | – | జగత్ప్రకాశకరుడు |
| సత్త్వమేవ | – | విశ్వసంస్థితికరుడును |

ఊర్ధ్వరశ్మిః - ఊర్ధ్వదిశగా వ్యాపించిన కిరణములు కలవాడైన
స రవిః - ఆయాదిత్య భగవానుడు
జయతి - సర్వోత్కృష్టుడై జయించుచున్నాడు.

**భావము:-** యే నారాయణుడు బలిచక్రవర్తి యొక్క వ్యక్తిత్వమును అనగా తామసమైన రాక్షసస్వభావమునణచివేసి, పాతాళమున నతనిని లయింపజేసి, వామనస్వరూపుడైకూడ ఒకే పాదముచే ముందుగా తూర్పుదిక్కునాక్రమించి క్రమముగా లోకములను ఏడింటిని కూడా ఆక్రమించినాడో, మరియు సూర్యనారాయణుడుగా ముందుగా బాలారుణాదిత్యుడుగానుదయించి, పాదరూపకిరణములచే ముందుగా తూర్పుదిక్కును, పిమ్మట క్రమముగా సప్తభువనములను వ్యాపించి, వానిలో ఉన్న ప్రాణుల స్వాభావికమైన అవిద్యాంధకారమును అణచి వేయుచున్నాడో, అట్టి జగత్ప్రకాశకుడు, జగద్రక్షకుడును ప్రత్యక్షనారాయణుడును అగు సూర్యనారాయణుడు సర్వోత్కృష్టుడుగా విజయము చేయుచున్నాడు. లోకపాలకుడై జగద్రక్షణము గావించుచున్నాడని భావము.

**శ్రీపాదుక:-** ఈ శ్లోకమున చతుర్థపాదములో 'సః సః' అని తచ్ఛబ్దము రెండు పర్యాయములు **'త్వమేవ'** అని త్వం పదముతో కలిసి వర్ణింపబడి 'తత్వమసి' అను మహావాక్యమును స్ఫురింప జేయుచున్నది. **సః సః** అని రెండుసార్లు ప్రయోగింపబడిన తచ్ఛబ్దములలో ఒకటి ప్రకటహరియైన వామనమూర్తికి, రెండవది ప్రత్యక్షనారాయణునకు అన్వయించుకోవాలి. తరువాత సః (వామనః), **సః (పరమాత్మా) ఊర్ధ్వరశ్మిః రవిః త్వమేవ -** అనగా పరమాత్మ స్వరూపుడైన ఆ వామనమూర్తి సూర్యభగవానుడవైన నీవే అని అన్వయించు కోవాలి. కాగా ఇందులోని విశేషణములన్నియు క్రమముగా వామనునకు, ప్రత్యక్ష నారాయణుడైన ఆదిత్య భగవానునకు సమానంగా అన్వయిస్తాయి.

**ఐంద్రీమాశాం** – అనగా ఇంద్ర సంబంధమైన వాంఛను లేదా తూర్పుదిక్కును అని అర్థం చెప్పుకోవచ్చు. అలాగే **పృథుకవపుషా** – అనే పదానికి వామనమూర్తి మరియు బాలుడు అని అర్థం చెప్పుకోవచ్చు. ఈ విధంగానే 'ప్రకటహరి' **'పాద' ' విగళిత బలివ్యక్తి''విశ్వాలోక'** పదాలకు కూడా వామనపరంగా, ఆదిత్యపరంగా, పరమాత్మ పరంగా అర్థాలనన్వయించుకోవచ్చు.

కాగా పృథుక (మరుగుజ్జు) శరీరమును ధరించి, ఇంద్రుని త్రిభువనాధిపత్య ప్రాప్తిరూపమైన వాంఛను తీర్చుటకై తాను విశ్వవ్యాపియైన నారాయణుడుగా త్రివిక్రముడుగా ప్రకటింపబడినవాడై ఒక పాదముతో లోకమును క్రమముగా భువరాది సత్యలోకపర్యన్తము సప్తభువనములను ఆక్రమించి పాతాళమున కణగ ద్రొక్కబడిన బలిచక్రవర్తియొక్క అహంకృతి కలవాడై విశ్వమునకే ప్రకాశముగా వెలుగొందువాడు **(విశ్వాలోకః)** – వామనావతారమూర్తి – అని వామనపరంగా అన్వయము.

పృథుకవపుః (బాలాదిత్యునిగా **ఇంద్రీమాశాం** అనగా తూర్పుదిక్కును ఒక పాదముచే తొలుత వ్యాపించి క్రమముగా సప్తభువనములను ప్రకాశింపచేయుచు, తన సప్తసప్తి ప్రకటనముచే (హరిశబ్దమునకు అశ్వము అనే అర్థాన్ని సంభావిస్తే సప్తాశ్వ రథారూఢునిగా ప్రకటితమైన వాడనే అర్థం సిద్ధిస్తుంది. **(ప్రకటాః సప్తహరయః సప్తాశ్వాః యస్య సః ప్రకటహరిః** – అని సూర్యపరంగా వ్యాఖ్యానము గ్రహించిన పక్షములోననిభావము). **విగళిత బలివ్యక్తి ధ్వాంతం పాతాళలీనం కృత్వా** – అనే పదానికి అభివ్యక్తమైన తమోరూపమైన (చీకటియనే) బలీయమైన తామసాంధకారమును పాతాళమునకణగద్రొక్కి క్రమముగా విశ్వాలోకము అనగా ఊర్ధ్వకిరణుడుగా జగత్ప్రకాశకుడుగా వెలుగొందువాడు అని సూర్యపక్షముగా అన్వయం చెప్పుకోవచ్చు. అలానే–ఇంద్రియ సంబంధములైన కోర్కెలను పూరిస్తూ (తీరుస్తూ) సూక్ష్మశరీరముతో క్రమముగా దేహాన్తర్గత సప్తభువనములను వ్యాపించి బలీయమైన అవిద్యారూపమైన తామసాహంకారమును

పాతాళమునకు అణచివేసి, ఆంతరజగత్ప్రకాశకుడైన పరమాత్ముడు **(సః) త్వమేవ** నీవేనని పరమాత్మ పరముగా అన్వయం భావించవచ్చు. ఇదే విధంగా ప్రత్యగాత్మస్వరూపుడైన జీవాదిత్యపరంగా కూడా అర్థాన్ని సమన్వయించుకోవచ్చు.

ఈ విధముగా శ్లేషోపమాలంకార ధ్వని గర్భితమైన కావ్యభాషలో ఆదిత్యుని స్తుతించడంలో సాంబుని యొక్క మహాకవిత్వ సామర్థ్యమును గ్రహింపవచ్చును.

## అనువాద పద్యము

**సీ॥ వామనమూర్తిగా వారించె నెవ్వాడు**
**బలిచక్రవర్తిదౌ బాలిశతను**
**ఆతని యహముల నణగంగ ద్రొక్కెఁ బా**
**తాళముకెవడు తత్పాదముంచి**
**తూర్ణమౌగతితోడ తూర్పును కబళించి**
**యావలి పాదమ్ము నాక్రమించె**
**నన్నిలోకమ్ముల నవలీల నెవ్వడు**
**రవితేజమతడె నారాయణుండు**

**గీ॥ అతడు విశ్వాత్మ విశ్వపుడతడె జేత**
**ఊర్ధ్వరశ్ముల పాలించు నూర్ధ్వలోక**
**వితతి నభమున తిరుగాడు వేదవేద్యు**
**డైన చిద్భానుడే మనకగుత రక్ష ॥**

---0---

# 12వ శ్లోకము

**అవతారిక:-** ఈ శ్లోకమున సాంబుడు సూర్యభగవానుని పరబ్రహ్మముగా భావించి, గాయిత్రీ మంత్రమున స్మరింపబడిన అతని యొక్క వరేణ్యమైన భర్గమనే తేజస్సును కీర్తించుచున్నాడు.

శ్లో॥ ధ్యాత్వా బ్రహ్మ ప్రథమమతను ప్రాణమూలే నద(త్తద్) న్తం
దృష్ట్వాచాన్తః ప్రణవముఖరం వ్యాహృతీః సమ్యగుక్త్వా ।
యత్తద్దేవే తదితి సవితుర్బ్రహ్మణోక్తం వరేణ్యం
తద్భర్గాఖ్యం కిమపి పరమం ధామ గర్భం ప్రపద్యే॥

**అన్వయము:-** ప్రథమమతను బ్రహ్మాధ్యాత్వా, ప్రాణమూలే తదేవాన్తః నదన్తం దృష్ట్వా, ప్రణవముఖరం వ్యాహృతీః సమ్యగుక్త్వా, యద్వేదే బ్రహ్మణా ఉక్తం సవితుః వరేణ్యం భర్గాఖ్యం కిమపి పరమం ధామ, తత్తేజః ప్రపద్యే ఇత్యన్వయః

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| ప్రథమం | - ముందుగా |
| అతనుః | - దేహాత్మాభిమానమును వీడి |
| బ్రహ్మాధ్యాత్వా | - నిర్గుణ పరబ్రహ్మమును ధ్యానించి |
| ప్రాణమూలే | - సూత్రాత్మయైన ప్రాణమునకు మూలమైన మూలాధారమునందు |
| తదేవ | - దానినే ( ఆ పరబ్రహ్మమునే) |
| అన్తః నదన్తం దృష్ట్వా | - లోపల నాదరూపమున వివర్తముగా నినదించుచున్నట్లు చూచి |
| ప్రణవముఖరం | - ప్రణవోచ్చారణ పురస్సరముగా |
| వ్యాహృతీః | - భూర్భువస్సువరాది సప్తవ్యాహృతులను |
| సమ్యక్ | - లెస్సగా ఉదాత్తాది లక్షణయుక్తములుగా |
| ఉక్త్వా | - ఉచ్చరించి |
| యద్వేదే బ్రహ్మణా ఉక్తం | - బ్రహ్మగారిచే వేదమునందు గాయత్రీ, బ్రాహ్మణములలో చెప్పబడిన |
| సవితుః | - జగత్ప్రసవకారణ భూతుడైన సూర్యభగవానుని యొక్క |
| వరేణ్యం | - ప్రార్థింపదగిన |

| | | |
|---|---|---|
| కిమపి ధామగర్భం | - | ఒకానొక అనిర్వచనీయమైన ప్రకాశగర్భితమైన |
| భర్గాఖ్యం | - | భర్గశబ్దవాచ్యమైన తేజస్సును |
| ప్రపద్యే | - | ప్రపత్తిపూర్వకముగా సేవించుచున్నాను. |

**భావము :-** ముందుగా దేహమేనేనను భావమును విడనాడినవాడనై, నిర్గుణపరబ్రహ్మతత్త్వమును మనసా ధ్యానించి, సూత్రాత్మయైన ప్రాణమునకు మూలమైన మూలాధారము నందు ఆ పరబ్రహ్మమునే లోపల నాదరూపమున తద్వివర్తముగా నినదించుచున్నట్లుగా దర్శించి, ప్రణవోచ్చారణపూర్వకముగా భూర్భువస్స్వరాది వ్యాహృతులను లెస్సగా ఉదాత్తానుదాత్తాది లక్షణానుగుణముగా ఉచ్చరించుచు, బ్రహ్మగారిచే గాయత్రీ బ్రాహ్మణాది వేదభాగములందు కీర్తించబడిన, జగదాదికారణ భూతమైన, పరమాత్మ స్వరూపుడగు ఆదిత్య పరబ్రహ్మము యొక్క, భర్గమనియెడి వరేణ్యము వరిష్ఠమునైన పరమ ప్రకాశగర్భితమైన తేజస్సును ప్రపత్తి పూర్వకముగానాశ్రయించుచున్నానని భావము.

**శ్రీపాదుక:-** స్తుతి కర్తయైన సాంబుడీ శ్లోకమున **' సవితుః వరేణ్యం కిమపి ధామగర్భం భర్గాఖ్యం తేజః ప్రపద్యే'** - అని సవితృదేవతాకమైన ఒకానొక అనిర్వచనీయమైన భర్గమనెడి ధామగర్భిత తేజస్సును ఉపాసించుచున్నట్లు పేర్కొనినాడు. దాని యొక్క సాధారణముగా స్ఫురించే అర్థాన్ని ప్రతిపదార్థ తాత్పర్యములలో వివేచించుకున్నాం.

ఇక్కడ చిత్సూర్యుని ధామగర్భ ప్రకాశమును **'కిమపి'** అనగా వాచామగోచరము విలక్షణమునైనదిగా పేర్కొనినాడు. ఇది తంత్ర శాస్త్ర మర్యాదననుసరించి చెప్పినమాట. తంత్రములలో చిదాదిత్య ప్రభ సూర్య-సోమ-అగ్ని మండలములలో క్రమంగా జాగ్రత్ స్వప్న సుషుప్త్యవస్థలలో ప్రకాశాన్ని ప్రసరింపజేస్తూ అవస్థాత్రయములలో అనుభవములననుగ్రహిస్తూ ఉంటుంది. ఈ మండల త్రయము,

అవస్థాత్రయము తద్గతానుభవములు అన్నిటికినీ నిదానము లేదా మూలకారణమా తురీయుడగు చిదాదిత్యుని ప్రకాశమే. కావుననే తురీయుడగు చిదాదిత్యుని **"భర్గాఖ్యం కిమపి పరమం ధామగర్భ'** - మని స్తుతించినాడు. తంత్ర శాస్త్ర పరంగా క్షేమరాజు వ్యాఖ్యానిస్తూ - ప్రజాపతియైన బ్రహ్మ విశ్వప్రసూతికి మూల కారకుడైన సవితృదేవతాత్మకమైన భర్గమనే తేజస్సును పరమోత్కృష్టధామముగా అనగా బాహిరములైన సూర్య-సోమ-వహ్నిత్రయాత్మకమైన ధామగర్భితంగా, వరేణ్యమనగా అనుగ్రహప్రదమైనదిగా ఓంకారోచ్చారణ పురస్సరముగా నుపదేశించినట్లు పేర్కొనినాడు.

ఆయన అతనుడు అనగా అశరీరి. అకారపరామర్శాత్మయైన వీరేశ్వర పరబ్రహ్మమని, ప్రాణమూలమనగా దేహాన్తర్వర్తి సూత్రాత్మయైన ప్రాణమునకు మూలమైన మూలాధారమని భావము. దానిని దృష్ట్వా చూచి యనగా ఆత్మసాక్షాత్కారము జేసికొని పిదప- **'భూఃస్వాహా - భువః స్వాహా - భూర్భువస్వః స్వాహా'-** ఇత్యాది వ్యాహృతి మంత్రపురస్సరముగా నుచ్చరించినాడు. ఇట్లుచ్చరించుటను జపమని శివసూత్రము పేర్కొని, దీనివలన శరీరము శాక్తరసాప్లావితమైన 'ధామ-ఆవాసముగా' నవుతుందని వివరించి **(ధామగర్భమిత్యత్ర ధామశబ్దః తంత్రేణ ద్విరుక్తః"-** అని శాక్త శాంభవాగమ తంత్రనిరుక్తిపురస్సరముగ తురీయుడైన చిదాదిత్యుని ధామగర్భితతత్త్వాన్ని రాజానక క్షేమరాజు సూత్రప్రాయముగా నిర్దేశించినాడు. దానినే సాంబకవి **"కిమపి పరమం"** సర్వోత్కృష్టమైన ఒకానొక అనిర్వచనీయమైన ధామముగా స్తుతించి సేవించినాడని తాత్పర్యముగా గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥** నిర్జించి దేహమ్ము నిర్గుణ బ్రహ్మము
ప్రాణమూలము నందు నాణవముగ
ధ్యానించి లోపల నానించి ప్రణవము
నినదింప జేసియు నిత్యవిధిగ
లెస్సగా వ్యాహృతి లీనమౌ స్వరముల
బ్రహ్మోక్తరీతిలో జిహ్మముడుగ
ప్రవరేణ్య మైనట్టి భర్గమౌ సావిత్ర
ధామమ్ము జేరెద దమశమముల

**గీ॥** అదియె పరమము పరపద మదియె నాకు
అదియె నాగమ్యమును లక్ష్య మదియె సిద్ధి
అదియె సర్వము సర్వస్వ మదియె నేను
నేనె చిద్భాను తేజము నేనద్వైతి ॥

---0---

# 13వ శ్లోకము

**అవతారిక:-** ఈ శ్లోకములో సాంబకవి తాను చేయుచున్నవి స్థూల – సూక్ష్మ – పరరూపములలో నున్న ఆదిత్యభగవానుని స్తుతియని, స్తుతికర్మ గావున తానుకర్తయని, విషయము ఆదిత్యుడని భేదభావము కలుగుచున్నదని. ఇది అవిద్యలేక అజ్ఞానవే అయినను దీనివలన జ్ఞానప్రతిపత్తి భగవదనుగ్రహమువలన కలుగుచున్నందున ఇది అవిద్యా నిర్మూలన హేతువుగాన ఉపాదేయమే అనగా అవశ్యము స్వీకార్యమేనను విషయమును ప్రస్తావించుచున్నాడు.

**శ్లో॥ త్వాం స్తోష్యామి స్తుతిభిరితి మే యస్తు భేదగ్రహో౽యం
సైవావిద్యా తదపి సుతరాం తద్వ్యుదాసాయ యుక్తః।
స్తౌమ్యేవాహం త్రివిధముదితం స్థూలసూక్ష్మం పరం వా
వేద్యోపాయః పర ఇతి బుధైర్గీయతే ఖల్వవిద్యా॥**

**అన్వయః-** (అహం) 'స్తుతిభిః త్వాం స్తోష్యామి ' ఇత్యయం భేదగ్రహః యస్తు (వర్తతే) సైవ అవిద్యా. తదపి తద్వ్యుదాసాయ సుతరాం యుక్తః (తస్మాత్) స్థూల–సూక్ష్మం– పరంవా త్రివిధం ఉదితం (త్వాం) అహం స్తౌమ్యేవ (యతః ఇయమేవ) అవిద్యా పరః వేద్యోపాయః ఇతి బుధైః గీయతే ఖలు!

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| స్తుతిభిః | – స్తోత్రములచే |
| త్వాం స్తోష్యామి | – నిన్ను స్తుతించుచున్నాను |
| ఇతి మే అయం | – అనెడి నాయొక్క ఈ విధమైన |
| భేదగ్రహః | – (నీవు నాకన్న గొప్పవాడవు, భిన్నుడవు) అనెడి భేదబుద్ధి |
| యస్తు వర్తతే | – యేది కలదో |
| సా అవిద్యా ఏవ | – అది తప్పక అజ్ఞానమే! |
| తదపి | – ఆ అవిద్య కూడా |
| తద్వ్యుదాసాయ | – ఆ యజ్ఞానమును తొలగించుటకొరకు |
| సుతరాం యుక్తః | – సర్వథా సమర్థమైనది (అన్నివిధముల తగియున్నది) (తస్మాత్ – అందువలన) |
| స్థూల, సూక్ష్మ పరంవా | – స్థూల సూక్ష్మ పరారూపములుగా |
| త్రివిధం ఉదితం | – ముప్విధములుగా నుదయించిన |
| త్వాం | – నిన్ను |

| | |
|---|---|
| అహం | - నేను |
| స్తౌమ్యేవ | - స్తుతిస్తూనే ఉంటాను |
| యతః | - ఏలనన |
| ఇయమవిద్యా | - ఈ అవిద్యారూప అజ్ఞానమే |
| విద్యాపరః ఉపాయః | - ఆత్మవిద్యాప్రాప్తికి శ్రేష్ఠమైన సాధనముగా |
| బుధైః | - తత్త్వమెఱిగిన పండితులచే |
| గీయతే ఖలు | - కీర్తింపబడుచున్నది కదా! |

**భావము:-** హే ఆదిత్యదేవా! స్తోత్రములతో నిన్ను స్తుతించుచున్నాననే నాయొక్క భేదభావన తప్పక నా యొక్క అవిద్యారూపమైన అజ్ఞాన విలసనమే యని నాకు తెలియును. ఈ యజ్ఞానముకూడా అవిద్యానిరాసమునకు సర్వవిధముల సమర్థమగుచున్నది. కావున స్థూల, సూక్ష్మ, పరారూపములలో మూడువిధములుగా సాక్షాత్కరించుచున్న నిన్ను నేను స్తుతిస్తూనే ఉంటాను. ఎందుకంటే, ఈ అవిద్యారూపమైన అజ్ఞానమే ఆత్మవిద్యాప్రాప్తికి శ్రేష్ఠమైన సాధనోపాయముగా పండితులచే కీర్తింపబడుచున్నది.

**శ్రీపాదుక:-** ప్రారంభముననున్న దశశ్లోకి శ్రీకృష్ణస్తుతియని కొందరి యభిప్రాయమని ప్రారంభంలో ముందుమాటగా చెప్పుకున్నాం. (పుట-2). ఆపక్షంలో ఈ శ్లోకమునుండి సాంబకృతమైన స్తోత్రమారంభమవుతున్నదని వ్యాఖ్యానించుకోవాలి. ఈ విషయాన్ని **'త్వాం స్తుతిభిః స్తోష్యామి "** అనే యాతని కంఠోక్తి స్పష్టీకరిస్తున్నది.

నేను స్తుతించుచున్నాను అనే యీ వాక్యంలోని నేను, నిన్ను అనే పదాలు స్తుతికర్తను, స్తుతి విషయికమైన దేవతను వేర్వేరుగా భాసింపచేస్తున్నాయి. నేనువేరు, స్తుతింపబడుచున్న దైవమువేరు అనే భేదభావమును తలపింప చేస్తున్నాయని భావం. తత్త్వదృష్టితో చూస్తే ఈ భేదభావన కేవలము అవిద్యావిలాసమే! అజ్ఞానమేనని

తెలుస్తుంది. ఈ యెఱుక కలిగిన మరుక్షణమే నీవు నేననే భేదము తొలగి బుద్ధిలో **'త్వమేవాహం'** నీవే నేననే జ్ఞానము అంకురించి క్రమంగా **'సోఽహం' –'అహం బ్రహ్మాస్మి'** అనే భావన సిద్ధిస్తుంది. ఈ విధంగా బ్రహ్మాద్వయ భావనాసిద్ధికి అవిద్యానిరాసమునకు 'భేదగ్రహ'మే కారణమగుచున్నదని రెండవ పాదంలో స్పష్టీకరించబడింది .

కేవల స్తుతి, భజనములేకాక జపహోమాద్యర్చావిధులన్నీ కూడా దేవతవేరు, కర్తవేరు అనే భేదబుద్ధితో చేస్తున్నవే. అయినా వీనిద్వారా తత్తద్దేవతానుగ్రహజన్యమైన జ్ఞానము, తద్వారా **'సోఽహం'** లేదా ఆ దైవమే నేననే అద్వయభావ సంసిద్ధి కలుగుతుంది. కావున భేదగ్రహయుక్తమైన ద్వైతసాధనలే అద్వయ పరబ్రహ్మప్రాప్తికి లేదా ఆత్మజ్ఞానమునకు సాధనములవుతున్నాయని కవి హృదయంగా గ్రహించాలి.

ఈ భావన నాకు మాత్రమే కలిగినది కాదు పండితులందరు దీనిననుభవపూర్వకముగా తెలిపి యున్నారనే విషయాన్ని నాలుగవ పాదంలో **'ఖలు'** అనే నిర్ధారణవాచకావ్యయంద్వారా తెలియజేస్తాడు స్తుతికర్త.

మూడవపాదంలో స్వానుభవాన్ని – **'స్తౌమ్యేవాహం త్రివిధముదితం స్థూల సూక్ష్మం పరంవా'** – అంటే నిన్ను స్థూల సూక్ష్మ పరారూపాలలో ముప్విధములుగా స్తుతిస్తున్నానని తెలియజేస్తాడు. ప్రత్యక్షంగా బహిరాకాశంలో గోళాకారంతో భాసిస్తున్న ఆదిత్య మణ్డలం తానుపాసిస్తున్న చిదాదిత్యుని స్థూలరూపము. సుషుమ్నాపథంలో చిదాకాశంలో సంచరించే చిత్ప్రకాశమాతని సూక్ష్మరూపము. హృన్మధ్యంలో సర్వకారణరూపమైన పరబ్రహ్మముగా అద్వయభావంతో **'సోఽహం'** సమాధినిష్ఠులు,

ఆత్మారాములునైన యోగులు దర్శించే సమష్టిరూపమే పరారూపము. సూక్ష్మపరారూపములు రెండును యోగిమానస ప్రత్యక్షములు, కేవలము ధ్యానమాత్రగమ్యములు నని గ్రహించాలి. వీనిని గూర్చి ఆయా ప్రసంగాలలో మనం యదాతదా ప్రస్తావించుకుంటున్న విషయం సహృదయ పాఠకులకు విదితమే!

## అనువాద పద్యము

**సీ॥** స్తుతులచే నినుగొల్వ సూటిగా ద్వైతమ్ము
నంగీకరించుటే యగును సుమ్ము
భేదమజ్ఞానమ్ము భేదభావనమదె
అయ్యవిద్యయె నాశమగును నుతిని
కావున స్థూలసూక్ష్మ పరరూపములతో
నుదయించు నిన్ను నేనుద్యమించి
ఆత్మ విద్యాప్రాప్తి నందెద నుతిజేసి
యదియ సిద్ధి కుపాయ మగుట వలన

**గీ॥** వేద విదులైన విబుధులు భేదబుద్ధి
నుతుల నిటులేను నినుపొందు గతులటంచు
నుతుల జేసి యవిద్యను నుగ్గు జేసి
ఆత్మసిద్ధిని పొందినా రవని లోన ॥

---0---

## 14వ శ్లోకము

అవతారిక :- పూర్వశ్లోకంలో **"త్రివిధముదితం"** అని ప్రస్తావించిన ఆదిత్యుని స్థూల-సూక్ష్మ పరారూపములే కాకుండ విశ్వాకారంగా పరిణమించిన అయన అనంతరూపాలను వికృతులుగా వర్ణించి, ఈ శ్లోకములో యథార్థమైన పరాప్రకృతికే తన నమస్కారమంటాడు సాంబకవి.

**శ్లో॥ యోఽనాద్యన్త్యోఽప్యతను రగుణోఽణో రణీయాన్మహీయాన్**
**విశ్వాకారః సగుణ ఇతివా కల్పనాకల్పితాంగః**
**నానాభూత ప్రకృతివికృతీర్దర్శయన్ భాతి యోవా**
**తస్మై తస్మై భవతు పరమాదిత్య! నిత్యం నమస్తే॥**

**అన్వయము:-** హే పరమాదిత్య! యః భవాన్ అనాద్యన్తః అతనుః, అగుణః అపి, అణోరణీయాన్, మహీయాన్, విశ్వాకారః సగుణః ఇతి వా కల్పనా కల్పితాంగః (అస్తి) వా యస్త్వం నానాభూత ప్రకృతివికృతీః దర్శయన్ తస్మై తస్మై (నానారూపధారిణే) తే నిత్యం నమః

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| హే పరమాదిత్య! | - పరమాత్మ స్వరూపుడవైన ఓ ఆదిత్యదేవా! |
| యః భవాన్ | - యే నీవు |
| అనాద్యన్తః | - ఆద్యన్తరహితుడవు |
| అతనుః | - ఇదమిత్థమైన శరీరాకృతి లేనివాడవు (అన్ని తనువులు నీవేయైనవాడవు) |
| అగుణః | - గుణరహితుడవు (వైదికపరిభాషననుసరించి గుణాతీతుడవని భావము) |
| అపి | - అయినప్పటికి |
| అణోరణియాన్ | - అణువుకంటెను సూక్ష్మమైన వాడవు |
| మహీయాన్ | - (మహత్తుకంటెను) మహాకృతి కలవాడవు |
| విశ్వాకారః | - (ప్రపంచమూర్తి విశ్వవ్యాపియని భావము) |
| సగుణః | - సర్వజ్ఞత్వాది సమస్తగుణనిధివి |
| ఇతి వా | - అని యీ విధముగా |
| కల్పనాకల్పితాఙ్గః | - తమ సంకల్పమున కనుగుణముగానుప కల్పించబడిన వివిధాకారములు కలవాడవు |

| | |
|---|---|
| వా | – ప్రకారాంతరముగా వివక్షించినచో |
| నానాభూతప్రకృతివికృతీః | – బహువిధ ప్రాణిజాతముల స్వభావ వికృతులను (అనగా పరిణామములను) |
| దర్శయన్ | – ప్రదర్శిస్తూ |
| భాతి | – ప్రకాశించు చున్నావు |
| తస్మై తస్మై | – ఈ విధముగా ఆయారూపములలో సాక్షాత్కరించుచున్న |
| తే | – నీకు |
| నిత్యం | – సర్వకాల సర్వావస్థలయందును |
| నమః | – నమస్కారము. |

**భావము:-** విశ్వాత్మగా ప్రకాశించుచున్న ఓ పరమాదిత్య దేవా! నీవు ఆద్యంతములు అనగా చావుపుట్టుకలు లేనివాడవు. ఇట్టిట్టిదను రూపములేనివాడవు, నిస్త్రైగుణ్యమూర్తివి, నిర్వికారుడవు. అయినప్పటికి అణువుకన్న సూక్ష్మతరునిగా, మహత్తులను మించిన మహాత్మునిగా విశ్వాత్మగా, సర్వజ్ఞత్వాది సర్వగుణ సమన్వితునిగా, ఎవరికి వారు తమకు తోచిన విధముగా సంస్తుతించుచున్నారు. తదనుగుణముగా నీవు కూడా ఆయా చరాచర ప్రాణిసంఘాతముల స్వభావ విపరిణామములను విశ్వమూర్తిగా ప్రదర్శిస్తూ ప్రకాశిస్తున్నావు. ఈ విధముగా ఆయారూపములలో విశ్వాత్మగా ప్రకాశించుచున్న నీకు నిత్యము నమస్కరించుచున్నానని భావము.

**శ్రీపాదుక:-** ఈ శ్లోకమున పరమాదిత్యుని పరిపూర్ణతత్త్వము సమగ్రముగా సంస్తుతింపబడినది. ఆదిత్యుడు పరిపూర్ణుడు. దేశ, కాలాది పరిమితులకు లోబడనివాడు. అనగా అపరిచ్ఛిన్న పరిమాణము కలవాడు. ఈ లక్షణములు సనాతనము శాశ్వతమైన పరబ్రహ్మమునకే చెప్పబడినవి. కావున ఆదిత్యుడు పరబ్రహ్మము. అతని యొక్క స్థూల సూక్ష్మ పరరూపములు ప్రపంచింపబడుచున్నవి.

ప్రథమ పాదములో వైదికపరిభాషలో అతని పరరూపము **అనాద్యన్త, అతను అగుణ, అణోరణీయాన్, మహీయాన్** అనే అయిదు శబ్దాలలో వివరించబడినది. ఆద్యంతములు లేనివాడు అనగా సనాతనుడు. ఆది నుండి అంతమువరకు తనదైన తనతనముతో తనరారువాడని, నిత్యసత్యమైన అస్తిత్వముతో ప్రకాశించువాడని అర్థము. అలాగే అతనుశబ్దానికి అశరీరియని గాక అన్ని శరీరములు (ఉపాధులు) తానే యైనవాడు అని అర్థం చెప్పుకోవాలి. **అగుణః** అంటే గుణ వివర్జితుడు అని కాక సమస్త కళ్యాణగుణ సంపన్నుడు అని భావం. అలాగే **అణోరణీయాన్ మహతోమహీయాన్ అనే** పదములచే ఆయన యొక్క సర్వోత్కృష్టత్వము తెలియజేయబడినాయని గ్రహించాలి. **"అణోరణుతరముత్కృష్టం" మహతి మహత్తరముత్కృష్టం"** అని శాస్త్రము. అణువంటేనే సూక్ష్మము అని అర్థము. సూక్ష్మముకన్న సూక్ష్మతరమైనది ఉండదు. ఉన్నదంటే మొదటిది సూక్ష్మము కానేరదు. అలానే మహత్తును మించిన మహత్తరముండదు. ఉన్నదంటే నీవు సంభావించిన మహత్తు మహత్తుకాక పోవాలి. అంటే **"అణోరణీయాన్ మహతోమహీయాన్**' అనే వైదిక పరిభాషకర్థమేమిటంటే ఆ తత్త్వమును మించిన అణువుగాని మహత్తుగాని వేఱొకటి లేదని భావము. అణుమహత్తత్త్వాలు రెండూ మూర్తములే. వాని కతీతతముగా అణువులో నణుతరముగా మహత్తును మించినట్లుగా భాసించు వాడని భావము. ఈ విధంగా భాసించే తత్త్వము విభుత్వము. **"సర్వమూర్తద్రవ్య సంయోగిత్వం విభుత్వమ్"** అని శాస్త్రీయమైన నిర్వచనము. విభువు నిత్యము సత్యమునై అన్నిటిలో పరిచ్ఛిన్నమై అణువులో అణుతత్త్వముగా మహత్తులో మహత్త్వముగా ప్రకాశిస్తున్నట్లు ఉంటుంది. **"తచ్చైకో విభు నిత్యం చ"** అని ఆకాశాన్ని విభువుగా నిర్దేశించింది శాస్త్రం. సర్వాంతర్యామి, సర్వవ్యాపి,అరూపుడు, సర్వరూపుడు అయినవాడు పరమాదిత్యమూర్తియని భావము.

రెండు మూడు పాదాలలో అతని స్థూల సూక్ష్మరూపాలు నిరేశింపబడినవి. **విశ్వాకారః, సగుణః, కల్పనాకల్పితాఙ్గః** అనే పదాలలో ఆదిత్యుని స్థూలరూపం సంభావింపబడినది. విశ్వాకార పదమాతని

సర్వవ్యాప్తిని సగుణపదము సర్వజ్ఞత్వాది షడ్గుణైశ్వర్య సంపన్నత్వమును సూచిస్తాయి.

**"సర్వజ్ఞతా,తృప్తి,రనాదిబోధః- స్వతంత్రతా, నిత్యమలుప్తశక్తిః।**
**అనంతశక్తిశ్చ విభోర్విధిజ్ఞాః- షడాహురంగాని మహేశ్వరస్య"**- అనే ఈశ్వరీయ గుణములారింటిచే ప్రకాశించువాడనికూడ సగుణశబ్దార్థంగా చెప్పుకోవచ్చు.

ఈ విధంగా మనం సంభావిస్తున్న గుణ రూపములన్నీ కూడా కేవల భావనామూలకములనే విషయాన్ని కల్పనా కల్పితాంగః అనే పదంలో సూచిస్తాడు సాంబుడు. కాగా పరతత్త్వము అవాఙ్మానసగోచరమైనదని భావం. సర్వాంతర్యామిగా అయన పిపీలికాదిబ్రహ్మపర్యంతము వ్యాపించి ప్రకాశిస్తూ ఉంటాడని చెప్పడంలో ఆతని అతిసూక్ష్మ, అతిమహత్తత్త్వములు, పిండాండబ్రహ్మాండములలోని భూతతత్త్వముల ప్రకృతి వికృతి స్వరూపములకు మూలముగా నిర్దేశింపబడినట్లు గ్రహించాలి. **'తస్మై తస్మై'** – అనే ద్విరుక్తి మరియు **'కల్పనాకల్పితాఙ్గః'** అనే పదాలు స్థూలరూప నమస్కృతిపరములే కాని యథార్థతత్త్వ ప్రతిబోధకములు కావని సాంబుని హృదయంగా తెలుస్తుంది. కావుననే జ్ఞానులైన ముని జనుల తత్త్వాఖ్యానము తరువాతి రెండుశ్లోకములలో ప్రస్తుతింపబడినది.

## అనువాద పద్యము

**సీ॥ ఆద్యన్తరహిత! యో ఆదిత్య! పరమాత్మ!**
**ఆకారగుణరహి తాత్మనిష్ఠ !**
**అణు మహత్పరిధుల నవలీల దాటియు**
**విశ్వాత్మగా వెల్గు విశ్వమూర్తి !**
**కల్పనాకల్పిత కమనీయమూర్తివై**
**వివిధ భూతవితతి విభవములను**
**దర్శింపజేయుచు దయతోడ జీవుల**
**నాంతరగతుడవై యాదుకొందు**

**గీ॥** **వట్టి సర్వాత్మ! సర్వద! యర్క! నిన్ను**
**బహుళరూపులలో నేను భావనమున**
**చిద్గగనభాసి చిద్భాను చిత్తసంస్థ**
**డనుచు భావించి దర్శించి యంజలింతు ॥**

---0---

## 15వ శ్లోకము

**అవతారిక:- 'తస్మై తస్మై' - నిత్యం నమః'** అని నమస్కార పురస్సరముగా స్థూల–సూక్ష్మ–పరా రూపములకు నమస్కరించుటకు కారణమీ శ్లోకములో వివరింపబడుచున్నది.

**శ్లో॥** **తత్త్వాఖ్యానే త్వయి మునిజనాః నేతినేతి బ్రువన్తః**
**శ్రాన్తాః సమ్యక్ త్వమితి న చ తైరీదృశోవేతి చోక్తః।**
**తస్మాత్తుభ్యం నమ ఇతి వచోమాత్రమేవాభివచ్మి**
**ప్రాయో యస్మాత్ ప్రభవతి పరా భారతీ జ్ఞానగర్భా॥**

**అన్వయము:-**యస్మాత్ ప్రాయః (త్వద్విషయా) భారతీ జ్ఞానగర్భా పరా ప్రభవతి మునిజనాః త్వయి తత్త్వాఖ్యానే 'నేతినేతి' బ్రువన్తః శ్రాన్తాః చ ఈదృశః త్వం ఇతి తైః సమ్యక్ న ఉక్తః. తస్మాత్ తుభ్యం నమః ఇతి వచః మాత్రమ్ ఏవ అభివచ్మి.

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| యస్మాత్ | – ఏకారణముచే (ఎందువలన) |
| ప్రాయః | – తరచుగా (సాధారణముగా) |
| త్వద్విషయా | – నీసంబంధమైన (నీ యనుగ్రహవినిస్సృతమైన) |
| భారతీ | – (స్తుతి పరమైనట్టి)ఈ వాణి లేదా వాక్కు |
| జ్ఞానగర్భా (పరా) | – జ్ఞానగర్భితమైనపరావాగ్రూపముగామాత్రమే |

ప్రభవతి - ప్రసరించుచున్నదో
తస్మాత్ - ఆకారణమువలన
మునిజనాః - (యదాతదామౌనమునువీడిన) మునీశ్వరులు
త్వయి తత్త్వాఖ్యానే - నీ సంబంధమైన తత్త్వమును చెప్పుటలో
నేతి నేతి ఇతి బ్రువన్తః - 'ఇదికాదు, అదికాదు' అని మాత్రమే చెప్పగలిగినవారై
శ్రాన్తాః - అలసి విరమించినారు
చ తైః - మరియు వారిచే
త్వం ఈ దృశః ఇతి - నీవు ఇట్టివాడవు అని
న ఉక్తః - చెప్పబడలేదు
తస్మాత్ - ఆకారణముచే
(అహమపి - నేనుకూడ)
తుభ్యంనమః ఇతి - నీకు నమస్కారమనెడి
వచోమాత్రమేవ - వాక్కును మాత్రమే
అభివచ్మి - నిన్నుద్దేశించి పలుకుచున్నాను.

**భావము:-** అవాఙ్మానసగోచరుడవైన ఓ పరమాదిత్య దేవా! నీ యథార్థతత్త్వమును తెలుపుటకుద్యమించిన మునీశ్వరులు (ఎట్టకేలకు మౌనమును విడనాడి) ఇది కాదు అదికాదని కేవలము నిషేధరూప లక్షణ వాక్యములనుపదేశించుటలోనే అలసినవారై, అంతటితో విరమించినారు. కాని 'నీవు ఇట్టి వాడవు' - అని నీ యథార్థమైన తత్త్వమును చెప్పలేదు. (వారు నీ యథార్థతత్త్వమును యోగమార్గముచే దర్శింప గలిగిన వారు మాత్రమే) కాని, నీ సంబంధమైన జ్ఞానగర్భితమైన ఆ పరావాక్కు, నీ యనుగ్రహముచే మాత్రమే ప్రసరించును. అది వాక్కులకందనిది. కావున వారివలెనే నేనును అశక్తుడనై (అహంకారమును విడనాడి) నీకు నమస్కారమనెడి వాగ్రూపమైన ప్రణతిని మాత్రమే చేయుచున్నాను. ఈ ప్రణతిలో కవి యొక్క ఆత్మసమర్పణభావము, వినమ్రత అభివ్యక్తమగుచున్నవి.

**శ్రీపాదుక:-** పరమాత్మ తత్త్వమును ఇదమిత్థముగా వర్ణించుట ఎవ్వరికిని సాధ్యము కాదు అనే విషయాన్ని ఈ శ్లోకంలో ప్రస్తావించడం జరిగింది. పరమాత్మ యొక్క పరాతత్త్వము సంవిద్రూపము. అది జ్ఞానానుభవ రూపము మాత్రమే. అదికూడా ఎల్లరకూ సాధ్యముకాదు. ఆ పరమాత్మ యొక్క అనుగ్రహమెవరిపై ప్రసరిస్తుందో, ఆయన ఎవరినెన్ను కుంటాడో వారికి మాత్రమే ఆతని తత్త్వమవగత మవుతుంది. ఈ విషయం **'ప్రాయో యస్మాత్ ప్రభవతి పరా భారతీ జ్ఞానగర్భా'** అనే చివరి పాదంలో తెలియజేయబడినది. తనను అనన్యశరణాగతి చేసి ఆశ్రయించిన వారిని ఎన్నుకుని, వారికి జ్ఞానానుభవరూపమైన పరావాగ్రూపంలో పరమాత్మ తనకు తానుగా సాక్షాత్కరిస్తుందని భావం.

**"నాయమాత్మాప్రవచనేన లభ్యః,**
**న మేధయా న బహునా శ్రుతేన।**
**యమైవేష వృణుతే తేన లభ్యః" –** అని ఉపనిషచ్ఛ్రుతి.

పరమాత్మతత్త్వము ఉపన్యాసములు వినడం వల్ల గాని, మేధాపరిజ్ఞానము వలన కాని, బహువిధ వేదశాస్త్రాద్యధ్యయనముచే గాని లభించదు. ఆ పరమాత్మ ఎవనిని వరిస్తుందో, ఆ జ్ఞానానుభవం వారికి మాత్రమే లభిస్తుందని భావము. ఆ జ్ఞానానుభవమే సిద్ధయోగులకు పరాభారతీ అంటే పరావాక్కుగా సంవిద్రూపంగా సాక్షాత్కరిస్తుందని భావము. ఇలా ఉదయించిన పరావాక్కు మధ్యమగా యోగి మానస ప్రత్యక్షవిషయమై మునీశ్వరులకు సాక్షాత్కరిస్తుంది. వారు దాని తత్త్వాన్ని లోకానికి ఉపదేశింపదలచి యథార్థము అనగా, అనుభవగోచరమవుతున్నదానిని చెప్పదలచినవారై లెస్సగా దానినిట్టిట్టిదని చెప్పజాలనివారై "అదికాదు ఇదికాదు" అని జగత్తత్త్వము నుండి వేరుచేసి ఉపదేశింపనారంభించి, అలసిపోయి లక్షణార్థము వద్దనే నిలచిపోయిరి. ఈ విషయమును సాంబకవి ప్రథమార్థములో వివరించి మూడవ పాదములో తాను చేయుచున్నది ప్రణతియే కాని ప్రణుతి కాదనే విషయాన్ని వాచ్యంగా **"తస్మాత్ తుభ్యం**

**నమ ఇతి వచో మాత్రమేవాభివచ్మి"** కావున నీకు నేను నమస్కరించు చున్నాననెడి వాక్కునే నుతిగా ప్రస్తుతిస్తున్నానని తన అంతరంగాన్ని వివరిస్తాడు.

**"మత్తస్త్వముత్కృష్టః త్వత్తోఽహమపకృష్టః ఇత్యాకార ప్రహ్వీభావ సూచకాంజలి సంపుటీకరణం నమస్కారః"** అనగా నాకన్న నీవు గొప్పవాడవు నీకన్న నేనెంతో తక్కువ వాడననే వినమ్రతా సూచకగా అంజలి ఘటించుటయే నమస్కారమని భావము. ఇది స్వాత్మ సమర్పణమును సూచించును. ఈ విధమైన స్వాత్మార్పణముచే మాత్రమే భగవదనుగ్రహము శీఘ్రముగా లభిస్తుంది. స్తుతులచే కన్న ఆత్మార్పణ బుద్ధితో పరమాత్మ నాశ్రయించుట వలననే శీఘ్రముగా భగవదనుగ్రహం లభిస్తుందని తాత్పర్యము.

## అనువాద పద్యము

**సీ॥ నీదుతత్త్వ మెఱుగ నీరసపడినారు**
**మౌనము వీడిన మౌనిజనులు**
**ఇట్టిట్టి దని చెప్ప నేరికి సాధ్యమౌ**
**'నేతి-నేతి' యనుచు నిలచినారు**
**అట్టి జ్ఞానులె యిట్టు లలసి నిలచిపోవ**
**నేనెంతవాడను నిను నుతింప**
**'తుభ్యం నమోస్త'ని తొలి వాక్కు నతిగాను**
**పలికెద నినుజూచి పరమపురుష!**

**గీ॥ సిద్ధ చారణ ఋషిగణ మంజలింప**
**దివ్యకాంతుల తైజసుల్ తేజరిల్ల**
**మంగళముల ననుదినము మాకు నిడుచు**
**అక్షితర్పణమొనరింపు మయ్య నీవు ॥**

---0---

# 16వ శ్లోకము

**అవతారిక:-** మహర్షులచే తథ్యవిచారణమున భగవద్దర్శనము లభించలేదను విషయము పూర్వశ్లోకమున ప్రస్తావింపబడినది. ఆ పక్షమున తత్త్వవిచారణము వ్యర్థము అను సంశయముదయించును. దానికి సమాధానముగా ఈ శ్లోకము చెప్పబడుచున్నది.

**శ్లో॥ సర్వాఙ్గీణః సకలవపుషామన్తరేయోఽన్తరాత్మా**
**తిష్ఠన్ కాష్ఠే దహన ఇవ నో దృశ్యసే యుక్తిశూన్యైః।**
**యశ్చ ప్రాణారణిషు నియతై ర్మథ్యమానాసు సద్భిః**
**దృశ్యం జ్యోతిర్భవసి పరమాదిత్య తస్మై నమస్తే ॥**

**అన్వయము:-** హే పరమాదిత్య! సకలవపుషామన్తరే యః అన్తరాత్మా సర్వాఙ్గీణః తిష్ఠన్(అస్తి) సః త్వం యుక్తిశూన్యైః జనైః కాష్ఠే దహన ఇవ నో దృశ్యసే। మథ్యమానాసు ప్రాణారణిషు నియతైః (అభ్యాసనిరతైః) సద్భిః యశ్చ జ్యోతిః దృశ్యం భవసి, తస్మై తే (తుభ్యం) నమః॥

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| హే పరమాదిత్య! | - పరమాత్మ స్వరూపుడవైన ఓ సూర్యదేవా! |
| సకలవపుషాం | - సర్వప్రాణుల యొక్క |
| అన్తరే | - హృదయాన్తరాళములో |
| యః అంతరాత్మా | - ఎవడు అంతరాత్మయై అంతర్యామిగా |
| సర్వాఙ్గీణః | - సర్వశరీరమున వ్యాపించి యున్నవాడై |
| తిష్ఠన్(అస్తి) | - నెలకొనియున్నాడో |
| సః త్వమ్ | - అతడే నీవై |
| యుక్తిశూన్యైః | - విచక్షణాజ్ఞాన విహీనులైన |
| జనైః | - జనులచే |
| కాష్ఠేదహన ఇవ | - అరణికట్టెయందు నిగూఢమైయున్న అగ్నివలె |
| నదృశ్యసే | - చూడబడకున్నావు |

| | |
|---|---|
| చ | - మరియు |
| యః | - ఏ నీవు |
| నియతైః | - ప్రయత్నశీలురై |
| ప్రాణారణిషు | - ప్రాణరూపమైన అరణికాష్ఠములు |
| మథ్యమానాసు | - మథింపబడుచున్నవికాగా |
| సద్భిః | - సజ్జనులచే |
| దృశ్యం జ్యోతిః భవసి | - కనబడుచున్న అలౌకిక దివ్యప్రకాశము అగుచున్నావు. (అనగా దివ్యజ్యోతిగా సాక్షాత్కరించుచున్నావని భావము) |
| తస్మై | - ఆవిధముగా ప్రకాశించుచున్న |
| తే నమః | - నీకు నమస్కారము |

**భావము:-** పరమాత్మ స్వరూపుడవైన ఓ చిదాదిత్య దేవా! సర్వప్రాణులలో నీవే అంతరాత్మగా సర్వాంతర్యామివై ప్రకాశించుచున్ననూ, విచక్షణాజ్ఞానశూన్యులైన అజ్ఞానులకు అరణికట్టె యందున్న అగ్నివలె కనబడకున్నావు. ఆత్మనరణిగా ప్రాణవాయువునుత్తరారణిగా యమనియమ యోగసాధనలచే నియతి పూర్వకముగా నిత్యము అంతర్మథనమొనరించునట్టి ఆత్మారాములగు సజ్జనులకు మాత్రమే జ్యోతీరూపమున గోచరించుచున్నావు. ఆ విధముగా ప్రకాశించువాడవైన నీకిదే నా నమస్కారము.

**శ్రీపాదుక:-** అవాఙ్మానసగోచరమైనందున పరమాదిత్యుని తత్త్వమును యోగసిద్ధులైన మునీశ్వరులే ఇదమిత్థముగా నిశ్చయించి వర్ణింపలేకపోయినారని పూర్వశ్లోకములో చెప్పి, ఆ పక్షమున ఆవిషయమున మరల తత్త్వవిచారణ మికపై మన బోంట్లకనవసరమనే సంశయముదయింపవచ్చునని ఆశంకించి, దానిని వారించుటకై యీ శ్లోకమును సాంబకవి వచించినాడని చెప్పవచ్చును. సిద్ధయోగులు పరమాత్మతత్త్వమును సాక్షాత్కరించుకున్నప్పటికీ వాక్కుల కందరాని దగుటచే

దానిని ఇట్టిదని వర్ణింపలేకపోయినారు. పరమాత్మ సాక్షాత్కారమునకు తత్త్వవిచారణాజన్యమైన జ్ఞానము అత్యంతము ఆవశ్యకమైనది. ఈ అంశమునిచట కవి సోదాహరణముగా సందేశించుచున్నాడు.

పరమాత్మ తత్త్వమన్ని ప్రాణులలో అంతర్యామిగా సర్వాఙ్గీణముగా వ్యాపించి యున్నదని ప్రథమ పాదములో ప్రవచింపబడినది. ఇక్కడ సర్వాఙ్గీణ మను శబ్దము సాభిప్రాయము. దానికి ఇన–గతౌ అనే అర్థంలో **'సర్వేష్వఙ్గేషు ఇనతి గచ్ఛతి – వ్యాప్నోతీతి సర్వాఙ్గీణః'** అని వ్యుత్పత్తిని చెప్పుకుంటే సర్వప్రాణులలో పరమాత్మ తత్త్వమాంతరముగా అణువణువున వ్యాపించి యున్నదనే అర్థం సిద్ధిస్తుంది. అధిష్ఠానమైన రజ్జువునందు సర్పమువలె సర్వాంగీణముగా నది వ్యాపించి యున్నది. ఈ విధముగా సర్వాఙ్గీణముగా సర్వాంతర్యామిగా ప్రాణులన్నింటిలో నిండి నిబిడీకృతమై యున్నను అది మనకు కనబడకపోవుటకు కారణము సోదాహరణముగా రెండవపాదములో వివరింపబడుచున్నది. అరణికాష్ఠమునందు అంతర్నిహితమైన అగ్నితత్త్వమువలె అది విచక్షణాజ్ఞానములేని అవివేకులకు కనిపించదని చెప్పబడినది కాగా, అంతర్యామియైన పరమాత్మ యొక్క అదర్శనమునకు కారణము మన విచక్షణా రాహిత్యమేనని ఫలితార్థము. ఈ విషయమే **'ప్రాణారణిషునియతైః మథ్యమానాసు సద్భిః తజ్జ్యోతిః దృశ్యం భవతి'** – అని 3,4 పాదములలో చెప్పబడినది. నిరంతరము ప్రాణారణి నిర్మథన పరాయణులైన సజ్జనులు మాత్రమే ఆ జ్యోతీరూపమైన పరమాత్మను సందర్శింపగలరని భావము.

చిదాత్ముని యొక్క జాజ్జ్వల్యమైన ప్రకాశమే ఆతని అదర్శనము లేదా కనబడకపోవుటకు కారణమనే విషయాన్ని ఆత్మోపమానంతో శైవాగమాచార్యులు – **'మాణిక్య ప్రవేక ఇవ నిచోలితో నిజమయూఖలేఖయా ప్రతిభాతి లౌకికానామత్యన్త స్ఫుటోఽప్యస్ఫుట ఆత్మా॥'** అనగా – తనదైన

జాజ్జ్వల్యమైన ప్రకాశముచే నావరింపబడినదై ఆవెలుగులో లీనమైన మణి ప్రస్ఫుటముగాకనబడనట్లుగా, అజ్ఞానులకు ఆత్మస్వరూపము సంపూర్ణముగా సాక్షాత్కరింపదని భావము. ఇదే విధముగా సర్వాంగీణముగా సర్వవ్యాపిగా భాసించుచున్న చిద్భానుని అదర్శనమునకు కారణము మన యొక్క 'యుక్తిశూన్యత' విచక్షణా జ్ఞాన శూన్యత లేదా అజ్ఞానమే. అని **"యుక్తిశూన్యైః"** అనే పదం ద్వారా తెలియజేయబడినది.

పరమాత్మదర్శనమునకు కావలసిన విచక్షణాజ్ఞానము అంతర్మథనమువలననే లభించును. ఆయంతర్మథ్న ప్రక్రియ కైవల్యోపనిషత్తులో –

**'ఆత్మానమరణిం కృత్వా–ప్రణవం చోత్తరారణిం।**

**ధ్యాన నిర్మథనాభ్యాసాత్–పాశం దహతి పణ్డితః॥ –** అనే మంత్రంలో నిర్ధేశింపబడినది. యజ్ఞయాగాదుల కవసరమైన అగ్నిని అరణిమథనం ద్వారా ప్రజ్వలింపచేస్తారు. అరణిలో రెండు కట్టెలుంటాయి. క్రింద పీఠరూపముననున్న అరణిమధ్యంలో కాష్ఠరూపముననున్న వేరొక ఉత్తరారణిని ఉంచి మథిస్తే వాని రాపిడికి యజ్ఞీయాగ్ని ఆవిర్భవిస్తుంది. ఇదే ప్రక్రియను ఉపనిషత్తు – ఆత్మను ప్రధానారణిగా జేసి దానిని ప్రణవోచ్చారణ లేదా నాదోపాసనమనే ఉత్తరారణితో ధ్యానయోగంతో మథిస్తే జ్ఞానాగ్ని ప్రజ్వలించి పాశములను (సాంసారికవాసనలను) పూర్తిగా దహిస్తుంది. ఈ విధమైన నిర్మథనా భ్యాసమే పాణ్డిత్యమని శ్రుతిబోధ. గీతాస్మృతి కూడ – **"జానాగ్ని దగ్ధ కర్మాణం తమాహుః పణ్డితం బుధాః (గీత 4 అ19శ్లో॥)** అని ఇదే విషయాన్ని ప్రబోధించినది. యమనియమాది నియతిపూర్వకమైన ఈ విధమైన ప్రాణారణి నిర్మథనాభ్యాసము చేతనే అంతర్యామిగా భాసిస్తున్న చిదాదిత్యుని పరంజ్యోతి అనుభవ గోచరమవుతుందని 3,4 పాదాలలో సూచింపబడినది.

## అనువాద పద్యము

**సీ॥** సర్వజీవుల యొక్క సర్వాంగముల యందు
అంతరాత్మగ నీవ యలరు చుండి
కాష్ఠమందున నీవు కానబడని యగ్ని
చందము నగుపడ కుందువయ్య
మూఢమతులు నిన్ను చూడగ లేరయ్య
యుక్తిశూన్యమతులు శక్తి హీను
లటుగాక ప్రాణాల నరణి జేసి నియతి
నంతర్మథనమున నాంతరమున

**గీ॥** జ్ఞానచక్షులు నినుజూచి తానవమున
ముక్తి నరచేత గొనునట్టి యుక్తిపరులు
వారి శక్తికి యుక్తికి వంద్య! నీవె
కారణమ్మని నతిసేతు కావుమనుచు ॥ 16 ॥

---0---

## 17వ శ్లోకము

**అవతారిక :-** పరమాత్మజ్యోతిని సందర్శించిన మరుక్షణమే **స్తోత – స్తుత్యః – స్తుతి, జ్ఞాత – జ్ఞేయము – జ్ఞానము, ధ్యాత – ధ్యేయము – ధ్యానము** ఇత్యాది త్రిపుటి మటుమాయమై **"సర్వం ఖల్విదం బ్రహ్మ నేహ నానాస్తి కించన"** అంతయు పరబ్రహ్మమే (దానివివర్తమే) దానికన్న భిన్నమైనది వేరేదియు లేదను జ్ఞానముదయిస్తుందని ప్రస్తుత శ్లోకములో ప్రస్తావింపబడుచున్నది.

**శ్లో॥ స్తోతా స్తుత్యః స్తుతిరితి భవాన్ కర్తృకర్మక్రియాత్మా**
**క్రీడత్యేక స్తవ నుతివిధావస్వతంత్ర స్తతో౽హమ్।**
**యద్వా వచ్మి ప్రణయసుభగం గోపతే తచ్చ తథ్యం**
**త్వత్తోహ్యన్యత్కిమివ జగతాం విద్యతే తన్మృషా స్యాత్॥**

**అన్వయః-** స్తోతా స్తుత్యః స్తుతిరితి కర్తృకర్మ క్రియాత్మా భవాన్ ఏక ఏవ క్రీడతి. తతః అహం తవ స్తుతి విధౌ అస్వతంత్రః సన్ ప్రణయసుభగం యద్వా వచ్మి తత్ తథ్యం (స్యాత్) హేగోపతే! జగతాం త్వత్తః అన్యత్ యత్కిమివ విద్యతే తత్ మృషా స్యాత్.

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| స్తోతా | - స్తుతికర్త |
| స్తుత్యః | - స్తుతింపబడువాడు |
| స్తుతిః ఇతి | - స్తోత్రము అనెడి |
| కర్తృకర్మక్రియాత్మా | - కర్త, కర్మ, క్రియా వ్యాపారములను మూడింటి రూపములో |
| భవాన్ | - నీవు, |
| ఏకః | - ఒక్కడవే |
| క్రీడతి | - లీలారూపమున నిర్వర్తించుచున్నావు |
| తతః | - ఆకారణముచే |
| అహమ్ | - నేను |
| స్తుతివిధౌ | - ఈ విధముగా స్తోత్రము చేయుటయందు |
| అస్వతంత్రః | - స్వాతంత్ర్యము లేనివాడను. స్వయముగా చేయ జాలనివాడను (అంతర్యామిగా నీవే నాచే చేయించుచున్నావని భావము.) |
| చ | - మరియు |
| ప్రణయసుభగం | - మిక్కిలి భక్తితో చేయుటచే నీకు ప్రీతికరమగునట్లుగా |

యద్వచ్మి – యేమేమి పలుకుచున్నానో

తత్ – ఆ స్తుతి వచనము

తథ్యం – సత్యమైనది

తత్ – అది,

కిం – ఏదనగా

గోపతే – ఇంద్రియముల కధిపతివైన ఓ సూర్యదేవా!

జగతాం – లోకములకు

త్వత్తః – (జాగ్రదాద్యవస్థా చతుష్టయములో ప్రాణులకు రక్షకుడవైన) ఆ నీకంటె

అన్యత్ – వేరొకటి (తలంచుట)

మృషా – మిథ్య (అసత్యమే) యగునని భావము.

**భావము:-** సృష్టి స్థితి లయ కర్తృత్వములను నిర్వహించుటకై యావిర్భవించిన పరబ్రహ్మమే నీవు. నీకన్న వేరేదియును లేదని, కవి ఓ దేవా! హిరణ్యగర్భరూపమున బాహిరముగా ప్రత్యగాత్మగా నీవే సర్వజగత్కార్యములను కర్తృ కర్మ క్రియా వ్యాపారములను లీలగా నొక్కడవే నిర్వర్తించుచున్నావు.

స్తోత్రము స్తోత స్తుత్యము అన్నీ నేవేయైనప్పుడు (నిన్ను విషయముగా చేసికొని నేను స్తవనము చేయుట ఎట్లుకుదురును) నేను నిన్ను స్తుతించుచున్నాను అను భావనలో కూడ నేను నీకు పరతంత్రుడనే గాని స్వతంత్రుడను కాను. కాగా, జగత్తంతా నిండి నిబిడీకృతమై యున్న నీకన్న వేరొక విషయము స్మరించుట మిథ్యయే యగును. నీ ప్రీతికొరకునిన్ను స్తుతించు చున్నాననుటకూడా మిథ్యయే నని భావము. ఆదిత్యుని జగద్రక్షణపరాయణత్వమును కవి సంస్తుతించినాడని భావముగా గ్రహించాలి.

**శ్రీపాదుక:-** ఈ శ్లోకమున ఆదిత్య పరబ్రహ్మము కన్న భిన్నముగా వేరేదియును లేదను విషయము సుష్టముగా చెప్పబడినది. **'సర్వం ఖల్విదం బ్రహ్మ','నేహ నానాస్తి కించన'** ఉన్న దంతయూ పరబ్రహ్మము యొక్క వివర్తమే. నానావిధములగు నామరూపములతో కనబడుచున్న ప్రపంచమంతయు మిథ్యాభూతమైనదే అను శ్రుతివచనముకీ శ్లోకము వ్యాఖ్యా ప్రాయమనదగినది.

## అనువాద పద్యము

**సీ॥** నేనస్వతంత్రుడ నినుగూర్చి యేమేమి
వచియించుచుంటినో వమ్ముగాదు
ఏలన నీవయే ఇట్లుగా నా చేత
పలికింప జేయగా పలికినాడ
నీ పల్కులవిగాన నీకవి యిష్టమౌ
నని నేను తలచెద నయ్య వినుము
నుతికర్త నుతిభర్త నుతిరూపుడవు నీవె
యగుచు వ్యాపారము లన్ని నడుప

**తే గీ॥** నిన్ను వీడియు వేరుగా నెట్లు దలుప
సాధ్యమగునయ్య చెప్పుమో స్వామి నీవె
కర్మసాక్షి తెలిపితివి మర్మమిదియ
నేను నీకంటె వేరుగా లేనటంచు ॥

---0---

## 18వ శ్లోకము

**అవతారిక:-** కేవల జ్ఞానమాత్రైకగమ్యమైన నిర్గుణపరబ్రహ్మోపాసన అందరకు సాధ్యము కాదు. కావున మోక్షప్రాప్తికి సులభతరోపాయమైన భక్తియోగ మాశ్రయింపదగినదని ఈ శ్లోకములో నుపదేశింప బడుచున్నది.

శ్లో॥ జ్ఞానం నాన్తఃకరణరహితం విద్యతేఽస్మద్విధానాం
త్వం చాత్యన్తం సకలకరణాగోచరత్వాదచిన్త్యః।
ధ్యానాతీతస్త్వమితి న వినా భక్తియోగేన లభ్యః
తస్మాద్ భక్తిం శరణమమృత ప్రాప్తయేఽహం ప్రపన్నః॥

**అన్వయము:-** అస్మద్విధానాం జ్ఞానం అన్తఃకరణరహితం న విద్యతే, చ త్వం సకల కరణాగోచరత్వాత్ అత్యన్తం అచిన్త్యః త్వం ధ్యానాతీతః ఇతి భక్తియోగేన వినా న లభ్యః । తస్మాద్ అహం అమృత ప్రాప్తయే భక్తిం శరణం ప్రపన్నః ॥

**ప్రతిపదార్థము:-**

అస్మద్విధానాం - మా బోటి అల్పజ్ఞుల యొక్క
జ్ఞానం - జ్ఞానము (నిర్గుణ పరబ్రహ్మోపాసనాజ్ఞానము)
అన్తఃకరణరహితం -మనోబుద్ధ్యాది అన్తఃకరణములకతీతమైనదిగా
న విద్యతే - ఉండదు.
చ - మరియు
త్వం - నీవు
సకల కరణాగోచరః - ఇంద్రియజన్యజ్ఞానప్రత్యక్ష విషయము కావు అనగా (సర్వేంద్రియములకు గోచరింపవు)
త్వం ధ్యానాతీతః - నీవు ధ్యానపరిధిని దాటినవాడవు
భక్తియోగేన వినా - భక్తి యోగముచే తప్ప
నలభ్యః - పొందబడవు
ఇతి - అను యీ కారణముచే
తస్మాత్ - ఆ కారణముచే
అహం - నేను,
అమృతప్రాప్తయే - మోక్షప్రాప్తికై
భక్తిం - భక్తియోగమునే
శరణం - శరణముగా (ఆశ్రయముగా)
ప్రపన్నః - ఆశ్రయించినాను

**భావము:-** ఓ పరబ్రహ్మ స్వరూపా! - మాబోటి అల్పజ్ఞులయొక్క ప్రాకృతపరిజ్ఞానము, ఇంద్రియాన్తః కరణములకు లోబడియే యుండును గాని, వానికతీతముగా ప్రవర్తింపదు. కాని నీవు నిర్గుణ పరబ్రహ్మ మూర్తివగుటచే ఇంద్రియగోచరుడవు కావు. నీవు ధ్యానపరిధినతిక్రమించిన వాడవు, కావున భక్తియోగముచే తప్ప వేరొక విధముగా లభింపవు. ఆ కారణముచే నేను మోక్షప్రాప్తికై భక్తినే శరణముగా నాశ్రయించినాను.

**శ్రీపాదుక:-** పరబ్రహ్మప్రాప్తి లేక సాయుజ్యమనునది అనన్యశరణాగతి రూపమైన భక్త్యుపాయముచేత మాత్రమే సాధ్యము. గుణాతీతములు కాని అన్తఃకరణములకు నిర్గుణబ్రహ్మవిద్య సాక్షాత్కరింపదు. ఈ విషయము శ్లోక ప్రథమార్ధములో చెప్పబడినది. ఉపాధినిష్ఠములైన కరణములకు నిరుపాధికమైన బ్రహ్మము గోచరింపదు. నిర్గుణ పరబ్రహ్మమును గోచరింపచేసి, శివజ్ఞానమును ప్రసాదించి, శివైక్యమును అనుగ్రహించునది పరాశక్తియే. అది **"సాత్వస్మిన్ పరమ ప్రేమరూపా"** అని పరాభక్తిగా నారదభక్తి సూత్రములో చెప్పబడినది. ఈ భక్తియోగమే ఉన్మనావస్థలో భక్త్యుద్రేకము లేదా భక్త్యావేశంగా పరిణమించి శివజ్ఞానము ననుగ్రహిస్తుందని శాక్తతంత్రములలో చెప్పబడింది. ఈ భక్త్యావేశమే, విరక్తిని శాంకరీ శక్తిని తద్వారా శివజ్ఞానమును అనుగ్రహిస్తుందని విజ్ఞాన భైరవంలో -

**శ్లో॥ భక్త్యుద్రేకాత్ విరక్తస్య యాదృశీ జాయతే దశా।**
**సా శక్తిః శాంకరీ నిత్యం భావయేత్తాం తతః శివః ॥** అని చెప్పబడింది. శాంకరీ శక్తి శివజ్ఞాన ప్రదాయిని. ఆమె శివశక్త్యైక్యరూపిణిగా శివజ్ఞాన ప్రదాయినిగా లలితా సహస్రనామంలో కీర్తించబడింది. శివశక్తి సామరస్యమును సహస్రార కర్ణికా మధ్యములో సందర్శించిన సాధకుడు తచ్చరణామృత నిష్యందముచే నాప్లావితమైన సమస్తనాడీ ప్రపంచము కలవాడై 'శివాఽహమ్' 'సాఽహమ్' లేదా **'శివోఽహమ్' 'సోఽహమ్'** అనే సిద్ధిని పొందుతాడు. ఇదే అమృతత్త్వ సిద్ధిగా, మోక్షముగా చెప్పబడినది.

ఇదే భక్త్యావేశము లేదా భక్త్యుద్రేకము. భక్తి యోగము. చిద్భానుని కిరణామృతమే శ్రీవిద్యోపాసకులనుభవించే చరణామృతము. వారికి చంద్రమండలగత బిందుస్థానము కేంద్రమైతే సూర్యమణ్డలము సౌరోపాసకులకు ధ్యానకేంద్రము. అమృతత్వసిద్ధి ఉభయత్ర సమానమే నని భావము. ఈ విధముగా తంత్రమార్గములో భక్తియోగము ఈ శ్లోకములోని **'అన్తఃకరణ రహితం, కరణాగోచరత్వ, అమృతప్రాప్తి** అనే పదములలో ధ్వనింప చేయబడినదని గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥ అల్పజ్ఞులము మేము అస్మదాదుల తెల్వి**
**అన్తఃకరణముల యవధి దాట-**
**దర్యమేంద్రియముల కావల నీవుంట**
**నిన్నుధ్యానింపగా తెన్నుగనక**
**అందవు ధ్యానము కని భక్తి యోగము**
**నాశ్రయించితినయ్య అర్క! నిన్ను**
**భక్తి సులభుడవు భవమును దాటింప**
**శరణము నీవంచు చరణయుగళి**
**గీ॥ పట్టి ప్రార్థించు చున్నాను పట్టి వనుచు**
**పట్టి చేతిని తుదిదాక పట్టువీడ**
**కుండ నడిపించు తోడు నీవుండి మోక్ష**
**ఫలము నీయుము నీ భక్తి ఫలమటంచు ॥**

---0---

# 19వ శ్లోకము

**అవతారిక:-** మోక్ష సాధనోపాయమగు భక్తి వేదత్రయి వలె సాధకులలోని రజస్తమోగుణములను పారద్రోలి వారిని సత్త్వగుణ సంపన్నులు గావించి మోక్షముననుగ్రహించునని ప్రస్తావింప బడుచున్నది.

**శ్లో॥ హార్దం హన్తి ప్రథమముదితా యా తమః సంశ్రితానాం**
**సత్త్వోద్రిక్తా తదను చ రజః కర్మయోగక్రమేణ ।**
**సా స్వభ్యస్తా ప్రథయతితరాం సత్త్వమేవ ప్రసన్నా**
**నిర్వాణాయ వ్రజతి శమినాం తేఽర్క! భక్తి స్త్రయీవ॥**

**అన్వయము:-** హే అర్క! తే యా భక్తిః ఉదితా (సతీ) ప్రథమం సంశ్రితానాం హార్దం తమః హన్తి, చ తదను సత్త్వోద్రిక్తా కర్మయోగ క్రమేణ రజశ్చ హన్తి, స్వభ్యస్తా సా సత్త్వమేవ ప్రథయతి తరాం, ఏవం ప్రసన్నా సా శమినాం త్రయీవ నిర్వాణాయ వ్రజతి॥

**ప్రతిపదార్థము :**

| | |
|---|---|
| హే అర్క! | - ఓ సూర్యదేవా! |
| తే | - నీ యొక్క |
| యా భక్తిః | - యే భక్తి |
| ఉదితా (సతీ) | - ఉదయించినదై |
| ప్రథమం | - ముందుగా |
| సంశ్రితానాం | - ఆశ్రయించిన భక్తులయొక్క |
| హార్దం తమఃహన్తి | - హృదయమునందలి తమోగుణమును లేదా అజ్ఞానాంధకారమును నశింపజేయుచున్నదో |
| చ | - మరియు |
| తదను | - అటుపిమ్మట |
| సత్త్వోద్రిక్తా | - సత్త్వగుణాధిక్యముచే ప్రచోదితమై |
| కర్మయోగక్రమేణ | - కర్మయోగక్రమముచే |
| రజః హన్తి | - రజోగుణమును నశింపజేయుచున్నదో. |
| తతః | - పిమ్మట |
| స్వభ్యస్తా సా | - లెస్సగా నభ్యసించబడినదై |
| సత్త్వమేవ | - సత్త్వగుణమునే |

| | |
|---|---|
| ప్రథయతితరాం | – అతిశయించి వృద్ధిని పొందించుచున్నదో |
| (ఏవం) ప్రసన్నా | – ఈ విధముగా ప్రసన్నమైన |
| తే భక్తిః | – ఆ నీ భక్తి |
| శమినాం | – శాంతాత్ములగు సంయమీంద్రులయొక్క |
| నిర్వాణాయ | – మోక్షము కొరకై (మోక్షమునొసగుదిశగా) |
| వ్రజతి | – ప్రయాణించుచున్నది. |

**భావము :** ఓ సూర్యదేవా! నీయెడనుదయించిన భక్తి తొలుదొలుత భక్తుల హృదయాంతరమునందలి తమోగుణరూపమైన అజ్ఞానతమస్సును నశింపజేయును. అదియే సత్త్వోద్రేకముచే ప్రచోదితమై రజోగుణమును నశింపజేయును. పిమ్మట లెస్సగా నభ్యసింపబడినదై, సత్త్వగుణమును పెంపొందించి, తన నాశ్రయించిన శాంతచిత్తులగు భక్తులకు వేదత్రయి వలె మోక్షమునకు చేర్చునని వాచ్యార్థము.

**శ్రీపాదుక :** ఈ శ్లోకమున **"హే అర్క! తే భక్తి త్రయీవ శమినాం నిర్వాణాయ వ్రజతి'** అనెడి నాలుగవ పాదము ప్రధానముగా విశ్లేషింపదగియున్నది. సూర్యుని యందలి భక్తి, ఋగ్యజుస్సామాత్మకమైన వేదత్రయివలె శాంతచిత్తులగు భక్తులకు మోక్షమును పొందించుచున్నది. **'వ్రజ–గతౌ'** అను గత్యర్థక వ్రజధాతు ప్రయోగము వారిని మోక్షగాములను గావించుచున్నదను అర్థమును అభివ్యక్తీకరించుచున్నది.

ఈ శ్లోకమున భక్తి ఋగ్యజుస్సామాత్మకమైన వేదత్రయితో పోల్చబడినది. శ్లోకములోని భక్తి విశేషణములన్నియు సమాంతరముగా త్రయీవిద్యకు కూడా అన్వయిస్తాయి.

భక్తికి త్రయీవిద్యకు సమాంతరముగా అర్థము నన్వయించినచో తొలుదొలుతనుదయించిన భక్తి, ప్రథమ పఠితమైన వేదవిద్యవలె తననాశ్రయించిన వారి హృదయములోని తమః అనగా అవిద్య,అంధకారములను నశింపజేస్తుందని ప్రథమపాదమునకర్థం

సిద్ధిస్తుంది. వేదవిద్య పక్షంలో తమశ్శబ్దానికి జీవ స్వరూపాచ్ఛాదకమైన తమస్సును అనగా అనాద్యవిద్యను నశింపజేస్తుందని భావం.

రెండవపాదంలో సత్త్వగుణాధిక్య ప్రచోదితమైన భక్తి అని **'సత్త్వోద్రిక్తా'** అనే పదానికర్థం చెప్పుకున్నాం. వేదవిద్యవిషయానికొస్తే ఋషిచ్ఛందో దేవతా పురస్సరముగా నభ్యసింపబడిన స్వాధ్యాయము వేదవిద్య సత్త్వగుణమునుద్దీపింపజేసి, కర్మయోగముద్వారా రజోగుణమును నశింపజేస్తుందని అన్వయం చెప్పుకోవాలి. ఇక్కడ కర్మ–యనగా వేదపాఠము అదియే బ్రహ్మయజ్ఞము. యోగమనగా వేదార్థస్మృతి వీని యొక్క అభ్యాసముచే లెస్సగా నభ్యసింపబడిన త్రయీవిద్య 'సత్త్వం ప్రథయతి' స్వస్వరూప జ్ఞానమును అతిశయింపజేసి ఉద్దీప్తముగావించును. అనగా ఆత్మజ్ఞానమును ప్రకాశింపజేస్తుందనే అర్థం సిద్ధిస్తుంది.

వేదము **ప్రసన్నా** – అనగా ఈశ్వరానుగ్రహ సంపన్నమై తుదకు ఆత్మజ్ఞానము, తద్వారా నిర్వాణమును అనగా మోక్షమును ప్రజతి పొందింపజేస్తుందని భావం. ఇదే విధముగా భక్తి కూడ **సాత్త్వికీ రాజసీ – తామసీ** ప్రభేదములుగా ప్రస్తరింపబడిననూ, అభ్యాసవశమున క్రమముగా తమోరజస్సులను సత్త్వములోలయింపజేసి, తుదకు మోక్షమునకే చేర్చుతుందని గ్రహించాలి. వేదవిద్యకూడ ప్రథమ దశలో అభ్యసించడానికి కొద్ది కష్టమును కలిగించినా, హృదయాంతరాళములలోని తమస్సును నశింపజేస్తుంది. ద్వితీయావస్థలో కర్మయోగము అనగా ద్రవ్య,దేవతా,ఛందోజ్ఞాన పురస్సరముగా నభ్యసింపబడి అనుష్ఠాన దశలో రజోగుణమును అంతరింపచేస్తుంది.క్రమంగా శుద్ధసత్త్వ ముద్దీప్తమై తమో రజస్సంబంధులగు పాపవాసనలు క్షయించి జ్ఞానముదయించును. స్వస్వరూప జ్ఞానోదయమే నిర్వాణము. ఇది వేదాన్తమతము. శ్రుతి స్మృతి శాస్త్రోపపాదితమైన అద్వైత సిద్ధాన్తము. **'ధర్మేణ పాపమపనుదతి'** అని శ్రుతి. **"జ్ఞానముత్పద్యతే పుంసాం క్షయాత్ పాపస్య కర్మణః"** అని స్మృతి. **"జ్ఞానాదేవహి కైవల్యమ్"** అని శాంకర ప్రవచనము.

ఈ విధముగా భక్తి, వేదత్రయివలె సహచరియై ఆశ్రితులగు భక్తులను నిర్వాణము లేదా మోక్షమునకు  చేర్చునని భావము.

## అనువాద పద్యము

**సీ॥** నిన్నాశ్రయింపగా నీ భక్తి యుదయించి
  ముందుగానెదలోని యంధకార
మంతను తెగటార్చి చింతల బాపుచు
  తామసము నడంచు తానుగాను
ఆపైన సత్త్వము నారూఢి గాగొని
  కర్మయోగ క్రమ కారణమున
రాజసమ్ము నణచి రాజిల్లజేయును
  సత్త్వము నదియేను సమధికముగ

**గీ॥** ఇట్లు నీ భక్తి భక్తుల కిలను తరణి
తారకంబగుచును భవ తారణమును
నిత్యమొనరించు చున్నది నిక్క మదియ
సంయమీంద్రుల నిర్వాణ సాధనమ్ము ॥ 19 ॥

---0---

# 20వ శ్లోకము

**అవతారిక:-** చిదాదిత్యసంబంధమైన భక్తి, ఆశ్రితులను సర్వకాలసర్వావస్థల యందును విడువక సహచరియై పరమామృతమైన మోక్షసిద్ధి ననుగ్రహించునని దాని మాహాత్మ్యమునీశ్లోకమున సోదాహరణముగా సాంబకవి స్పష్టీకరించుచున్నాడు.

**శ్లో॥** తామాసాద్య శ్రియమివ గృహే కామధేనుం ప్రవాసే
ధ్వాన్తే భాతిం, ధృతిమివ వనే, యోజనే బ్రహ్మనాడీ ।
నావం చాస్మిన్ విషమవిషయగ్రాహసంసారసిన్ధౌ
గచ్ఛేయం తే పరమమమృతం యన్న శీతం న చోష్ణమ్॥

**అన్వయము:** గృహే శ్రియమివ, ప్రవాసే కామధేనుమివ ధ్వాన్తే భాతిమివ, వనే ధృతిమివ, యోజనే బ్రహ్మనాడీ ఇవ, అస్మిన్ విషమవిషయగ్రాహసంసారసిన్ధౌ నావమివ, తే తాం (భక్తి) ఆసాద్య యత్ న శీతం, చ న ఉష్ణం తాదృశం పరమమమృతం గచ్ఛేయ మిత్యన్వయః

**ప్రతిపదార్థము:**

గృహే శ్రియమివ - ఇంటియందు లక్ష్మీదేవి (సంపద) వలె

ప్రవాసే కామధేనుమివ - దేశాంతరమందు కామధేనువువలె

ధ్వాన్తే భాతిమివ - చీకటియందు వెలుగువలె

వనే ధృతిమివ - అడవిలో ధైర్యము వలె

యోజనే - యోగమునందు

బ్రహ్మనాడీవ - బ్రహ్మనాడి (సుషుమ్న)వలె

అస్మిన్ విషమ విషయగ్రాహ –ఈ వివిధ విషయవాసనలనెడి మకరములు (మొసళ్ళు) కల

సంసార సిన్ధౌ - సంసార సముద్రమున

నావమివ - దాటించు నౌకవలె నున్న

తే తాం భక్తిం ఆసాద్య - నీ సంబంధమగు ఆభక్తిని ఆశ్రయించి

యత్ న శీతం - యేది శీతలము కాదో

చ, న ఉష్ణం - మఱియు వెచ్చనిది కాదో(అనగా ఏది శీతోష్ణాదిద్వంద్వములకు అతీతమైనదో)

(తాదృశం) పరమం - అట్టి అత్యుత్కృష్టమైన

అమృతం(ధామ) - అమృతమయలోకమును గూర్చి

గచ్ఛేయమ్ - వెడలెదను

**భావము:-** హే సూర్యదేవా! నీ యందలి భక్తి గృహమందు సంపద వలె, విదేశమునందు కామధేనువు వలె, అంధకారమున వెలుగు (జ్యోతి)వలె, అరణ్యమున ధైర్యము వలె, యోగాభ్యాసము నందు సాక్షాత్కరించు

బ్రహ్మనాడివలె, వివిధములైన విషయవాసనలనెడి మకరమత్స్యాది జలజంతువులతో కూడిన భయంకరమైన సంసార సముద్రమున నావవలె సాధకులను లేదా భక్తులను సంరక్షించుచున్నది. దానిని నేను ఆశ్రయించి శీతోష్ణసుఖదుఃఖాది ద్వంద్వములకతీతమై పరమోత్కృష్టముగా ప్రకాశించు అమృత మయమగు నీ లోకమునకు చేరెదను.

**శ్రీపాదుక :** శ్రీ శంకరులు శివానందలహరిలో **' భక్తి జననీ భక్తార్భకం రక్షతి'** భక్తి తల్లివలె భక్తశిశువును సర్వదా సంరక్షిస్తూ ఉంటుందని చెప్పియున్నారు. అదేవిధంగా సాంబకవి ప్రస్తుత శ్లోకములో భక్తి భక్తులను సర్వకాల సర్వావస్థలలో ఆయా యవస్థలకనుగుణముగ తననా శ్రయించిన భక్తుల ననుగ్రహిస్తుందని, తానాశ్రయించిన చిద్భానుని భక్తియొక్క మాహాత్మ్యమును సాంబుడు ప్రస్తుతించినాడు. సాధకుడు ఇంటనున్నప్పుడు భక్తి గృహలక్ష్మిగా సంపదగా అతనికి సుఖానందములను సమకూరుస్తుంది. విదేశములకేగునప్పుడు కామధేనువు వసిష్ఠాది సాధకులైన బ్రహ్మర్షులను సంరక్షించినట్లు సంరక్షిస్తుంది. అంధకారమున దివ్యజ్యోతిగా దారి చూపిస్తుంది.

అరణ్యంలో ధైర్యమువలె, కష్టతరమైన యోగసాధనలో సుషుమ్నా (బ్రహ్మనాడీ) సాక్షాత్కారము వలె సిద్ధిని సమకూరుస్తుంది. వివిధ విషయవాసనలనబడే మకరమత్స్యాది జలజంతువులతో భయంకరమైన సంసారాంబుధిని తరింపచేసే నౌకవలె భక్తి తననాశ్రయించిన భక్తులను దరిచేర్చి జనన మరణ, కామ, క్రోధ, శీతోష్ణాద్యనంత ద్వంద్వముల కతీతమగు అమృతమయమగు మోక్షధామమునకు చేర్చుతుంది. కావున నేనీవిధమైన నీభక్తి నాశ్రయించి నిశ్చయముగా మోక్షధామమైన నీ యాదిత్య మండలమును తప్పక ప్రవేశింపబోవుచున్నానని కవి తన నిశ్చయము నీ శ్లోకమున ప్రకటించినాడు. భక్తితో పాటు **'రక్షిష్యతీతి విశ్వాసః'** తనను తనదైవము లేదా తానాశ్రయించిన భక్తి తప్పక సంరక్షిస్తారనే విశ్వాసము సాధకునకుండవలెనని గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥** నీ భక్తి నాయింట నిత్యము నడయాడు
శ్రీలక్ష్మియై యన్ని సిరులనిచ్చు
దేశాంతరపు కామధేనువై ననుగాచు
ధర్మమార్గమున నీ ధరణిలోన
చీకటి దివ్వెయై చిట్టడవిని ధైర్య
మైగాచు యోగము నందు నదియె
బ్రహ్మనాడి యగుచు బహువిషయగ్రాహ
సంసార సాగర సంతరణియు

**తే గీ॥** నైన తరణి శరణము నే నాశ్రయించి
పరము శీతోష్ణద్వంద్వాల పారగమ్ము
నైన యమృతాధి వాసము నందుకొనెద
భక్తమందార తిరమైన బత్తినిమ్ము ॥

---0---

## 21వ శ్లోకము

**అవతారిక:-** బాహిరముగ, ఆన్తరముగా బ్రహ్మాణ్డ పిణ్డాణ్డముల మూలకారణములను లయింపజేసి వానికి ముక్తి ననుగ్రహించుచున్న పరమాదిత్యుని అవ్యాజమైన అనుగ్రహము ఈ శ్లోకమున సంస్తుతింప బడుచున్నది.

**శ్లో॥** అగ్నీషోమావఖిలజగతః కారణం తే మయూఖైః
సర్గాదానే సృజసి భగవన్! హ్రాసవృద్ధిక్రమేణ
తావేవాన్త ర్విషువతి సమౌ జుహ్వతామాత్మవహ్నౌ
ద్వావప్యన్తం నయసి యుగపన్ముక్తయే ముక్తిభాజామ్॥

**అన్వయము:** హే భగవన్! (త్వం) అఖిలజగతః కారణం, తౌ అగ్నీషోమౌ మయూఖైః హ్రాసవృద్ధి క్రమేణ సర్గాదానే (సర్గాదాన నిమిత్తం) సృజసి, (తథా) అన్తర్విషువతి, ఆత్మవహ్నౌ సమౌ జుహ్వాతాం భక్తి భాజాం ముక్తయే, తౌ ద్వౌ అపి ఏవ యుగపత్ అస్తం నయసి.

**ప్రతిపదార్థము:**

హే భగవన్! – ఓ సూర్యభగవానుడా!

అఖిలజగతః – సమస్త ప్రపంచమునకు

కారణం – మూలకారణమైన వాడవు

త్వం – నీవు

అగ్నీషోమౌ – అగ్ని – చంద్రులను (ప్రాణాపానములను)

మయూఖైః – నీ చిత్రప్రభాకిరణములచే

హ్రాసవృద్ధిక్రమేణ – తగ్గుట, హెచ్చుట అనెడి క్రమముతో

సర్గాదానే సృజసి – సృష్టిలయములను లేదా నిశ్వసనోచ్ఛ్వాసములను సృష్టించుచున్నావు

తథా – అట్లే

అన్తర్విషువతి – హృదయాకాశమునందున్న విషువత్కాలాత్మకమైన

ఆత్మవహ్నౌ – ఆత్మాగ్నిలో

సమౌజుహ్వాతాం – (ప్రాణాపానములను) సమానముగా వ్రేల్చుచున్న

భక్తిభాజాం – భక్త జనుల యొక్క

ముక్తయే – మోక్షసిద్ధి కొరకు

తౌ ద్వావపి – ఆ ప్రాణాపానముల రెండింటిని

యుగపత్ – ఏక కాలములో (ఒక్కసారిగా)

అస్తంనయసి – అస్తమును పొందించుచున్నావు. (అస్తమింపజేయుచున్నావని భావము)

**భావము:** ఓ సూర్యదేవా! సమస్త ప్రపంచమునకు మాలకారణములైన ప్రాణాపానములను (బాహిరముగా) అగ్నీషోములకు నీయొక్క చిత్రప్రభాకిరణ ప్రసారముచే క్షయవృద్ధులనుపకల్పించుచున్నావు. అట్లే నీవు భక్తజనుల హృదయాకాశములో విషువత్కాలాత్మకమైన ఆత్మాగ్నిలో ప్రాణాపానములను ఏకకాలములో సమానముగా ఆహుతులనుగా వ్రేల్చి లయింపజేసి వారికి మోక్షముననుగ్రహించుచున్నావని భావము.

**శ్రీపాదుక:** అగ్నీషోమాత్మకముగా బ్రహ్మాణ్డమునకు, ప్రాణాపానరూపమున ఆంతర జగత్తులోను వృద్ధిక్షయములను కల్పిస్తూ చిద్భానుడు సర్గాదానములనుపకల్పిస్తున్నాడని ప్రథమార్థంలో నిర్దేశించబడినది. ఆకాశాదితృణపర్యన్తమైన బాహిరమైనసృష్టికి కారణముగా అగ్నీషోములను చెప్పుదురు. ప్రాతఃకాలమున ఉదయ సమయము అగ్నికి, అస్తమయవేళ సోమునకు వృద్ధికారణము. అవే వ్యుత్క్రమముగా వారికి క్షయకారణములుగా చెప్పుదురు. ఈ విధముగా తన ఉదయాస్తమయముల ద్వారా ఆదిత్యదేవుడు బ్రహ్మాణ్డ సృష్టికారకులైన సోమాగ్నులకు హ్రాసవృద్ధిక్రమములనుప కల్పించు చున్నాడని గ్రహించాలి.

కాలస్వరూప విధాతగా సంభావించిన పక్షంలో – హేమన్తం మొదలు గ్రీష్మ పర్యన్తం అగ్నికి వృద్ధికాలము సోమునకు క్షయకాలము అట్లే వర్షర్తువు మొదలు శరదృతు పర్యన్తం సోమునకు వృద్ధికాలము అగ్నితత్త్వమునకు క్షయకాలము ప్రాకృతికంగా కనిపిస్తుంది. దీనికంతకు కారణము బహిరాదిత్యుని కిరణప్రసారములోని తారతమ్యమేనని తాత్పర్యార్థము గ్రహించాలి.

దీనినే ఆంతరంగా సమీక్షిస్తే, ప్రాణశక్తి రూపములో చిదాదిత్యుని ప్రకాశమే ప్రాణాపానముల రూపములలో హృదయాదిగుదస్థాన పర్యన్తము సంచరిస్తూ, ఆన్తరంగా బాహిరంగా తుష్టిని పుష్టిని కలిగిస్తుంది. ఈ బహిరన్తర తుష్టికారణమైన మాధ్యంతర జీవితకాలము విషువత్కాలము. విషువత్తులలో

ప్రాణాపానములను హోమముచేసి లయింప చేయుటయే మోక్షము. ఈ విధమైన ప్రాణాయామ ప్రయోగ ప్రక్రియ భగవద్గీతలో–

**"అపానే జుహ్వతి ప్రాణం ప్రాణేఽపానం తథాపరే।**

**ప్రాణాఽపానగతీ రుద్ధ్వా ప్రాణాయామపరాయణాః॥** –అనే శ్లోకములో నిర్దేశించబడినది. (భ.గీ. 4/20)

పూర్వ (నాల్గవ) శ్లోకములో ప్రాణాపానములు పరస్పరము ఒకదాని నొకటి కబళించుటలో నిత్యము నిమగ్నమై యుంటాయని చెప్పుకున్నాం. వాని ప్రకోపానికి కారణము అగ్నిషోమీయతత్త్వమే సోమవృష్ట్యభావము చే జాఠరమైన అగ్ని ఉద్దీప్తమైశరీరాన్ని దహింపచేసి నశింపజేస్తుంది. అలానే అగ్ని ప్రజ్వలనం జాఠరాగ్ని ప్రదీపనము క్షీణిస్తే, సోమవృష్టి జనిత శైత్యము ప్రకోపించి శరీరం చల్లబడి కొయ్యబారి నిశ్చేతనమై నశిస్తుంది. కావున ఈ రెండు తత్త్వములను హ్రాసవృద్ధిక్రమ నిరోధము ద్వారా నియంత్రించాలి. ఆ చిదాత్ముని చిత్ప్రభా సమున్మేషము ఈ ప్రాణాయామ ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగిస్తూ, భక్త సాధకులను సంరక్షిస్తూ ఉంటుందని పరమార్థం గ్రహించాలి.

ఈ ప్రక్రియనిర్వహణమే – విషువత్తులో ఆత్మాగ్నిలో ఆ తత్త్వముల రెంటినీ సమానముగా ఏకకాలములో హోమం చేసి మోక్షభాజనులగు సాధకులకు ముక్తిననుగ్రహిస్తున్నావని శ్లోకములో 3,4 పాదాలలో సాంబుడు స్తుతి పరంగా వివరించేడని పిండితార్థంగా గ్రహించాలి. ఇక్కడ హోమపదమునకు – కార్యకారణప్రపంచ సంహారమని – అనగా కారణములైన అగ్నిషోమములు, ప్రాణాపానములు కార్యములైన బ్రహ్మాణ్డ,పిణ్డాణ్డముల యుగపదుపసంహారమే, సమగ్ర విలయమని వ్యాఖ్యానించబడింది. ఈ విధముగా పరమాత్మగా, జీవాత్మగా ఆదిత్యమూర్తి ఒకే విధముగా సృష్టి స్థితి లయపాలనానుగ్రహములను నిర్వర్తించుచున్నాడని తాత్పర్యము.

## అనువాద పద్యము

**సీ॥** అఖిల జగమ్ముల నగ్ని సోములు తాము
ప్రాణమపానమై త్రాణమిలను
సేయుచునున్నారు, చిన్మయూఖాలదౌ
హ్రాసవృద్ధి యుగళ మనెడి సరణి
ఆంతరమ్మున కూడ నాత్మాగ్నిలో తాము
విషువత్తులో నాత్మ విదులు వ్రేల్తు
రేక కాలమునందు నేకాహుతిగ రెంటి
నస్తమించు నటుల నాహుతులుగ

**తే॥ గీ॥** వారి నిట్లు నీ చిద్భాస బారజేసి
మోక్షసిద్ధిని సమకూర్చి వీక్షణముల
సర్వకాలంబులందున ఖర్వమైన
చిత్సుఖంబును గూర్తువో చిద్విలాస! ॥

---0---

## 22వ శ్లోకము

**అవతారిక:-** ఈ శ్లోకములో కవి స్తుతివిషయమున తన సామర్థ్యము నెందుకు కొరగానిదని, పురుషకార మెంతయు వ్యర్థమైనదని విన్నవించుచు శరణాగతి మాత్రము చేతనే సంతసించి, తనసుద్ధరింప వలసినదిగా ఆ చిదర్కమూర్తిని వేడుచున్నాడు.

**శ్లో॥** స్థూలత్వం తే ప్రకృతిగహనం నైవ లక్ష్యం హ్యనన్తమ్
సూక్ష్మత్వం వా తదపి సదసద్వ్యక్త్యభావాదచిన్త్యమ్ ।
ధ్యాయామీత్థం కథమవిదితం త్వామనాద్యన్తమన్తః
తస్మాదర్క! ప్రణయిని మయి స్వాత్మనైవ ప్రసీద॥

**అన్వయము:-** హే అర్క! తే స్థూలత్వం ప్రకృతి గహనం. అనన్తం నైవ లక్ష్యం హి. వా తే సూక్ష్మత్వం. తదపి సదసద్వ్యక్త్యభావాత్ అచిన్త్యం. ఇత్థం అనాద్యన్తం అవిదితం త్వాం అన్తః కథం ధ్యాయామి? తస్మాత్ ప్రణయిని మయి స్వాత్మనా ఏవ ప్రసీద.

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| హే అర్క! | - ఓ సూర్యభగవానుడా! |
| తే స్థూలత్వం | - నీ యొక్క స్థూల ప్రకృతి |
| ప్రకృతి గహనం | - స్వాభావికముగనే అబోధమై తెలియశక్యము కానిదై యున్నది. |
| అనన్తం | - నిస్సీమమైన ఆరూపము |
| నైవలక్ష్యమ్ హి | - పూర్తిగా చూడశక్యముకానిది గదా! |
| వా | - పక్షాంతరమున |
| తే సూక్ష్మత్వం | - నీ సూక్ష్మ స్వరూపము (యేది కలదో) |
| తదపి | - అది కూడా |
| సదసద్వ్యక్త్యభావాత్ | - సాకార నిరాకార రూపములుగా అభివ్యక్తము కానిదగుట వలన |
| అచిన్త్యమ్ | - ఊహించుటకు కూడ వలను పడనిది. |
| ఇత్థం | - ఈ ప్రకారముగా |
| అనాద్యన్తం | - ఆద్యన్తరహితమైన (మొదలు తుది లేని) |
| అవిదితమ్ | - ఏ విధముగను తెలియుటకు శక్యము కాని స్వరూపము కల |
| త్వామ్ | - నిన్ను |
| అన్తః ధ్యాయామి | - హృదయములో ధ్యానించు చున్నాను |
| తస్మాత్ | - అందువలన |
| ప్రణయిని మయి | - (భక్తుడను కావుననే) ప్రీతిపాత్రుడనైన నాయందు |
| స్వాత్మనా ఏవ | - నీవే స్వయముగా |
| ప్రసీద | - ప్రసన్నుడవు కమ్ము |

**భావము:-** ఓ సూర్యదేవా! స్వాభావికమైన నీ స్థూలరూపము నిస్సీమమై యనంతముగా భాసించుచున్నందున, అట్లే నీ సూక్ష్మరూపమత్యంత నిగూఢమై సాకారమా? నిరాకారమా? యని ఊహించుటకు కూడ శక్యము కాని దగుటచే యేవిధముగను తెలియబడని ఆద్యంతరహితుడవైన నిన్ను నేనెట్లు స్తుతింపగలను? (అది నాకు సాధ్యము కాదు) కావున నీవే నీ భక్తుడను, ప్రీతి భాజనుడనైన నాయెడ ప్రసన్నుడవు కమ్ము అని భావము.

**శ్రీపాదుక:-** తత్త్వమాలోచిస్తే భగవానుని భజించుట, అనగా స్తుతి పాఠాదులు, అర్చనాది కర్మలచే అర్చించుట అవివేకమనిపిస్తుంది. అతని యథార్థతత్త్వమును తెలుపవలసినదిగా అతనినే శరణువేడి అతని యను గ్రహమును పొందుట మాత్రమే మనము చేయగలిగినదని, తద్గతమైన అనన్యమైన ప్రపత్తి పూర్వకమైన శరణాగతియే మన కర్తవ్యమనే విషయము ఈ శ్లోకములో ప్రతిపాదింపబడినదని గ్రహించాలి.

ఆదిత్యభగవానుని యొక్క స్థూల సూక్ష్మ రూపములు రెండును అప్రమేయము అచిన్త్యమునైనవనెడి విషయము శ్లోకపూర్వార్ధములో (1,2 పాదములలో) ప్రస్తావింపబడినది. స్థూలత్వమనే పదము బ్రహ్మాణ్డములనే ప్రకాశింపజేయగల అతని విరాట్ స్వరూపమును బుద్ధిగోచరము గావిస్తుంది. అది కేవల భక్తిమాత్రైకసాధ్యమని కవి హృదయమును మొదటి పాదములోని **'అనన్తం' 'నైవ లక్ష్యం'** అనే పదాలు తెలియజేస్తాయి. ఈ విధముగా స్థూలత్వమాతని దేశతః అనన్త్యమును అపరిచ్ఛిన్న తత్త్వమును తెలియజేస్తున్నదని గ్రహించాలి. **'కరణాగోచరత్వం సూక్ష్మత్వమ్'** అనగా ఇంద్రియాద్యుపకరణములచే చూడశక్యము కానిదని సూక్ష్మత్వము నిర్వచింపబడినది.

ఆచిదాదిత్యమూర్తి యొక్క స్థూల సూక్ష్మ తత్త్వములు రెండును అనన్తము, అవిదితములు. అనగా అచిన్త్యము అగోచరములు అని చెప్పి కారణమును సదసద్వ్యక్త్య భావము అనగా ఉన్నదనిగాని లేదనిగాని వచింప శక్యము కాక పోవుటయేనని చెప్పబడినది.

పరమాత్మతత్త్వము అతని కరుణచే మాత్రమే పొందదగినదని **"యమైవేష వృణుతే తేన లభ్యః" అనే వేదప్రతిపాద్యమైన సిద్ధాంతము (చూ॥15వ శ్లోకవ్యాఖ్య)** ఉత్తరార్థములో ప్రతిపాదించబడుచున్నది.

అచిన్త్యము, అగోచరము, అనూహ్యాము, వక్తుమశక్యము వాక్కులకందనిదియు నైనందున నీ రూపమును నేను మాత్రమెట్లు ధ్యానింపగలను? **'కథం ధ్యాయామి?'** – అని తన అశక్తతను 3వ పాదములో ప్రదర్శించి – "కావున ఓ సూర్యదేవా! దయామయుడవైన నీవే నా యెడ ప్రసన్నుడవు కమ్మని' తన అనన్యశరణాగతిని, సంపూర్ణ స్వాత్మసమర్పణ భావమును తుది పాదములో **'ప్రణయిని మయి స్వాత్మనైవ ప్రసీద'** అని ప్రకటించినాడని గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥** స్థూలతత్త్వము నీది చూడగా లేనయ్య
అతిగహన మనంత మగుట చేత
సూక్ష్మతత్త్వము కూడ చూడలేరెవ్వరు
ఉండి లేనట్లుగా నుంట జేసి
తుది మొదల్దెలియదు మదినెట్లు తలతును
ఊహల కందదు, సోఽ_హమనుచు
ధ్యానమార్గమునందు ధ్యాసతో పయనించి
నిన్ను జేరెదనయ్య నిష్ఠతోడ

**గీ॥** అట్టి నానిష్ఠ సాగింప నండ నిలచి
అర్క! అధ్యాసనున్న నన్నాదుకొనుము
ప్రీతి భాజను జేసి సంప్రీతి గొలుప
స్వాత్మ భావనతో నన్ను సాకుమయ్య!॥

---0---

## 23వ శ్లోకము

**అవతారిక:-** భగవత్స్వరూపము, సదసద్వ్యక్త్యభావము, అనన్తము సూక్ష్మము, వాచామగోచరము, ఊహాతీతము నని పూర్వశ్లోకమున చెప్పబడినది. ఈ విషయమును తెలిసి కూడ స్తుతించుటకు ప్రక్రమించుట వ్యర్థము. అది కేవలము బాలురు శాస్త్రార్థము చేయుటకుద్యమించుట వంటిదగును కదా! అను శంకకు సమాధానముగా తన ప్రమేయము లేకుండగనే ఆదిత్యుడే శబ్దబ్రహ్మముగా స్వయముగా ఈ స్తుతిని ప్రవచింపచేయుచున్నాడని ఈ శ్లోకమును ప్రస్తావించుచున్నాడు.

**శ్లో॥ యత్తద్వేద్యం కిమపి పరమం శబ్దతత్త్వం త్వమన్తః**
**తత్సద్వ్యక్తిం జిగమిషు శనైర్లాతి మాత్రా కలాః ఖే ।**
**అవ్యక్తేన ప్రణవవపుషా బిన్దునాదోరితం సత్**
**శబ్దబ్రహ్మోచ్చరతి కరణవ్యంజితం వాచకం తే ॥**

**అన్వయము:-** త్వమ్ అన్తః యత్కిమపి పరమం వేద్యం శబ్దతత్త్వం తత్ సద్వ్యక్తిం జిగమిషుః మాత్రాకలాః అవ్యక్తేన ప్రణవవపుషా ఖే శనైః లాతి తతః బిన్దునాదోరితం సత్ తే శబ్దబ్రహ్మ కరణవ్యఞ్జితం వాచకం (స్వయం) ఉచ్చరతి॥

**ప్రతిపదార్థము:-**

త్వం – నీవు

అన్తః – లోపల
యత్కిమపి – ఒకానొక అనిర్వచనీయమైన
పరమం – సర్వోత్కృష్టమైన
వేద్యం – తెలియదగిన

శబ్దతత్త్వం - శబ్దోత్పత్తికి మూలకారణము (అయి ఉన్నావు)
తత్ - ఆ నీవు
సద్వ్యక్తిమ్ - సాకార రూపమును
జిగమిషుః - స్వీకరింపదలచినవాడవై
మాత్రాకలాః - అకారాది మాతృకాస్వరూప కళలను
అవ్యక్తేన - అభివ్యక్తముకాని
ప్రణవవపుషా - (పశ్యన్తియనెడి) ఓంకారాకృతిలో
ఖే - చిదాకాశమునందు
శనైఃలాతి - నెమ్మదిగా స్వీకరించుచున్నావు
తతో<u>ఽ</u>పి - పిమ్మట
కరణవ్యఞ్జితం - ఇంద్రియవ్యాపారములచేనభివ్యక్తమై
బిన్దునాదోదితం- బిన్దునాద రూపమున నిర్గమించిన
తే - నీ యొక్క
సచ్ఛబ్దబ్రహ్మ - సద్రూపమైన శబ్ద బ్రహ్మతత్త్వము
వాచకమ్ - (మధ్యమావైఖరులుగా) వాచక స్వరూపమును అనగా వాగ్రూపమును
స్వయం - స్వయముగా (తానుగా)
ఉచ్చరతి - ఉచ్చరితమై ప్రకటించుచున్నది.

**భావము:** ఓ చిదాదిత్యదేవా! నీవు మా హృదయాన్తరాళములలో సర్వోత్కృష్టముగా ప్రకాశించుచు పరా వాగ్రూపమున ఒకానొక అనిర్వచనీయమైన,(శబ్దబ్రహ్మముగా - ప్రణవముగా) విరాజిల్లుచున్నావు. నీవే సమస్తమైన శబ్ద ప్రపంచమునకు మూలోత్పత్తి స్థానమైన వాడవుగా తెలియదగి యున్నావు. అట్టి నీవు నీ యొక్క సాకారతను అభివ్యక్తిని ప్రకటింపదలచిన వాడవై చిదాకాశములో వర్ణమాత్రా కళాది మాతృకాశక్తులతో అవ్యక్త ప్రణవ స్వరూపమైన

పశ్యన్తీవాగ్రూపమును క్రమముగా గ్రహించుచున్నావు. ఆ పైన ప్రకాశవిమర్శాత్మకములైన బిన్దునాదములుగా శబ్దబ్రహ్మముగా మధ్యమావైఖరుల రూపమున ఆయాస్థాన ప్రయత్నకరణములచే స్వయముగా వాగ్వైభవము నుచ్చారణ మూలకముగా ప్రకటించుచున్నావని భావము.

**శ్రీపాదుక:-** ఆదిత్యుడే శబ్దబ్రహ్మమైన ప్రణవముగానావిర్భవించి ప్రాణవాయు సంగతిచే మిత్రావరుణ సదనమైన ఈ దేహమునందు ఆయాస్థానముల యందు అభిహితమై పరానాదముగా నావిర్భవించి, పశ్యన్తిగా యోగిమాత్రైక వేద్యమై తుదకు 63 వర్ణముల వాగ్వైఖరిగా ప్రకటింపబడుచున్న వైనము **"యాసామిత్రా వరుణ సదనాత్......."** అను 6వ శ్లోకములో సూత్రప్రాయముగా నిర్దేశించబడినది. ఆ అభివ్యక్తియొక్క వివరణమే ప్రస్తుత శ్లోకమున ప్రపంచింప బడుచున్నదని తెలుస్తుంది.

ప్రథమపాదంలో చిద్భానుడే వేదవేద్యమైన పరతత్త్వమని అది **"కిమపి పరమం శబ్దతత్త్వం'** – ఒకానొక అనిర్వచనీయమైన శబ్దరూపము. అదే ప్రణవాత్మకమైన నాదబ్రహ్మము. అది వేద్యము అనగా అవశ్యము తెలియదగినది. అతనినే **'తం త్వౌపనిషదం పురుషమ్'** అని పుంరూపమునుపకల్పించి శృతి నిర్దేశించినది. రూపరహితమైన తత్త్వమునకు పుంరూపమునుపకల్పించుట ఎందులకనే శంకా నిరాసార్థమై రెండవ పాదంలో – అది ఒక రూపమును పొందుటకు సంకల్పించి నెమ్మది నెమ్మదిగా హృదయాకాశములో మాత్రా,కళాస్వరూపమున అభివ్యక్తమైనదని చెప్పబడినది. అభివ్యక్తికి పూర్వము దానియొక్క అవ్యక్తమైన పరారూపము ప్రణవమనే శరీరము లేదా ఆకృతిని బిన్దునాదాత్మకముగా మధ్యమారూపమున సాక్షాత్కరించినదని మూడవపాదములో ప్రబోధింపబడినది. అదేశబ్దబ్రహ్మము ఆయా వాగింద్రియోప కరణముల యందు ప్రాణశక్తి సంగముచే నభిహతమై 6వశ్లోకములో ప్రతిపాదింపబడిన 63 వర్ణములతో

వాచకశబ్దములుగా వైఖరీరూపమున ప్రస్ఫుటమగుచున్నదని నాలుగవ పాదములో స్పష్టీకరించబడినది. శబ్దశాస్త్రమునందును, వేదమునందును ప్రవచింపబడిన వేదశాస్త్రవేద్యమగు ఈ నాదబ్రహ్మోపాసనమును ఆదిత్యపరముగా సాంబకవి ఈ శ్లోకము ద్వారా సూత్రప్రాయముగా బోధించినాడని గ్రహించాలి.

**'కిమపివేద్యం'** అనిర్వచనీయమైన ఆ పరతత్త్వము నాదబ్రహ్మమైన ప్రణవమేనని **(వేద్యం)** తెలియబడవలెనని భావము. దాని స్వరూపమును శబ్దశాస్త్రము, వ్యాకరణ వేదాన్త యోగ శాస్త్రముల సమన్వయ పూర్వకముగా సంభావిస్తేనే తెలుస్తుంది. శబ్దబ్రహ్మమైన ప్రణవ సాక్షాత్కార ప్రక్రియ శాస్త్రంలో

**"అకారశ్చ ఉకారశ్చ మకారో బిన్దురేవచ।**
**అర్ధచంద్రో నిరోధీచ నాదో నాదాన్త ఏవచ।**
**శక్తిశ్చ వ్యాపినీచైవ సమనైకాదశీ స్మృతా।**
**ఉన్మనాతు తతోఽతీతా తదతీతం నిరామయమ్॥**– అనగా అకార–ఉకార–మకార–బిన్దు–అర్ధచంద్ర–నిరోధీ–నాద–నాదాన్త శక్తి–వ్యాపినీ–సమనా– అనే ప్రణవానికి సంబంధించిన11 మాత్రలను చిదాకాశంలో యోగియైన సాధకుడు లయింపచేసినప్పుడు అతనికి పన్నెండవదైన 'ఉన్మనా' శక్తి అవ్యక్త ప్రణవరూపంలో సాక్షాత్కరిస్తుంది. ఈ అవస్థానుభవాన్ని **'దివ్యకరణబంధ'** – మనే సాధన చే మాత్రమే పొందగలము. ఈ విషయము గ్రంథాంతమునందలి 'స్థిత్వాకించిత్.. అనే 52వశ్లోక సంస్కృతవ్యాఖ్యానములో సూచింపబడినది. ఈ విధముగా శబ్దతత్త్వము యొక్క పరారూపము యోగమార్గములో మాత్రమే అనుభవింపదగినదని ప్రథమపాద తాత్పర్యము.

రెండవ పాదములో అది సద్వ్యక్తి అనగా సత్పదార్థమనిన్నీ ఆ పరారూపము **"జిగమిషుః"** ప్రయాణ సంకల్పముతో దహరాకాశంలో హంసల రూపమున ప్రాణశక్తి సహాయంతో సంచరిస్తూ మాత్రా కళా సంగ్రహముతో పశ్యన్తీ రూపముగా యోగిమానస ప్రత్యక్షముగా విస్తుందని

ద్వితీయ పాదంలో చెప్పబడింది. శబ్దతత్త్వము యోగశాస్త్రములో ప్రసరణశీలమైన 'హంస' శబ్దముచే కీర్తింపబడినది.

**'శాస్త్రం శబ్దాత్మకం సర్వం - శబ్దోహంసః ప్రకీర్తితః'** శాస్త్రమంతయు శబ్దస్వరూపమే ఆ శబ్దము 'హంస' నామధేయముతో కీర్తించబడినది. అది నాదాత్మకమైన పరాబీజమని - **'నాదాఖ్యం యత్పరం బీజం'** - అదియే వేద్యమని ప్రథమపాదాదిలో సూచింపబడి. అదియే **'జిగమిష'** అనగా సుషుమ్నా పథంలో హంసలరూపమున యాతాయాతములను నిర్వర్తిస్తూ మాత్రా కళాత్మకములైన వర్ణములను **'శనైః లాతి'** నెమ్మదిగా గ్రహిస్తుంది. అని చెప్పబడిన వచనాన్ని పరికిస్తే నిరవయువి, సూక్ష్మతరమునగు పరాబీజమునకు 'జిగమిష' అనగా ప్రయాణ సంకల్పము. అగ్రాహ్యాము, నిత్యము, అవ్యయము నైన దానికి గ్రహణసామర్థ్యమెట్లు పొసగును అనే సంశయం - **"యస్యరూపం శరీరంవా నాస్తి వర్ణః క్రియా తథా।స కథం గృహ్యతే సూక్ష్మో హ్యగ్రాహ్యో నిత్యమవ్యయః"** అని ఉదయిస్తుంది.

ఇదంతయు అఘటనఘటనా పటీయసియైన వీరాదిత్యుని యొక్క భర్గతేజస్సు యొక్క ప్రభావము వలన సుసాధమేనని **భర్గశిఖోపనిషద్వచనము-**

**నైష వర్ణో న వా శబ్దః న చైవాయం కలాత్మకః**
**కేవలః పరమానందో వీరో నిత్యోదితో రవిః ।**
**నాస్తమేతి నచోదేతి న శాన్తో న వికారవాన్**
**సర్వభూతాన్తరచరో భానుర్భర్గ ఇతిస్మృతః॥**-సర్వ భూతాన్తరాత్మగా సుషుమ్నా పథంలో హంసల రూపంలో చరించే చిద్భాను ప్రకాశము భర్గమనే పేరుతో ధ్వని వర్ణపద పరిధులనతిక్రమించి, మాత్రాకళాత్మక వర్ణములను గ్రహిస్తూ, వాని కన్న భిన్నముగా కేవల చిదానంద స్వరూపముతో వీరాదిత్యుడుగా, ఉదయాస్తములు లేని నిత్య నిర్వికార శాన్త స్వరూపుడుగా ప్రకాశిస్తూ ఉంటుందని చెప్పబడినది. ఆదీవ్యత్ప్రకాశమే **'కిమపి పరమం వేద్యం'** - అనే పదాలచే నిర్దేశింపబడినదని గ్రహించాలి దానికసాధ్య మేదియును లేదు. పరబ్రహ్మస్వరూపమగుటచే దానికి సంకల్పవికల్పాదులు,

గ్రహణాదానములు అన్నియును అన్వయించు నని భావము. కావుననే దానికి **'జిగమిష'** ప్రయాణింపవలెనను ఇచ్ఛ, కళామాత్రాది వర్ణగ్రహణసామర్థ్య ప్రకాశనములు రెండవ పాదములో చెప్పబడినవి. ఉపనిషచ్ఛృతి దాని సంకల్పము నొకచో – **'తత్సృష్ట్వాతదేవాను ప్రావిశత్' 'జీవాత్మనానుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి "** ఇత్యాదివాక్యములలో వర్ణించినది, ఇదియే దాని 'జిగమిష'గా కూడా భావించవచ్చును. ఈ జీవాదిత్యుని భర్గప్రకాశమే పరాపశ్యన్తీ స్వరూపములను సుషుమ్నా పథంలో దర్శింప గలుగుచున్నారు. దీనిని వ్యాఖ్యాత తనదైన త్రిపురభైరవీ స్తుతిలోని–

**" ప్రకాశమానా ప్రథమే ప్రయాణే–**
**ప్రతి ప్రయాణే ప్యమృతాయమానా ।**
**సౌషుమ్న సంచారగతి స్త్వమేవం**
**నాడీస్సుపూర్ణాః పరిపశ్యతీతి॥**

**'త్వం యోగి భిర్దృష్టనిజస్వరూపా'** – ఇత్యాది శ్లోకాల్లో ప్రస్తావించినాడు. ఈ విధంగా చిత్ప్రకాశంలో భర్గతేజముగా ప్రకాశిస్తున్న చిదాదిత్యుడు పరారూపమును మొదట ప్రకటించి, తరువాత మధ్యమగా అనుభవ యోగ్యత్వమును కల్గించి, పిమ్మట కళామాత్రాది రూపములలో వర్ణములను గ్రహించి, శబ్దార్థ స్వరూపంతో వైఖరిగా సాక్షాత్కరింపచేస్తాడు.

**"మీయన్తే పరిచ్ఛిద్యన్తే ఇతి మాత్రాః"** అకారాది స్వర పరతంత్రములై పరిచ్ఛిన్నముగా నుచ్చరింపబడే **'అకారాదిక్షకారాంత'** వర్ణములు మాత్రలనబడుతాయి. స్వతంత్రముగానూ – **" కళా విశదాం వైఖరీం వాచకశక్తిం లాన్తీతికలాః "** – వాచకత్వశక్తిని వైఖరీ రూపమున బహిర్గతముగావించు శక్తిమత్స్వరములు అకారాది విసర్గాంతము కళలు లేదా స్వరములనబడును. వీటిని సంగ్రహించి మధ్యమ గాన భివ్యక్తమైన శబ్దబ్రహ్మము మూలా ధారాది కంఠతాలు దన్తౌష్ఠాది స్థానములందభిహతమై ఉచ్చారణ రూపమున వెలువడు శబ్దబ్రహ్మ వివర్తము వైఖరియనబడును.

**దివ్యకరణ బంధముతో** పరాపశ్యన్తీ మధ్యమా వైఖరులను సందర్శించుట శబ్దబ్రహ్మ సాక్షాత్కారము. **"దివ్యంతు కరణం కృత్వా తత్త్వస్యోచ్చారణం కురు"** - అనే యీ దర్శన ప్రక్రియ ప్రస్తుత స్తోత్రమున ప్రదర్శించబడినదని సారాంశము. ఈ విధమైన శబ్దబ్రహ్మసాక్షాత్కారము పరబ్రహ్మప్రాప్తికి కారణమగుచున్నదని **''శబ్దబ్రహ్మణి నిష్ణాతః పరంబ్రహ్మాధిగచ్ఛతి"** అనే అభియుక్తోక్తి ప్రబోధించుచున్నది.

## అనువాద పద్యము

**సీ॥** గుప్తరూపము తోడ గోప్తవై నిను నీవు
ప్రకటించుకొనదల్చి ప్రణవ తనువు
దాల్చి పశ్యన్తిగా దయజూపి కళలను
మాతృకలుగ నీవు మలచికొనియు
శబ్దమే బ్రహ్మమౌ శబలితరూపము
చిన్నభస్థుండవై స్వీకరించి
మధ్యమ వైఖరీ మాధ్యమంబుల నీవు
వెల్లడి యైనట్టి వెలుగు వేల్పు ॥

**గీ॥** నిన్ను దర్శించు మార్గము నీవ యనెద
దివ్యకరణంపు బంధమ్ము నవ్య ఫణితి
తొలుత పశ్యన్తి, వైఖరి మలుపు గొనియు
శాబ్దిక బ్రహ్మ గానిన్ను చాటు గాదె! ॥

---0---

## 24వ శ్లోకము

**అవతారిక:-** ముప్పొద్దులలో ప్రకాశించు సూర్యభగవానుని ప్రకాశమును జగత్సృష్టి స్థితి లయకారణముగ, వేదత్రయితో నుపమించి సాంబుడీ శ్లోకములో సంస్తుతించుచున్నాడు.

**శ్లో॥ ప్రాతః సంధ్యారుణకిరణభాక్ ఋఙ్మయం రాజసం యత్**
**మధ్యేచాపి జ్వలదివ యజుః శుక్లభాః సాత్త్వికం వా ।**
**సాయం సామాస్తమితకిరణం యత్తమోల్లాసి రూపం**
**సాహ్నః సర్గస్థితిలయవిధా వాకృతిస్తే త్రయీవ॥**

**అన్వయము:-** యత్తే రూపం ప్రాతః సంధ్యారుణ కిరణభాక్ రాజసం, అపి చ మధ్యే జ్వలదివ శుక్ల భాః యజుః సాత్త్వికం సాయం అస్తమితకిరణం తమోల్లాసి సామరూపం అస్తి అహ్నః సా (తే) ఆకృతిః (జగతః) సర్గస్థితిలయ విధౌ త్రయీవ (రాజతే ఇతి భావః)

**ప్రతిపదార్థము:-**

(ఓ సూర్యదేవా!)

| | |
|---|---|
| యత్ తే రూపం | - యే నీ మణ్డలాకృతి |
| ప్రాతః | - ప్రభాతకాలమున |
| సంధ్యారుణకిరణభాక్ | - అరుణకిరణరంజితమై |
| ఋఙ్మయం | - ఋగ్వేదాత్మకమైన |
| రాజసం | - రాజసరూపముతో రాజిల్లుచున్నదో |
| మధ్యే | - మధ్యాహ్నవేళలో |
| అపి | - (కూడ) అదియే |
| జ్వలదివ | - ప్రజ్వలించుచున్నదివలె |
| శుక్లభాః | - తెల్లని వెలుగు కలదై |
| యజుః | - యజుర్వేదాత్మికమైన |
| సాత్త్వికం | - సత్త్వగుణప్రధానమైనదిగా ప్రకాశించుచున్నదో |
| చ సాయం | - మరియు సాయం సమయములో |
| అస్తమితకిరణం | - అస్తంగతమగుచున్న అరుణకిరణ భాసితమై |
| తమోల్లాసి | - తమోగుణమునుద్దీపింపజేయు |
| సామరూపం(అస్తి) | - సామవేదాత్మకరూపమును ధరించుచున్నదో |

అహ్నః సా (తే) ఆకృతి – దినకరమగు ఆ నీ స్వరూపము
(జగతః)సర్గస్థితిలయవిధౌ – జగత్సృష్టిస్థితిలయములను నిర్వర్తించుటలో
త్రయీవ – ఋగ్యజుస్సామాత్మకమగు వేదమువలె (భాసించుచున్నదని భావము)

**భావము:-** హే ఆదిత్య దేవా! ప్రాతఃకాలమున ప్రభాతసంధ్యారుణిమతో శోభిల్లు నీరాజసరూపము ఋగ్వేదాత్మకము, మధ్యాహ్నవేళలో తెల్లని వెలుగుతో ప్రకాశించుచున్న నీ యొక్క సాత్త్వికమూర్తి యజుర్వేదాత్మకమైనది, అట్లే సాయంకాలమున అస్తంగతమగుచున్న నీతమోఽరుణమూర్తి సామవేదాత్మకమైనది. ఈ విధముగా దివసకరములైన నీ మూర్తిత్రయము వేదత్రయివలె జగత్సృష్టిస్థితిలయకరణదక్షమై రాజిల్లుచున్నదని భావము.

**శ్రీపాదుక:-** చిద్భానుని యొక్క స్వరూపమును మూడు సంధ్యలలో ముప్విధములుగా మూడువేదముల రూపమున ప్రకాశిస్తున్నట్లు, అదియే సృష్టి స్థితి లయములకు కారణమగుచున్నదని భాహ్యార్థంగా భాసిస్తున్నా ఈ శ్లోకంలో రహోయాగ రూపమైన ఆదిత్యుని అంతరార్చన గోచరిస్తుంది. రహస్యములు గోప్యములు, గురుముఖైక వేద్యములునైన శాస్త్రవిషయములు కొన్ని ప్రత్యక్షంగా కాకుండ ధ్వన్యాత్మకంగా చెప్పబడతాయి. వాటిని సాధకులు యథాశక్తి యథామతి గ్రహించాలి.

సాధకుని ఉపాసనా తీవ్రత కారణంగా అతని ప్రాణశక్తి తురీయావస్థకు చేరి సుషుమ్నాపథ సంచారియై ప్రధానంగా హృదయ, తాలు, బాహ్య ద్వాదశాన్త స్థానములలో అనుభవగోచర మవుతుంది. దీనినే చిద్భానుని చిత్ప్రకాశంగా సంభావించాడు సాంబుడు. తురీయమైన ప్రాణశక్తి చిద్భాను ప్రకాశముగా హృదయస్థానమున తన ప్రస్థానానికుపక్రమించడం ప్రాతఃసంధ్య లేదా ప్రభాత సంధ్య లేదా తొలి సంజగా చెప్పబడుతున్నది. అదే ప్రాణశక్తి తాలుస్థానమునకు చేరి, యటనుండి మరలనూర్ధ్వముఖముగా ప్రయాణించడానికుపక్రమిస్తుంది. ఈ సమయమే మాధ్యాహ్నిక సంధ్యగా

నిర్దేశించబడినది. అటనుండి బయలుదేరి ద్వాదశాన్తమనే జ్ఞాన (నాడీ) కేంద్రాన్ని చేరుకున్న సమయం సాయంసంధ్యా నామధేయాన్ని సంతరించుకుంటుంది.

ఈ మూడు సంధ్యలలో ప్రకాశించే చిద్భానుస్వరూపాన్ని సాంబకవి రజస్సత్త్వ తమోగుణాత్మకంగా వేదత్రయితో పోల్చి ఈ శ్లోకంలో సంస్తుతించాడనిపిస్తుంది.

చిదాదిత్యుని యొక్క ఆహ్నికమైన చిత్ప్రకాశము సృష్టిస్థితిలయములను మూడు సంధ్యలలో వేదత్రయీరూపముతో నిర్వహిస్తున్నదని ప్రతిపాదించబడినది.

ప్రభాతసంధ్యలో హృద్వినిర్గతమైన ప్రాణశక్తి అరుణారుణమై తనదైన రజోగుణ ప్రాభవముతో ఋగ్వేదము వలె సృష్టికార్యోన్ముఖమౌతున్నదని ప్రథమపాదానికి అర్థం చెప్పుకోవాలి. ఋక్ఛందస్సు గంభీరంగా ఉంటుంది. దానిని మందాధికారులు శీఘ్రంగా గ్రహించలేరు. కావున దానిని రజోగుణ ప్రధానమైనది(రాజసాత్మ) అని నిర్దేశిస్తాడు కవి. ఈ విధమైన రాజసాత్మకమైన ఋగ్వేద ప్రచోదితమైన చిద్భానుని ప్రాణశక్తి ప్రభాతవేళలో సృష్టికర్మకుపక్రమిస్తుంది. ఈ తత్త్వము **"ప్రాతః సంధ్యారుణ కిరణభాక్ ఋఙ్మయం–రాజసం"** అనే పదములతో మొదటి పాదంలో కీర్తించబడింది.

అదే ప్రాణశక్తిప్రకాశము మధ్యాహ్నసమయంలో శుక్లకాంతితో దేదీప్యమానంగా ప్రజ్వలిస్తూ ప్రపంచమునంతను సమగ్రముగా యథాయథంగా దర్శింపజేస్తుంది. ప్రౌఢపదబంధంతో కర్మకాణ్డను శుద్ధసత్త్వగుణ సమన్వితంగా ప్రబోధిస్తూ సాత్త్వికప్రకృతిని అనుభవగోచరము గావించేది యజుర్వేదము. యజుర్వేద ప్రతిపాద్యమైన కర్మకాణ్డ సాత్త్వికప్రధానమైన దేవతలకు పరమాహ్లాదమును కలిగించి వారి అనుగ్రహానికి సాధకులకును పాత్రులను గావిస్తుంది.

దేవతానుగ్రహమువలన లోకములు సుభిక్షములై సుఖ శాంతులతో వర్ధిల్లుతాయి. ఇదే విషయాన్ని గీతాస్మృతి – **"దేవాన్ భావయతానేన .....**

అనే (3-11) శ్లోకంలో పరోక్షంగా వివరిస్తుంది. ఈ విధంగా యాజుషమంత్రములు సత్త్వగుణసంపన్నములై దేవతానుగ్రహప్రాప్తికి తద్వారా లోకసంస్థితికి హేతుభూతము లగుచున్నవి. ఆవిధమైన యజుర్వేదాత్మకత్వమును సంతరించుకుని చిద్భానుని మాధ్యాహ్నిక ప్రకాశము శుద్ధసత్త్వగుణసంశోభితమై స్థితికారణమగుచున్నదనే విషయం, రెండవపాదంలోని **"మధ్యేచాపి జ్వలదివ యజుః శుక్లభాః సాత్త్వికం యా"** అనే పదబంధముచే సంస్తుతింపబడినది.

హృన్మధ్యమునుండి ప్రసరించిన ప్రాణశక్తి ఊర్ధ్వముఖీనమై ద్వాదశాన్తపర్యన్తము ప్రస్థానమును సాగించి అక్కడ ప్రాణాదిసంస్కారములు విగళితములు కాగా, ఉపశాన్తావస్థలో తన ప్రకాశమునుపసహరించుకుని, సర్వసంస్కారములు అణగారి ద్వైతాద్వైత ప్రపంచమంతయు నశిస్తుంది. ఇది సాయంసంధ్యగా ఆంతరోపాసనలో చెప్పబడినది. ఈ ఉపశాన్తావస్థనే తామసమైన సామస్వరూపంగా **"సాయం సామస్తిమితకిరణం యత్తమోల్లాసిరూపం"** అని మూడవపాదంలో ప్రకీర్తింపబడినది. సామవేదం గానగుణ ప్రధానమగుటచే అర్థము ప్రస్ఫురింపదు. అదే కిరణముల సంకోచముగా తమోవిజృంభణముగా ఉపశాన్తస్థితిగా సంభావింపబడినదని తాత్పర్యము.

ఈ విధముగా ప్రాతఃకాల మందు చిద్భాను ప్రకాశము ఋగాత్మకమై స్తుతి ప్రధానమై రజోగుణముతో రాజిల్లుచున్నదై, మధ్యాహ్నము నందు సత్త్వగుణ సమన్వితమై, యజుర్వేదాత్మకమై కర్మానుష్ఠానమును ప్రతిపాదించి, తల్లభ్యమైన దేవతానుగ్రహఫలమైన లోకసంస్థితి హేతుభూతమై సాయంకాలమున విశ్రాన్తి ప్రధానమై తమఃసముల్లాసి సామవేదాత్మకమై లయస్వరూపమైన ముక్తి ప్రదమగుచున్నదనే ఆంతరోపాసన మీ శ్లోకమున అభివ్యక్తమైనదిగా గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥** ప్రాభాత సంధ్యలో పారాడు కిరణాలు
అరుణారుణంబులై యలరుచుండు
ఋఙ్మయం బైనయా ఋజురాజసపురూపు
మధ్యాహ్న వేళలో మారిపోవు
తెల్లని వెలుగుల వెల్లువై వినువీధి
యాజుషవేదమై యలరు నదియె
సాత్త్వికంబగు రూపు సాయంపు సంజలో
నస్తంగతంబయి యరుణకాంతి

**గీ॥** తామసంబగు దీప్తితో సామవేద
రూప ముధరించి యణగార్చు పాపరాశి
అర్క! నీరూప మిట్లుగా నహరహమ్ము
సర్గసంస్థితి లయముల సాకు జగతి॥

---0---

## 25వ శ్లోకము

**అవతారిక:-** ఇంతవరకు ఆదిత్యుని మండలమును కీర్తించి, ప్రస్తుతమాతని బాహిరమైన అనగా పరిదృశ్యమానమైన రూపమును సప్తసప్తి (సప్తాశ్వరథారూఢుని) గా, ఏకాశ్వునిగా సంస్తుతించుచున్నాడు.

**శ్లో॥** యే పాతాలోదధిమునినగద్వీపలోకాధి బీజ-
చ్ఛన్దోభూత స్వరమఖనదత్సప్తసప్తిం ప్రపన్నాః।
యే చైకాశ్వం నిరవయవ వాగ్భావమాత్రాధిరూఢం
తే త్వామేవ స్వరగుణకళావర్జితం యాన్త్యనశ్వమ్॥

**అన్వయం:-** యే, పాతాళ – ఉదధి – ముని – నగ – ద్వీప – లోక – ఆధి – బీజ – ఛన్దో – భూత – స్వర – మఖ – నదతః సప్తసప్తిం, ప్రపన్నాః ; యేచ నిరవయవ వాక్ – భావ మాత్రా అధిరూఢం ఏకాశ్వం (త్వాం) ప్రపన్నాః, తే, స్వర – గుణ – కళావర్జితం – అనశ్వం త్వామేవ – యాన్తి ॥

**ప్రతిపదార్థం:-**

యే – యేసాధకులు (భక్తులు)
పాతాళ – సప్తపాతాళములు (సప్త అధోలోకములు)
ఉదధి – సప్తసముద్రముల
ముని – సప్తమహర్షుల
నగ – సప్తకులపర్వతముల
ద్వీప – సప్తద్వీపముల
లోక – సప్తలోకముల
ఆధి – సప్తమానసిక వ్యధల
బీజ – సప్తబీజముల
ఛన్దః – సప్తఛన్దస్సుల
భూత – సప్తభూతముల
స్వర – సప్తస్వరముల
మఖ – సప్తయజ్ఞముల
నదత్ – వీనిచే శబ్దాయమానమైన
సప్తసప్తిం – నీ యొక్క సప్తాశ్వసమన్వితమైన స్వరూపమును
ప్రపన్నాః – ప్రపత్తిపూర్వకముగా శరణు జొచ్చినారో
చ–యే – మరియు నెవ్వరు
నిరవయవ – అవయరహితమైన
వాగ్భావమాత్రాధిరూఢం – వాగ్రూపమునందిన పశ్యన్తీ స్వరూపము ధరించిన

| | |
|---|---|
| ఏకాశ్వం | – ఏకాశ్వారూఢమైన నీరూపమును |
| ప్రపన్నాః | – శరణుజొచ్చి సేవించుచున్నారో |
| తే | – వారు |
| స్వర,గుణ,కళావర్జితం | – స్వర–గుణ–కళాతీతమైనదియు |
| అనశ్వం | – అశ్వోపాధివినిర్ముక్తమునైన |
| త్వామేవ | – నీ నిర్గుణస్వరూపమునే |
| యాన్తి | – పొందుచున్నారు. |

**భావము**: – ఎవరు అతలాది సప్తపాతాళములచే, క్షీరాది సప్తసముద్రములచే, అత్ర్యాది సప్తమహర్షులచే మహేంద్రాది సప్తకులపర్వతములచే, జంబూ మొదలైన సప్తద్వీపములచే, మోహాది సప్తవిధమనోవ్యథలచే, యవాది సప్తబీజములచే, గాయత్ర్యాది సప్తచ్ఛందస్సులచే, షడ్జాది సప్తస్వరములచే, అగ్న్యాధానాది సప్తయజ్ఞములచే, ప్రతీకాత్మముగా ప్రవచింపబడిన నీయొక్క సప్తాశ్వసమన్వితమైన రూపము నాశ్రయించుచున్నారో (వీరందరు ప్రాపంచిక విషయములనాశించెడి సగుణోపాసకులు) మరియు నెవ్వరు నిరవయవము, నిరుపాధికము కేవలము సూక్ష్మతరమైన వాగ్రూపములో పశ్యన్తిగా ప్రకాశించుచున్న ఏకాశ్వయుతునిగా నిన్ను నిష్కాములై శరణుజొచ్చుచున్నారో (వీరు నిష్కాములైన నిర్గుణోపాసకులు) వారందరు (ఈ యిరుతెగలకు చెందిన ఉపాసకులు కూడ) స్వరగుణకళాతీతమైన అనశ్వమైన అనగా నిరుపాధికమైన నీయొక్క ఆ రూపమును (పరాదిత్య పరబ్రహ్మరూప సాయుజ్యమునే) పొందుచున్నారని భావము.

**శ్రీపాదుక:-** ఈ శ్లోకము చిద్భానునియొక్క పరబ్రహ్మస్వరూప వర్ణనముతో పాటు అతని అవ్యాజ కరుణాపూరత్వము ఆలంకారికమైన కావ్యభాషలో అత్యంతరమణీయముగా ప్రతిపాదింపబడినది.

కోరిన కోరికలను అనుగ్రహించుట దేవతల స్వభావము. కావున సకాములైన భక్తులు ఆయా కోరికలననుగ్రహించు దేవతామూర్తులను లోకములో నారాధించుచున్నారు. ఈ విధమైన ఉపాసన సగుణోపాసనమనబడును. ఇది భక్తి మార్గము.

**"త్యాగేనైకే అమృతత్వమానశుః"** అను శ్రుతిబోధననుసరించి కొందరు నిష్కాములై నిరుపాధికమైన పరబ్రహ్మమునుపాసించి మోక్షమును పొందుచున్నారు. వీరుజ్ఞానులు. వీరి ఉపాసన నిర్గుణోపాసన నిరుపాధికమైనది.

ఈ ఇరు తెగలకు చెందిన సాధకులు ఒకే ఆదిత్య దేవుని తమతమ భావములకనుగుణముగా ఉపాసించుచున్నారు. అందరకూ కరుణావరుణాలయుడైన చిద్భానుడు ఇహపరములైన భుక్తిముక్తులననుగ్రహించు చున్నాడనే విషయ మీ శ్లోకములో చక్కగా వివరింపబడినది.

ప్రథమార్థములో సకాములైన సాధకులు ఆదిత్యభగవానుని సప్తసప్తి రూపమున సంభావించిన వైనము సమగ్రముగా విశదీకరింపబడినది. సప్తియనగా అశ్వమని అర్థము. అశ్వపదమునకు **"శ్వః న భవతీతి అశ్వః "** రేపటికి ఉండనిది అనగా అశాశ్వతమైనది లేదా మిథ్యాభూతమైనది అని అర్థము. ఈ విధముగా అశ్వాపరపర్యాయమైన 'సప్తి' పదము జగత్తుకు ప్రతీకయని భావము. **'సప్తసప్తి' –** సప్తాశ్వములు కలవాడు. సప్తభువనాధీశుడు జగత్ప్రకాశకుడు – సూర్యభగవానుడు అనే అర్థం సిద్ధిస్తుంది. **"సప్తసప్తిం ప్రపన్నాః"** అట్టి సూర్యభగవానుని సకాములైన సగుణోపాసకులు ఆశ్రయించుచున్నారని భావం. సప్తసప్తియైన సూర్యదేవుని యొక్క విశ్వరూపము సప్తసంఖ్యా సమన్వితముగా ప్రపంచింపబడిన వైనము అత్యద్భుతము. అల్పాక్షరములలో అనల్పార్థబోధకమై విరాజిల్లినదనుట అతిశయోక్తి కాబోదు.

సప్తసంఖ్యావత్త్వము ఒకే సమస్త పదములో – **"పాతాళ ఉదధి – ముని, నగ, ద్వీప, లోక, ఆధి, బీజ, ఛన్దో – భూతస్వర, మఖనదత్త" –**

ని చెప్పబడినది. ఈ ఒక్క పదములో సప్తసంఖ్యా పరివ్యాప్తమైన విశ్వస్వరూపమే సంభావించబడుట చమత్కారమని కావ్య శాస్త్ర పరిభాషలో చెప్పనొప్పును. ఈ విషయమును కొద్దిగా వివరించుకుందాం.

**సప్తపాతాళములు:-** అనగా అధోలోకములు సప్తసంఖ్యాకములు ఇవి - 'అతల-వితల-సుతల-తలాతల-మహాతల-రసాతల- పాతాళము'లని పద్మపురాణములోను; 'అతల-వితల-నితల- గభస్తిమత్-మహాతల-సుతల పాతాళములని విష్ణుపురాణములోను, 'అతల-సుతల-వితల-గభస్తిమత్-మహాతల-రసాతల పాతాళములని అగ్నిపురాణములోను యత్కించిద్భేదపూర్వకముగా చెప్పబడినవి. సప్తసంఖ్యాత్వము సర్వత్ర సమానమే యని గ్రహించవలెను.

**సప్తసముద్రములు:- 'లవణేక్షు సుధా సర్పిర్దధిక్షీరజలాంతర ఏవంలోకేషు చాహత్య సముద్రాస్సప్తకీర్తితాః** అని సప్తసముద్రాలు ప్రసిద్ధంగా చెప్పబడినాయి. అట్లే

**సప్తర్షులు:-కశ్యపోఽ త్రిర్భరద్వాజో విశ్వామిత్రోఽ థ గౌతమః।**

**జమదగ్నిర్వసిష్ఠశ్చ సప్తైతే ఋషయః స్మృతాః॥** అని కీర్తింపబడినారు. వీరికి అర్ఘ్యప్రదానం చేస్తే దయామయులైన వీరు మన పాపాలన్నిటినీ తొలగిస్తారని ఋషి పంచమీవ్రతకల్పంలో **'దహన్తు పాపం సర్వం మే గృహ్ణన్త్వర్ఘ్యం నమోనమః"** అని చెప్పబడింది.

**సప్తనగములు:-** అనగా సప్తకులపర్వతాలు -

**మహేంద్రో మలయః సహ్యః శుక్తి మానృక్షపర్వతః**

**వింధ్యశ్చ పారిజాతశ్చ సప్తైతే కులపర్వతాః॥** అని చెప్పబడినాయి. ఈ విధంగానే

**సప్తద్వీపాలు : 'జంబూశాకకుశక్రౌఞ్చశాల్మలీప్లక్షపుష్కరాః'** అని వర్ణింపబడినాయి. **'భూ-ర్భువ-స్సువ-ర్మహో-జని-స్తప-స్సత్య'** - లోకాలు **సప్తలోకాలుగా** ప్రసిద్ధములు.

**సప్తఆధులు:** ఆధియనగా మనోవ్యధ అని అర్థం. **'పుంస్యాధిర్మానసీవ్యధా'**– అని కోశము కాగా '**మోహోూమదశ్చమాత్సర్యం విషాదః క్రోధ ఏవచ। భయంచ హర్షణం చైవ దేహే సప్తాధయః స్మృతిః। అని** సప్తమనోవ్యధలు పేర్కొనబడినవి.

**సప్తబీజములు:**- యవ, ధాన్య, ముద్గ, మాష, ప్రియఙ్గు సర్షప – తిలలు సప్తధాన్యములుగా పరిగణింపబడినవి.

**సప్తఛందస్సులు:**-గాయత్రి – ఉష్ణిక్ – అనుష్టుభ్ – బృహతీ – పంక్తి – త్రిష్టుభ్ జగతి – అనునవి **సప్త వైదిక ఛందస్సులు**.

**సప్తభూతములు:**- పృథివ్యాపస్తేజోవాయ్వాకాశములు పంచభూతములు వీనికి మహదహంకారతత్త్వములను చేర్చినచో **భూతసప్తకము** సిద్ధించునని తాత్పర్యము.

భూత శబ్దము చేత మహాభూతములనియే కాకుండా – **'పశవో మమ భూతాని'** అనే శ్రుతి వచనానుసారంగా ప్రాణివాచకమైన పశుశబ్దార్థాన్ని గ్రహించిన పక్షంలో – **'ఆరణ్యాన్‌గ్రామ్యాంశ్చ యే' "సప్తగ్రామ్యాః సప్తారణ్యాః"** – అనే శ్రుతులను సంభావించిన పక్షంలో సింహాది ఆరణ్య పశు సప్తకమును గవాదిగ్రామ్యపశు సప్తకమును గ్రహించాల్సి ఉంటుంది. అవి క్రమంగా –

**"సింహ వ్యాఘ్ర వరాహాశ్చ మహిషా వారణాస్తథా**
**ఋక్షాశ్చ వానరాశ్చైవ సప్తారణ్యాః ప్రకీర్తితాః॥**
**గౌరజోమనుజాశ్వాచశ్వవ్యశ్యతరగర్దభాః**
**ఏతే గ్రామ్యాః సమాఖ్యాతా పశవస్సప్త పణ్డితైః ॥** అని చెప్పబడినవి.

**సప్త స్వరములు:**- స్వరములు స–రి–గ–మ–ప–ద–ని అని పారిభాషికముగా షడ్జ–ఋషభ – గాంధార–మధ్యమ–పంచమ –ధైవత –నిషాదములని **సప్తస్వరములు** ప్రసిద్ధముగా ప్రవచింపబడినవి.

స్వరశబ్దము తర్వాత రెండవ పాదములో **"ముఖనదత్"** అను పదమున్నది. దానికి బదులు 'మఖ–నదత్' అనే శబ్దద్వయము పాఠాన్తరముగా కనబడుచున్నది.

ఆ పక్షమున **'మఖ'** శబ్దమునకు యజ్ఞమనే అర్థంలో సప్త సంఖ్య నన్వయించుకోవాలి. యజ్ఞములు హవిర్యజ్ఞములు సోమయజ్ఞములు, పాక యజ్ఞములనెడి అవాంతర ప్రభేదములలో కీర్తింపబడినవి. వానిని పరిగణనమున పరిగ్రహించినచో - **అగ్న్యాధాన - అగ్నిహోత్ర- దర్శపూర్ణమాస ఆగ్రాయణ, చాతుర్మాస్య, నిరూఢ పశుబన్ధ - సౌత్రామణి** - యనబడే **సప్తహవిర్యజ్ఞములను,**

**'అగ్నిష్టోమ-అత్యగ్నిష్టోమ-ఉక్థ్య - షోడశీ - వాజపేయ - అతిరాత్ర- అప్తోర్యామ'** ములనబడే **సప్త సోమసంస్థ యజ్ఞములు**

**'అష్టక - పార్వణ - శ్రాద్ధ - శ్రావణి - ఆగ్రహాయణి - చైత్రీ - ఆశ్వయుజీ** - అనెడి **సప్త పాకయజ్ఞములను** గ్రహించాలని తాత్పర్యం.

నదత్ శబ్దము చే **'నాదంకుర్వన్తి'** అనే అర్థాన్ని అశ్వపరంగా అన్వయించుకుంటే నదత్సప్తి - అనగా హేషారవమును చేసే సప్తాశ్వములు అనిన్నీ సప్తస్వరాన్వితమైన శబ్దబ్రహ్మమనిన్నీ అర్థాలు సిద్ధిస్తాయి. శబ్దార్థద్యోతితమైన పరబ్రహ్మము నామరూపాత్మకముగా జగత్తును భాసింపచేయుచు జగద్వ్యాపిగా భాసించుచున్నదో అదే, చిదాదిత్యమూర్తిగా సర్వవ్యాపియై సప్తసప్తిగా సప్తసంఖ్యాకమైన సర్వప్రపంచమును అనుగ్రహించుచున్నాడని పూర్వార్థమునకు ఉత్తరార్థముతో అన్వయించు విధముగా వ్యాఖ్యానమును గ్రహించాలి. ఇట్టి సగుణ బ్రహ్మముగా ఆదిత్యునుపాసించి సకాములైన సాధకులు అభీష్టసిద్ధిని పొందుచున్నారని పూర్వార్థ తాత్పర్యము.

ఉత్తరార్థములో నిర్గుణోపాసకుల జ్ఞానమార్గము మూడవ పాదములో - **"యేచ ఏకాశ్వం నిరవయవవాగ్భావమాత్రాధిరూఢం"** అని సూచింపబడినది. ఎవరు ఏకాశ్వమునధిరోపించిన నిన్ను నిరవయవవాగ్భావ మాత్రారూఢునిగా ఉపాసించుచున్నారో అని వర్ణింపబడినది. సప్తసప్తిగా వర్ణించిన ఆదిత్యుని నిర్గుణోపాసకులు ఏకాశ్వునిగా అవ్యాకృత రూపములో భావించెదరు. అతని ఏకాశ్వరూపము

నిరవయవ వాగ్భావమాత్రారూఢత్వమని వివరింపబడినది. నిరవయవము అనగా అవయవములు ప్రకటింపబడని అతిసూక్ష్మరూపము. అది వాగ్భావమాత్రారూఢము అనగా పశ్యన్తీ వాక్స్వరూపమున అనుభవైక వేద్యమైనది. లేదా శబ్ద బ్రహ్మరూపమని అర్థమును చెప్పుకొనవలెను.

ఇదే విషయమాతని కారణరూపమును వివరించు సందర్భములో ( 9వ) శ్లోకములో **'యత్రారూఢం త్రిగుణవపుషి బ్రహ్మ తద్బిన్దురూపమ్'** అని బిన్దునాదములకాధారముగానున్నదని వివరింపబడినది.

ఈవిధముగా ఆదిత్యుని నిరవయవ నిర్గుణోపాసన ఏకాశ్వోపాసనగా చెప్పబడినది. పూర్వార్థములో చెప్పబడిన సప్తాశ్వోపాసకులు, మరియు మూడవపాదములో సూచింపబడిన ఏకాశ్వోపాసకులు వీరుభయులు కూడా **'స్వరగుణకళావర్జితం అనశ్వం త్వామేవ యాన్తి** – అని ఫలితమొకేవిధమైన సాయుజ్యప్రాప్తిగా కీర్తింపబడినది. ఉభయులకు లభించు ఫలము స్వరగుణకళావర్జితమైన పరబ్రహ్మరూపమే. స్వరశబ్దము అకారాదిషోడశ సూక్ష్మ ప్రపంచాత్మకములైన కారణోపాధులు. గుణ శబ్దము సగుణోపాధికారణములైన సత్త్వ రజస్తమోగుణములను వెరసి నామరూపాత్మకమైన జగత్తును సూచిస్తాయి. ఇవి కళా(సూక్ష్మ) రూపముగానైన దేనియందు ప్రకాశింపవో అది తురీయమైన నిర్గుణ పరబ్రహ్మము కేవల చిదానన్దఘనము. అశ్వశబ్దము గతి వాచకమై జగత్తుకు ప్రతీకగా సంభావింపబడినది. అనశ్వము అనగా నామప్రపంచము రూపప్రపంచము రెండింటికీ అతీతమైన పరబ్రహ్మస్వరూపమని అదే నిష్ప్రపంచమైన ఆదిత్యుని అసలైన మూలరూపముగా సాంబుడు అనశ్వపదంచే నిర్దేశించాడని గ్రహించాలి.

సప్తసప్తి లేదా సప్తాశ్వునిగా తననుపాసించే సామాన్య సగుణోపాసకులకు, అనశ్వునిగా పరబ్రహ్మస్వరూపమును సంభావించే జ్ఞానులకు ఒకే విధమైన సాయుజ్యముక్తి ననుగ్రహిస్తాడు చిద్భానుడని పరమార్థం. ఈ విధమైన అనుగ్రహమాతని అవ్యాజకారుణ్య పరత్వమును,

సమదృష్టిని సూచిస్తుంది. ఇతర దేవతలు ఎవరేవిధమైన భావనతో ఉపాసిస్తారో వారికి వారివారి ఉపాసనలకనుగుణమైన ఫలములననుగ్రహిస్తారు. కాని చిద్భానుడట్లు గాక సర్వులకు సర్వోత్కృష్టమైన సాయుజ్యము నను గ్రహించే పరమకారుణికుడని సాంబుని అంతరంగముగా గ్రహించాలి. మరో విశేషం, సప్తాశ్వోపాసన వల్ల అనశ్వప్రాప్తి వర్ణించబడడంలో ఆలంకారికంగా విరోధము భాసించి, దానివలన ఆదిత్యుని సమదృష్టిత్వ అవ్యాజకరుణాపూర్ణగుణ వర్ణన, స్తుతిపరమైన పరిహారమునకు వర్ణింపబడుటచే ఈ శ్లోకములో విరోధాభాసాలంకారముపనిబంధింపబడినదని విశేషార్థమును గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥** **పాతాల ఋష్యబ్ధి వాతాశనద్వీప**
**లోకాధి బీజాల లోలనమున**
**ఛన్దముల్ భూతముల్ స్వరములు మఖములు**
**విశ్వాత్మగా నిన్ను విశ్వరూప!**
**సప్తసప్తిగ మది సంభావనము జేసి**
**ఆశ్రయించెడి వార లద్వయతను**
**వాగ్భావ మందిన వాజివాహిగ నిన్ను**
**నేనశ్వ గామది నెంచి చూచి**

**గీ॥** **నీదు నిర్గుణ రూపము నిత్యవిధిని**
**భావనము జేసి జీవించి జీవముడుగ**
**భయము వీడియు నీయందు లయము నొంది**
**అద్వయీభావ సంసిద్ధి నందగలను ॥**

**---0---**

# 26వ శ్లోకము

**అవతారిక:** ఆదిత్యుడే బాహ్యాంతర ప్రపంచములలోని అంతర్యామి అంతరాత్మ మరియు ప్రాణశక్తి అని ఈ శ్లోకమున నిరూపించబడుచున్నది.

**శ్లో॥ దివ్యజ్యోతిః సలిల పవనైః పూరయిత్వా త్రిలోకీమ్**
**ఏకీభూతం పునరపి చ తత్ సా తమాదాయ గోభిః ।**
**అన్తర్లీనో విశసి వసుధాం తద్గత స్సూయసేఽన్నమ్**
**తచ్చ ప్రాణస్త్వమితి జగతాం ప్రాణభృత్ సూర్య ఆత్మా॥**

**అన్వయము:-** త్వం త్రిలోకీం జ్యోతిః సలిల పవనైః పూరయిత్వా ఏకీభూతం తత్ దివ్యం సారం గోభిః ఆదాయ పునరపి అన్తర్లీనః భూత్వా వసుధాం విశసి. తద్గతః సన్ అన్నం సూయసే. తచ్చ (అన్నం) ప్రాణాన్ సూయతే- ఇతి త్వం జగతాం ప్రాణభృత్ సూర్యః ఆత్మా అసి.

| | |
|---|---|
| **ప్రతిపదార్థము:-** | - ఓ సూర్యదేవా! |
| త్వం | - నీవు |
| త్రిలోకీం | - ముల్లోకములను |
| జ్యోతిఃసలిలపవనైః | - అగ్ని జల వాయువులచే |
| పూరయిత్వా | - నింపి |
| ఏకీభూతం | - ఒక్కటిగా పరిణమించిన |
| తత్దివ్యం | - ఆ ప్రకాశవంతమై |
| సారం | - సారమును |
| గోభిః | - (నీ) కిరణములచే |
| ఆదాయ | - స్వీకరించి |
| పునరపి | - మరల |
| అన్తర్లీనః భూత్వా | - అన్తర్యామి లేదా అంతర్ముఖుడవై |

| | |
|---|---|
| వసుధాం విశసి | – భూమిని ప్రవేశించుచున్నావు. |
| తద్గతః సన్ | – ఆ విధముగా భూమిని ప్రవేశించినవాడవై |
| అన్నం సూయసే | – అన్నమునుత్పాదించుచున్నావు |
| తచ్చ | – ఆ యన్నము |
| ప్రాణాన్ (సూయతే) | – ప్రాణములను జనింప చేయుచున్నది |
| ఇతి త్వం | – ఈ విధముగా నీవు |
| జగతాం | – లోకములకు |
| ప్రాణభృత్ | – ప్రాణశక్తిని ధరించు చున్నవాడవై |
| సూర్యః | – బాహ్యాన్తరాకాశ సంచారివైన |
| ఆత్మా అసి | – పరమాత్మవగుచున్నావు |

**భావము:-** ఓ చిదాదిత్యదేవా! నీవు అగ్ని జల వాయు తత్త్వములచే ముల్లోకములను పూరించి (పరితృప్తముగావించి) వానియందు ఏకత్రితమై సారభూతముననున్న వాని తత్త్వమును కిరణముల ద్వారా గ్రహించి, మూలపృథివీ తత్త్వమును ప్రవేశించి అంతర్యామిగా నందుండి అన్నమునుత్పాదించుచున్నావు. ఆ యన్నము ప్రాణులను సృజించుచున్నది. ఈ విధముగా నీవు ప్రాణశక్తిని ధరించుచున్నవాడవై జగదన్తరాత్మయైన సూర్యభగవానుడుగా అన్వర్థనామధేయముతో బాహిరముగా ఆంతరముగా వెలుగొందుచున్నావని భావము.

**శ్రీపాదుక:-** **'సూర్య ఆత్మా జగతస్తస్థుషశ్చ'** అనే శ్రుతివాక్యమునకు వ్యాఖ్యానరూపముగా నీ శ్లోకమును సాంబుడు రచించెనని చెప్పవచ్చును.

**"సరత్యాకాశే ఇతి సూర్యః"** – అనగా ఆకాశమున సంచరించువాడు అని సూర్యశబ్దమునకర్థము చెప్పబడినది. బహిరాకాశసంచారియై జగములను, హృదయాకాశమున సుషుమ్నాపథగామిగా ప్రాణులను అంతర్యామిగా అంతరాత్మయై సంరక్షించుచున్నాడని భావము. రెండు

విధములుగను ఈ శ్లోకమునకు అర్ధమును సంభావించ వచ్చును. బ్రహ్మాణ్డ పిణ్డాణ్డముల రెంటినీ ప్రాణశక్తిగా సూర్యుడు ఆత్మస్వరూపుడై పోషించి నడిపిస్తున్న వైనాన్నిలా చెప్పుకోవచ్చును.

బహిరాకాశ సంచారియగు సూర్యుడు భూర్భువస్వర్లోకములను అగ్ని జల వాయు తత్త్వములచే పరితృప్తములు గావించుచు, మరల ఆయా లోకముల యందలి సమరసభావము నందియున్న ఆ తత్త్వ సమాహారమును రసరూపమున దివ్యములైన కిరణములచే సంగ్రహించి, వృష్ట్యాత్మగా మూలమైన ధరాతత్త్వమును అంతర్లీనముగా ప్రవేశించి, దానినుండి ఓషధులను, అన్నమును, ప్రాణశక్తిని ప్రాణులను కూడ సృష్టించి విశ్వాత్మగా వెలుగొందుచున్నాడని 'సూర్య ఆత్మా జగతః' అను శ్రుతి పరమైన సమన్వయము. **"ఆదిత్యాజ్జాయతేవృష్టిః వృష్టేరన్నం తతః ప్రజాః"** అని గీతా స్మృతి లో కూడా ఇదే అభిప్రాయ మభివ్యక్తీకరింపబడినదిగా గ్రహించవచ్చును.

హృదకాశ సంచారియైన సూర్యుడు జాగ్రత్స్వప్న సుషుప్తులనే ప్రపంచములను చిత్ప్రకాశ శాక్తామృత ప్రాణవాయువులచే పరితృప్తములుగావిస్తూ, ఆయా ప్రపంచములలో సమరసతనందిన సామరస్యపూర్ణమైన దివ్యమైన తురీయమైన చిదానంద ఘనతత్త్వమును తన దివ్యకిరణములద్వారా గ్రహించి అన్తర్లీనముగావించుకొని అంతరాత్మగా (చిదాత్మగా) అంతర్యామిగా, ప్రాణశక్తిని ప్రసరింపజేస్తూ, ప్రాణధారియై ప్రాణులను సంరక్షిస్తూ, ఉంటాడు చిద్భానుడని కూడా **"సూర్య ఆత్మా జగతః"** అనే శ్రుతి వాక్య సమన్వయయుతమైన అర్థాన్ని సంభావించవచ్చును.

## అనువాద పద్యము

**సీ॥** వాయ్వగ్ని జలముల వాటము నొకటిగ
జేసి పూరించి యై జీవదాత
మూడైన లోకాల మూలము భావించి
సారము కిరణాళి సంగ్రహించి
భూమిని జొచ్చియు భూతసృష్టికి నీవు
అన్నముత్పాదించి యాదుకొనుచు
బాహ్యాన్తరాకాశ బాహాట సంచార
పరుడవై ధరియించి ప్రాణశక్తి

**గీ॥** సూర్య! జగదాత్మ వనినీవు సూటిగాను
ఆగమోక్తుల యర్చన నందుకొంటి
వట్టి చిద్భాను నిన్ను నే నాత్మభాస
నరసి యద్వయ సంసిద్ధి నందుకొంటి ॥ 26 ॥

---0---

## 27వ శ్లోకము

**అవతారిక:-** ఆత్మారాములగు పరమయోగులకు మోక్షస్థానము, పరమగమ్యము, చిద్భానురూపుడైన పరమాదిత్యుడే నని కవి ప్రస్తుతించుచున్నాడు.

**శ్లో॥** అగ్నీషోమౌ ప్రకృతిపురుషౌ బిన్దునాదౌ చ నిత్యౌ
ప్రాణాపానావపి దిననిశే యే చ సత్యానృతే ద్వే ।
ధర్మాధర్మౌ సదసదుభయం యోన్తరావేశ్య యోగీ
వర్తేతాత్మన్యుపరతమతిః నిర్గుణం త్వాం విశేత్సః ॥

**అన్వయము:-** యః నిత్యౌ అగ్నీషోమౌ, ప్రకృతి పురుషౌ, బిన్దునాదే ప్రాణాపానౌ, ధర్మాధర్మౌ, సత్యానృతే, దిననిశే చ ద్వే ఏవం సదసత్ ఉభయం చ అన్తరావేశ్య యః యోగీ ఉపరతమతిః సన్ ఆత్మని వర్తేత సః త్వాం నిర్గుణం విశేత్။

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| యోగీ యః | - యోగాభ్యాస నిరతుడైన యే సాధకుడు |
| నిత్యౌ | - త్రికాలాబాధితములైన |
| అగ్నీషోమౌ | - చంద్రాగ్నులను (శీతోష్ణములను) |
| ప్రకృతిపురుషౌ | - ప్రకృతి పురుషులను |
| బిన్దునాదౌ | - బిన్దునాదములను |
| ప్రాణాపానౌ | - ప్రాణాపానములను |
| ధర్మాధర్మౌ | - ధర్మాధర్మములను |
| సత్యానృతే | - సత్యాసత్యములను |
| దిననిశే | - రేయింబవళ్లను అనెడి |
| ద్వే | - ద్వంద్వములను |
| సదసత్ | - అస్తినాస్తి తత్త్వములను |
| ఉభయంచ | - రెండింటిని కూడ |
| అన్తరావేశ్య | - హృదయము నందు విలీనము చేసికొని |
| ఆత్మని | - ఆత్మానందములో |
| ఉపరతమతిః | - ప్రశాన్తచిత్తుడై (ఆత్మారాముడై) యుండునో |
| స ఏవ | - అట్టి యోగనిరతుడు మాత్రమే |
| నిర్గుణం త్వాం | - నిర్గుణ పరబ్రహ్మ స్వరూపుడవైన నిన్ను |
| విశేత్ | - ప్రవేశించును (అనగా నీ లో లయించునని భావము) |

**భావము:-** హే చిదాదిత్య దేవా! ప్రపంచములో నిత్యము అనుభవ గోచరములగుచున్న అగ్నీషోమాత్మకములైన శీతోష్ణములను, ప్రకృతి పురుషులు, బిన్దునాదములు, ప్రాణాపానములు, ధర్మాధర్మములు, సత్యాసత్యములు, తేయింబవళ్లు, సదసదిత్యాది ద్వంద్వములను అన్నింటిని తన హృదయము నందు విలీనము చేసికొని ఆత్మారాముడై రమించునో అట్టి యోగాభ్యాస నిరతుడు మాత్రమే నిన్ను ప్రవేశించును. అనగా నీ సాయుజ్యము నందునని భావము.

**శ్రీపాదుక:-** నిర్గుణ పరబ్రహ్మ ప్రాప్తికి ఆత్మోపరతమతి రూపమైన యోగాభ్యాస మొక్కటియే సాధనమను విషయ మీ శ్లోకమున ప్రతిపాదించబడింది. ఈ విషయము 4వ పాదములో స్పష్టీకరించబడినది. అట్టి యోగాభ్యాస నిరతుడు మాత్రమే **'నిర్గుణం త్వాం విశేత్'** నిర్గుణ పరబ్రహ్మస్వరూపుడవైన చిదాదిత్యునిలో ప్రవేశిస్తాడని చెప్పబడినది. **'ఆత్మన్యుపరతమతి'** యైన యోగి ఉత్తమోత్తమ సాధకుడు అతడు ఆత్మజ్ఞుడని చెబుతూ, అతడు ద్వంద్వాతీతుడు నిత్యసత్త్వ గుణసంపన్నుడు అని గీతాస్మృతి – **'నిర్ద్వంద్వో నిత్యసత్త్వ స్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ (గీ 2–45)** అని అతని స్వభావాన్ని నిర్దేశించింది. ఇంకా అతడు తపోధనుల కన్న జ్ఞానులకన్న కర్మిష్ఠులకన్న గొప్పవాడు అని చెప్పి తుదకు **'తస్మాద్యోగీ భవార్జున!'** కావున యోగనిష్ఠుడవు కావాలని ప్రబోధిస్తాడు పరమాత్మ. (గీ 6–46) మరల నతడే ముందు ద్వితీయాధ్యాయంలో యోగనిష్ఠ అంటే – లౌకికంగా శీతోష్ణ సుఖదుఃఖాది ద్వంద్వములలో జీవిస్తూనే వానితో సంగము లేదా సంబంధమును పెట్టుకొనక సమదర్శిగా సాక్షిగా వానిని దర్శిస్తూ అనుభవిస్తూ ఉండడము – అని సూచిస్తాడు. నీళ్లలో తామరవలె ద్వంద్వములతో నిస్సంగుడై జీవించడమే యోగనిష్ఠ అని భగవానుడు కర్మయోగాన్నిలా ఉపదేశిస్తాడు.

**యోగస్థః కురుకర్మాణి సంగంత్యక్త్వా ధనంజయ**
**సిద్ధ్యసిద్ధ్యోః సమోభూత్వా సమత్వం యోగ ఉచ్యతే ॥ (గీ 2-48)**

అనే దాతని వక్కణ. ద్వంద్వాతీతస్థితిని యోగి పొందుతాడు అన్న మాటకు అతడు ద్వంద్వముల నుండి విడివడి వాని కతీతంగా ఉంటాడని కాదు పరస్పర విరుద్ధములుగా భాసించే శీతోష్ణసుఖదుఃఖాదులను సమానంగా దర్శించి అనుభవిస్తూ వాని ప్రభావములకు లోనుకాకుండా నిశ్చలమైన చిత్తంతో ప్రశాంతముగా ఆత్మనిష్ఠుడై ఆత్మారాముడై చిదానందముననుభవిస్తూ ఉంటాడని భావం. యోగానుష్ఠానమంటే ఇదే. కర్మయోగ కౌశలమని సాధనకుపాదేయమైన నిష్ఠయని భగవానుడు **'తస్మాద్యోగాయ యుధ్యస్వ - యోగః కర్మసు కౌశలమ్" (గీ 2-50)** అని విశదీకరిస్తాడు. ఈ విషయమే మూడు నాలుగు పాదాలలో **"ఉభయం అన్తరావిశ్య యః వర్తేత - ఆత్మన్యుపరతమతిః"** అనే పదాలలో సాంబకవి నిర్దేశించినాడని గ్రహించాలి.

ఈ విధమైన కర్మకౌశలముకల యోగి మాత్రమే నిర్గుణ పరబ్రహ్మస్వరూపుడైన చిద్భానునిలో లయిస్తాడని **'నిర్గుణం త్వాం సః విశేత్'** అని సిద్ధాంతరూపంగా ప్రతిపాదించబడింది కాగా యోగనిష్ఠుడైన సాధకుడు ఆత్మని- అనగా స్వస్వరూపానుసంధానము నందు ఉపరతా అనగా లయించిన, **మతిః- బుద్ధికలవాడై** అనగా మనోలయమును పొందిన వాడవుతాడు. సంకల్పవికల్పానుభవాల కాస్పదమైన మనస్సు లయిస్తే ద్వంద్వములన్నియు పరస్పర ప్రవిలుప్తములై ప్రపంచమే లయిస్తుంది. అప్పుడు అంతటా నిర్గుణపరబ్రహ్మమే భాసిస్తుంది. అదే తనస్వస్వరూపమనే జ్ఞానము అనుభవము సిద్ధిస్తాయి. ఇదే **'యోగీ నిర్గుణం త్వాం విశేత్'** ఆ సిద్ధయోగి నిర్గుణ పరబ్రహ్మ స్వరూపుడైన చిద్భానునిలో ప్రవేశిస్తాడనే ఉపదేశము యొక్కపరమార్థంగా గ్రహించాలి.

## అనువాద పద్యము

సీ॥ యోగియై యెవ్వాడు యోగసాధన చేత
నిత్యాగ్నిసోముల సత్యములుగ
ప్రకృతిని పురుషుని ప్రాణమపానమున్
బిందునాదమ్ముల చందమరసి
ధర్మమధర్మమున్ ధరణి సత్యానృత
రాత్రిందినద్వంద్వ రాశి నెఱిగి
సదసత్తులనుకూడ శాంతాత్మలో లీన
మొనరించి యుపరతి నొప్పుచుండు

తే గీ॥ నట్టి యోగీశ్వరుండిల నచలయోగ
నిష్ఠలోపల నంతస్థు నిన్ను గనును.
నిన్నుగనుచును తానుగా నీదుమణ్డ-
లమును భేదించి నీలోన లయము నందు ॥

---0---

## 28వ శ్లోకము

**అవతారిక:-** ఈ శ్లోకంలో సాంబకవి చిదర్కునికి గృహస్థధర్మము నాపాదించి యతనినిరువురు సపత్నులతో రమించు రసలోలునిగా సాలంకారికమైన కావ్యభాషలో సంస్తుతించుచున్నాడు.

శ్లో॥ గర్భాధాన ప్రసవవిషయే సుప్తయోరిన్దుభాసోః
సాపత్న్యేనాభిముఖమివ ఖే కాన్తయోర్మధ్యసంస్థః ।
ద్యావాపృథ్వ్యోర్వదనకమలే గోముఖైర్బోధయిత్వా
పర్యాయేణాపిబసి భగవన్! షడ్రసాస్వాదలోలః ॥

**అన్వయము:-** హే భగవన్! షడ్రసాస్వాదలోలః, మధ్యసంస్థః సాపత్న్యేన అభిముఖమివ కృత్వా ఇన్దుభాసా, ఖే సుప్తయోః కాన్తయోః ద్యావాపృథ్వ్యోః వదనకమలే గోముఖైః బోధయిత్వా, గర్భాధానప్రసవవిషయే పర్యాయేణ ఆపిబసి.

**ప్రతిపదార్థము:**

| | |
|---|---|
| హే భగవన్! | – ఓ సూర్యభగవానుడా! |
| షడ్రసాస్వాదలోలః | – షడ్రసానందభూమికలనాస్వాదించు లాలసకలవాడవై |
| మధ్యసంస్థః | – భూమ్యాకాశముల నడుమ నంతరిక్షగతుడవై |
| సాపత్న్యేన | – పరస్పర ప్రతియోగిభావముచే |
| అభిముఖమివ | – ఒకరికొకరెదురుగా నుండి |
| ఖే సుప్తయోః | – ఆకాశమనెడి శయ్యయందు నిదురించుచున్నవివలె |
| కాన్తయోః | – ప్రకాశించుచున్న (ప్రియురాండ్రవలెనున్న) |
| ద్యావాపృథ్వ్యోః | – భూమ్యాకాశములయొక్క |
| వదనకమలే | – ముఖకమలములను |
| గోముఖైః | – ముఖమువలె ప్రసరించు కిరణములచే |
| బోధయిత్వా | – మేలుకొలిపి |
| గర్భాధానప్రసవవిషయే | – అన్తఃప్రవేశ నిస్సరణాత్మకమైన |
| పర్యాయేణ | – క్రమానుగుణముగా |
| ఆపిబసి | – తృప్తిగా పానము చేయుచున్నావు |

**భావము:-** హే సూర్యభగవానుడా! నీవు షడ్రసానంద భూమికలనాస్వాదించు లాలసతో, భూమ్యాకాశముల నడుమ నంతరిక్షగతుడవై, సపత్నీ భావముతో పరస్పర ప్రతియోగిభావముతో నాకాశమనెడి శయ్యపై శూన్యావస్థితిలో నిదురించుచున్న ద్యావాపృథివీకాంతల ముఖకమలములను, అన్తఃప్రసరణ నిస్సారణ రూపమైన గర్భాధానప్రసవ ప్రక్రియలో భాగముగా నీ చిత్రరశ్మలను

చిత్రభాపుంజములను ప్రసరింపచేయుచున్నవాడవై పానము చేయుచున్నావు. అనగా చుంబనాధరోష్ఠపానాదులను నిర్వర్తించి యానందించుచున్నావని భావము.

**శ్రీపాదుక:-** ఈ శ్లోకములో సూర్యభగవానుడొక దక్షిణ నాయకుడుగ ద్యావాపృథువులనెడి కాంతలతో రమించుచున్నట్లు ఆలంకారికపరిభాషలో వర్ణింపబడినది. గర్భాధానప్రసవవిధి యగు గృహస్థధర్మ నిర్వహణమునకై సపత్నుల ననునయించు దక్షిణనాయకుడు వలె సూర్యుడు పరస్పరాభిముఖముగ నిదురించుచున్న ద్యావాపృథువుల నడుమ నున్నవాడై, తన కిరణహస్తములచే ఒకరి తరువాతనొకరి ముఖకమలములను మేల్కొల్పి షడ్రసానందము నాస్వాదించుచున్నట్లు వర్ణింపబడినది.

కాని దీనిలో కేవల గురుముఖైక వేద్యమైన అంత్యంత గోప్యమైన యోగసాధనారహస్యము ద్యావా పృథివీ - గోముఖ - షడ్రసానంద భూమికలను పదములచే నుద్బోధింప బడినట్లు క్షేమరాజు తన వ్యాఖ్యానములో వెల్లడించి యున్నాడు. **ద్యావాపృథ్వోః** అను పదమునకు **'సర్వద్వాదశాన్తాత్మాంతరిక్ష దేహభూమ్యోః'** అని వ్యాఖ్యానించినాడు. కాగా, ఇప్పుడు ద్యావా పృథ్వీశబ్దములచే క్రమముగా బహిరన్తర ద్వాదశారములను, మధ్యస్థితుడైన చిద్భానుని అన్తరిక్షగత ప్రకాశము, గోముఖశబ్దము చేత చిద్రశ్ములనే అర్థం, అలాగే షడ్రసానందానుభవశబ్దముచే - యోగసాధనలో అనుభవానికి వచ్చే - **నిజానంద, నిరానంద, బ్రహ్మానంద మహానంద, చిదానంద, జగదానందము**లనే ఆరు ఆనంద భూమికలు స్ఫురిస్తాయి. ఆకాశంలో చిద్భానుడాస్వాదించే షడ్రసాస్వాదము - మనోలయం జరిగిన పిమ్మట సాధనలో యోగులు శూన్యంలో ఆస్వాదించే షడానంద సందోహమే ననే విషయము

**'కళోద్వ్యదితమేతచ్చ చిత్తత్త్వం కర్తృతామయం।**

**అచిద్రూపస్యశూన్యాదేః మితం గుణతయాస్థితమ్'॥** - అనే కారికలో నిర్దేశింపబడినట్లు వ్యాఖ్యానిస్తాడు క్షేమరాజు. బాహిరంగా వర్ణింపబడిన

ఆదిత్యుని యొక్క గర్భాధాన ప్రసవ విషయములు – గ్రీష్మకాలంలో కర్షణ్యాది కిరణములచే భూమిగత రసమును స్వీకరించి వర్షర్తువులో వర్షిణ్యాది కిరణములచే నాకసమునుండి అమృతరసమునుప వర్షించి నానావిధౌషధాన్నములను, తద్వారా జీవుల ప్రసవమును నిర్వర్తించుటకై రసాస్వాదన ప్రక్రియ నిర్వర్తించబడుచున్నట్లును, అదియే ఆదిత్యుని రసాస్వాద లోలత్వముగను తెలియజేయబడినది.

ఈ విధముగా ఈ శ్లోకమున రెండు విధముల అర్థములు భాసించు శ్లిష్టపద సమాయోజనముచే సాంబకవి బాహిరముగా ఆదిత్యుని గార్హస్థ్యధర్మవర్తనమును ఆంతరముగా యోగీశ్వరేశ్వరత్వమును స్తుతించినాడు. ఆలంకారికభాషలో ఈ శ్లోకమున శ్లేషాలంకార గర్భితమైన సమాసోక్త్యలంకారము ఉపనిబంధింపబడినదని తాత్పర్యము.

## అనువాద పద్యము

**సీ॥ సవతులిరువురతో షడ్రసాస్వాదము**
**నందు కోరికతోడ నర్యముండు**
**ఆకాశశయ్యపై నంతరిక్షము భూమి**
**కాంతలిర్వుర మధ్యకాంతు డనగ**
**ఎడమోము పెడమోము నేమరి నిదురించు**
**ధరణీద్యుకాంతల దక్షత గని**
**ఆధాన ప్రసవాల నంచిత గర్భంబు**
**నభిలషించెడి వారి నాదరమున**

**గీ॥ కిరణ కరముల ముఖముల తరణి తాకి**
**క్రమము నధరామృతా స్వాద రసపిపాస**
**కర్షణాధాన వర్షణ కార్యములను**
**జగతి రక్షింప చేయు నా ఖగవిభుండు ॥**

---0---

# 29వ శ్లోకము

**అవతారిక:-** కర్మిష్ఠుడు ధర్మనిరతుడునైన గృహపతి, బాహిరంగా దర్శపూర్ణమాసాది యాగములను వైశ్వదేవాదులను నిర్వర్తిస్తూ ఆంతరంగా స్వాత్మహోమమును, అన్తర్యాగక్రమంలో చేస్తున్నట్లుగానే, బ్రహ్మాణ్డన్తర్గృహవర్తియైం చిద్భానుడు కూడ ఆత్మయాగాన్ని నిర్వహిస్తున్నాడని స్తుతించబడుచున్నది.

**శ్లో॥ సోమం పూర్ణామృతమివ చరుం తేజసా సాధయిత్వా**
**కృత్వా తేనానలముఖ జగత్తర్పణం వైశ్వదేవం ।**
**ఆమావస్యం విఘసమివ ఖే తత్కళాశేషమశ్నన్**
**బ్రహ్మాణ్డాన్తర్గృహపతిరివ స్వాత్మయాగం కరోషి ॥**

**అన్వయము:-** (హే చిదర్క!) తేజసా సోమం పూర్ణామృత చరుం ఇవ సాధయిత్వా, తేన అనలముఖ జగత్తర్పణం, వైశ్వదేవం కృత్వా, (ఏవం) ఆమావస్యం విఘసమివ తత్ కళాశేషం ఖే అశ్నన్ బ్రహ్మాణ్డాన్తర్గృహపతిరివ స్వాత్మయాగం కరోషి ॥

**ప్రతిపదార్థము:-**

(ఓ చిదాదిత్యదేవా! నీవు)

తేజసా - నీ చిత్ప్రకాశముచే
సోమం - అమృతాంశుడగు చంద్రుని
పూర్ణామృతచరుం+ఇవ - అమృతపూర్ణమైన హవిష్యన్నమువలె
సాధయిత్వా - పచనముచేసి (వండి)
తేన - ఆ హవిరన్నముతో
అనలముఖ - అగ్నిముఖీనముగా (అగ్నిద్వారా)
జగత్తర్పణం - ప్రపంచమును పరితృప్తిపరచువిధముగా
వైశ్వదేవం కృత్వా - పంచమహాయజ్ఞములలోనొకటగు వైశ్వదేవమను పేరుగల యజ్ఞమును చేసి

| | |
|---|---|
| ఆమావస్యం | – అమావాస్యా సంబంధమైన |
| తత్కళాశేషం | – పదునారుకళలలో దేవతలు పానము చేయగా మిగిలిన కళాశేషమును |
| విఘసమివ | – అతిథిభృత్యాద్యవశిష్టమైన అన్నమువలె |
| ఖే | – ఆకాశమునందు |
| అశ్నన్ | – భుజించుచున్నవాడై |
| బ్రహ్మాణ్డాన్తర్గ్ృహపతిరివ | – బ్రహ్మాణ్డమనెడిగృహాన్తర్భాగమున తదధిపతియగు యజమానుని వలె |
| స్వాత్మయాగం కరోషి | – ఆత్మయజ్ఞమును చేయుచున్నావు. |

**భావము:-** హే చిదాదిత్యదేవా! నీవు నీ చిత్ప్రభలచే ప్రాణాపానముల కధిష్ఠానమైన అమృతాంశుడగు చంద్రుని హవ్యాన్నముగా వండి, దానిని అగ్నిముఖీనముగా నాహుతి చేసి అనగా ఉదానాగ్నిలో వ్రేల్చి సర్వజగత్తర్పణముగా వైశ్వదేవ యజ్ఞమును నిర్వర్తించుచున్నావు. అటుపై ప్రాణాపాన మధ్యగత సంధియగు అమావాస్య యనబడు ద్వాదశాన్తము నందు అవశిష్టమగు **'అమా'** కళను హుతశేషముగా ఆస్వాదించుచున్నావు. ఈ విధముగా నీవు బ్రహ్మాణ్డమను గృహమునకు యజమానివై సదా ఆత్మయజ్ఞమును చేయుచున్నావని భావము.

**శ్రీపాదుక:-** లోకంలో గృహపతియైన యజమానుడు సర్వదేవతాప్రీత్యర్థమై పెద్దపాత్రలో చరువనబడే హవిస్సుగా వండబడిన అన్నమును వండి, పంచయజ్ఞములను నిర్వర్తించి, అవశిష్టమైన అనగా శేషించిన యజ్ఞప్రసాదాన్ని తాను సకుటుంబముగా స్వీకరిస్తాడు. ఇదే కార్యమీశ్లోకంలో చిదాదిత్యకృత్యంగా సంస్తుతింపబడినది. కాకుంటే ఆదిత్యుడు బ్రహ్మాణ్డాధిపతి. పిపీలికాది బ్రహ్మపర్యన్త జీవులాతని యాత్మ స్వరూపములే. సర్వజగత్పరిపోషణార్థమై అతడు ప్రతిదినమున ఆత్మయజ్ఞమును చేస్తూ, జగత్తర్పణముగావిస్తున్నాడని భావము.

క్షేమరాజీయ వ్యాఖ్యానము చిదాదిత్యకృత్యమైన ఈ స్వాత్మయజ్ఞాన్ని శాక్తసంప్రదాయపరముగా వివరిస్తుంది. అందలి వివరములు పరమరహస్యములు గురుముఖైక వేద్యములు. ఆ అంతర్యాగ విశేషాలు సంగ్రహంగా ప్రస్తావిస్తాను. రహోయాగ ప్రక్రియలో భావనామయమైన స్వాత్మ యజ్ఞం –

**అన్తర్నిరన్తర నిరిన్ధన మేధమానే**
**మోహాన్ధకారపరిపంథిని సంవిదగ్నౌ ।**
**కశ్మింశ్చిదద్భుత మరీచి విలాస భూమౌ**
**విశ్వం జుహోమి వసుధాదిశివావసానమ్ ॥**
**ఇదం తు పాత్రభరిత మహత్తాప పరామృతమ్**
**పూర్ణాహుతిమయే వహ్నౌ పూర్ణహోమం జుహోమ్యహమ్ ॥**

ఏ విధమైన ఇంధనములు లేకుండానే లోపల నిరంతరాయంగా ప్రజ్వరిల్లుచున్న జ్ఞానమయమైన చిద్వహ్నిలో వసుధాదిశివాన్తజగత్తును, హోమము చేస్తున్నట్లు సంభావించి చివరగా కర్తృత్వ భావనాద్యోతకమైన **'అహన్త'** నేను నేననబడే భావాన్ని కూడా పూర్ణాహుతిగా హోమం చేయడం స్వాత్మయజ్ఞమనబడుతుందని వివరింపబడింది. ఇది రహోయాగము.

చిద్భానుడు బ్రహ్మాణ్డన్తర్గృహపతిగా స్వాత్మయాగము చేస్తున్నాడని నాలుగవ పాదంలో ప్రధానవాక్యంగా ప్రతిపాదించబడింది. దీనికి బహిర్యాగపరంగా వ్యాఖ్యానము నిలా సంభావించవచ్చు. బ్రహ్మరంధ్రములో శాక్తబ్రహ్మోపలక్షితమైన అణ్డములోపల – ధరా, మూల, మాయా, శక్తులనే అణ్డచతుష్టయం గృహ మధ్యభాగంగా భాసిస్తూ ఉంటుంది. దానిలో చిద్భానుడు స్వాత్మయాగాన్ని చేస్తున్నాడని భావం. అందుకు హోమద్రవ్యంగా రూపాది పంచదశాత్మకుడగు అమృతకిరణుడైన చంద్రుణ్ణి తన కిరణప్రభావముచే పూర్ణామృత రూపమైన చరువు (హవిరన్నము లేదా అన్నరూపహవిస్సుగా) వండి, దానిని ఉదానాగ్నిలో వ్రేల్చి, ధరాదిశివతత్త్వాన్తమైన

జగత్పరితర్పణము చేసి ఆయా హవిర్భాగములచే సమస్త దేవతలను సంతృప్తిపరచి, అవశిష్టమైన కళాశేషమును తాను గ్రహిస్తాడని భావించాలి. ఇది ఆమావాస్యమైన విఘసమని మూడవపాదములో సూచింపబడినది. శాక్త గ్రంథాలలో ఈ ఆమావాస్యమగు విఘసము (కళాశేషరూపమై అవశిష్టాన్నభోజనము) జగత్పరితర్పణకారణమవుతున్నదని

**"అమృతం చంద్రరూపేణ ద్విధా షోడశధా పునః**
**పిబన్తి చ సురాః సర్వే దశపంచ పరాః కళాః**
**అమాశేష గుహాన్తస్థామావస్యా విశ్వతర్పిణీ ॥ "** – అని చెప్పబడినది.

శ్రీ విద్యాసపర్యలో ఇదే అంతర్యాగ ప్రక్రియ భావనాపరంగా సంభావింపబడింది. ఆంతరంగా ప్రాణశక్తికి మూలమైన అపానవాయువే ఆంతరచంద్రునిగా బాహ్యద్వాదశాన్తమువైపు ప్రయాణిస్తూ 15 తృటి రూపకాల పరిమాణమైన శుక్లపక్షమును దాటి హృదయాకాశాంత స్థితమైన, తృట్యర్థాంశ సీమితమైన అంతర్ద్వాదశాన్తములో విరాజిల్లుచున్న బహిశ్చంద్రుని పరిపూర్ణషోడశీ కళనుసంతరించుకుని ఆంతరపూర్ణిమామృత రసాస్వాదనము చేస్తాడు.

ఈ విధంగా పరిపూర్ణత్వమును పొందిన ఆ యాంతర చంద్రుడు ప్రాణశక్తిగా అంతర్ద్వాదశాన్తములోనికి ప్రసరిస్తూ 15 తృటుల(కాల) పరిమితమైన కృష్ణపక్షక్రమంలో (దేవతలచే పానము చేయబడుచున్నవాడై) క్రమంగా క్షీణించి, బహిర్ద్వాదశాన్తములో అర్ధతృట్యంశగా విరాజిల్లుతున్న ఆంతరామావాస్యకు సంబంధించిన 'అమాకళ' నాస్వాదిస్తాడు. ఈ విధంగా ఆంతర పూర్ణిమామావాస్యా కళలను ఆస్వాదిస్తూ యోగులు సదా ఆంతరమైన స్వాత్మయాగాను భవాన్ని పొందుతూ ఉంటారు.

ఈ విధంగా భర్గతేజస్సుతో విరాజిల్లే చిద్భానుడు బ్రహ్మాండాన్తర్గృహపతిగా స్వాత్మయాగ నిరతుడై వైశ్వదేవంగా ప్రతిదినము దేవర్షినరజీవాత్మక జగత్పరితృప్తిని సమకూర్చుచున్నాడని సారాంశంగా గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥** చండాంశు తేజము చంద్రుని చరువుగా
వైశ్వదేవార్థమై వండుచుండు
పూర్ణామృతాన్నము పూర్తిగా వ్రేల్చును
అగ్నికాహుతిగాగ నహరహరమున
అనల ముఖంబున నద్దాని జగతికి
తర్పణంబనగాను తరణి సలుపు
అటులె యమావాస్య నవశిష్ట కళలను
విఘసమనగ తిను విభుడతండె

**గీ॥** ఇట్లు బ్రహ్మాండ గృహపతి యట్ల నీవు
స్వాత్మ యాగము ననుదిన మాత్మభాస
చేయుచుంటివి చిద్భాను! చిత్కళాభ!
లోకకల్యాణ కరుడ! యో లోకబంధు ! ॥

---0---

## 30వ శ్లోకము

**అవతారిక :-** దివాకరుడైన చిదాదిత్యుని యొక్క అహోరాత్రాత్మకమైన దివసకరత్వము పంచవిధావర్తన రూపముగా ప్రతిపాదింపబడుచున్నది.

**శ్లో॥** కృత్వా నక్తం దివమివ జగద్బీజమావ్యక్తికం యత్
తత్రైవాన్తర్దినకర! తథా బ్రాహ్మమన్యత్తతోఽల్పమ్ ।
దైవం పిత్ర్యం క్రమపరిణతం మానుషం చాల్పమల్పం
కుర్వన్ కుర్వన్ కలయసి జగత్పంచధావర్తనాభిః ॥

**అన్వయము:-** హే దినకర! ఆవ్యక్తికం యత్ జగద్బీజం అస్తి తత్ నక్తం దివమివకృత్వా, తథా తత్రైవ అన్తః తతః అల్పం బ్రాహ్మం (నక్తం దివం) అన్యత్ కృత్వా, ఏవం - దైవం, పిత్ర్యం, మానుషంచ, (నక్తందివం) క్రమపరిణతం అల్పమల్పం కుర్వన్కుర్వన్ పంచధా ఆవర్తనాభిః జగత్ కలయసి.

**ప్రతిపదార్థము:**

హే దినకర! – దివసకరుడవైన ఓ సూర్యదేవా!
ఆవ్యక్తికం – ప్రాకృతికమైన
యత్‌జగద్బీజమ్ – జగత్తుకు మూలబీజమైన కాలస్వరూపమేది కలదో
తత్ నక్తం దివం కృత్వా – దానిని ఱేయింబవళ్లుగా రచించి
తథా తత్రైవ – ఆ విధముగా రచింపబడిన ఆరాత్రింబవళ్లలోనే
బ్రాహ్మం (నక్తందివం)అన్యత్ కృత్వా – బ్రహ్మగారికి సంబంధించిన రాత్రింబగళ్లను ప్రత్యేకముగ సృష్టించి
ఏవం – అదే విధముగా
దైవం-పిత్ర్యం-మానుషంచ – దేవ పితృమనుష్యులకు సంబంధించిన
నక్తందివం – ఱేయింబవళ్లను
అల్పంఅల్పం – ఒకదానికన్న వేరొకటిచిన్నవిగానుండు
క్రమపరిణతం – క్రమములో పరిణతి చెందునట్లుగా
కుర్వన్‌కుర్వన్ – వేర్వేరుగా సృష్టించుచు
పంచధా –(ప్రాకృత-బ్రాహ్మ-దైవ-పితృ మనుష్యకల్పములనెడి) అయిదు విధములైన
ఆవర్తనాభిః – పరివర్తనములచే
జగత్ – ప్రపంచమును
కలయసి – రచించుచున్నావు (విశ్వసృష్టి చేయుచున్నావని భావము)

**భావము:-** దివసకరుడవైన ఓ చిద్భానుదేవా! తొలుదొలుత నీవు అవ్యాకృతమైన ప్రాకృతమైన విశ్వసృష్టికి మూలమైన రాత్రిందినవిభాగమును చేసి, వాని నుండి స్వల్పభాగమును గ్రహించి, బ్రహ్మకల్పమునకు సంబంధించిన నక్తందివములను, మఱియు క్రమముగా ఒకదాని కన్న

మరియొకటి పరిమాణములో అల్పాల్పములుగా నుండునట్లు దైవ, పిత్ర్య – మానుష సంబంధములైన దివారాత్రములతో కూడిన దివస(కాల) రచనమును పంచవిధ పరివర్తనాత్మకముగా చేసి విశ్వరచనమును కొనసాగించుచున్నావు. అనాదిగా ఇదే విధమైన పంచవిధ పరివర్తనములలో ఆదిత్యునిచే విశ్వసృష్టి గావింపబడుచున్నదని భావము.

**శ్రీపాదుక:-** మొదటిపాదంలో చిద్భానుడు దినకరుడుగా ఆవ్యక్తిక జగద్బీజముగా రాత్రిందిన విభాగము చేసినట్లు పేర్కొనబడినది. ఇక్కడ చిద్భానుడు దినకరుడు అనగా విశ్వోదయకృద్దివసకరుడు. అనగా జగత్సృష్టికి బీజమైన దివసమునుపకల్పించువాడు అని అర్థం. జగత్పదానికి సదాశివపర్యన్తమైన విశ్వమనే అర్థాన్ని భావించాలి. జగద్బీజముగా రాత్రింబవళ్లనుపకల్పించుట అనగా విశ్వసృష్టి లేదా విశ్వోదయము పగలుగను విశ్వావసానము లేదా విశ్వవిలయము రాత్రి గను భావించి అర్థం చెప్పుకోవాలి. అవ్యాకృతము లేదా ప్రాకృతమైన జగద్బీజరూపమైన సృష్టినిలా రచించి, దాని యందే అంతర్భూతముగా బ్రహ్మకల్పమునకనువుగా బ్రాహ్మమైన సృష్టిని గావించినట్లు రెండవపాదములో వర్ణింపబడినది.

దీని భావము నిట్లు గ్రహింపవచ్చును. అవ్యాకృతమైన ప్రాకృతికదివసము బ్రహ్మకల్పము లేదా బ్రహ్మాయువును నూరు బ్రహ్మవత్సరములు గా గ్రహింపవచ్చును. బ్రహ్మగారియొక్క ఒక దినము ఒక మనుష్య కల్పము లేదా నాలుగు వేల యుగములకు సమానము. మనుష్యకల్పములో సంవత్సరమునకు రెండు అయనములుండును. అవి ఉత్తరాయణము దక్షణాయనము అనునవి. ఒక్కొక్కటి 6 మాసములు పరిమితి కలవి. దేవతలకు పితరులకు ఉత్తరాయణము పగలు, దక్షిణాయనము రాత్రి యగును.

పరిశీలించినచో అవ్యాకృత రాత్రింబవళ్లకన్న బ్రాహ్మదివసము, దానికన్న దైవపితృదివసములు, అంతకన్న మానుషములు క్రమముగా అల్పాల్పతరాల్పతమములని తెలియవచ్చును. ఈ విషయమే మూడవపాదములో

'అల్పమల్పం - క్రమపరిణతం' అను పదములలో తెలుపబడినది. చివరగా నాలుగవ పాదములో సారసంగ్రహముగా - **అవ్యాకృత (ప్రాకృత), బ్రాహ్మ-దైవ-పితృ-మానుష**-కల్పభేదముచే ఐదు విధములగు ఆవర్తనములలో చిద్భానుడు దివసకరుడుగా సృష్టి కార్యము నిర్వర్తించుచున్నట్లు సిద్ధాన్తీ కరించబడినది. అవ్యాకృత జగద్బీజ దివసము బ్రహ్మకల్పముగా చెప్పబడినది. బ్రహ్మగారి జన్మ మొదలుకొని మోక్ష పర్యన్తకాలము అవ్యాకృత దివసము. అట్లే ఒక బ్రహ్మముక్తుడైనది మొదలు పునః బ్రహ్మోణ్డోత్తరోత్పత్తి పర్యన్తకాలము అవ్యాకృత నక్తముగా గ్రహించాలి.

శ్లోకంలో అవ్యక్త జగద్బీజ పరిమాణం మొదలుకొని అల్పాల్పతరంగా బ్రాహ్మదైవ పితృ మానుష నక్తం దివసములు సృష్టింపబడినట్లు పంచవిధక్రమం ప్రస్తావింపబడింది. అదే వ్యుత్క్రమంగా మానుషము నుండి అవ్యాకృతము వరకు అధికాధిక ప్రమాణంలో క్రమంగా స్వచ్ఛంద తంత్రంలో ఇలా చెప్పబడింది.

**ముహూర్తాస్తు తథా త్రింశ దహోరాత్రస్తు మానుషః**
**దక్షిణం చాయనం రాత్రి రుత్తరం చాయనం దినమ్ ।**
**పితౄణాం తదహోరాత్రం అనేనాబ్దంతు పూర్వవత్**
**ఏవం దైవ స్త్వహోరాత్రః ........** అని చెప్పబడినది ॥

అహోరాత్ర స్వరూపమైన మన దివసము ముప్పది ముహూర్తముల పరిమితి కలది. మానుషకాలములో 6 మాసములైన దక్షిణోత్తరాయనములు దైవపితృ మానములో రాత్రింబవళ్లు. అనగా ఒక మానుష సంవత్సరము పితరులకు, దేవతలకు ఒకదినమగునని భావము. అట్లే

**కల్పే బ్రహ్మదినం ప్రోక్తం చతుర్యుగసహస్రకమ్**
**షట్త్రింశత్తు సహస్రాణి బ్రహ్మణః ప్రళయోద్భవః**
**అవ్యక్త స్థేషు రుద్రేషు దినరాత్రిశ్చ తావతీ**

నాలుగు యుగ సహస్రకాలమొక కల్పమనబడును. అది బ్రహ్మకొక దినము అట్టి 36000 కల్పములు ఒక బ్రహ్మాయువు. అంతే పరిమాణము

కల అనగా 36,000 బ్రహ్మాయువులు రుద్రుని యొక్క అవ్యక్తమనబడును. ఈ విధముగా మనుష్యదైవ పితృ బ్రాహ్మ అవ్యక్తముల అధికాధికతరత్వములు చెప్పబడినవి. ఈ విధమైన అవ్యక్త పర్యన్తమగు మహత్తమ సృష్టిని భర్గతేజముతో చిద్భానుడే చేయుచున్నాడని తాత్పర్యార్థముగా గ్రహించాలి. ఈవిధంగా ఈ శ్లోకమున చిద్భానుని అనాద్యనన్తకాలకర్త ృత్వము (మహామహిమ్నత్వము) స్తుతింపబడినవని గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥ అవ్యక్త జగతికి నాదిబీజంబైన**
**కాలము గైకొని కర్తయగుచు**
**దినరాత్రములనంగ దినమణి విభజించి**
**తొల్లి బ్రహ్మదివసమల్లి పిదప**
**అల్పాల్ప భాగములన దైవపితరుల**
**మానుష దినరాత్ర మాన్యసృష్టి**
**నావర్తనముల చే నైదు విధంబుల**
**కాలకల్పవిధిని క్రమము తోడ**
**ఆ.వె॥ చేసినావుగాదె చిద్భాను దేవేశ!**
**నీదులీల లెన్న నేరితరము !**
**కాల కర్త నిన్ను కలినెవ్వడర్చించు**
**కనడు వాడు భువిని కష్టములను ॥**

---0---

# 31వ శ్లోకము

**అవతారిక:-** ఉదయాస్తములు లేని చిద్భానుని యందు వానినారోపించి ప్రబోధనిద్రావస్థల ననుభవించుచు పరమానంద నిర్భరులైన పరమయోగులు జ్యోతిర్మయాదిత్యమణ్డలమును భేదించి, తుదకు నిర్గుణపరబ్రహ్మ స్వరూపుడగు చిదాదిత్యునిలో లయించుచున్నారని నిర్గుణోపాసనాతత్త్వ మీ శ్లోకములో వివరింపబడుచున్నది.

**శ్లో॥ తత్త్వాలోకే తపన! సుదినే యే పరం సంప్రబుద్ధాః**
**యే వా చిత్తోపశమరజనీ యోగనిద్రాముపేతాః ।**
**తేఽహోరాత్రోపరమ పరమానన్దసంధ్యాసు సౌరం**
**భిత్త్వా జ్యోతిః పరమ పరమం యాన్తి నిర్వాణసంజ్ఞమ్ ॥**

**అన్వయము:**-హే తపన! తత్త్వాలోకే సుదినే యే పరం సంప్రబుద్ధాః, వా యే చిత్తోపశమరజనీయోగనిద్రాం ఉపేతాః, తే అహోరాత్రోపరమ పరమానందసంధ్యాసు సౌరం జ్యోతిః భిత్త్వా పరమ పరమం నిర్వాణసంజ్ఞం పదం యాన్తి

**ప్రతిపదార్థము:**

| | |
|---|---|
| హే తపన | – ఓ సూర్యుడా! |
| తత్త్వాలోకే | – ఆత్మజ్ఞానరూపమైన |
| సుదినే | – ప్రశస్తమైన ప్రభాతవేళలో |
| యే | – ఎవరు |
| పరం సంప్రబుద్ధాః | – పరిపూర్ణముగా జాగరూకులైనారో |
| వా యే | – మరియునెవరు |
| చిత్తోపశమరజనీ | – మనోలయమను రాత్రిలో |
| యోగనిద్రాముపేతాః | – యోగ సమాధిని పొందుచున్నారో |
| తే | – అట్టి యోగులు |
| అహోరాత్రోపరమ | – దినరాత్రి తత్త్వములుపశమించిన |
| పరమానంద సంధ్యాసు | – సర్వోత్కృష్టమైన ఆనందపూర్ణములైన సంధ్యాసమయములలో |
| సౌరం జ్యోతిః | – (ప్రాణశక్తి రూపమైన) సూర్యతేజమును అనగా సూర్యమణ్డలమును |
| భిత్త్వా | – భేదించినవారై |
| నిర్వాణసంజ్ఞం | – మోక్షమనే ప్రసిద్ధమైన |
| పరమపరం | – సర్వోత్కృష్టమైన స్థితిని |
| యాన్తి | – పొందుచున్నారు. |

**భావము:-** ఓ సూర్యదేవా! ఆత్మజ్ఞానముదయించే ప్రశస్త ప్రభాతసమయంలో సిద్ధయోగులు పరిపూర్ణమైన విమర్శాంశతోడి చైతన్యమును పొంది ప్రబోధింపబడుచున్నారు. అట్లే సంకల్ప వికల్ప రహితమైన మనోలయ రూపమగు రాత్రిలో యోగనిద్రా (సమాధి) నిర్మగ్నులగుచున్నారు. ఈ విధముగా ప్రాణాపానరూప అహోరాత్ర్యుపరమాత్మకమైన పరమానంద సంధ్యా సమయములలో ప్రాణశక్తి రూపమైన సూర్యమణ్డలమును భేదించి నిర్వాణ సంజ్ఞకమైన పరమోత్కృష్టపదమును అనగా మోక్షమును పొందుచున్నారని భావము.

**శ్రీపాదుక:-** ఇదొక అత్యద్భుతమైన శ్లోకం. తపన! అనే సంబోధనతో **'తత్త్వాలోకే'** అని ప్రారంభమవుతుంది. మొదటి పాదంలో పదాలను పరిశీలిస్తే తపన ఎప్పుడు ప్రారంభమవుతుందో అప్పుడే ఆక్షణమే మనకు సుదినం. తపన వల్ల జ్ఞానము జాగృతమవుతుంది. అనే విషయాన్ని **"పరం సంప్రబుద్ధాః"** అనే పదాలు తెలియజేస్తాయి. బుద్ధః అంటేనే తెలిసినవాడు అని అర్థం. ప్రబుద్ధః – విశేషముగా తెలిసినవాడు విశేషజ్ఞుడు. ఏమా విశేషము. అది పరమే అనగా దేనికి మించి తెలియవలసినది లేదో అదే. దానినే పరతత్త్వమన్నారు వేదాంతులు ఆలోకమనగా వెలుగు. తత్త్వాలోకమనగా తత్త్వదర్శనము అని భావం. కాగా ప్రథమపాదంలోని పదగుంఫనంలో మనకు తపన అనగా జిజ్ఞాస లేదా విచారణ ఉదయించిన సుప్రభాతవేళ లో ఉత్కృష్టమైన జ్ఞానముదయించి తత్త్వదర్శనమవుతుందనే అర్థం ధ్వనిస్తుంది. ఆ దర్శనమే యోగం. తత్త్వాన్ని దర్శించడము యోగమైతే ద్రష్ట యోగి అని వేరే చెప్పనవసరంలేదు. యే అనే పదానికి ఏ యోగులీవిధమైన తత్త్వదర్శనం చేస్తున్నారో అనే అర్థం సిద్ధిస్తుంది. తత్త్వదర్శనము అంటే ఉన్నదాని యొక్క యథార్థమును చూడడమని భావము.

మనమంతా ఉన్నదానినే చూస్తాం. లేనిదానినెలాగూ చూడలేము ఉన్నదాని నున్నట్టుగానే చూస్తాం. దీనికింత గొప్పగా **"తత్త్వాలోకము సంప్రబుద్ధి** అనే పదాలు చెప్పి ఇలా చూడడానికుపక్రమించడం **'జిజ్ఞాస'**

అని, ఆదర్శనం కలిగితే అది సుదినమని ఇంతలా చెప్పాలా అనిపిస్తుంది. తత్త్వమాలోచిస్తే సాంబుడేకాదు అతని బాబు (తండ్రి యైన కృష్ణుడు) కూడా ఇదే విషయాన్ని – **"నాసతో విద్యతే భావః నాభావోవిద్యతేసతః"** లేని దానికి అస్తిత్వము లేదా ఉనికి ఉండదు. అట్లే సత్తు (ఉన్నదానికి) అభావము ఉండదు. అనగా ఉన్నది లేదన్నంత మాత్రాన ఉండకుండా పోదు. లేనిదానిని ఉన్నదనడం కుదరదు అని చెప్పి – ఉన్నది లేనిది – **సత్ అసత్ ల**యొక్క అంతమును దర్శించడమే తత్త్వదర్శనమంటాడాయన. **"ఉభయోరపిదృష్టోఽన్తః అనయోస్తత్త్వదర్శినః"** అనేదాతని కంఠోక్తి. ఇదే తత్త్వాలోకమని చెప్పి దానిని మిగిలిన మూడు పాదాలలో వివరిస్తాడు సాంబుడు.

ఉన్నదెప్పుడూ ఉంటుంది. ఎంతత్రోసి పుచ్చినా పోదు. లేనిది ఎంతగా దర్శించాలనుకున్నా కనిపించదనేది అందరికీ అనుభవంలో నున్న విషయం. ఒక్కొక్కప్పుడు మనం లేని దాని నున్నట్లు ఉన్నదాన్ని లేనట్లు చూస్తూ ఉంటాం. ఉదాహరణకు మధ్యాహ్నం మనం తారురోడ్డుమీద ప్రయాణిస్తూ దూరంగా నీళ్లు అలలుగా పారుతున్నట్లు చూస్తూ ఉంటాం. సమీపానికి వెళ్లి చూస్తే అక్కడ నీళ్లుండవు. కేవలం ఎండకు మెరుస్తున్న రోడ్డు మాత్రమే కనిపిస్తుంది. అక్కడఉన్నదిసూర్యకాంతి. ఇప్పుడు ఉన్నదేది లేనిదేది అని విచారణచేస్తే తెలిసే యథార్థం – ఉన్నది సత్పదార్థం సూర్యరశ్మి. లేనిది అసత్తు – జలం, అనే విషయం. విచారణచేయకపూర్వము జలమే సత్తనే భావన కలిగించి,సూర్యకాంతి నీ బుద్ధిలో భాసించలేదు. స్థాణుపురుషభ్రాంతి, (దుంగను చూచి దొంగనుకోవడం) రజ్జు సర్పభ్రాంతి (త్రాడును పాముగా చూడటం), శుక్తిరజత భ్రాంతి (ముత్యపు చిప్పను చూచి వెండిగా భ్రమించడం) ఇలాంటి భ్రాంతులెన్నో శాస్త్రంలో విచారణ చేయబడినాయి. ఇది సత్తు, ఇది అసత్తు అని నిర్ధారణ చేసే ప్రమాణం మన విచారణ లేదా బుద్ధి శక్తి. ఇది కేవల జ్ఞానరూపమైనది. పాంచభౌతికమైన ఈ జగత్తును సాక్షీభూతంగా దర్శించేది నిర్ధారించేది

ఈ జ్ఞానమే. ఇక్కడితో భౌతికవిజ్ఞానశాస్త్రం (మెటీరియలిస్టిక్ సైన్స్) నిలచిపోతుంది. ఇక్కడ ప్రారంభమవుతుంది. మన అధ్యాత్మ విజ్ఞానము. సర్వప్రమాణములకు ఆధారమైన జ్ఞానమునకు అధిష్ఠానము లేదా సాక్షిభూతమైనది మనలోనున్న ప్రత్యగాత్మ. అది చిదానందఘనము. సదసద్వి లక్షణమైనది. దీని లక్షణం **"యతో వాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ"** – అని శృతి నిర్దేశించింది. అన్నిటికీ సాక్షిభూతముగా ఇది సత్తు, ఇది అసత్తు అని తత్త్వనిర్ధారణ చేస్తుంది. ఆత్మచైతన్యము లేదా ఆత్మజ్ఞానము. అది మన స్వస్వరూపము. దానికదే ప్రమాణము. అది స్వస్వరూపము కాబట్టి దాని అస్తిత్వాన్ని మనం త్రోసిపుచ్చలేము. **'నసన్నాసదుచ్యతే'** అని దాని తత్త్వం సదసద్విలక్షణమైనదిగా క్షేత్రజ్ఞాధ్యాయంలో నిరూపించబడింది. సదసద్వ్యక్తులేకాదు, సంకల్పవికల్పాలు, వాని కధిష్ఠానమైన భావాలు ద్వంద్వాలు అన్నీ దానిలో లయించవలసినదే. ఇలా సదసదాదులన్నింటి అంతమును అనగాలయమును ఆత్మలో దర్శించడమే తత్త్వదర్శనము అని **"ఉభయోరపిదృష్టోన్తః అనయోః తత్త్వదర్శిభిః"** అనే గీతావాక్యపరమార్థంగా భావించాలి. జ్ఞానులీవిధంగా విచారణద్వారా ఆత్మదర్శనం పొందడం అహస్సు.

యోగులు మనోలయం ద్వారా సమాధిలో (యోగనిద్రలో) పరతత్త్వాన్ని దర్శించడం రాత్రి అనే అర్థం రెండవ పాదంలో ధ్వనింపచేయబడినది.

ఆ విధంగా పరమానంద నిర్భరులైన జ్ఞానులు, యోగులు ఉభయులు అహోరాత్రి తత్త్వములు రెండును లయించిన సంధ్యలలో సూర్యమణ్డలాన్ని భేదించి స్వస్వరూపమును చిద్భానునిలో లయింపచేసుకొని నిర్వాణ పరంధామము అనగా మోక్షపథమును పొందుచున్నారని ఉత్తరార్థసారాంశముగా గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥** సుజ్ఞాన ముదయింప సుప్రభాతము సుమ్ము
అదియ సుదివసమౌ నవనిలోన
మనసు లయించుటే మాన్యమౌ శివరాత్రి
దాన యోగ సమాధి ఘనవినిద్ర
ఇట్టి యెఱుక నిద్ర నెవరుపాసింతురో
పరసంజ దినరాత్రి పరిధి దాటి
సూర్యమండల భేద శూరులై నేరుగా
పరమ నిర్వాణాఖ్య పదము నంది

**ఆ.వె॥** అచట నవధి లేని యానంద మునుబొంది
నిన్ను జేరి వారు నిత్యశూరు
లనగ నీదులోక మందుండి నీలోన
లయము నందగలరు లాఘవమున ॥

---0---

## 32వ శ్లోకము

**అవతారిక:-** బ్రహ్మాది స్థావరజంగమాత్మక ప్రపంచము యొక్క సృష్టి లయ కారకుడైన చిదాదిత్యుని వైభవమును, అసమయములలో అతని రశ్మి ప్రసరణ లీలను ప్రస్తుత శ్లోకములో ప్రస్తావించుచున్నాడు.

**శ్లో॥** ఆ బ్రహ్మేదం నవమివ జగజ్జఙ్గమస్థావరాన్తం
సర్గే సర్గే విసృజసి రవే! గోభి రుద్రిక్తసోమైః ।
దీప్తైః ప్రత్యాహరసి చ లయే తద్యథాయోని భూయః
సర్గాన్తాదౌ ప్రకటవిభవాం దర్శయన్ రశ్మిలీలామ్ ॥

**అన్వయము:-** హే ! రవే ! (త్వమ్) ఆ బ్రహ్మ జంగమస్థావరాన్తం ఇదం జగత్ దీప్తైః ఉద్రిక్తసోమైః గోభిః సర్గే సర్గే నవమివ విసృజసి, తథా (ఇదం జగత్) లయే చ యథా యోనిః భూయః ప్రత్యాహరసి. ఏవం సర్గాన్త - ఆదౌ ప్రకటవిభవాం రశ్మిలీలాం దర్శయన్ (స్థితో౨_సి)

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| హే రవే! | – ఓ చిద్భానుదేవా! |
| త్వం | – నీవు |
| ఆబ్రహ్మ | – బ్రహ్మమొదలుకొని |
| జంగమస్థావరాన్తం | – చరాచరమైన |
| ఇదం జగత్ | – ఈ ప్రపంచమును |
| దీప్తైః | – ప్రకాశవంతములు |
| ఉద్రిక్తసోమైః | – అమృతాంశుడైన చంద్రునుద్దీపింపచేయు |
| గోభిః | – కిరణములచే |
| సర్గే సర్గే | – సృజించునప్పుడెల్ల (ప్రతిసృష్టియందును) |
| నవమివ | – కొంగ్రొత్త రీతిలో |
| విసృజసి | – సృష్టించుచున్నావు |
| తదిదం జగత్ | – ఆయా జగత్తునే మరల |
| లయే చ | – ప్రళయకాలములో కూడ |
| యథా యోనిః | – (నీవే) కారణభూతుడవు వలె |
| భూయః | – మరల (తిరిగి) |
| ప్రత్యాహరసి | – ఉపసంహరించుచున్నావు |
| ఏవం | – ఈ విధముగా |
| సర్గాన్తాదౌ | – సృష్ట్యాది మరియు సృష్ట్యన్తవేళలలో |
| ప్రకటవిభవాం | – వైభవము లేదా మాహాత్మ్యమును ప్రకటించు |
| రశ్మిలీలాం | – కిరణప్రసారక్రీడను |
| దర్శయన్ | – ప్రకటించుచు |
| విభాసి | – ప్రకాశించుచున్నావని భావము |

**భావము:-** ఓ చిద్భానుదేవా! నీవు బ్రహ్మాది చరాచరాత్మక ప్రపంచమును నీ యొక్క ఉజ్జ్వలములు, చంద్రునుద్దీపించి తద్గతామృతమయాకిరణాళిచే ప్రతిసృష్టిని దేనికదే క్రొత్తగా భాసించునట్లుగా సృష్టించుచున్నావు. అట్లే

ప్రళయకాలములో ఆయా జగత్తులనుపసంహరించు చున్నావు. ఈ విధముగా సృష్టిసంహారకార్యములలో మూలకారణములుగా కిరణప్రాభవ లీలావైభవమును ప్రదర్శించుచున్నావు.

**శ్రీపాదుక:-** శాక్తతంత్రములు పరబ్రహ్మముయొక్క ఉన్మేషనిమేషములే సృష్టి ప్రళయములని చెప్పుచున్నవి. లలితా సహస్రనామం కూడా - **"ఉన్మేషనిమిషోత్పన్నవిపన్నభువనావళిః "** - అని అమ్మవారి ఉన్మేషనిమేషములే జగత్స ృష్టి సంహారకారణములని కీర్తించింది. అదే విధంగా ఆదిత్యుని ప్రథమోన్మేషమే సృష్టియని అస్తంగతత్వమే ప్రళయమని అది ఆయన కిరణావళి యొక్క విస్తార సంకోచరూపమైన లీలయని చెప్పబడినది. ప్రాణులకు జాగ్రదవస్థ సృష్టిగను, సుషుప్తి ప్రళయముగను శ్రుతి కీర్తించినది.

గీతాస్మృతి కూడా అష్టమా ఽధ్యాయంలో-

**అవ్యక్తాద్వ్యక్తయః సర్వాః ప్రభవన్త్యహరాగమే ।**
**రాత్ర్యాగమే ప్రలీయన్తే తత్రైవావ్యక్త సంజ్ఞకే ॥**
**భూతగ్రామః స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే**
**రాత్ర్యాగమేఽవశః పార్థ! ప్రభవత్యహరాగమే ॥ (8/18-19)** అవ్యక్త పరబ్రహ్మము యొక్క అహోరాత్రములే జగత్సృష్టి ప్రళయములుగా కీర్తించినది. ఆ పరబ్రహ్మమెవరోకాదు. చిద్భానుడే అతని రశ్మిలీలయే అహోరాత్ర్యుపకల్పనము అని ప్రస్తుతశ్లోకములో స్తుతించబడినది.

గీతాస్మ ృతిలో సంభావింపబడినట్లు గనే ఆ పరబ్రహ్మమును **సోఽహం** భావనతో స్వస్వరూపంగా గ్రహిస్తే జాగ్రత్సుషుప్తులే నిత్యసృష్టిలయములుగా గోచరిస్తాయి. అప్పుడు దినదినమున జరిగే సృష్టిలయ తతంగమంతా చిదాదిత్యుని రశ్మిహేలాలీలా విలాసమనే విషయమనుభవగోచరమవుతుందని, ఈ విధమైన అహంగ్రహోపాసన సూర్యోపనిషత్తులోని 9వ మంత్రంలో

**మం॥ సూర్యాద్భవన్తి భూతాని సూర్యేణ పాలితాని చ**

**సూర్యేలయం ప్రాప్నువన్తి యః సూర్యః సోఽహమేవహి ॥**

అని సూచింపబడినది. కాగా చిద్భానుడే జగత్స్రష్ట, సంహర్త అనియు ఆతని కర్తృత్వలయకారత్వములు రెండును ఆతని రశ్మిలీలా విలాసములనియు తాత్పర్యముగా గ్రహించాలి.

సాంబకవి చివరగా చెప్పిన **"దర్శయన్ రశ్మిలీలామ్"** అనునది చాలా బరువైన మాట. చిద్భానుని యొక్క రశ్మిప్రసారరూప సృష్టి, రశ్మ్యుపసంహార రూపమైన లయము రెండూ, ఆతని లీలావిలాసములు. హేలా క్రీడనములు. గౌడపాదులవారు ఈ విధమైన లీలాప్రదర్శనము వ్యక్తమైన పరబ్రహ్మము యొక్క స్వభావమే తప్ప వేరొక భావన లేదంటారు. **"దేవస్యైష స్వభావోఽయం ఆప్తకామస్య కా స్పృహా? "** – అనే దాతని కంఠోక్తి. ఈ విషయాన్ని కావ్యభాషలో ధ్వన్యాత్మకంగా కొన్ని మాటల్లో సూచిస్తాడు. మొదటిపాదంలో – బ్రహ్మాది స్థావరజంగమాత్మకసృష్టిని ప్రతిపర్యాయము నవమివ అనగా క్రొత్తదానివలె సృజిస్తున్నాడు. అని వర్ణింపబడినది. మునుపు ఉన్నదానినే క్రొత్తదానివలె సృష్టిస్తున్నాడని ఎలా అంటే ఉద్రిక్తసోమైః ఉద్దీపింపబడిన అమృతాంశు కిరణములచేనని రెండవపాదంలో సూచించబడింది. కాగా లయించిన స్థావర జంగమాది భూతజాతమునంతను వాని సంచిత కర్మానుభవోద్దీప్తములైన ఉపాధులలో తిరిగి సృష్టిస్తున్నాడని భావం. దీనివలన సృష్టి లయ కర్తృత్వములాయనలో ఆభాసగా కనిపిస్తున్నా వానితో ఆయనకు ప్రమేయమేమీ లేదు. అది అతని స్వభావము అనే అర్థం సిద్ధిస్తుంది. **"దేవస్యైష స్వభావోయం ఆప్తకామస్య కా స్పృహా"** అనే మాటకిదీ అర్థం. **'యథాయోని'** అనే ధ్వనివల్ల జీవుల సుకృత దుష్కృతములే వారి జన్మకర్మల బంధమునకు కారణమనే విషయం అభివ్యక్తమవుతుంది. దీనినే గీతాస్మృతిలో భగవానుడు – **"స ఏవ భూత గ్రామః అవశః ప్రభవత్యహరాగమే। రాత్ర్యాగమే ప్రలీయతే"** – ఉన్న భూత జాతమే కర్మానుభవంకోసం **సర్గేసర్గే–** ప్రతిసృష్టిలో ప్రభవిస్తుంది.

ప్రతిలయంలోను లయిస్తూ ఉంటుంది. భగవానునికీ సృష్టిలయములతో ప్రమేయములేదు. ఆయన ఆప్తకాముడు. రాగద్వేషములకు అతీతుడు. సృష్టిలయములు అతని స్వాభావికములైన నిర్హేతుకలీలావిలాసములు మాత్రమే అనే అర్థం సిద్ధిస్తుంది. దీనిని చిద్భానుని లీలావిలాస ప్రకటన వైభవముగా నాలుగవపాదంలో పేర్కొంటాడు సాంబుడు.

మరొక చమత్కారం. మొదటి పాదంలో **నవమివ** రెండవపాదంలో **సర్గేసర్గే** (ప్రతి సృష్టిలోను అనే ద్విరుక్తి) మూడవపాదంలో **'తద్యథాయోని'** నాలుగవ పాదంలోని రశ్మీలీలా అనే పదాలు మహార్థగర్భితాలు. ఇవి లేకపోతే వర్తమానసృష్టిలోని జీవులు భగవానునిచే సృష్టింపబడినాయని, వారివారి సుఖదుఃఖాను భవములకాయనయే కర్తయని జగత్సృష్టిలయములు అతని సంకల్పానుగుణంగా జరుగుతున్నాయనే అర్థాలు స్ఫురిస్తాయి. అలాంటప్పుడు **అకృతాభ్యాగమ-కృతవిప్రణాశమ**నే దోషం సంభవిస్తుంది. **'అకృతాభ్యాగమము'** అంటే మనం చేయనిదాని ఫలితం మననెత్తిన పడటం, **'కృతప్రణాశ'**మంటే చేసినదానికి ఫలితం లేకుండా పోవడం. ఈ దోషం **సర్గేసర్గే** ప్రతిసృష్టిలోనూ అనే ద్విరుక్తి చేత మూడవపాదంలోని **'యథాయోని'** అనే పదంచేత వారించబడుతుంది. **సర్గేసర్గే** అనే పదం ఎన్నెన్నో జన్మలను సూచిస్తుంది. ఆయా జన్మలలోని కర్మఫలాలకనుగుణంగా ప్రస్తుత జన్మలలో ఉపాధులు సుఖదుఃఖాలు జీవులకు సంప్రాప్తిస్తాయి. ఇందులో భగవానునికి కర్తృత్వము గాని రాగద్వేషములు గాని లేవనే విషయం తెల్లమవుతుంది. లయానంతరం మరల సృష్టి నూతనంగా ఆవిర్భవిస్తుందనడం వల్ల "కృతప్రణాశనం" ఈ జన్మలో చేసిన కర్మఫలం నశించదు. మరుజన్మలో తప్పక సంప్రాప్తిస్తుంది అని 'కృతప్రణాశనదోషం' పరిహరింపబడుతుంది. కావుననే గీతాస్మృతి **' స ఏవ భూతగ్రామః అవశః ప్రభవతి ప్రలీయతే"-** అదే స్థావరజంగమాది భూతప్రపంచము కర్మబంధమునకు లోబడి సృష్టిలయములననుభవించుచున్నదని చెప్పబడినది. అవశత్వమునే అనగా పారతంత్ర్యము పరోక్షముగా పరమాత్మకుకూడా అన్వయించవచ్చు. ఇదే

విషయాన్ని **'ఆప్తకామస్యకాస్పృహా"** అనే వాక్యంలో అభివ్యక్తీకరించేరని గ్రహించాలి. ఇందతయు చిద్భానుడు ప్రకటించే రశ్మిలీలా వైభవమంటాడు సాంబుడు. ఇంతటి ఉదాత్త గంభీరమైన రచనాప్రౌఢిమ సాంబకవియొక్క పాణ్డితీశౌణ్డీర్యమునకు మచ్చు తునక. చూడగలిగే కన్నుండాలి గాని ఇలాంటి విశేషాలెన్నెన్నో భావిస్తూన్న కొలదీ సహృదయులకు గోచరిస్తూనే ఉంటాయి.

## అనువాద పద్యము

**సీ॥ చిద్భానుదేవేశ! శీతాంశు దీపించి**
**బ్రహ్మాది స్తంభపర్యన్త మూర్తి**
**నిత్యనూతనరీతి సత్యభాసగ సృష్టి**
**జేసియు నద్దాని జేసి మాయ**
**మరల లయమునీవ మార్తాణ్డ యోనివై**
**లీనము లోనికి లీల యనగ**
**నీవయాకర్షించి నీదగు విభవము**
**రమ్యరీతిని జూపి రశ్మిలీల**
**ఆ.వె॥ విశ్వయోనివగుచు విశ్వాత్మ! నీవయై**
**చేయుచుంటివయ్య చిద్విలాస!**
**నీవె సృష్టికర్త నీవేను లయకర్త**
**రవివి నీవ మాకు రక్షకుడవు ॥ 32 ॥**

**---0---**

## 33వ శ్లోకము

**అవతారిక:-** అజ్ఞానాంధకారములో నున్న అంతేవాసులకు సద్గురువు తన జ్ఞాన బోధచే స్వస్వరూప జ్ఞానమును అనుగ్రహించినట్లుగా చిదాదిత్యుడు సాధకుల చిదాకాశములో జ్యోతీరూపమున ప్రకాశించి ఆత్మదర్శనమును గావించుచున్నాడని సోదాహరణముగా ప్రస్తుతింపబడుచున్నది.

శ్లో॥ శ్రిత్వా నిత్యోపచితముచితం బ్రహ్మతేజః ప్రకాశం
రూపం సర్గస్థితిలయముచా సర్వభూతేషు మధ్యే ।
అన్తేవాసిష్వివ సుగురుణా యః పరోక్షప్రకృత్యా
ప్రత్యక్షోఽసౌ జగతి భవతా దర్శితః స్వాత్మనాఽత్మా ॥

**అన్వయము:-** (హే భగవన్!) సర్గస్థితి లయముచా భవతా స్వాత్మనా నిత్యోపచితం ఉచితం బాహ్యతేజః ప్రకాశం రూపం శ్రిత్వా, సర్వభూతేషు మధ్యే అన్తేవాసిషు సుగురుణా ఇవ యః ప్రకృత్యా పరోక్షః (వర్తతే) అసౌ ఆత్మా జగతి ప్రత్యక్షః దర్శితః.

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| హే భగవన్! | - ఓ సూర్యభగవానుడా! |
| సర్గస్థితిలయముచా | - సృష్టిస్థితి సంహారములకు లోబడని లేదా వానికతీతుడవైన |
| భవతా స్వాత్మనా | - నీచే స్వీయమైన పరబ్రహ్మ స్వరూపముతో |
| నిత్యోపచితం | - సదా పరిపూర్ణమైన |
| ఉచితం | - ప్రశస్తమైన |
| బాహ్యతేజః ప్రకాశం | - బాహిరమగుకాంతిచే ప్రకాశించుచున్నదగు |
| రూపం శ్రిత్వా | - స్వరూపమాశ్రయించబడినదై |
| అన్తేవాసిషు | - శిష్యులనడుమ |
| సుగురుణా ఇవ | - సద్గురువు వలె |
| సర్వభూతేషు మధ్యే | - అన్ని ప్రాణుల మధ్య |
| అసౌఆత్మా | - ఈ ప్రత్యగాత్మ |
| జగతి | - లోకమునందు |
| యః ప్రకృత్యాపరోక్షః | - యేది స్వభావతః పరోక్షముగా అదృశ్యముగా నుండునో (గోచరింపదో) |
| సః జగతి | - అది జగత్తునందు |
| ప్రత్యక్షదర్శితః | - ప్రత్యక్షముగా చూపబడుచున్నది. |

**భావము:-** హే సూర్యభగవానుడా! నీవు సృష్టి-స్థితి-లయములనే అవస్థాత్రయమునకు అతీతుడవు. (వానికి లోబడనివాడవు శాశ్వతుడవని భావము) సదా పరిపూర్ణము, ప్రశస్యము, ప్రశస్తము, బ్రహ్మతేజస్సంపన్నము అగు రూపము నాశ్రించిన నీవు శిష్యులనడుమనుండి, వారి నుద్బోధించు సద్గురువు వలె భక్తుల హృదయాకాశములో విరాజిల్లుచున్నవాడవై, వారికి అపరోక్ష స్వభావముకల ఆత్మజ్ఞానమును ప్రత్యక్షముగా తాత్త్వికముగా యథార్థమైనదిగా దర్శింపచేయుచున్నావని భావము.

**శ్రీపాదుక:-** అంతర్యామి యైన చిద్భానుడు అవ్యాజకరుణా సముద్రుడు. అతి దుర్లభమైన ఆత్మజ్ఞానాన్ని ఆయన సద్గురువు వలె సాక్షాత్కరింప చేస్తాడని ఈ శ్లోకంలో వివరించబడింది. "నాయమాత్మా' ప్రవచనేన లభ్యః " ఆత్మజ్ఞానం ప్రవచనాలు ఉపదేశాలవల్ల లభించదని చెప్పి, శ్రుతి అది తానెవరిని వరింపదలుచుకుంటే వారికే లభిస్తుంది. **-"యమ్మై వేష వృణుతే తేన లభ్యః"** అని వివరించింది. ఆత్మ అంతటా ఉంటుంది. అన్ని చోట్లా ఉంటుంది కాని అందరికీ కనిపించదు. అది భగవత్స్వరూపం. అదే జీవ స్వరూపం కూడా. ఈ రెండింటినీ అను సంధానం చేసే గురుస్వరూపం కూడా అదే. అంటే ఈశ్వరుడు అంటే భగవానుడే గురువుగా ఆత్మతత్త్వాన్ని లేదా ఆత్మజ్ఞానాన్ని సాక్షాత్కరింపజేస్తాడని శాస్త్రప్రవచనం. అది అతని యొక్క నిర్హేతుకమైన కారుణ్యమేతప్ప వేరొకటి కాదు. అనన్యభావనతో తన నాశ్రయించిన భక్తులను దయామయుడైన భగవానుడు వారి హృదయాలలో జ్ఞానదీపాన్ని వెలిగించి, అనాదిగా పేరుకుపోయి, ఆత్మతత్త్వాన్ని కనబడకుండా కప్పివేసిన అవిద్యాంధకారాన్ని పారద్రోలి, సద్గురువుగా ఆత్మజ్ఞానాన్ని దర్శింపచేస్తానని భగవానుడు స్వయంగా ముక్తకంఠంగా భరవసానిచ్చేడు.

**తేషామేవానుకంపార్థం అహమజ్ఞానజం తమః**

**నాశయామ్యాత్మభావస్థః జ్ఞానదీపేన భాస్వతా ॥**అని యాతని కంఠోక్తి. (గీ॥విభూతి॥శ్లో॥11.)

ఇక్కడ ఆయన స్వయంగా అనుకంపార్థం - అంటే వారి యందుగల

అవ్యాజమైన కరుణతో వారిలో ఆత్మస్థానంలో నుండి జ్ఞానదీపాన్ని వెలిగించి, అజ్ఞానాంధకారాన్ని తొలగిస్తానంటాడు. ఆత్మస్థానంలో ఉంటేనే ఆత్మజ్ఞానమును బోధించడం సాధ్యమవుతుంది. బ్రహ్మమే బ్రహ్మజ్ఞానాన్నను గ్రహిస్తుంది అందుకే సాంబకవి – బ్రహ్మతేజః ప్రకాశం శ్రిత్వా – అని మొదటిపాదంలో ప్రతిపాదించాడు. 'బృహత్వాత్ బృంహకత్వాచ్చ' బృహత్త్వా అదే, బృంహకత్వము అంటే బృహత్త్వమూ అదే. కావున దానిని బ్రహ్మమన్నారు. బ్రహ్మజ్ఞానము జ్ఞాతను బ్రహ్మముగా చేస్తుంది. బ్రహ్మవేత్త బ్రహ్మమే అయి పోతాడని 'బ్రహ్మవిద్బ్రహ్మైవ భవతి' అని శ్రుతి. చిద్బ్రహ్మమైన సూర్యభగవానుడు ఆత్మజ్ఞానాన్ని ప్రత్యక్షముగా ప్రకటించి, స్వాత్మతత్త్వాన్ని అంటే సాయుజ్యమునే అనుగ్రహిస్తాడని అతని పరమకారుణికత్వ మీశ్లోకంలో సంస్తుతింపబడినదని గ్రహించాలి.

జ్ఞానప్రదాన రూపమైన భగవదనుగ్రహం సద్గురురూపంలోనే అందజేయబడుతుంది. అందుకే గురుతత్త్వాన్ని 'గురుస్సాక్షాత్ పరంబ్రహ్మ' అని ప్రత్యక్ష పరబ్రహ్మముగా మన సంప్రదాయం సంస్తుతించినది. మనమంతా అనాదిగా అనుస్యూతంగా వెంటాడుతున్న మృత్యుసంసారసాగరంలో పూర్తిగా మునిగి కొట్టుమిట్టాడుతున్నాం. అలాంటి మనలను చూచి ప్రత్యక్షదైవమైన ఆదిత్యభగవానుడు తన బ్రాహ్మమైన తేజములో గురుమూర్తిగా అవతరించి ఆత్మతత్త్వాన్ని ప్రకటింపచేస్తాడు. ఈ విషయాన్ని తానే "తేషామహంసముద్ధర్తామృత్యుసంసార సాగరాత్ " – అని స్వయంగా చెబుతాడు. మన సాంసారిక జీవనమంతా మృత్యువు యొక్క సాహచర్యంలో సాగుతూ ఉంటుంది –

**సహైవమృత్యుర్వ్రజతి సహమృత్యుర్నిషీదతి**

**గత్వాసుదూర మధ్వానం సహమృత్యుర్నివర్తతే ॥** –జీవులమైన మనం మృత్యువు వెన్నంటి దానితో పాటుగానే నడుస్తున్నాం. మనం కూర్చుంటే అదీ మనతో పాటే కూర్చుంటుంది. మనం బహుదూరం ప్రయాణిస్తే అది మనను నీడలా వెంటాడుతూనే ఉంటుంది. చివరకు మనం దానితోనే ఈ లోకం నుండి నిష్క్రమిస్తాం. ఇలాంటి మృత్యుసంసారసాగరం నుండి మన

నుద్ధరిస్తానంటాడు భగవానుడు. ఎంతకరుణాసముద్రుడో! ఈ మృత్యుసంసార సముద్రము నుండి మనలను తరింప చేయడం కోసం సూర్యభగవానుడు ప్రత్యక్షనారాయణుడుగా బహిరాకాశంలో ఆంతరంగా చిద్భానుడుగా సద్గురుమూర్తివలె అంతర్యామిగా సంచరిస్తూ, జ్ఞానోపదేశంచేసి ఆత్మసాక్షాత్కారాన్నను గ్రహిస్తున్నాడని సాంబుని అంతరంగంగా గ్రహించవచ్చు.

## అనువాద పద్యము

**సీ॥** సర్గస్థితిలయాల సంసర్గమునువడి
బ్రహ్మతేజము పరబ్రహ్మమూర్తి
యగుచు పరాత్పరు డాదిత్యు డలరును
సచ్ఛిష్యుల నడుమ సద్గురుడన
సహజమున నెవడు సత్యస్వరూపుడు
ప్రత్యక్షముగనుండు ప్రత్యగాత్మ
కరుణామయుండయి కాశ్యపి కనవచ్చు
కనువిందు జేయును కన్నుగవకు

**గీ॥** నట్టి చిద్భాను దర్శన మఘము బాపు
నిత్య సుఖమును కలిగించు సత్యమిదియు
అంతరంగము సూర్యున కర్పణముగ
జేసి నిర్వాణపదమునే జేరువాడ ॥ 33 ॥

---0---

# 34వ శ్లోకము

**అవతారిక:** సహజముగా జీవులందరు పరబ్రహ్మముయొక్క అంశావతారములే. భగవానుడు మాయాతీతుడు కావున సర్వజ్ఞుడు సర్వవ్యాపి సర్వశక్తిమంతుడు. జీవులు మాయాశబలితులు. మాయచే నావరింపబడినవారు కావున అల్పజ్ఞులు, పరిచ్ఛిన్నులు, అశక్తులు అను విషయమీ శ్లోకమున విశదీకరింపబడుచున్నది.

శ్లో॥ లోకాః సర్వే వపుషి నియతం తే స్థితాః త్వం చ తేషాం
ఏకైకస్మిన్యుగపదగుణో విశ్వహేతోర్గుణీవ ।
ఇత్థంభూతే భవతి భగవన్ న త్వదన్యోఽస్మి సత్యం
కిన్తు జ్ఞస్త్వం పరమ పురుషోఽహం ప్రకృత్యైవ చాజ్ఞః ॥

**అన్వయము:** హే భగవన్! విశ్వహేతోః తేవపుషి, సర్వేలోకా నియతం స్థితాః త్వం చ తేషాం ఏకైకస్మిన్ (రూపే) యుగపత్ (స్థితః) (అతఃత్వం) అగుణః అపి గుణీవ (ప్రతిభాసి) ఇత్థంభూతే భవతి (సతి) అహం త్వదన్యః న (ఇదం) సత్యమ్. కిన్తు, త్వం పరమపురుషః జ్ఞః చ అహం ప్రకృత్యాఏవ అజ్ఞః (అస్మీతిభావః)

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| హే భగవన్! | – ఓ సూర్యభగవానుడా! |
| విశ్వహేతోః | – జగత్కారణభూతుడవైన |
| తే వపుషి | – నీ శరీరమునందు |
| సర్వలోకాః | – లోకములన్నియు |
| నియతం స్థితాః | – సదా ఒక నియతిననుసరించి నెలకొనియున్నవి. |
| చ త్వం | – మరియు, నీవు |
| తేషాం | – వానిలో |
| ఏకైకస్మిన్ రూపే | – ప్రతిదానియందు వేర్వేరుగా ఆయారూపములలో |
| యుగపత్ | – ఏకకాలములో |
| అగుణః అపి | – నిర్గుణుడవైనప్పటికిని |
| గుణీవ | – సగుణ సాకారరూపములు కలవాని వలె (విరాజిల్లుచున్నావని భావము) |
| ఇత్థంభూతే | – ఈ విధముగా ప్రకాశించుచున్న |
| త్వదన్యః(అహం)నాస్మి | – నీ కంటే నేను భిన్నుడను కాను. |
| ఇదం సత్యమ్ | – ఇది నిజము లేదా వాస్తవము |
| కిన్తు | – కాని |

త్వం పరమపురుషః జ్ఞః – నీవు పరమపురుషుడవు సర్వజ్ఞుడవు
చ, అహం – మరియు నేను
ప్రకృత్యా ఏవ – స్వభావము చేతనే
అజ్ఞః (అస్మి) – అల్పజ్ఞుడనైయున్నాను.

**భావము:-** ఓ సూర్యభగవానుడా! జగత్కారణమైన నీ శరీరమునందే లోకములన్నియు ఒకనియతి ననుసరించి సుస్థములై యున్నవి. మరియు నీవా జగద్విషయములన్నింటను ప్రత్యేకముగా స్వస్వరూపములలో ఏకకాలములో విరాజిల్లుచున్నావు. వాస్తవముగా నీవు నిర్గుణడవు, నిరాకారుడవు. అయినప్పటికీ సగుణ సాకారరూపములలో ఏకకాలములో బహువిధములుగా భాసించుచున్నావు. ఈ విధముగా భాసిల్లు నీకన్న నేను వేరుకాదను సత్యమును నే నెఱుగుదును. ఏలన నీవు పరబ్రహ్మ పరమాత్మ స్వరూపుడవు, సర్వజ్ఞుడవు. అట్లే నేను స్వభావముచేతనే అల్పజ్ఞుడను, అశక్తుడను. ఈ విధమైన వాస్తవ పరిజ్ఞానము కూడ నీయనుగ్రహమేనని సాంబుని యంతరంగము.

**శ్రీపాదుక:-** శ్లోకపూర్వార్థంలో లోకములన్నీ పరబ్రహ్మస్వరూపుడగు చిద్భానుశరీరంలోనున్నాయనిన్నీ, అన్నిటా ఆయనే ఏకకాలంలో జీవరూపంగా ప్రతిబింబిస్తున్నాడని వర్ణించబడింది. తరువాత ఉత్తరార్థంలో విశాలమైన విశ్వంలో ఏదీ నీవు కానిది లేదని స్తుతిస్తూ, చివరగా నీవే నేననే విషయమును నేనెఱుగుదునంటూ జీవేశ్వరులిరువురకు అల్పజ్ఞత్వ సర్వజ్ఞత్వమును భేద కారణముగా ప్రతిపాదించబడింది. కవి ఈ శ్లోకంలో జీవేశ్వరులను భిన్నంగా చూపించి వారికి, అల్పజ్ఞత్వ సర్వజ్ఞత్వ భేదాన్ని ఆరోపించి చూపించేదే కాని వాస్తవానికి ఇద్దరూ ఒకే తత్త్వమన్న విషయాన్ని మూడవపాదంలో **'నత్వదన్యోస్మి'** – నేను నీకన్న వేరుకాదు అని చెప్పి ఇదే నిజమని **'తత్సత్యమ్'** అని వాచ్యంగా ధృవీకరిస్తాడు. ఇది శాస్త్రభాష.

గీతలో భగవానుడీ విషయాన్ని – **'మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః'(గీ.15-7)** అని కంఠోక్తిగా ప్రతిపాదిస్తాడు. సాంబుడు చెప్పిన

విషయాన్నే పరమాత్మ – జీవుడు నాయంశమే – నని చెప్పి అతడు సత్యమని చెప్పిన విషయాన్ని **'సనాతనః'** అనే పదంచేత ధృవపరుస్తాడు. **'మమైవాంశః'** అంటే పరమాత్మ 'అంశి', జీవుడు 'అంశ' అని భావించే ప్రమాదమున్నది – జీవ పరమాత్మలకు అంశాంశి భావము లేదు. ఇరువురూ ఒకటేననే విషయాన్ని ధృవపరచడంకోసమని ఇరువురుకు 'సనాతనత్వం' సమాన ధర్మముగా ప్రవచిస్తాడు.

సజాతీయములైన వానికే అంశాంశిభావం కుదురుతుంది. మహాకాశం ఘటమనే ఉపాధిని పొందితే ఘటాకాశం అనబడుతుంది. కుండపగిలిపోతే ఘటాకాశం మరల మహాకాశంలో లయిస్తుంది. మరల వెనుకకు రాదు. జలాదిత్యుడు నిజాదిత్యుని అంశ. జలోపాధిపోతే జలాదిత్యుడు నిజాదిత్యునిలో లీనమైపోతాడు. మరల వెనుకకురాదు. అలానే పరమాత్మ ఉపాధి నిష్ఠమై జీవుడుగా జీవాత్మగా ఉంటుంది. ఉపాధి నశించిన మరుక్షణం పరమాత్మలో లీనమైపోతుంది. మరల వెనుకకురాదు. **"యద్గత్వాననివర్తన్తే తద్ధామ పరమం మమ"(గీ. 15-6)** ఎచటకు వెడలిన వారు మరల వెనుకకు రారో ఆపరంధామమే నాది అంటాడు పరమాత్మ. పరమాత్మ అంశమే జీవుడైనప్పుడు జీవుడు కూడా సనాతనుడే. అతడు మరలమరల ఎందుకు జన్మిస్తూ కర్మఫలాలనను భవిస్తున్నాడు. అనే ప్రశ్న సగటు మనిషికి కలగడం సహజం. దానికి సమాధానంగా భగవానుడు **"మనష్షష్ఠానీంద్రియాణి ప్రకృతి స్థాని కర్షతి"** అని చెబుతాడు. ప్రాకృతములైన మనస్సు పంచేంద్రియ వ్యాపారములచే ఆకృష్టుడై కర్మలనాచరిస్తూ జన్మకర్మల వలయంలో పరిభ్రమిస్తూ ఉంటాడు. అనాది అవిద్యలో కొట్టుమిట్టాడుతూ ఉంటాడు. పరమకారుణికుడైన పరమాత్మ అనుగ్రహం పొందిన వాడు ఈ ప్రాకృతిక మాయా జాలం నుండి విడివడే జ్ఞానాన్ని పొందుతాడు. దానికాతడు చేయివలసినది అనన్యశరణాగతి. **"మామేవయే ప్రపద్యన్తే మాయామేతాం తరన్తితే" (గీ॥7/14)** అని కదా భగవద్వచనము. అనన్యశరణాగతి చేసినవారికి **"దదామిబుద్ధియోగం"** బుద్ధియోగాన్ని ప్రసాదిస్తాడు. దాని

వల్ల జ్ఞానము కలిగి అవిద్యావరణం తొలగి స్వస్వరూపము "నేను పరమాత్మకన్న వేరుకాదు" **'సోఽహం** అనే జ్ఞానం కలుగుతుంది. ఇది సత్యమైన జ్ఞానము. అనే విషయం **"భగవన్ - నత్వదన్యోస్మి - సత్యమ్"** అనే పదాలలో స్పష్టీకరించబడిందని అదే పరమార్థమని సాంబుని అంతరంగంగా గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥ విశ్వాత్ముడవు నీవు విశ్వాంతరాత్మవు**
**విశ్వకారణమీవు విశ్వరూప !**
**విశ్వము నీలోన విడిసెను నియతిని**
**విశ్వమందున నీవు విడిసియుంటి**
**విశ్వగర్భమునందు విశ్వునిగానున్న**
**నేను భిన్నుని గాను నీకు నిజము**
**పరమాత్మ వీవయ్య ప్రాకృతుండను నేను**
**సర్వజ్ఞుడవు నీవు స్వల్పమతిని**
**గీ॥ ఇట్లు మనమధ్య నంతర మెంతయున్న**
**దీనుడను నేను నీవయ్య దీనబంధు-**
**వనెడి బంధమిది మనల యంతరమును**
**తొలగ జేసియు నద్వైత మందజేయు ॥**

**---0---**

# 35వ శ్లోకము

**అవతారిక :-** అనాద్యనుస్యూతముగా జన్మజన్మాంతరములలో కూడ మాయా అవిద్యలచే నావరింపబడిన జీవుడు తన స్వస్వరూపజ్ఞానమును కోల్పోయి సంసార సముద్రములో మునిగి పోవుచున్నాడు. అట్టివారినుద్ధరించునది కేవలము భక్తి ప్రపత్తులతో కూడిన శరణాగతియేనను అంశమీశ్లోకములో ప్రస్తావింపబడుచున్నది.

శ్లో॥ సంకల్పేచ్ఛాద్యఖిలకరణప్రాణవాణ్యో వరేణ్యాః
సంపన్నా మే త్వదభినమనాజ్జన్మ చేదం శరణ్యమ్।
మన్యే చాస్తం జిగమిషు శనైః పుణ్యపాపద్వయం వా
భక్తిశ్రద్ధే తవచరణయోరన్యథా నో భవేతామ్ ॥

**అన్వయము:**(హేభగవన్) త్వదభినమనాత్ మే సంకల్పేచ్ఛాద్యఖిల కరణ ప్రాణవాణ్యః వరేణ్యాః సంపన్నాః । ఇదం జన్మ చ శరణ్యం (సంపన్నం) మన్యే. తత్ పుణ్యపాపద్వయం చ శనైః శనైః అస్తం జిగమిషుః భవతి. అన్యథా తవ చరణయోః భక్తి శ్రద్ధే నో భవేతామ్॥

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| హే భగవన్! | - ఓ ఆదిత్య భగవానుడా! |
| త్వదభినమనాత్ | - నీకు నమస్కరించి స్తుతించుటవలన |
| మే | - నా యొక్క |
| సంకల్పేచ్ఛాద్యఖిల కరణప్రాణవాణ్యః | - సంకల్పములు, కామనలు, ఆదిశబ్దముచే లోభమోహాదులు, సమస్తములైన ఇంద్రియ ప్రాణవాక్కులు(అన్నియు) |
| వరేణ్యాః సంపన్నాః | - శ్రేష్ఠములైనవి. |
| ఇదం జన్మ చ | - ఈ నా పుట్టుకకూడ |
| శరణ్యం సంపన్నం | - నన్ను (కర్మబంధములనుండి)రక్షించునదైనది |
| మన్యే | - తలంచుచున్నాను |
| తత్పుణ్యపాపద్వయంచ | - తద్వారా సంక్రమించిన పుణ్యపాపములు రెండును కూడ |
| శనైః శనైః | - నెమ్మదినెమ్మదిగా |
| అస్తం జిగమిషు | - అస్తమించుచున్నవి (అనగా నశించుచున్నవని భావము) |

అన్యథా - అట్లుకాకున్నచో
తవచరణయోః - నీ పాదములపై
భక్తిశ్రద్ధే - భక్తి శ్రద్ధలు
న భవేతామ్ - కలుగవు కదా!

**భావము:** ఓ సూర్యదేవా! నీకు నమస్కరించి స్తుతించుటవలన నా సంకల్పములు, కోరికలు, లోభమోహాదులు, ప్రాణేంద్రియాది సమస్తములైన కర్మోపకరణములు అన్నియు శ్రేష్ఠములుగా నెన్నదగినవి అయినవి. ఈనా పుట్టుక కూడ నా రక్షకమైనదని తలంచుచున్నాను. ఈ జన్మము ద్వారా సంక్రమించిన పుణ్యపాపములు రెండును నెమ్మది నెమ్మదిగా అస్తమించుచున్నవి. ఈ విధముగా జరుగనిచో నీపాదారవిందములపై భక్తి శ్రద్ధలు కలుగవు కదా!

**శ్రీపాదుక:**-భగవత్ స్తుతి నిష్ఫలము కాదు. తనను నిత్యము సేవించు భక్తుల యోగక్షేమములను తానే స్వయముగా నిర్వహిస్తాననేది భగవానుని ప్రతిజ్ఞ **"తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్" (గీ - 9/22) తేషామహం సముద్ధర్తా మృత్యుసంసార సాగరాత్** (గీ- 12/7)అన్నగీతావచనములను మనం పూర్వం విచారించుకున్నాం

**"న దేవా దణ్డమాదాయ రక్షన్తి పశుపాలవత్**
**యంతు రక్షితు మిచ్ఛన్తి బుద్ధ్యాసంయోజయన్తి తమ్ "** అనగా పశుపాలకుడు దణ్డధారియై సదా పశువుల వెంటనుండి వానిని సంరక్షిస్తున్నట్లుగా దేవతలు మనను సంరక్షించరట. వారెవరిని రక్షింపదలచుకుంటారో వారికి సకాలములో సద్బుద్ధి ననుగ్రహిస్తారు. వారికి బుద్ధి యోగాన్నను గ్రహిస్తారు. మన బుద్ధిలో భగవానుడు భాసించిన మరుక్షణముననే మన అంతఃకరణములు పవిత్రములై మన హృదయం భగవదావాసమవుతుంది. అతడు మనవాడౌతాడు. ఈ విషయాన్నాయనే **'భక్తాస్తేఽతీవమేప్రియాః,** (గీ- 12/20) **మయితే తేషుచాప్యహమ్** ' ఇత్యాది వాక్యాలలో వెల్లడిస్తాడు.

భగవానుని పొందాలనే అభిలాష లేదా సంకల్పముదయిస్తే చాలు ఆక్షణంలోనే వారి కర్మాచరణములన్నియు భగవత్పర తంత్రములై పరిశుద్ధములౌతాయి. శివుడే గురువై వారికి దీక్ష ననుగ్రహిస్తాడు. '**దీయతే శివ సాయుజ్యం క్షీయన్తే సర్వసంశయాః**" – సర్వసంశయములను నిర్మూలించి సాయుజ్యముక్తి ననుగ్రహిస్తుంది దీక్షయని చెప్పబడింది.

**యదా శివేஉభిలాషోవై జాయతే చనృణాం సదా**

**తదా శివాభిమానాస్తే జాయన్తే పరమాణవః ॥**

**ముక్తాస్తదైవ తే దీక్షాం ప్రాప్నువన్తి గురోస్తతః ॥** అని నందిశిఖా ప్రవచనం. ఈ ఫలితాన్నే సాంబుడు శ్లోకంలోని ప్రథమార్థంలో సూర్యునకు నమస్కరించిన మరుక్షణంలోనే తన అంతఃకరణము, ఇంద్రియములు వాని వ్యాపారములు అన్నియు "**వరేణ్యాః సంపన్నాః**" సుసంపన్నములైనవి, మరియు జన్మసార్థకమైనది "**జన్మచేదం శరణ్యమ్**" అని భగవానునికి విన్నవించు కొనినాడు. తన కర్మక్షయముకూడ తాను గుర్తించిన వైనాన్ని మూడవపాదంలో "**మన్యేచాస్తం జిగమిషుశనైః పుణ్యపాపద్వయం తత్** " అని సూచించినాడు. పుణ్యపాపములు రెండును మోక్షమునకు ప్రతిబంధకములే. వాని యనుభవమునకై జీవుడు మరల మరల జన్మిస్తూ ఉండాలి. పుణ్యము స్వర్ణ శృంఖల (బంగారుసంకెల), పాపము అయఃశృంఖల (ఇనుపసంకెల) రెండూ మనలను సంసారములో బంధించేవే. అవి అస్తమిస్తే తప్ప అనగా పూర్తిగా కర్మక్షయమైతే తప్ప ముక్తి లభించదని భావం. దానికి కారణం భక్తి శ్రద్ధలేనని నాలుగవ పాదములో అవి తనకు లభించినవనే విషయాన్ని తెలియజేస్తాడు.

ఈ విధంగా తనకు భగవదనుగ్రహం పూర్తిగా లభించినది. జ్ఞానప్రాప్తి తద్వారా సాయుజ్యముక్తి కూడా స్తుతిఫలముగా లభింపనున్నదనే విషయాన్ని సశాస్త్రీయంగా హేతుబద్ధంగా ప్రస్తావించినాడు సాంబుడని గ్రహించాలి. "**తస్యైవతు ప్రసాదేన భక్తి రుత్పద్యతే నృణామ్** " భగవానుని అనుగ్రహము చేతనే భక్తి కలుగుతుంది. "**తదైతత్ ప్రథమం చిహ్నం రుద్రే**

**భక్తిః సునిశ్చలా** " భగవానుని యందు నిశ్చలమైన భక్తి ఉదయించడమనేది ఆతని అనుగ్రహానికి మొదటి గుర్తు అని ప్రాజ్ఞుల ప్రవచనం.

మోక్షప్రాప్తికి కారణమైన పరిపూర్ణజ్ఞానము పూర్తిగా కర్మక్షయ మైనప్పుడే లభిస్తుంది. జ్ఞానప్రాప్తి సమయంలో సంచిత, ఆగామి కర్మలు స్వయంగా దగ్ధమై పోతాయి. ప్రారబ్ధకర్మల అనుభవం శరీరం ఉన్నంతవరకూ కొనసాగుతూనే ఉంటుంది. కావుననే సాంబుడు పుణ్యపాపకర్మలు రెండూ నెమ్మదినెమ్మదిగా అస్తంగతములౌతూ ఉన్నాయి. పూర్తిగా కాలేదని తలంచుచున్నాను. **'మన్యే చాస్తం జిగమిషు శనైః పుణ్యపాపద్వయం తత్త'**ని – చిద్భానునకు విన్నవించినాడని గ్రహించాలి. ఈ విధంగా ఈ శ్లోకంలో కవి తనకు సంప్రాప్తించిన చిద్భానుని అనుగ్రహానుభవాన్ని తెలియజేసినాడని గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥** **అతి భక్తితో నిన్ను నభినతినుతి జేయ**
**సంకల్ప మిచ్ఛాది సకలకరణ-**
**ప్రాణవాణ్యాదుల యక్షయ సంపద**
**దనర నా జన్మంబు ధన్యమయ్యె**
**శారీరకమ్ములై సంక్రమించిన యట్టి**
**పుణ్యపాపాదులు పూర్తిగాను**
**అస్తమించుచునున్న వట్లుగా కున్నచో**
**భక్తి శ్రద్ధలు నీదు పాదయుగళి**

**గీ॥** **నెట్లు కలుగును గతజన్మ నేమి జేసి**
**నాడ నోయిట్లు సాంబుని నాదుమదిని**
**ఆవహింపగ ప్రార్థించి యర్క నిన్ను**
**నద్వయుండనై జొచ్చెద నతని వోలె ॥ 35 ॥**

**---0---**

# 36వ శ్లోకము

**అవతారిక:-** లోకసంతారణ సామర్థ్యమును స్తుతిఫలముగా నను గ్రహింపుమని కవి, చిద్భానుని ప్రార్థించుచున్నాడు.

**శ్లో॥ సత్యం భూయో జననమరణే త్వత్ప్రపన్నేషు న స్తః**
**తత్రాప్యేకం తవ నుతిఫలం జన్మ యాచే తదిత్థం ।**
**త్రైలోక్యేశః శమ ఇవ పరః పుణ్యకాయోప్యయోనిః**
**సంసారాబ్ధౌ ప్లవ ఇవ జగత్తారణాయ స్థిరః స్యామ్॥**

**అన్వయము:-** త్వత్ప్రపన్నేషు జననమరణే భూయః న స్తః ఇతి యత్ తత్సత్యం. తత్రాపి తవ నుతిఫలం ఏకం జన్మ యాచే. తదిత్థం భవతు - అహం పరం త్రైలోక్యేశః పరః శమ ఇవ పుణ్యకాయః, అయోని రపి సన్ సంసారాబ్ధౌ జగత్తారణాయ స్థిరః ప్లవ ఇవ స్యామితి.

**ప్రతిపదార్థము:**

| | |
|---|---|
| హే భగవన్! | - ఓ షడ్గుణైశ్వర్య సంపన్నుడా! |
| త్వత్ప్రపన్నేషు | - నిన్నుశరణు జొచ్చినవారికి |
| జననమరణే | - జన్మమృత్యువులు |
| భూయః న స్తః | - మరలమరల సంప్రాప్తించవు |
| ఇతి యత్ | - అనువచనమేదికలదో |
| తత్ సత్యం | - అదినిజము |
| తత్రాపి | - అయినప్పటికిని |
| తవ నుతిఫలం | - నీకునేనొరించిన స్తుతికి ఫలితముగా |
| ఏకం జన్మ యాచే | - ఒక జన్మమును కోరుచున్నాను |
| తదిత్థం(భవతు) | - ఆ జన్మమిట్లుండవలెను |
| అహం | - నేను |
| త్రైలోక్యేశః | - ముల్లోకములకు ప్రభువుగా |
| పరః | - ఉత్కృష్టమైన |

| | |
|---|---|
| శమః | - ఇంద్రియ నిగ్రహము కలిగి శాన్తమూర్తిగా |
| పుణ్యకాయః | - పుణ్యశరీరముకలవాడుగా |
| అయోనిః అపి సన్ | - అనగా అయోనిజుడుగా నుండి |
| సంసారాబ్ధౌ | - సంసారసముద్రమునుండి |
| జగత్తారణాయ | - జగత్తును తరింపజేయు |
| స్థిరః ప్లవః ఇవ | - స్థిరమైన నావవలె |
| స్యామ్ | - కావలిసియున్నది |

(అనగా నిట్టి జన్మమునను(గ్రహింపుమని భావము)

**భావము:-** ఓ ఆదిత్య భగవానుడా! నిన్నాశ్రయించిన భక్తులు జన్మజరామరణముల నుండి విముక్తులౌదురనుమాట సత్యమైనది (కావున నేను ముక్తుడనే నని భావము) అయినప్పటికీ నేను చేసిన స్తుతికి ప్రతిఫలముగా నాకొక జన్మననుగ్రహింపవలసినదిగా వేడుచున్నాను. ఆ జన్మమున నేను ముల్లోకములకు ప్రభువుగా, సర్వశ్రేష్ఠునిగా, ప్రశమస్వరూపుడుగా, పుణ్యాత్ముడుగా, అయోనిజుడుగా (స్వేచ్ఛాజన్మమరణములు కలవాడుగా)నుండి సంసార సముద్ర నిర్మగ్నులైన ప్రాణులందరను తరింపచేయగల సుస్థిరమైన సుదృఢనౌకవలె నుండవలెను

**శ్రీపాదుక:-** ఇది సాంబుని యొక్క ఉదాత్త స్వభావమును తెలియజేయు గొప్ప శ్లోకము. ఇందు మొదటిపాదములో తన ఆరాధ్యదైవమైన చిద్భానుని కారుణ్యము వర్ణింపబడినది. అతనినాశ్రయించిన భక్తులకు జననమరణములుండవట. ఇది నిత్యమని ఘంటాపథముగా సిద్ధాంతీకరించినాడు సాంబుడు. జన్మమరణ రాహిత్యమే మోక్షము. అది పొందినట్టి ఆప్తకామునకు వేరొక కోర్కె యుండదు. అయినను స్తుతిఫలముగా మరల మరియొక జన్మననుగ్రహింపుమని రెండవపాదములో వేడుకొనుచున్నాడు. దీనిని బట్టి భగవానుడడుగకుండగనే అనుగ్రహించు మోక్షము కన్నను సాంబుడు కోరుకొనిన జన్మము ఆతని దృష్టిలో మహత్తరమైనదిగా దోచును. మూడవ పాదములో సాంబుడు తానాశించిన

జన్మమెట్లుండవలెనో ప్రతిపాదించినాడు. అతడు ముల్లోకములను శాసించువాడుగా నుండవలెనట. భూర్భువస్సువర్లోకములకు ముల్లోకములనెడి వ్యవహారము కలదు. సాధకుడు, నిర్మముడునైన సాంబుడు వానిపై ఆధిపత్యమును వాంఛింపడు. అది యాతని స్వభావమునకు విరుద్ధమైన కోరిక. కాగా అతడు జీవులు నిత్యమనుభవించు జాగ్రత్స్వప్న సుషుప్తులనెడి ప్రపంచత్రయాధిపత్యమును కోరియుండునని భావింపవలసియున్నది. తదుపరి కోరిన సర్వశ్రేష్ఠత్వ ప్రశాంతచిత్తత్వ, పుణ్యశీలత్వములు సర్వులకు వరేణ్యములే. అతడు వాంఛించిన అయోనిజత్వము స్వచ్ఛందజనిభావజన్యమైన పవిత్రతను వైరాగ్యమును సూచించును. యోనిజులైనవారికి సాంసారికము పారివారికములునైన మాతాపుత్రాది సంబంధములు సంభవించును. అయోనిజత్వము అతనికి పారివారిక (సం)బంధములపై గల విరక్తిని ధ్వనింపచేయుచున్నది. ఈ విధమైన విలక్షణమైన జన్మమునందిన తానేమి చేయదలచినదీ (నాలుగవ పాదమున) తెలియజేయుచున్నాడు. పరిశీలించినచో సాంబుని యొక్క ఈ కోరిక ద్వారా ఆతని చారిత్రికౌన్నత్యము వ్యక్తము కాగలదు.

1) **"సంసారాబ్ధౌ ప్లవ ఇవ జగత్తారణాయ స్థిరః స్యామ్ "** – అనగా సంసార సాగరమున పరిభ్రమించు జీవులనందరను తరింపజేయగల సుదృఢమైన ప్లవము (నావ)గా తానుండదలచినాడని భావము. భగవానుడు తననాశ్రయించిన భక్తులను మాత్రమే జన్మమృత్యుబంధములనుండి ముక్తులను గావించుచున్నాడు. కాని సాంబుడు సంసారాంబుధి నిర్మగ్నులైన ప్రాణులందరను తాను తారకనౌకగా నిలచి తరింపజేయ గోరుచున్నాడు. ఈ తలంపులో ఆతని దివ్యత్వముతో కూడిన ఉదాత్తత గోచరించును.

2) **"యస్మిన్ జీవతి జీవన్తి బహవః సతు జీవతు "** ఎవని జీవనముచే పలువురు సుఖశాంతులతో జీవించుచున్నారో అట్టివాడు శాశ్వతముగా జీవించుగాక! యను వచనమునకనుసరించి సాంబుని జీవితమే చరితార్థమైనది. అతడు చిరంజీవి యని చెప్పనొప్పును.

3) సాంబుని స్వభావ మత్యంతౌదార్య పరిపూర్ణమైనది. అతనికి స్తుతిఫలితముగా లభించు దివ్యానుగ్రహమును తానొక్కడే అనుభవింపదలంచలేదు. **"ఏకఃస్వాదు న భుంజీత"** అను సదాచారమును పాటించుచు, తనతోపాటు లోకములోని ప్రాణులందరు తరింపవలెనని యభిలషించిన నిస్వార్థమైన భావనకల మహితాత్ముడు. **"పరోపకారాయ సతాం విభూతయః"** సజ్జనుల చారిత్రక విభూతులు (సంపదలు) పరోపకారము కొరకే వినియోగపడుచున్నవనే సుభాషితమునకు సాంబుని యభిలాష ఉదాహరణముగా చెప్పదగినది.

4) ఆదర్శ ప్రాయమైన సజ్జనుల నడువడి సర్వభూతహితకామనతో నుండును. ' **లోకాః సమస్తాః సుఖినో భవన్తు** ' అనేది వారి ఆకాంక్ష. వారు సదా –

**"సర్వేన సుఖినఃసన్తు సర్వేసన్తు నిరామయాః**
**సర్వే భద్రాణి పశ్యన్తు మా కశ్చిత్ దుఃఖమాప్నుయాత్ ।**
**సర్వస్తరతు దుర్గాణి సర్వోభద్రాణి పశ్యతు**
**సర్వః కామానవాప్నోతు సర్వః సర్వత్ర నన్దతు "**

ఇత్యాదిగా, సర్వభూత దయగలవారై సర్వజనహితమును కోరుకుంటూ ఉంటారు. మరొక విశేషమంటే అందరికీ సుగతి అందరికీ మోక్షం కలగాలని వారాకాంక్షిస్తూ అందుకే అహర్నిశలు శ్రమిస్తూ ఉంటారు.

**దుర్జనః సజ్జనో భూయాత్ సజ్జనః శాన్తి మాప్నుయాత్**
**శాన్తోముచ్యేత బంధేభ్యః ముక్తశ్చాన్యాన్ విమోచయేత్ ॥**

లోకంలో దుర్మార్గుడనే వాడుండడానికి వీల్లేదు. అందరూ సజ్జనులు కావాలి. సజ్జనులందరికీ శాంతి లభించాలి. శాన్తులు సజ్జనులు వారందరూ ముక్తిని పొందాలి. ముక్తి లభించిన వారంతా ఇతరులను సంసారబంధముక్తులను చేయాలని వారి ఆకాంక్ష. ఇది వారి స్వభావమంటుంది మంత్రశాస్త్రం.

**"స్వం కర్తవ్యం కిమపి కలయన్ లోక ఏష ప్రయత్నాత్**
**నో పారార్థ్యం ప్రతి ఘటయతే కాంచన స్వప్రవృత్తిమ్ ।**
**యస్తు ధ్వస్తాఖిల భవమలో భైరవీ భావ పూర్ణః**
**కృత్యం తస్య స్ఫుటమిదమియల్లోక కర్తవ్య మాత్రమ్ ॥**

అనగా లౌకికులైన వారు ప్రయత్న పూర్వకంగా సత్కర్మలనాచరిస్తారు. అవి పరప్రయోజనం కోసం కాకుండా స్వప్రయోజనములనే సాధిస్తాయి. కాని సాధనలో పరిపూర్ణులై భైరవీభావము నందిన సాధకులు సమస్త సాంసారిక మల వినిర్ముక్తులై లోక సంగ్రహము కొరకై సర్వలోక హిత కార్యములనాచరిస్తారు. ఇసుమంతకూడా స్వార్థాపేక్షలేనివారు వారని భావం. ఆ కోవకు చెందిన సాధకాగ్రణి సాంబుడనే విషయాన్ని సాంబుని యొక్క యీ అభ్యర్థన తెలియజేస్తున్నది.

ఈ విధంగా ఈ శ్లోకములో సాంబుని యొక్క మహోన్నతమైన స్వభావము అభివ్యక్తమైనదని గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥** 'నీ పాదముల భక్తి నిరతము నర్చించు
జనులకు నుండదు జన్మమరణ
భయమను వచనము వమ్ము కాదైనను
నుతిఫలముగ జన్మ గతిని నేను
కోరుచు నుంటి నా కోరిక దీర్పగా
పుట్టింపవలె నన్ను పుణ్యకాయు
ననఘునయోనిజు నఖిల జగములకు
తారకంబగు భవతరణిగాను

**తే గీ॥** ఇట్లు నీదయ జన్మించి యిహమునందు
సర్వజనతార కుండనై సాధ్వసమును
బాపి జనహిత మొనరించి భానుమూర్తి !
లయము నందెద నీలోన భయమువీడి ॥

---0---

# 37 వ శ్లోకము

**అవతారిక :-** సూర్యభగవానుడు నిత్యము లోకములనుల్లసింప చేయుచున్నవాడై జగన్మిత్రుడై తన మిత్ర శబ్ద వాచ్యత్వమును చరితార్థము చేసికొనుచున్నాడని కీర్తింపబడుచున్నది.

**శ్లో॥ సౌషుమ్నేన త్వ మమృతపథేనైత్య శీతాంశుభావం**
**పుష్ణాస్యగ్రే సురనరపితౄన్ శాన్తభాభిః కలాభిః ।**
**పశ్చాదంభో విశసి వివిధాశ్చౌషధీస్తద్గతోఽపి**
**ప్రీణాస్యేవం త్రిభువనమతస్తే జగన్మిత్రతార్క! ॥**

**అన్వయము:** హే అర్క! త్వమ్ అమృతపథేన సౌషుమ్నేన శీతాంశు భావమేత్య, అగ్రే శాన్తభాభిః సురనరపితౄన్ పుష్ణాసి. పశ్చాత్ అంభః వివిధాః ఓషధీశ్చ విశసి ఏవం తద్గతః అపి త్రిభువనం ప్రీణాసి. అతః తే జగన్మిత్రతా (యుక్తియుక్తా - సమీచీనా ఏవేత్యర్థః )

**ప్రతిపదార్థము:**

హే అర్క! - ఓ సూర్యదేవా!
త్వం - నీవు
అమృతపథేన సౌషుమ్నేన- సుషుమ్నా నాడీ సంబంధి యగు అమృతమయ మార్గముతో
శీతాంశుభావం ఏత్య - చంద్ర భావమును పొందినవాడవై
అగ్రే - ముందుగా
శాన్తభాభిః - ప్రశాన్త కిరణములతో కూడిన
కళాభిః - కళలతో
సురనరపితౄన్ - దేవమనుష్యపితృగణములను
పుష్ణాసి - పోషించుచున్నావు
పశ్చాత్ - పిమ్మట

అంభః – జలములను
వివిధాః ఓషధీశ్చ – బహువిధములైన ఓషధులను
విశసి – ప్రవేశించుచున్నావు
ఏవం – ఈ విధముగా
తద్గతః అపి – వానిలో నంతర్లీనముగా ప్రకాశించుచు కూడ
త్రిభువనం ప్రీణాసి – ముల్లోకములను ఆనందపరచుచున్నావు.
అతః తే జగన్మిత్రతా – ఈ కారణముచే నీకు జగన్మిత్రత్వము
తద్వారా మిత్రనామ ధేయము చరితార్థమైనది.

**భావము:** ఓ సూర్యదేవా! నీవు ప్రప్రథమముగా అమృత మయమైన సుషుమ్నా మార్గమున ప్రయాణించుచు చంద్రభావమును అనగా శీతకిరణత్వమును పొంది, ఆ విధమైన చల్లని అమృత కిరణములతో కూడిన కళలతో దేవ మనుష్య పితృగణములను పరితృప్తులను గావించుచున్నావు. పిమ్మట జలతత్త్వమును పొంది నానావిధములైన ఓషధులలో ప్రవేశించినవాడవై ముల్లోకములను పోషించుచున్నావు. కావున మిత్రశబ్దవాచ్యుడవైన నీకు జగన్మిత్రత్వము సార్థకనామధేయమైనదని భావము.

**శ్రీపాదుక:-** ప్రథమపాదంలో చిదాదిత్యుడు అమృతనిష్యంది సుషుమ్నా మార్గమును ప్రవేశించి శీతకిరణుడై చంద్రత్వమునుపొంది, దేవ,మనుష్య,పితృసంతతులను పోషించుచున్నాడని వర్ణింపబడినది. యోగశాస్త్రపరంగా చంద్రభావమనగా ప్రాణాపాన వృత్తిత్వము. దేవ–మనుష్య–పితృ శబ్దములకు సాత్త్విక రాజసతామస వృత్తులు లేదా ప్రకృతులని అర్థమును వివక్షించి సమన్వయము గావించవచ్చును. ప్రాణాపానముల సంధియే చండకిరణములు శీతలకిరణములుగా ఉపశమనమును పొందుట. ఈ ప్రక్రియ వలన సాత్త్విక రాజస తామస తత్త్వములకు పుష్టికలిగి పరిపుష్టములైన వాని నుండి పంచ మహాభూతముల సృష్టి సంభవించుచున్నది.

మూడవ పాదములో సూచించబడిన అంభశ్శబ్దము పంచ భూతములకు ప్రతీక. **"వివిధాః ఓషధీః – తద్గతః – అపి "** అనే పదాలు **' పృథివ్యాఓషధయః – ఓషధీభ్యో౽న్నమ్ – అన్నాత్ పురుషః'** – అనే శృతి వాక్యములను ధ్వనింప చేస్తాయి. ఈ అభివ్యక్తి వలన ఆదిత్యుడు తన చండకిరణములచే జలమును గ్రహించి, తద్వారా ఓషధులను వానినుండి అన్నమును భూతజాతమును అనగా ప్రాణికోటిని పోషించుచున్నాడనే తాత్పర్యార్థమును సంభావించ వచ్చును. ఆ పక్షమున కూడ అతనికి జగన్మిత్ర నామధేయ చరితార్థ్యమును చెప్పవచ్చును.

సూర్యుని యొక్క జగన్మిత్రత్వోపపాదకమైన తత్త్వమును వైదిక పరిభాషలో కూడనిట్లు దర్శింప వచ్చును. మార్తాండుత్తరాయణమున ఊర్ధ్వముఖముగా విరాట్శరీరమునందలి సుషుమ్నా పథంలో చరిస్తూ అమృతమయమైన ఆ మార్గంలో శీతకిరణత్వము అనగా చంద్రభావమునంది దేవనరపితృ సంతతులకు పుష్టిని చేకూర్చుచున్నాడు. ఈ విషయమును పూర్వవ్యాఖ్యానములో వివరించుకున్నాం. అట్లే దక్షిణాయనములో అంభస్సులను ప్రవేశించి మరల శీతాంశుడై ఓషధులను ప్రవేశించి జీవులకు పుష్టిని సమకూర్చుచున్నాడు. ఈ విధమైన ప్రక్రియ వైశ్వదేవ యాగానుయాగక్రమముగా పేర్కొనబడినది. ఇట్లు సూర్యభగవానుడు త్రిజగత్పోషకుడై **'జగన్మిత్ర'** నామధేయముతో కీర్తింపబడినాడని భావము.

## అనువాద పద్యము

**సీ॥ సౌషుమ్న మైనట్టి సామృత పథమున**
**చంద్రత నందియు చారుగతిని**
**పరశాన్తకిరణాళి సురనర పితరుల**
**పోషించు చున్నావు పుష్టిగూర్చి**
**ఆపైన జొచ్చియు నంబుధి నటుపైన**
**అందున్న యోషధు లందునిండి**
**ముజ్జగంబులకీవు మోదము గూర్చుచు**
**నీ జగన్మిత్రత నిలుపుకొంటి**

**గీ॥ వర్క!యమరేశ!ఆదిత్య! అమరవంద్య!**
**అధిసుధాంధస గణపోష! ఆదిపురుష !**
**అఖిల జగముల కాధార మగుచునిట్లు**
**లోక మిత్రాఖ్యకైతివి యాకరంబు ॥**

---0---

## 38వ శ్లోకము

**అవతారిక :-**తమోగుణము లేదా అనాద్యవిద్యచే నావరింపబడిన తన బుద్ధిని వికసింపజేసి బ్రహ్మజ్ఞానబోధను చేయవలసినదిగా సాంబుడాదిత్యుని ఆలంకారిక భాషలో నభ్యర్థించుచున్నాడు.

**శ్లో॥ మందాక్రాన్తే తమసి భవతా నాథ! దోషావసానే**
**నాన్తర్లీనా మమ మతిరియం గాఢనిద్రాం జహాతి ।**
**తస్మాదస్తంగమిత తమసా పద్మినీవాత్మభాసా**
**సౌరీత్యేషా దినకర పరం నీయతామాశు బోధమ్ ॥**

**అన్వయం:** హే నాథ ! హే దినకర ! తమసి మన్దాక్రాన్తే దోషావసానే అన్తర్లీనా అపి ఇయం మమ మతిః గాఢనిద్రాం న జహాతి. తస్మాత్ భవతా అస్తంగమిత తమసా ఆత్మభాసా ఏషా (మమ మతిః) సౌరీ పద్మినీవ పరం బోధం ఆశు నీయతామ్.

**ప్రతిపదార్థము:**

| | |
|---|---|
| హే నాథ! దినకర! | – ప్రభూ దివసకరుడవైన సూర్యదేవా! |
| తమసి | – అజ్ఞాన స్వరూపమైన అంధకారము |
| మన్దాక్రాన్తే (సతి) | – నెమ్మది నెమ్మదిగా ఆవరించినది కాగా |
| దోషావసానే | – (రాత్రి గతించిన పిమ్మట) దోషములు (పూర్తిగా) నశించిన పిమ్మట |
| అన్తర్లీనా అపి | – అంతర్ముఖీనమైన అవస్థను పొందినప్పటికిని |

ఇయం మమ మతిః - ఈ నా యొక్క బుద్ధి
గాఢనిద్రాం న జహాతి - గాఢనిద్రను వీడకున్నది.
తస్మాత్ - అందువలన
భవతా - నీచే
అస్తంగమిత తమసా - అంధకారమునస్తమింపచేయగల
ఆత్మభాసా - స్వప్రకాశముచే
ఏషా - ఈ నా యొక్క బుద్ధి
సౌరీ పద్మినీ ఇవ- సూర్యపత్నియగు కమలిని వలె
పరం బోధం - ఉత్కృష్టమైన బ్రహ్మజ్ఞానబోధను
ఆశు నీయతామ్ - శీఘ్రముగా పొందింపవలసినది.

**భావము:-** ఓ ప్రభూ! చిద్భానుదేవా! దినకరా! అజ్ఞానాంధకారముచే ఆవరింపబడినప్పటికీ దోషావసానమున అన్తర్ముఖావస్థను పొందినప్పటికిని యీనా తామసబుద్ధి (మోహమనెడి) గాఢనిద్రను వీడుటలేదు. కావున నీవు తామసాంధకారమును పారద్రోలు సామర్థ్యముకల నీ చిత్ప్రకాశమును ప్రసరింపజేసి పద్మినివలె నీయందమిత భక్తిప్రపత్తులు కల నాబుద్ధిని శీఘ్రముగా బ్రహ్మజ్ఞానప్రబోధముచే వికసింపజేయువలసినదిగా ప్రార్థించుచున్నాడని భావము.

**శ్రీపాదుక:-** ఈ శ్లోకమున సాంబుడు తన బుద్ధి అజ్ఞానాంధకారముచేనావరింపబడి, దోషావసానమున అంతర్ముఖీనమైనప్పటికిని గాఢనిద్రను విడనాడలేదని, పూర్వార్థములో విన్నవించుకోవడం కనిపిస్తుంది. దీని అర్థాన్నిలా భావించాలి. చిద్భానుని అనుగ్రహం చేత తమోగుణం అంటే అవిద్య నశించి దోషావసానం తత్ఫలితం జ్ఞానోదయం కలిగి సమాధి సిద్ధించింది. అయినా దానినుండి మరల బాహ్యప్రపంచంలోకి వచ్చిన మరుక్షణంలోనే సంకల్పవికల్పాదు లుదయించి సాంసారిక ప్రవృత్తులలో పరిభ్రమించడం జరుగుతున్నది. కావున ఉత్తరార్థంలో నీ యందు నిత్యానురక్తయైన నీ కాత్మీయురాలు కావుననే సౌరి (సూరస్యస్త్రీ అని నీకాంత)

గా వ్యవహరింపబడుచున్న పద్మినిని అనుగ్రహించినట్లుగా తనకు కూడ ప్రబోధానుగ్రహము చేయగోరినాడు. దోషావసానము అనగా రాత్రి గతించి కమలిని గాఢనిద్రను వీడనిదై ముడుచుకొనియే ఉంటుంది. భానుడుదయించి తన ఆత్మీయ కిరణప్రసారము చే దానిని మేలుకొలిపి ప్రబోధానుగ్రహము చేయుచున్నాడు. ఇది అతని నిత్యకృత్యము. ఆత్మీయత. అవ్యాజమైన అనురాగము. ఆవిధముగనే అత్మభాసా వికాసమునను గ్రహించి తనకు కూడ ప్రబోధానుగ్రహము కల్పించవలసినదిగా ప్రార్థించుచున్నాడని భావము.

శ్లోకము మందాక్రాన్తా శబ్దముతో ప్రారంభింపబడడంలో ఒక చమత్కారం కనిపిస్తుంది. తన కృతి పూర్తిగా మందాక్రాన్తా వృత్తంలో కొనసాగించాడు సాంబకవి. మందాక్రాన్తావృత్త నిర్దేశమును ప్రారంభంలో వ్యక్తీకరించాడు. కృతి ప్రతిపాద్యము స్తుతి. స్తోత్రము శ్రవణసుభగమై వీనులవిందు చేస్తే దేవతానుగ్రహం శీఘ్రంగా ప్రాప్తిస్తుంది. కారణం ఆస్తుతిని, స్తుతికర్తను ఆత్మీయతతో అనుగ్రహిస్తాడు పరమాత్మ. తద్వారా సత్వరసిద్ధి లభిస్తుంది. ఈ విషయాన్ని చివరలో **“ ఆశు బోధం నీయతామ్ ”** అని ఆశు శబ్దప్రయోగం చే సూచిస్తాడు.

మన్దాక్రాన్తా శబ్దము తమస్సు అవిద్యాంధకారములకు విశేషణంగా కూడా వాడబడింది. **‘ మన్దం ఆక్రాన్తా’** నెమ్మది నెమ్మదిగా (దిన దిన క్షణ ప్రవర్ధమానమవుతూ పూర్తిగా నాక్రమించినది) **“మన్దే (మయి) ఆక్రాన్తా”** – మందుడనైన నాయందు పూర్తిగా నావరించినది, అని **మన్దేన (మయా) ఆక్రాన్తా** మందుడనైన నాచే (మరల మరల) ఆక్రమించబడుచున్న అని మూడురకాలుగా వ్యుత్పత్త్యర్థమును సంభావించవచ్చు. ఈ విధముగా శబ్దార్థాలంకార శోభితంగా ఆత్మీయతా భావమునుద్దీపింపచేస్తూ, నమ్రతతో తన మందబుద్ధికి అవిద్యావశమున మందగించుచున్న బుద్ధికి ఆత్మభాసా ప్రబోధానుగ్రహమును కలిగించుమని ప్రార్థించినట్లు గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥** నాథ!దివసకర! నన్ను తామసమిట్టు-
లజ్ఞాన మనగాను నావరించె
రాత్రిపోయిన కూడ రాగము నామతి
వీడకయున్నది గాఢనిద్ర
అరుణోదయాభాస నలరగ జేయుము
నీరేజబాంధవా! నిద్ర లేపి
చీకట్ల పోకార్చు చిన్మయభాసల
పద్మిని కైవడి పరమ బోధ
**గీ॥** శీఘ్రమొనరింప వేడెద చిత్తమునకు
ఆశుతోషద! మాసౌరి!యఘవినాశ
చిన్మయానంద!చిద్భాను!చిద్విలాస!
చిద్గగనచారి! చిత్తవిక్షేపశమన! ॥

---0---

## 39వ శ్లోకము

**అవతారిక:-** తనయుని దుష్కృత్యమునకతనిని శిక్షించి మరల దయార్ద్రచిత్తముతో నతనికి వాత్సల్యముతో సన్మార్గమును బోధించి చక్కదిద్దునట్టి తండ్రివలె తనను సంరక్షింపవలసినదని కవి చిద్భానుని వేడుకొనుచున్నాడు.

**శ్లో॥** యేన గ్రాసీకృతమివ జగత్ సర్వమాసీత్తదస్తం
ధ్వాన్తం నీత్వా పునరపి విభో! తద్దయాఘ్రాతచిత్తః ।
ధత్సే నక్తందివమివ గతీ శుక్లకృష్ణే విభజ్య
త్రాతా తస్మాద్ భవ పరిభవాద్దుష్కృతాద్దేవ! భానో! ॥

**అన్వయము:** హే విభో! యేన ధ్వాన్తేన సర్వం జగత్ గ్రాసీకృతం ఆసీత్, తద్ ధ్వాన్తం అస్తం నీత్వా, తద్దయాఘ్రాత చిత్తః శుక్లకృష్ణే గతీ విభజ్య పునరపి తద్ (అన్ధకారాత్మకం) నక్తం దివం ధత్సే. తస్మాత్ హేభానో! మే దుష్కృత పరిభవాత్ అపి త్రాతా భవ.

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| హే విభో! | – ఓ సర్వవ్యాపీ! సూర్యదేవా! |
| యేన ధ్వాన్తేన | – యే అజ్ఞానాంధకారముచే |
| సర్వం జగత్ | – సమస్త ప్రపంచము |
| గ్రాసీకృతం ఆసీత్ | – కబళింపబడినదో |
| తద్ ధ్వాన్తం | – ఆ అంధకారమును |
| అస్తం నీత్వా | – అస్తమింప (నశింప) జేసి |
| తద్దయాఽఽర్ద్రీకృతచిత్తః | – మరల దయార్ద్రహృదయుడవై |
| శుక్లకృష్ణే గతీ | – శుక్ల కృష్ణ గమనములుగా |
| విభజ్య | – విభాగము చేసి |
| పునరపి | – మరల |
| తద్ | – ఆ యంధకారమును |
| నక్తందివం | – రాత్రింబవళ్లుగా |
| ధత్సే | – ధరించుచున్నావు |
| తస్మాత్ | – అందువలన |
| హే భానో! | – ఓ చిద్భానుదేవా! |
| మేదుష్కృత | – నా యొక్క పాపము యొక్క |
| పరిభవే అపి | – క్లేశానుభవమున కూడ |
| త్రాతా భవ! | – రక్షకుడవుకమ్ము |

**భావము:-** సర్వవ్యాపకుడవైన హే చిదాదిత్యదేవా! అవిద్యాంధకారమీ ప్రపంచమునంతను నిత్యము కబళిస్తున్నది. దానిని (దయామయుడవైన నీవు) నశింపజేయుచున్నావు. మరల దాని విషయమున కూడ దయార్ద్రచిత్తుడవై శుక్లకృష్ణగతుల రూపమున విభాగము చేసి, రేయింబవళ్లతోడి దివసరూపమున దానికి పరిపుష్టిని సమకూర్చుచున్నావు. కావున ఓ చిద్భానుదేవా! నీ భక్తుడనైన, నావిషయమున కూడ దయకల వాడవై, (ఆత్మ సమాధిని పొందికూడ మరల భవపరిభవము చే దానినుండి

వేరు చేయు) పాపఫలానుభవక్లేశమును దూరము చేసి నాకు రక్షకుడవు కమ్ము. ( అనగా నన్ను నిత్య సమాధినిష్ఠునిగా చేసి రక్షింపుము అని భావము)

**శ్రీపాదుక:-** ఇది ఆదిత్యుని నిర్వ్యాజమైన నిస్సీమమైన కరుణను ప్రబోధించే మహోర్ధవంతమైన శ్లోకం. ఇందులో ఆదిత్యుడు విభువుగా సంబోధింపబడినాడు. విభువనగా ప్రపంచమందంతటా అణువణువునా వ్యాపించిన తత్త్వమని – **'సర్వమూర్తద్రవ్యసంయోగిత్వ'** మని శాస్త్రంలో నిర్వచింపబడింది. – అంధకారము కూడా అంతటా అలాగే వ్యాపించినట్లు కనిపిస్తుంది. అది అంతటా వ్యాపించి అంతనూ ఆవరించి కనబడకుండా చేస్తుంది. చిద్భానుప్రకాశం దాన్నికూడా కబళించి లోకాలను ప్రకాశింపచేస్తుంది. అది భక్షకమైతే ఇది రక్షకము. అందుకే **'త్రాతా భవ!'** – అని చివరగా ఆదిత్యభగవానుని అర్థించడం జరిగింది. రక్షించడానికి అతని దయాపూర్ణత్వమే కారణంగా స్తుతించబడింది. ఆ రక్షణలోకూడా తమశ్శిక్షణం మరల తదనుగ్రహం రెండుమూడు పాదాలలో వర్ణింపబడడం చిద్భానుని వాత్సల్యము లేదా నిర్వ్యాజమైన కరుణను సూచిస్తుంది. అవిద్యాధ్వాన్తమును అస్తమింప జేసి, మరల దానికి శుక్లకృష్ణ గతులను కల్పించి, అపారమైన దయతో జగద్రక్షణమును ఆదిత్యభగవానుడు చేస్తున్నాడని వర్ణించబడినది. ఇది కేవలము బాహిరమైన అర్థం. ఇక్కడ శుక్లకృష్ణగతులు, దినరాత్రులకు సంకేతాలుగా గ్రహించాలి. శుక్లకృష్ణ గమనములచే ప్రాణాపానగతి ప్రసార నిరోధముల సంకేతాన్నిలా సంభావించాలి. ఉచ్ఛ్వాసంలో ప్రాణశక్తి బయటనుండి లోపలికి ప్రవేశించేటప్పుడు ప్రాణకళలు శుక్లపక్షములోని చంద్రకళలవలె వృద్ధి పొందుతాయి. అలానే నిశ్వాస సమయంలో ప్రాణశక్తి లోనుండి వెలుపలికి నిర్గమించే సమయంలో ప్రాణకళలు కృష్ణపక్షములోని చంద్రకళల వలె క్రమక్రమంగా తగ్గుతాయి అని భావం.

జగత్తును కబళిస్తున్న అవిద్యాంధకారాన్ని అస్తమింప చేయడం ఒక విధమైన రక్షకత్వమైతే, దానిని మరల శుక్లకృష్ణ గతులుగా దినరాత్రి విభాగము

చేసి వాని ద్వారా భక్తులకు లేదా ఉపాసకులకు అనావృత్తి – ఆవృత్తి మార్గములను చూపి నిర్వ్యాజమైన కరుణతో వారిని సంరక్షించి, జగత్తుకు శాశ్వతమైన స్థితినుపకల్పించడ మాయన అసలైన రక్షకత్వముగా స్తుతించి, తద్వారా తనకనావృత్తి రూపమైన నిర్వ్యుత్థాన సమాధినను గ్రహించమని వేడడం సాంబుని జ్ఞానపరిణతికి పరాకాష్ఠయని చెప్పవచ్చును.

అవిద్యాంధకారమునస్తమింపజేసి దయామయుడవై దానికి కాలరూపంలో అహోరాత్రములు శుక్లకృష్ణ గతుల నేర్పరిచి జగత్తును రక్షించు చున్నావని మొదటి మూడుపాదములలో స్తుతించిన వైనము మహార్థ గంభీరమైనది. జగత్తును కబళించిన అంధకారము నస్తమింపజేయుట దుష్టశిక్షణము, భగవానుని యొక్క రక్షాదీక్షలో నొకభాగము. రక్షించుట అతని స్వభావము. ఈ రక్షణలో శిక్షితునిపట్ల వాత్సల్యము, వానికి ఉత్తమగతికల్పనము, భగవానుని అహేతుకమైన కృపను దర్శింప చేస్తుంది. ఈ నిర్వ్యాజమైన కృపాప్రదర్శనలోనే భగవానుని రక్షాదీక్షా ప్రాగల్భ్యమును వర్ణిస్తాడు కవి. జగత్తును కబళించిన అవిద్యాంధకార స్వభావమునస్తమింపజేసి దానికి శుక్లకృష్ణగతులను తద్వారా కాలస్వరూపములో తనదైన దివ్యత్వముననుగ్రహించి, దానిచేతనే మరల ప్రాణులకు అనావృత్తి ఆవృత్తి రూపములలో రాకపోకలను వ్యవస్థీకరించి, మిథ్యాభూతమైన జగత్తునకు వ్యావహారికముగా శాశ్వతత్వమును కల్పించుట ఆదిత్యభగవానుని అఘటనఘటనా పటీయస్త్వమునకు నిదర్శనము. ఆవిషయాన్ని సంగ్రహంగా సమీక్షించుకుందాం. వ్యావహారికంగా జగత్తున్నంతవరకు ప్రాణులకు శుక్లకృష్ణగతులతోడి రాకపోకలు అనావృత్త్యావృత్తి రూపములుగా సంప్రాప్తిస్తూనే ఉంటాయి.

**శ్లో॥ శుక్లకృష్ణే గతీ హ్యేతే జగతః శాశ్వతే మతే**
**ఏకయా యాత్యనావృత్తిం అన్యయా వర్తతే పునః ॥**

**(గీ8–26)** అని గీతాస్మృతి. అసలీ శుక్లకృష్ణ గమనముల తత్త్వమేమిటో భగవానుడు స్వయంగా నిర్దేశిస్తాడు. తనయొక్క నిర్గుణమైన పరతత్త్వాన్ని

ఉపాసించే భక్తులు జ్ఞానులు. వారి ఉపాసనామార్గం జ్ఞానమార్గం. దానికే శుక్లగతి యని, దేవయానమని అర్చిరాదిమార్గమనీ నామాంతరాలు శాస్త్రంలో చెప్పబడినాయి. ఈ మార్గంలో ప్రయాణించే భక్తులు నేరుగా పునరావృత్తి రహితమైన నా ధామాన్ని చేరుకుని నాలోనే లయిస్తారు. వారు మరల తిరిగిరారు.

**"అగ్నిర్జ్యోతి రహః శుక్లః షణ్మాసా ఉత్తరాయనమ్ ।**

**తత్ర ప్రయాతా గచ్ఛన్తి బ్రహ్మ బ్రహ్మవిదో జనాః॥(గీ 8/24)** అగ్ని యనేది ఆదిత్యుని రూపాన్తరమే. 'ఆదిత్యోవా ఏషయదగ్నిః' – అని శ్రుతి. జ్యోతిష్షాతని ప్రకాశము. అహస్సు అనగా పగలు లేదా దినము ఆతని కృత్యము అతడూర్ధ్వముఖముగా ప్రయాణించు ఆరుమాసముల ప్రయాణకాలము ఉత్తరాయణము. ఈ పరిజ్ఞానముతో ఆదిత్యోపాసనచేసే నిర్గుణోపాసకులు చిద్భానుని యనుగ్రహము చేత అర్చిరాది మార్గంలో శుక్లగతితో పరబ్రహ్మరూపమైన చిదాదిత్యునిలో శాశ్వతంగా లయిస్తారని భావం.

ఇలానే కర్మకాణ్డనాశ్రయించి సగుణోపాసన చేసే యోగనిష్ఠులు ధూమాదిమార్గం గుండా చంద్రలోకానికి అక్కడ కర్మ ఫలానుభవమైన పిమ్మట ద్యు, పర్జన్య, పృథివీ, పురుష యోషిత్తులనే పంచాగ్నుల ద్వారా కర్మభూమియైన భూలోకానికి వస్తాడు అని గీతాస్మృతి –

**'ధూమో రాత్రి స్తథా కృష్ణో – షణ్మాసా దక్షిణాయనమ్ ।**

**తత్ర చాంద్రమసం జ్యోతి – ర్యోగీ ప్రాప్య నివర్తతే ॥(గీ–8.25)** – అని ప్రవచించినది. ఈ విధముగా చిద్భానుడే శుక్లకృష్ణగతులను కల్పించి, ఉపాసకులకు కర్మానుగుణఫలితములననుగ్రహిస్తున్నాడని సాంబుని యన్తరంగం. కర్మయోగులకు పునరావృత్తిని కల్పించినా వారు మరుజన్మమునందు తమ యోగాభ్యాసమును కొనసాగించుటకు అవకాశమును కూడా ఆయనే అనుగ్రహిస్తాడు.

ఇట్టి దయామయుడు కావున చివరిపాదంలో **"దుష్కృతాత్ పరిభవాత్ త్రాతాభవ"** అనగా నా యొక్క పాపఫలమైన అజ్ఞానము, అనగా ఆత్మన్యవస్థితి

అనగా ఆత్మారామ సమాధిస్థితి నుండి విడివడి యుండుట- అను క్లేశమును బ్రహ్మజ్ఞానానుభవప్రదానానుగ్రహము చే నశింపజేసి రక్షకుడవు కమ్మని ప్రార్థించినాడు.

## అనువాద పద్యము

**సీ॥ జగముల కబళించు జాలంపు చీకటి**
**నంత మొందించియు నర్క! దయను**
**ఉదయించి దివసము నూర్జిత ప్రభలతో**
**శుక్లకృష్ణములుగా సూర్యదేవ!**
**ఱేయింబవళ్లను రీతిని విభజించి**
**ధరియించు చుంటివో తరణి! నీవు**
**నన్నును కబళించు నావగు దురితమ్ము**
**లంతము జేయుమో యార్తిహారి!**

**తే గీ॥ రక్షకుడవయి నీవు సంరక్ష జేయ**
**దిక్కు నీవేనని దలచు దీను గాంచి**
**అద్వయత నాకు 'నీవెనే' ననెడి బోధ**
**జేయ రావయ్య చిద్భాను! చిత్తవాసి! ॥**

---0---

## 40వ శ్లోకము

**అవతారిక:**-అవిద్యా దుఃఖములచే బహువిధక్లేశముల ననుభవించుచు, మిథ్యాజ్ఞానము చేనావరింపబడి సంసార జంబాలములో కన్నుగానక కొట్టుమిట్టాడు జీవులకు కరుణామయుడవైన నీవే రక్షకుడవు కావలసియున్నదని సూర్యభగవానుడు అభ్యర్థించబడుచున్నాడు.

**శ్లో॥ ఆసంసారోపచిత సదసత్ కర్మబంధాశ్రితానాం**
**ఆధివ్యాధిప్రజనమరణక్షుత్పిపాసార్దితానాం ।**
**మిథ్యాజ్ఞానప్రబలతమసా నాథ చాన్ధీకృతానాం**
**త్వం న స్త్రాతా భవ కరుణయా యత్ర యత్ర స్థితానామ్ ॥**

**అన్వయము:-**హే నాథ! ఆసంసారోపచిత సదసత్కర్మబంధాశ్రితానాం ఆధివ్యాధి ప్రజనమరణ క్షుత్పిపాసార్దితానాం, మిథ్యాజ్ఞాన ప్రబలతమసా అంధీకృతానాం, చ యత్ర తత్ర స్థితానాం నః త్వం కరుణయా త్రాతా భవ!

**ప్రతిపదార్థము :**

| | |
|---|---|
| హే నాథ! | – ఓ ప్రభూ |
| ఆ సంసారోపచిత | – అనాదికాలమునుండి కూడబెట్టబడిన |
| సదసత్కర్మబంధాశ్రితానాం | – పుణ్యపాపకర్మబందముల నాశ్రయించిన వారము |
| ఆధివ్యాధిప్రజనమరణక్షుత్పిపాసార్దితానాం | – శారీరకమానసిక వ్యధలచేతను జన్మమరణముల చేతను ఆకలిదప్పికల చేతను నిరంతరము పీడింపబడుచున్నవారము |
| మిథ్యాజ్ఞానప్రబలతమసా | – అన్యధాజ్ఞానరూప భ్రాంతులనే దట్టమైన చీకటిచే |
| అంధీకృతానాం | – కన్నుగానని వారుగా చేయబడినవారమై |
| చ యత్రతత్రస్థితానాం | – కావుననే ఎక్కడికక్కడే నిలచిపోయిన |
| నః | – మాకు |
| త్వం | – నీవు |
| కరుణయా | – దయతో |
| త్రాతా భవ | – రక్షకుడవు కమ్ము. |

**భావము:-** హే ప్రభూ! ఆశ్రితులమగు మేము అనాదిగా (జన్మ జన్మాంతరముల నుండి) సంపాదించుకొనిన పుణ్యపాపములనే కర్మలచే బంధింపబడి, వాని ఫలితములుగా శారీరక మానసిక క్లేశములను, చావు పుట్టుకలు, ఆకలిదప్పులు మొదలగు బాధలననుభవించు చున్నాము. ఇంకను మిథ్యాజ్ఞానము లేదా భ్రాంతి మూలకమైన అజ్ఞానముచే అంధులము అనగా కన్నుగానని వారమై, ముందుకు సాగలేక ఎక్కడికక్కడే నిలచిపోవుచున్నాము. అటువంటి మాకు దయామయుడవైన నీవే రక్షకుడవు కావలసి యున్నది. నీవు తప్ప వేరొక దిక్కులేదని భావము.

**శ్రీపాదుక:-** ఆర్తుడు, జిజ్ఞాసువు, ప్రయోజనమును కోరువాడు, జ్ఞాని యనెడి నాలుగు విధములైన జనులు తననాశ్రయించు చుందురని భగవద్వచనము.  వానిలో మొదటితరగతికి చెందిన ఆర్తుల లక్షణము ఈ శ్లోకమున నిర్దేశింపబడినది.

## అనువాద పద్యము

**సీ॥** సంచిత ప్రారబ్ధ సదసత్తు లౌకర్మ
బంధములను బడ్డ బాలిశులము
ఆధివ్యాధుల,జన్మ మరణము లాకలి-
దప్పుల వెతలను దవిలి, మరియు
నధ్యాస చేనైన యాంధ్యమ్ముతో మేము
తెన్ను గానగ లేక తిరముగాను
నిలచి పోయితి మయ్య నీవె మాకిల దిక్కు
నీవె రక్షకుడవు నీవె శరణ-

**తే గీ॥** మనుచు వేడెడి మా మొర లాలకించి
మమ్ము రక్షింప రావయ్య మహిత తేజ!
సాంబ సంపూజ్య! మా కర్మసాక్షి! మమ్ము
దీనులను రక్ష జేయుమో దీనబంధు ! ॥

---0---

## 41వ శ్లోకము

**అవతారిక:-** తన తప్పిదములను, అసమర్థతను తెలిసికొనిన పుత్రుడు తనను రక్షింపుమని తండ్రిని కోరుటకు సంశయించుచు తడబడుచు, సిగ్గుపడుచు సమీపిస్తాడు. ఆ విధమైన ప్రపత్తి యీ శ్లోకమున ప్రదర్శింపబడుచున్నది.

**శ్లో॥ సత్యాసత్యస్ఖలితవచసాం శౌచలజ్జోజ్ఝితానాం**
**అజ్ఞానానామఫలసఫల ప్రార్థనాకాతరాణాం ।**
**సర్వావస్థాస్వఖిల విషయాభ్యస్తకౌతూహలానాం**
**త్వం న స్త్రాతా భవ పితృతయా భోగలోలార్భకాణామ్ ॥**

**అన్వయము :-** సత్యాసత్యస్ఖలితవచసాం శౌచలజ్జోజ్ఝితానాం అజ్ఞానానాం, అఫలసఫల ప్రార్థనా కాతరాణాం, సర్వావస్థాసు అఖిలవిషయాభ్యస్త కౌతూహలానాం, భోగలోలార్భకాణాం నః త్వం పితృతయా త్రాతాభవ.

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| హే భగవన్ | – ఓ భగవత్స్వరూపా! |
| సత్యాసత్యస్ఖలితవచసాం | – సత్యానృతముల యథార్థతత్త్వమును తెలియకపోవుటచే తడబడుచు మాట్లాడువారము |
| శౌచలజ్జోజ్ఝితానాం | – (శారీరక మానసిక) బాహ్యాభ్యంతర పరిశుద్ధివిషయమున సిగ్గువిడచి ప్రవర్తించువారము |
| అజ్ఞానానాం | – అజ్ఞానముచే నావరింపబడినవారము |
| అఫలసఫలప్రార్థనాకాతరాణామ్ | – ప్రార్థనాసాఫల్యవిషయమున ఫలించునో లేదో యను బెరకు లేదా భీతి కలవారము |
| సర్వావస్థాసు | – జాగ్రదాద్యవస్థలన్నిటియందును |
| అఖిలవిషయాభ్యస్తకౌతూహలానామ్ | – సమస్త విషయ వాంఛలను పొందుట కాసక్తి కలవారము |
| భోగలోలార్భకానాం | – విషయభోగములననుభవించు చలచిత్తము కల బాలురవంటి వారము అగు |
| నః | – మాకు |
| త్వం | – నీవు |

పితృతయా – పితృభావము (వాత్సల్యము)తో

త్రాతా భవ – రక్షకుడవు కమ్ము

**భావము:** ఓ సూర్యభగవానుడా, నిత్యము సత్యాసత్య ప్రలపనముల కలవాటు పడినందున మామాటలు తడబడుచున్నవి. బాహ్యాంతరశౌచప్రక్రియల నెఱుగని వారమగుటచే నెదుట పడుటకే సిగ్గుపడుచున్నాము. మరియు ప్రార్థన సఫలమగునో లేక వ్యర్థమగునో అనగా నీవు మా యెడ ప్రసన్నుడవగుదువో లేదో యను భయము కలుగుచున్నది. ఇంకను మేము సర్వకాల సర్వావస్థల యందును విషయోపభోగములకై వెంపర్లాడువారము ఈ విధముగ మేము నిరంతర భోగలాలసులమైన అర్భకులము. అయినను నీవు మమ్ము తండ్రివలె సంరక్షింపవలసినదిగా వేడుచున్నాము.

**శ్రీపాదుక:-** ఈ శ్లోకమున సాంబుడు ఆదిత్యుని తండ్రిగా భావించి '**త్వం న స్త్రాతా భవ పితృతయా**' అని రక్షణ నభ్యర్థించినాడు.

**"జనితా చోపనేతా చ యశ్చ విద్యాం ప్రయచ్ఛతి।**
**అన్నదాతా భయత్రాతా పంచైతే పితరః స్మృతాః ।"**

అను ప్రవచనములో చెప్పబడిన పంచపితరుల లక్షణములు ఆదిత్యునిలో కానవచ్చును. **'ఆదిత్యో వా ఏష యదగ్నిః'** అని శ్రుతివచనము. బృహదారణ్యకోపనిషత్తులోని ప్రథమాధ్యాయములోని ద్వితీయ బ్రాహ్మణములో ఆదిత్యాగ్నులు సరూపులుగా సంభావింపబడినారు. ఋగ్వేదంలోని అగ్నిసూక్తములో 9వ మంత్రము **'స నః పితేవ సూనవే అగ్నే! సోపాయనో భవ!'** ఆదిత్యాపరపర్యాయుడైన అగ్నిభట్టారకుతండ్రితోనుపమించబడినాడు. ఈ సంప్రదాయము ననుసరించియే సాంబుడు కూడ చిదాదిత్యుని తండ్రిగా భావించి కరుణార్ద్రహృదయుడైన అతనిని రక్షింపవేడినాడని గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥ సత్యమనృతమును సరిగను తెలియమి**
**తడబడు మాటల తడుముకొనుచు**
**అంతరబాహిర మగుశుద్ధి తెలియక**
**లజ్జను విడనాడి లంపటముల**
**నజ్ఞానవశమున న సఫల ప్రార్థనా**
**భయముచే భీతిలి నియతి మీరి**
**సర్వస్థితుల యందు సర్వవిషయముల**
**వర్తిలు చుందుము వాంఛతోడ**

**గీ॥ భోగలాల సులము మేము భోగులమని**
**యర్భకుల మని యవమతులని దలంచి**
**తండ్రి వలెగని మమ్ము వాత్సల్యమునను**
**రక్ష జేయుము కారుణ్య వీక్షణముల ॥**

---0---

## 42వ శ్లోకము

**అవతారిక:-** మృత్యువేక్షణములోనైనను కబళింపవచ్చును కావున అది మమ్ములను కబళింపక పూర్వమే ఓ దయామయా దీనబంధూ! మమ్ము దయజూపి రక్షింపవలసినదని ప్రార్థించుచున్నాడు.

**శ్లో॥ యావద్దేహం జరయతి జరా నాన్తకాదేత్య దూతీ**
**నోవా భీమస్త్రిఫణ భుజగాకార దుర్వారపాశః ।**
**గాఢం కంఠే గ్రసతి సహసా జీవితం లేలిహానః**
**తావద్భక్తాభయద! సదయం శ్రేయసే నః ప్రసీద ॥**

**అన్వయము:** హే భక్తాభయద! యావత్ అన్తకాత్ దూతీ జరా ఏత్య మమ దేహం న జరయతి, యావత్ చ భీమః త్రిఫణభుజగాకార దుర్వారపాశః (మమ) జీవితం లేలిహానః సన్ కంఠే సహసా గాఢం న గ్రసతి, తావదేవ నః శ్రేయసే సదయం నః ప్రసీద

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| హే భక్తాభయద! | – భక్తులకు అభయము నిచ్చు సూర్యదేవా! |
| యావత్ | – ఎంతలో |
| అన్తకాత్ | – యముని నుండి |
| దూతీ జరా | – దూతికయైన వార్ధకము |
| ఏత్య | – వచ్చి |
| మమ దేహం | – నా శరీరమును |
| న జరయతి | – ముదిమిపాలు జేయదో |
| చ యావత్ | – మరియు నెంతలో |
| భీమః | – భయంకరమైన |
| త్రిఫణభుజగాకారదుర్వారపాశః | – మూడుపడగలపామునుబోలినదియు వారింపశక్యముకానిదియునగు అతని మృత్యుపాశము. |
| మమ జీవితం | – నా జీవితమును |
| లేలిహానః (సన్) | – ఆస్వాదించుచున్నదై |
| కంఠే | – మెడయందు |
| సహసా గాఢం న గ్రసతి | – ఒక్కసారిగా (హఠాత్తుగా) ప్రగాఢముగా చుట్టుకొనబడదో |
| తావదేవ | – అంతలోనే |
| నః శ్రేయసే | – మా కల్యాణము లేదా హితము కొరకు |
| సదయం | – కరుణతో |
| ప్రసీద | – అనుగ్రహింపుము |

**భావము:** భక్తులకభయమిచ్చు స్వభావము కల ఓ చిద్భానుదేవా! యమదూతియగు జరాదేవి వార్ధకముగా నా శరీరమును జర్జరితముగావింపకమునుపే, మరియు దుర్నివారమగు ఆతని యొక్క

త్రిఫణామండల ఫణిరాజువలె శోభిల్లు మృత్యుపాశము నా జీవితము నాస్వాదించుటకై మెడకు హఠాత్తుగా తగులుకొనక మునుపే, నీవు మా శ్రేయస్సుకొరకై దయజూపి మా యెడ ప్రసన్నుడవు కమ్ము అని భావము.

**శ్రీపాదుక:** అన్తకాలము సమీపింపకమునుపే మాకు శ్రేయోరూపమైన ముక్తిననుగ్రహింప వలసినదని సాంబుడు చిద్భానునీశ్లోకములో వేడుకొనినాడు. నాలుగవ పాదములో "భక్తాభయద సదయం నః శ్రేయసే ప్రసీద' భక్తులకభయము నిచ్చువాడా! దయతో మాకు శ్రేయము నొసగుటకై ప్రసన్నుడవు కమ్మ' – అని భావము. ఇచట భక్తాభయద! అను సంబోధనము సాభిప్రాయముగా చూపట్టును. ఎందులకనగా (సూర్య)నారాయణుడే పూర్వము బాహువును పైకెత్తి ప్రతిజ్ఞాపూర్వకముగా భక్తులకు –

**" సత్యం బ్రవీమి మనుజాః స్వయమూర్ధ్వబాహుః**
**యోమాం నృసింహ! ముకున్ద! జనార్దనేతి ।**
**జీవన్ జపత్యనుదినం మరణే ఋణీవ**
**పాషాణకాష్ఠసదృశాయ దదామి ముక్తిమ్ ॥"**

అనగా "ఓ భక్తమానవులారా ! బాహువును పైకెత్తి మరీ ఒక సత్యమును చెప్పుచున్నాను. ఆరోగ్యముగా జీవించుకాలములో నెవడు ప్రతిదినము నన్ను నృసింహా! ముకుందా! జనార్దనా! అని నామజప పురస్సరముగా కీర్తించుచున్నాడో మరణకాల మాసన్నమై శరీరము పాషాణమువలె కొయ్యబారి నిశ్చేతనమై పడి యున్నప్పుడు నేనాతనికి ఋణపడినవాడువలె వచ్చి మోక్షము నను గ్రహించెదను" అని అభయప్రదానము చేసియున్నాడు.

**"భక్తాభయద!"** అని సంబోధించి సాంబుడాతనికి పూర్వము తాను భక్తులకిచ్చిన ప్రతిజ్ఞారూపమైన అభయ ప్రదానమును గుర్తుచేసెనని సంభావింపవచ్చును.

## అనువాద పద్యము

**సీ॥** యమునిచే దూతిగా నంపబడిన యట్టి
జరవచ్చి తనువును జర్జరితము
గావించు లోపల ఘనతరంబగు మూడు
పడగల పామన పాశమొచ్చి
మెడకు దుర్వారమై మెండుగా జుట్టియు
పట్టిలాగుచు నుండి గట్టిగాను
జిహ్వాలసాచుచు జీవమాస్వాదింప
వారింప నద్దాని వరద! నీవు

**తే గీ॥** చిన్న భస్థుడ వయివెల్గి చీరి దాని
నన్ను రక్షింప వేడెద నాథ! నిన్ను
భక్త మందార! భవహారి ! భక్తిగమ్య
ఆపదుద్ధార! శరణాగతార్తి హారి! ॥ 42 ॥

---0---

# 43వ శ్లోకము

**అవతారిక:-** మృత్యువు వెన్నంటి తరుము చుండగా భయముచే దిక్కుతోచక పరుగిడుచున్న భక్తులను రక్షింపుమని భానుని కవి ప్రార్థించుచున్నాడు.

**శ్లో॥** విశ్వప్రాణగ్రసనరసనాటోపకోపప్రగల్భం
మృత్యోర్వక్త్రం దహననయనోద్దామదంష్ట్రాకరాళం ।
యావద్దృష్ట్వా వ్రజతి న భియా పఞ్చతామేష కాయః
తావన్నిత్యామృతమయ రవే! పాహి నః కాన్దిశీకాన్ ॥

**అన్వయము:** హే నిత్య! అమృతమయ! రవే! విశ్వప్రాణగ్రసన రసనాటోప కోపప్రగల్భం - దహననయనోద్దామ దంష్ట్రాకరాళం మృత్యోః వక్త్రం దృష్ట్వా, ఏషః కాయః యావత్ భియా పంచతాం న వ్రజతి, తావదేవ కాన్దిశీకాన్ నః పాహి॥

**ప్రతిపదార్థము:**

హే నిత్య! అమృతమయ! రవే! - శాశ్వతుడవు అమృత స్వరూపుడవు అగు సూర్యదేవా!

విశ్వప్రాణగ్రసన రసనాటోపకోప - ప్రపంచములోని ప్రాణులను కబళించునట్టి- కోపముచే నాలుకను ప్రసరింపచేయుచున్న

ప్రగల్భం - ప్రాగల్భ్యము (పరాక్రమము) కలదియు

దహన నయనోద్దామ - దహింపజేయునట్టి కన్నులనుండి ఊర్ధ్వముఖముగా ప్రజ్వరిల్లుచున్న

దంష్ట్రాకరాళం - కోరలచే భయంకరమైన

మృత్యోః - మృత్యుదేవతయొక్క

వక్త్రం దృష్ట్వా - ముఖమును చూచి

ఏష కాయః - ఈ శరీరము

యావత్ - ఎంతలో

భియా - భయముచే

పంచతాం న వ్రజేత - పంచత్వమును అనగా మరణమును పొందదో

తావత్ ఏవ - అంతలోనే (అంతకుపూర్వమే)

కాందిశీకాన్ - (మృత్యుభయముచే దిక్కుతోచక) పరుగిడుచున్న

నః పాహి - మమ్ము సంరక్షింపుము

**భావము:-** శాశ్వతుడవు, అమృత స్వరూపుడవునగు చిద్భాను దేవా! ప్రపంచములోని ప్రాణులను కబళించుటకై కోపము చే నాలుకలను ప్రసరింప చేయునదియును, ప్రజ్వరిల్లుచున్న నేత్రములచే ఊర్ధ్వముఖీనముగా ప్రకాశించుచున్న కోరలచే భయంకరమైన మృత్యుముఖమును చూచిన వెంటనే

భయమునందిన ఈ శరీరము మరణమును పొందుటకు పూర్వమే అమృతస్వరూపుడవైన నీవు మృత్యుభయముచే దిక్కుతోచక పరుగులిడు మమ్ము రక్షింపుమని భావము.

**శ్రీపాదుక:-** మృత్యువు పై బడుచున్నప్పుడు సాధకుని కర్తవ్యమును ఈ శ్లోకమున ప్రబోధించుచున్నట్లు గ్రహించాలి.

**" తావద్భయస్య భేతవ్యం యావద్భయమనాగతమ్**
**ఆగతం తు భయం వీక్ష్య నరః కుర్యాద్యథోచితమ్॥ " –**

అని నీతి శాస్త్రము. భయము పై బడనంతవరకు మాత్రమే భయమును గూర్చి భయపడవలెను. తీరా అది పై బడునపుడు యథోచితముగా దానిని బాపుకొను ప్రయత్నమును చేయవలెను అనిభావము.

మృత్యువు సమీపించి నట్లు గుర్తించిన సాంబుడు పూర్వ శ్లోకములో చిద్భానుని అభయ ప్రదానమును స్మరించి, సంస్తుతించి ఈ శ్లోకమున నిత్యామృతమయ స్వరూపుడైన చిద్భానుని రక్షణకై యభ్యర్థించి నాడని గ్రహించాలి.

'నిత్యామృతమయరవే!' అనే సంబోధన సాభిప్రాయమైనది. అన్యదేవతలు అమృతత్వసిద్ధిననుగ్రహిస్తారు. అమృతత్వమనగ మరణధర్మము లేనిదని భావము. దానిననుగ్రహించు దేవతలుకూడ కల్పాంతమున లయమును పొందువారే. కాని పరబ్రహ్మస్వరూపుడైన చిద్భానుడుమాత్రము నిత్యామృతమయ రసస్వరూపుడు. అతని సాయుజ్యము నందినవారు అనావృత్తి రూపమగు అనగా పునరావృత్తి లేని మోక్షమును పొంది శాశ్వతానందమునను భవింతురని భావము.

**" యే యథా మాం ప్రపద్యన్తే తాం స్తథైవ భజామ్యహమ్"(గీ.4-11)** ఎవరే భావనతో నన్నెలా పొందుతారో వారి నావిధంగా నేనను గ్రహిస్తానని భగవద్వచనం. సాంబుడీ శ్లోకంలో ఆ (సూర్య) నారాయణుని **అమృతమయ! రవే!** అని అభినుతించి ఆశ్రయించినాడు. అమృతమయుడు కావుననే రవి మాత్రమే అమృతత్వసిద్ధి నను గ్రహింపగలడు. అక్ష్యుపనిషత్తు 3వ మంత్రంలో

'అసతో మా సద్గమయ - తమసో మా జ్యోతిర్గమయ

మృత్యోర్మా అమృతం గమయ" అని ఆదిత్యుని ప్రార్థించింది. మృత్యుధర్మము కల మనలకు శాశ్వతమైన అమృతత్వమునను గ్రహించువాడు రవి చిద్భానుడు మాత్రమే నని శ్రుతివచన తాత్పర్యమిచట ప్రబోధింపబడినదని గ్రహించాలి. అటులే ఆశ్రయించి తరించాలని ప్రభోదించినాడని తాత్పర్యార్థంగా గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥** జగతిని జీవుల జాలము కబళింప
కోప ప్రగల్భతల్ కోరలందు
వెరపును గొలుపుచు వెలుగొందు నయనాల
నిప్పులు గ్రక్కుచు నప్పళించు
మృత్యుదేవత ముఖ మెప్పుడు నే జూచి
భయముతో దేహము బాయకుంద
నంతకు ముందుగా నాదిత్య నీనిత్య
భాసను భయపడి పరుగుదీయు

**తే గీ॥** కాందిశీకులమౌ మము గావ నెంచి
అమృత కిరణాళి వర్షించి యమృతులుగను
చేయ ప్రార్థించు చున్నాము చిత్తగగన
మందు నుదయించి చిద్భాను డగుచు నీవు ॥

---0---

## 44వ శ్లోకము

**అవతారిక:** మృత్యుభయ విహ్వాలుడైన తన యాక్రందనమును వినవలసినదిగా సర్వశ్రుతి మయుడైన చిద్భానునికి విన్నవించుచున్నాడు.

**శ్లో॥** శబ్దాగారం వియదివ వపుస్తే యజుస్సామధామ్నః
సప్తచ్ఛందాస్యపి చ తురగాః ఋుఙ్మయం మణ్డలం చ ।
ఏవం సర్వశ్రుతిమయతయా మద్దయానుగ్రహోద్వా
క్షిప్రం మత్తః కృపణకరుణాక్రన్దమాకర్ణయేమమ్॥

**అన్వయము:-** హే భగవన్ యజుస్సామధామ్నః తేవపుః శబ్దాగారం వియదివ, చ సప్త చ్ఛందాంసి అపి తే తురగాః తే మణ్డలమ్ ఋఙ్మయం. ఏవం సర్వశ్రుతి మయతయా మద్దయానుగ్రహాత్ వా మత్తః ఇమం కృపణకరుణాక్రన్దం క్షిప్రం ఆకర్ణయ.

**ప్రతిపదార్థము:**

హే భగవన్ – భగవత్స్వరూపుడవైన ఆదిత్యదేవా!

| | |
|---|---|
| యజుస్సామధామ్నః | – యజుస్సామవేదములకు ఆవాసమైన |
| తే శబ్దాకారం వపుః | – నీ యొక్క శబ్దమయశరీరరము |
| వియదివ | – (నీ విహారభూమియగు) ఆకాశమువలె (నున్నది) |
| చ, సప్తఛన్దాంసి | – మరియు గాయత్ర్యాది సప్తవిధఛందస్సులు |
| అపి | – కూడా |
| తే, తురగాః | – నీ గుఱ్ఱములైనవి |
| చ, తే మణ్డలం | – మరియు నీ మణ్డలము |
| ఋఙ్మయం | – ఋగ్వేదఋక్కుల చేనిర్మింపబడినది |
| ఏవం సర్వశ్రుతిమయతయా | – ఈ విధముగా సర్వవేదాత్మకమగుటచే |
| మద్దయానుగ్రహాత్ | – నా యందు కృపజూపుట వలన (నాయెడ దయ ననుగ్రహించుచున్నవాడవై) |
| కృపణకరుణాక్రన్దం | – దీనుడనగు నాదయనీయమైన మొరను |
| శీఘ్రమాకర్ణయ | – త్వరగా వినుము. |

**భావము:-** ఓ సూర్యభగవానుడా! యజుస్సామ వేదములు నీ శబ్దమయస్వరూపము. శబ్దాయతనమైన ఆకాశము నీ విహార భూమి. గాయత్ర్యాది సప్తచ్ఛన్దములు నీ సప్తాశ్వములు. నీ మణ్డలము ఋగ్వినిర్మితము అనగా ఋగ్వేదమే. ఈ విధముగా సర్వవేదాత్మకుడవగు నీవు నా యందు దయగల వాడవై దీనుడనగు నా దయనీయమగు ఆర్తనాదమును త్వరగానాలకింపుము.

**శ్రీపాదుక:**ఈ శ్లోకపూర్వార్ధములో చిద్భానుని వేదస్వరూపము వర్ణింపబడినది. ఉత్తరార్థములో విశేషించి ఆయన యొక్క ఆర్తత్రాణైక పరాయణత్వము ధ్వనింపచేయబడినది. భగవానుని భక్తకోటి- ఆర్తులు, జిజ్ఞాసువులు, ప్రయోజనకాంక్షులు, జ్ఞానులు – అని నాలుగు రకములుగా నుందురని భగవానుడే వచించియున్నాడు (గీ ॥7/16) వీనిలో మొదటి తరగతికి చెందిన ఆర్తులే అధికసంఖ్యాకులు. వారిపట్ల అతడు ప్రదర్శించు దయ అమోఘము అపారమునైనది. ఇందులకు అతని భక్తచరితములన్నియు ఉదాహరణములే. శ్లోకములోని మూడవపాదంలో సాంబుడు భగవానుని సర్వశ్రుతిమయుడుగా అంటూ సర్వాత్మనా వేదమూర్తిగా సంభావించేడు. ఇక్కడ శ్రుతి పదములోని శ్లేష అద్భుతార్థద్యోతకము. శ్రుతి అనగా శ్రవణేంద్రియము (చెవి) అని కూడా అర్థము. భక్తుని ఆక్రందనమును మరుక్షణములోనే విలంబము జరుగకుండా వినుటకొరకై సర్వశ్రుతి మయుడుఅనగా శరీరమంతా చెవులు చేసుకొని వినుటకు సంసిద్ధుడై చిదాకాశంలోనే అప్రమత్తంగా సదా సంచరిస్తూ ఉంటాడు, దయామయుడైన చిద్భానుడని భావము. ఈ భావమును నాలుగవ పాదంలోని **'క్షిప్రం మత్తః కృపణకరుణాక్రన్ద మాకర్ణయ'** 'దయార్ద్రమైన నామొరను శీఘ్రమే ఆలకించవయ్యా' అనే పదబంధం అభివ్యక్తీకరిస్తున్నది. ఇదే భావనను తెలుగులో తిరుపతి వేంకట కవులు 'శివస్తుతిలో' **–'నీ వంటి దేవుండు నా వంటి దీనుండు నైవాస్తి దేవేశ మృత్యుంజయా'** – అని తమ దైన్యాన్ని అతని దీనబంధుత్వాన్ని ప్రకటిస్తారు.

భక్తుల మొర నాలకించడానికి విలంబము (ఆలస్యము) లేకుండా శరీరమంతా చెవులు చేసికొన్నట్లు సాంబుడు వర్ణించినట్లుగాను శ్రీ వైష్ణవ భక్త శిరోమణియైన పరాశరభట్టరు రంగరాజస్తవములో శ్రీరంగనాథుని రక్షాదీక్షాపరాయణత్వమును

**"పాతు ప్రణతరక్షాయాం విలంబమసహన్నివ**

**సదా పంచాయుధీం బిభ్రత్స నః శ్రీ రఙ్గనాయకః ॥** – అనే 12వ

శ్లోకంలో స్తుతిస్తాడు. ప్రపన్నులైన భక్తులను సంరక్షించడానికై రంగనాథస్వామి తనకున్నవి నాలుగు చేతులే అయినా సదా పంచాయుధములను ఎల్లప్పుడూ ధరించి సంసిద్ధుడై యుంటాడని స్తుతించబడినది. ఆయుధమును వేరొక చోట భద్రపరచినచో మరల దానిని గ్రహించుటకు ఆలస్యము కావచ్చును. ఒకచో స్మరించిన మాత్రమే తన ఆయుధములాతనికి సంప్రాప్తించినను స్మరణమాత్రమైన విలంబము (ఆలస్యము) ను కూడా సహింపలేడట ఆ దయామయుడు. అందుకాభక్తులకొరకు సదా పంచాయుధములను ధరించి అప్రమత్తుడై భక్తులను సంరక్షిస్తూ ఉంటాడా అచ్యుతుడు. ఈ విధముగా సర్వశ్రుతిమయునిగా చిద్భానుని సంభావించి సత్వరముగా తన యాక్రందనమునకు స్పందించి తనను మృత్యుభయవిదూరుని గావింపవలసినదిగా నభ్యర్థించినాడని తాత్పర్యార్థము గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥** **సామయజుస్సుల శరణమౌ నీ తను**
**వాకసంబును బోలి యలరుచుండు**
**సప్తఛందస్సులు సప్తసప్తులు గాగ**
**ఋఙ్మండలంబుగా ఋక్కులమరె**
**సర్వశ్రుతిమయము స్వశరీర మనజేసి**
**దయజూపినావయ్య తరణి! నీవు**
**కావున నీ దీను కరుణార్ద్ర మైనట్టి**
**యాక్రందనము వేగ మాలకించి**

**గీ॥** **కాన రావయ్య కనులకు కరుణజూపి**
**దీనబాంధవ! దినకర! దివ్యతేజ!**
**నిన్నె శరణము జొచ్చితి నీవె దిక్కు**
**నన్ను గావగ రావయ్య నాదరూప! ॥**

**---0---**

# 45వ శ్లోకము

**అవతారిక:-** చిద్భానుడు ప్రతిదినము తన దినచర్యగా గావించు ఆర్తత్రాణము, దీనజనపరిరక్షణమును సాంబుడీ శ్లోకములో ప్రస్తుతించుచున్నాడు.

**శ్లో॥ నాశం నాస్మచ్చరణశరణా యాన్త్యపి గ్రస్యమానాః**
**దేవైరిత్థం సితమివయశో దర్శయన్ స్వం త్రిలోక్యామ్ ।**
**మన్యే సోమం క్షతతనుమమాగర్భ వృద్ధ్యా వివస్వన్!**
**శుక్లచ్ఛాయాం నయసి శనకైః స్వాం సుషుమ్నాంశుభాసా॥**

**అన్వయము:-** హే వివస్వన్! అస్మత్ చరణశరణాః, దేవైః గ్రస్యమానాః అపి నాశం న యాన్తి. ఇత్థం స్వం సితం యశః త్రిలోక్యాం దర్శయన్ క్షతతనుం సోమం అమాగర్భవృద్ధ్యా, సుషుమ్నాంశు భాసా స్వాం శుక్లచ్ఛాయాం శనకైః నయసి ఇతి మన్యే.

**ప్రతిపదార్థము:-**

హే వివస్వన్! – ఓ సూర్యదేవా!
అస్మచ్చరణ శరణాః – నా చరణములను శరణుజొచ్చిన భక్తులు
దేవైః గ్రస్యమానాః అపి – దేవతలందరిచే కలసికట్టుగాకబళింప బడుచున్నప్పటికిని
నాశం న యాన్తి – నాశమును పొందరు (నశింపరు)
ఇత్థం స్వం సితం యశః– అనెడి ఈ విధమైన నీ శుభ్రమగు కీర్తిని
త్రిలోక్యాం దర్శయన్ – ముల్లోకములలో ప్రదర్శించుచున్నవాడవై
క్షతతనుం – అనుదినము క్షీణించుచున్న శరీరముకల
సోమం – చంద్రుని
అమాగర్భ – అమావాస్యా గర్భితమైన కళను
సుషుమ్నాంశు భాసా – సుషుమ్నా మార్గమున ప్రసరింపచేయబడిన కిరణ ప్రకాశముచే

| | |
|---|---|
| వృద్ధ్యా | – వృద్ధిని పొందించు చున్నవాడవై |
| స్వాం శుక్లచ్ఛాయాం | – తనదైన శుక్లపక్షప్రభను |
| శనకైః నయసి | – క్రమక్రమముగా పొందునట్లు చేయుచున్నావు |
| ఇతి మన్యే | – అని తలంచు చున్నాను. |

**భావము:-** ఓ చిదాదిత్య దేవా! 'నా చరణములను శరణుజొచ్చిన భక్తుడు దేవతలందరిచే అనుదినము భక్షింపబడుచున్నను ఎన్నటికీ నశింపడు' అని ప్రకటించుచున్నవాడవై, అనుదినము క్షీణించు స్వభావము కల చంద్రునియొక్క అమాకళను సుషుమ్నానాడీ గతమైన నీ స్వచ్ఛోచ్ఛకిరణప్రసారముచే వృద్ధినొందించుచున్నవాడవై క్రమ క్రమముగా చంద్రుడు తన శుక్ల పక్ష జ్యోతిస్సును సంపూర్ణముగా పొందునట్లు అనుగ్రహించుచున్నావు. ఈయనుగ్రహము ముల్లోకముల యందు నీ యొక్క స్వచ్ఛమైన కీర్తిని చాటుచున్నది.

**శ్రీపాదుక:-** కృష్ణపక్షంలో చంద్రుని కళలు దేవ పితృమనుష్య గణములచే వంతుల వారీగా గ్రసింపబడినవై మరల సూర్యరశ్మి ప్రభావముచే శుక్లపక్షములో వృద్ధిని పొందుతూ ఉంటాయన్న విషయాన్ని పూర్వశ్లోకములో వివరించుకున్నాం.(శ్లో॥10) ఇదే విషయం ప్రస్తుత శ్లోకంలో కృష్ణపక్షంలో క్షీణించిన చంద్రుడు అమాకళావశిష్టుడై సూర్యుని శరణుజొచ్చి మరల సౌషుమ్నగతి నందిన సూర్యకాంతిచే పునరుజ్జీవితుడై షోడశకళాపరిపూర్ణ మణ్డలుడౌతున్నట్లుగా, సూర్యునియొక్క ఈ విధమైన అనుగ్రహ ప్రదర్శనలు ముల్లోకములలో నాతని స్వచ్ఛమైనకీర్తిని వ్యాపింపజేయు చున్నట్లుగా వర్ణింపబడినది.

తనను అనన్యశరణ్యముగా భావించి భజించు భక్తుడు ఏ విధముగను ఎన్నడునూ పూర్తిగా నశింపడని భగవానుడు స్వయముగా భరవసానిచ్చియున్నాడు. **"అపి చేత్సదురాచారః భజతే యో మా మనన్యభాక్"** నన్ను అనన్యభక్తితో శరణముగా నాశ్రయించిన వాడు దురాచారవర్తనుడైనను (లోకపుదృష్టిలో మాత్రమే అతడు దుర్మార్గవర్తనుడు) వానిని సజ్జనునిగా దలంచి

భగవానుడు అతనికి జ్ఞానముననుగ్రహిస్తాడు. (గీ 9/29) భగవదనుగ్రహమును పొందిన ఆ శరణాగతుడు శీఘ్రముగనే ధర్మాత్ముడై అనుక్షణము శాంతిని పొందినవాడై ఆత్మారాముడైపోతాడు. **"క్షిప్రం భవతి ధర్మాత్మా శశ్వత్ శాన్తిం సగచ్ఛతి"** – అని ఈ విధంగా తన అనుగ్రహ మాహాత్మ్యాన్ని తెలిపి స్వయంగా ప్రతిజ్ఞచేస్తాడు. దయామయుడైన భగవానుడు. **"కౌన్తేయ ప్రతిజానీహి నమే భక్తః ప్రణశ్యతి"** అర్జునా తెలిసికో! ప్రతిజ్ఞచేసి మరీ చెప్పుచున్నాను. నా భక్తుడెన్నటికినీ ఏ విధముగను ప్రణాశమును పొందడు. (గీ 9/31)

ఇదే విషయాన్ని సాంబుడు చిద్భానుని స్తుతిపరంగా ప్రథమార్థంలో నా చరణములనన్య భక్తితో శరణుజొచ్చిన భక్తులు దేవతలందరిచే అనుదినము గ్రసింపబడుచున్నను నాశమునెన్నటికిని ఏ విధముగను పొందరనే కీర్తిని ముల్లోకములలో చాటుచు, క్షీణచంద్రుని తన స్వచ్ఛకిరణప్రకాశముచే పరిపూర్ణునిగావించుచున్న నిత్యకృత్యమును ఉత్తరార్థములో కీర్తించినాడని గ్రహించాలి.

యోగశాస్త్ర పరిభాషలో శ్వాస ప్రాణవాయువు హృదయాకాశము నుండి బహిర్ద్వాదశాన్తము వరకు ప్రయాణించి బయటకు నిర్గమించేటప్పుడు ఇంద్రియ వృత్తులచే (తదధిష్ఠానదేవతలచే) క్షీణింపచేయబడినదై బహిర్ద్వాదశాన్తమున ప్రాణసంధిగా కళామాత్రావశిష్టముగా సుషుమ్నాసంచారియగు చిద్భానుని శరణుజొచ్చునని భావించి, అతని యనుగ్రహముచే నది పునః పరిపుష్టమై అపానవాయువుగా పరిణమించి బాహ్యద్వాదశాన్తము నుండి మరల హృదయాకాశమును ప్రవేశిస్తుంది. ఈ విధముగా ప్రాణశక్తి సంధిగత చిద్భానుప్రకాశనము చే తన ఆవాగమనములను యాతాయాతములను నిర్వర్తించుచు క్షణక్షణము జీవులకు నవజీవనముననుగ్రహించి, సంరక్షించుచున్నదని సారాంశము. చిద్భానునియొక్క ఈ ప్రభావమే అతని స్వచ్ఛాచ్ఛమైనయశః ప్రకాశముగా సాంబునిచే సంస్తుతింపబడినది..

## అనువాద పద్యము

సీ॥ చరణములను నావి శరణుజొచ్చిన వాని
దేవతా గణములే యావరించి
కలసికట్టుగ కూడ కబళింప గాజాల
రనిచాటగా నర్క! యమలకీర్తి
మూడులోకాలకు మోదము గూర్పగా
చూపగా నెంచియు సూటిగాను
ద్యుతినమావాస్య గర్భిత చంద్రకళన్ నీవు
సౌషుమ్న సంచారి స్వచ్ఛకాంతి

తే గీ॥ బరపి వృద్ధిని పొందించి భవ్యతేజ!
చిరము నాశము నందని చిత్కళనగ
నభయ మిచ్చియు చంద్రుని నాదుకొంటి
వట్లె చిద్భాను! ననుగావు మాశ్రితునిగ ॥

---0---

## 46వ శ్లోకము

**అవతారిక:-** నిర్హేతుకమైన దయతో జన్మించిన జీవులందరకు తనపై యాస్థ, శ్రద్ధలననుగ్రహించి అన్తకాలమున నందరిని తరింపజేయుదయామయుడైన ఆదిత్యభగవానునికి సాటియగు దైవము లేదని సాంబుడతని నీశ్లోకములో సంకీర్తించుచున్నాడు.

శ్లో॥ ఆస్తాం జన్మ ప్రభృతి భవతః సేవనం తద్ధి లోకే
వాచ్యం కేనాపరిమిత ఫలం భుక్తిముక్తి ప్రకారమ్ ।
జ్యోతిర్మాత్రం స్మృతిపథమితో జీవితాన్తేఽపి భాస్వత్
నిర్వాణాయ ప్రభవసి సతాం తేన తే కః సమోఽన్యః ॥

**అన్వయము:-** హే భాస్వన్! జన్మ ప్రభృతి యత్ భవతః సేవనం తదాస్తామ్, తత్ భుక్తిముక్తిప్రకారమ్ అపరిమితఫలం లోకే కేన వాచ్యం (భవతి)? (నకేనాపివక్తుం శక్యమితి భావః) త్వం సతాం జీవితాఽన్తేపి జ్యోతిర్మాత్రం

స్మృతిపథం ఇతః నిర్వాణాయ ప్రభవసి. తే న తే సమః కః అన్యః అస్తి? (న కోపీతి భావః)

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| హే భాస్వన్! | – ఓ సూర్యభగవానుడా! |
| జన్మప్రభృతి | – జన్మ మొదలుకొని |
| యత్ భవతః సేవనం | – నీ భజనము (సేవ) ఏది కలదో |
| తత్ ఆస్తామ్ | – అది యట్లే యుండుగాక! |
| తత్ భుక్తిముక్తి ప్రకారం | – అది భోగ మోక్ష సాధనమైనది |
| అపరిమిత ఫలమ్ | – అనంత ఫలదము |
| లోకే కేన వాచ్యమ్? | – దానిని గూర్చి లోకమున నెవరు చెప్పగలరు? (ఎవ్వరును వర్ణింపలేరని భావము) |
| త్వం | – నీవు |
| సతాం | – సజ్జనులకు |
| జీవితాన్తేఽపి | – మరణసమయమునందు కూడ |
| జ్యోతిర్మాత్రం | – జ్యోతి స్వరూపునిగా |
| స్మృతి పథం | – స్మరింపబడుచున్నావు |
| ఇతః | – ఇంకను |
| నిర్వాణాయ ప్రభవసి | – మోక్షమునిచ్చుటకు సమర్థుడవైయున్నావు |
| తేన తే సమః | – ఈ కారణముచే నీకు సమానమైన వాడు |
| అన్యః కః అస్తి? | – వేరొకడెవ్వరున్నాడు? (ఎవ్వరును లేరని భావము) |

**భావము:** ఓ సూర్యభగవానుడా! భోగమోక్షములను పొందుటకు సాధనముగా నెవరు జన్మమొదలుకొని అంతులేని ఫలములనిచ్చు నిన్ను సేవించుచున్నారో, వారి విషయమటులనే యుండుగాక, దానినీలోకమున వర్ణింపనెవరికి సాధ్యమగును?ఎవ్వరికిని సాధ్యముకాదని భావము. ఇట్లుకాక కేవలమవసాన సమయమున సజ్జనుడగు నెవడు నీ జ్యోతిర్మయస్వరూపమును

కేవలమొకసారి స్మరింతురో, వారికి స్మరణమాత్రముచేతనే మోక్షమునను(గ్రహించు చున్నావు. కావున నీ విధమైన నీకు సమానముగా సరితూగగల వేరొక దైవము ఎవరున్నారు గనుక? అనగా నీకు సమానులైన వారెవ్వరును లేరని భావము.

**శ్రీపాదుక:-** లోకమున జన్మప్రభృతి నిన్ను సేవించువారు అపారముగా భుక్తిముక్తులను పొందుచున్నారని పూర్వార్థములోను, కేవలమవసాన సమయమున నీ జ్యోతీరూపమును స్మరించినవారికి స్మరణమాత్రము చేతనే దుర్లభమగు ముక్తి ననుగ్రహించుచున్నావని కీర్తించి, ఈ విధముగ సులభముగా భోగమోక్షములననుగ్రహించు దైవము నీవే తప్ప, నీకు సాటి వేరెవ్వరు లేరని సాంబుడు కీర్తించినాడు. సరిగ్గా ఇదే విధముగనర్జునుడు కూడ పరమాత్మను- **'న త్వత్సమోస్తి అభ్యధికః కుతోఽన్యః?- లోకత్రయేఽప్యప్రతిమ ప్రభావ! (గీ. 11- 43)** ముల్లోకములలో సాటిలేని ప్రభావము కల హేకృష్ణా! నీవే సర్వాధికుడవు నీకు సమానుడు వేరొకడెవ్వడున్నాడు గనుక అని కీర్తిస్తాడు. శ్లోకములో భోగమోక్ష శబ్దములు లౌకికమైన భుక్తిముక్తులుగాకాక సాధనపరమైన ప్రకరణార్థములో ప్రయోగింపబడినవిగా గ్రహించాలి. అదియే సాంబుని యంతరంగముగా దోచును.

ఇదే విషయము **"ఆస్తాం జన్మప్రభృతి భవతః సేవనం ..."** ఇత్యాదిగా ప్రథమార్థంలో అభివ్యక్తమైనది. మధ్యమతరగతికి చెందిన సాధకులు లేదా యోగమార్గానుయాయులు, సగుణోపాసకులు వీరందరు, పుట్టినది మొదలు భగత్సేవలో నుండి వారివారి భజనమునకు తగిన శివానందరూపమగు ఫలముననుభవించుచున్నారు. ఈయనుభవమునకే భోగమని వ్యవహారము. అంతేకాని లౌకికములైన విషయభోగములనే అర్థాన్ని గ్రహింపరాదు. అలాగే జ్ఞానులైనవారు (వారే సన్తః, సతాం అని సచ్ఛబ్దముతో నాల్గవపాదములో సూచింపబడినారు). అన్తకాలమున నీ జ్యోతీరూపమును స్మరించిన మరుక్షణమే నిర్వాణరూపమగు మోక్షమును పొందుతున్నారని వర్ణింపబడినది.

## అనువాద పద్యము

**సీ॥** జన్మము మొదలుగా జాగరూకతతోడ
నిన్ను సేవించిన నీదుభక్తి
నిస్సీమముగ నిచ్చు నిఖిల భక్తతతికి
భుక్తి సుఖములతో ముక్తి కూడ
ఆభక్తి మహిమను నవనిని వర్ణింప
నెవరికి తరమగు నెన్నటికిని
అది యట్టులుండ నిమ్మవసానమందున
అలరెడు జ్యోతిగా నర్క! నిన్ను

**తే గీ॥** దలచి నంతనె మోక్ష ప్రదాతవగుచు
ఆశ్రయించిన వారికి నన్ని శుభము
లందజేసెడి నీకంటె నాప్తుడెవడు
మాకు లభియించు మార్తాణ్డ! మహితతేజ! ॥

---0---

## 47వ శ్లోకము

**అవతారిక:** లౌకికమైన ఆయురారోగ్యైశ్వర్యాది భోగప్రదాతగా కూడ ఆదిత్యుని సంభావించి సేవించి ఆయా ఫలములనుకూడ ననుగ్రహరూపమున పొందవచ్చునని ఆదిత్యదేవుని వాత్సల్యపూర్వకానుగ్రహమును కీర్తించుచున్నాడు.

**శ్లో॥** యే చారోగ్యం దిశతి భగవాన్ సేవితోఽప్యేవమాహుః
తే తత్త్వజ్ఞా జగతి సుభగాః భోగయోగప్రధానాః ।
భుక్తేర్ముక్తేరపి చ జగతాం యచ్చ మూలం సుఖానాం
తస్యాన్యోర్కాదమృత వపుషః కో హి నామాఽస్తి దాతా ॥

**అన్వయము:-** 'భగవాన్ సేవితః సన్ ఆరోగ్యం దిశతి' - ఏవం యే ఆహుః - తే తత్త్వజ్ఞాః జగతి సుభగాః భోగయోగప్రధానాః చ సన్తి । హి జగతాం భుక్తేః ముక్తేః అపి చయత్ సుఖానాం మూలం, తస్య ఆరోగ్యస్య దాతా అమృతపురుషః అర్కాత్ అన్యః కో నామ అస్తి? న కోప్యస్తీ తిభావః

**ప్రతిపదార్థము:**

| | |
|---|---|
| భగవాన్ | - ఆదిత్యభగవానుడు |
| సేవితః సన్ | - సేవించబడినవాడై |
| ఆరోగ్యం దిశతి | - ఆరోగ్యమునిచ్చుచున్నాడు అని |
| ఏవం | - ఈ విధముగా |
| యే ఆహుః | - ఎవరు చెప్పిరో |
| తే తత్త్వజ్ఞాః | - అట్లుచెప్పెడి యా తత్త్వజ్ఞానులు |
| జగతి | - లోకములో |
| సుభగాః | - ఐశ్వర్యసంపన్నులు (గొప్పవారు) |
| చ భోగయోగప్రధానాః | - మరియు భోగయోగములను ప్రధానముగా తలచువారుగా |
| సన్తి | - ఉన్నారు) |
| హి | - అదియుక్తమే |
| జగతాం | - లోకముల (ప్రాణుల) యొక్క |
| భుక్తేః | - భోగమునకు |
| ముక్తేః ఆపిచ | - మోక్షమునకు మరియు |
| యత్ సుఖానాం | - సుఖసంతోషములకు నేది |
| మూలం | - మూలకారణమో |
| తస్య ఆరోగ్యస్య | - అట్టి ఆరోగ్యమునకు |
| దాతా | - ఇచ్చెడివాడగు |
| అమృతవపుషః | - అమృతమయశరీరముకల |
| అర్కాదన్యః | - సూర్యభగవానునికన్నవేరైన (దైవము) |

కో నామా஽స్తి – ఎవడున్నాడుగనుక!

(న కోప్యస్తీతి భావః – ఎవ్వరును లేరని భావము)

**భావము:-** 'ఆదిత్యుని సేవించినచో ఆరోగ్యములభించునని, అతడే ఆరోగ్యప్రదాత' యని ఎవరు చెప్పుచున్నారో వారు యథార్థము నెఱింగినవారు మరియు ఐశ్వర్య సంపన్నులు. వారే భోగయోగ మార్గావలంబులు. అది యుక్తమే. భోగమోక్షములకు సుఖసంతోషములకు అన్నిటికి మూలకారణమైన ఆరోగ్యము ననుగ్రహించు అమృతమయుడగు ఆదిత్యదేవునికన్న భిన్నమైన దైవము వేరెవ్వరున్నారు గనుక? అనగా ఎవ్వరును లేరని భావము.

**శ్రీపాదుక:- 'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్ శ్రియమిచ్ఛేద్ధుతాశనాత్ ఐశ్వర్యమీశ్వరాదిచ్ఛేత్ - మోక్షమిచ్ఛేజ్జనార్దనాత్॥'** అనగా ఆరోగ్యమును సూర్యునినుండి, సంపదలను అగ్నినుండి, ఐశ్వర్యములను ఈశ్వరుని నుండి, మోక్షమును విష్ణువునుండి వారిని సేవించి, వారి యనుగ్రహములుగా పొందవచ్చునని పెద్దల ప్రవచనము. సంపదైశ్వర్య మోక్షములన్నిటి మూలకారణము ఆరోగ్యమే. దానిని ఆ మూడింటితో పాటుగ సూర్యభగవానుడే అనుగ్రహిస్తాడని, అతనిని మాత్రము సేవించిన చాలునని సాంబుని హృదయమని గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥ ఆరాధనము సేయ నారోగ్యమునొసంగు**
**నాదిత్యుడని చెప్పు నవని నెవడు**
**అట్టి తత్త్వజ్ఞులు ఆంతరమ్మున భోగ**
**యోగములనుభవ యోజనమున**
**భుక్తి ముక్తులకును, భోగ్యమౌ సుఖముల**
**కారోగ్యమే మూల మనుచు నెంచి**
**అట్టియారోగ్యము నమృతాత్మ సూర్యుని**
**మించి యీగల దైవ మేది గలదు?**

**గీ॥** **నిన్ను మించిన దైవము నెన్నలేక**
**నీవ శరణమటంచును నీ చరణము**
**పట్టినాడను, నన్ను నీ పట్టిగాను**
**వత్సలత జూపి రక్షించు వరద నీవు॥**

**---0---**

# 48వ శ్లోకము

**అవతారిక:-** సర్వాభీష్టప్రదాతయు ప్రత్యక్షదైవమునగు ఆదిత్యుని సేవించుటయే సముచితమని యుక్తియుక్తముగా ఉపదేశింపబడుచున్నది.

**శ్లో॥** **అప్రత్యక్ష త్రిదశభజనాత్ యత్పరోక్షం ఫలం తత్**
**పుంసాం యుక్తం భవతి హి సమం కారణేనైవ కార్యమ్ ।**
**ప్రత్యక్షస్త్వం సకలజగతాం యత్సమక్షం ఫలం మే**
**యుష్మద్భక్తేః సముచిత మత స్తత్తు యాచే యథా త్వామ్॥**

**అన్వయము:-** అప్రత్యక్ష త్రిదశభజనాత్ పుంసాం యత్ పరోక్షం ఫలం తద్యుక్తం - కారణేన సమం ఏవ కార్యం భవతి హి, త్వం సకలజగతాం ప్రత్యక్షః । అతః యుష్మద్భక్తేః సముచితం యత్ మే ఫలం సమక్షం స్యాత్. తత్ తు అహం యాచే. తథా త్వాం యాచే.

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| అప్రత్యక్షత్రిదశభజనాత్ | - కనిపించని దేవతలను సేవించుట వలన |
| పుంసాం | - (పురుషులకు) సాధకులకు లేదా భక్తులకు |
| యత్ పరోక్షం ఫలమ్ | - పరోక్షములైన స్వర్గాది ఫలములు లభించుట ఏదికలదో |
| తత్ యుక్తమ్ | - అది సముచితమైనదే |
| యత్ | - ఏలనన |
| కారణేన సమమేవ | - కారణమునకు తగినట్లుగనే |
| కార్యం భవతి హి | - కార్యము సంభవించుచున్నది గదా |

| | |
|---|---|
| త్వం సకల జగతాం ప్రత్యక్షః | - హే చిద్భానుడా! నీవు లోకములన్నిట ప్రత్యక్షముగా ప్రకాశించుచున్నావు |
| అతః | - ఈ కారణముచే |
| యుష్మద్భక్తేః | - నీ సేవనమునకు |
| యత్ సముచితం ఫలం | - తగిన భోగమోక్షాది రూపమగు ఫలితము ఏదికలదో |
| తత్ మే సమక్షం స్యాత్ | - అది నాకు ప్రత్యక్షముగనే లభించును. |
| తత్ త్వామివ యాచే | - దానిని నిన్నువలె ప్రత్యక్షముగా నీయ వేడుచున్నాను |

**భావము:-** లోకమున కనబడని ఇంద్రాది దేవతలనుసేవించుటవలన అదృష్టఫలములైన స్వర్గాదిఫలములు లభించుచున్నవి. అది యుక్తమే. ఏలన కారణగుణముల కనుగుణముగనే కార్యములుద్భవిస్తాయి. (ఉదా : కారణమైన మట్టియే కార్యమైన కుండలో కనిపిస్తుంది. అలానే కారణమైన బంగారమే కార్యములైన హారకంకణాద్యాభరణములలో కనిపిస్తుంది.) ఓ ఆదిత్యభగవానుడా! నీవు సమస్తలోకములకు ప్రత్యక్షదైవముగా ప్రకాశించుచున్నావు. కావున నిన్ను ప్రత్యక్షముగనే భజించి నీనుండి ప్రత్యక్ష ఫలితములనే యాచించుచున్నాను.

**శ్రీపాదుక:-** సూర్యభగవానుడొక్కడే ప్రత్యక్షదైవము. మిగిలిన దేవతలు కనబడరు. వారిచ్చు స్వర్గమోక్షాది ఫలములుకూడ అదృష్టములు అపూర్వములుగనే యున్నవి. కనబడని దేవతలను భావనలో అర్చించి అదృష్టఫలములను పొందుటలో సంపూర్ణమైన తృప్తి లభించదు. ఇతర దేవతలు కనబడకపోవుటకు కారణము వారు వారివారి లోకములకు మాత్రమే పరిమితమైనవారు. అచట మాత్రమే వారిని మనము దర్శింపగలమని భావము. అట్లుగాక ఆదిత్యభగవానుడు విభువు. అనగా సర్వవ్యాపి. కనుకనే

సప్తభువనములను ప్రకాశింపజేస్తూ అన్నిలోకములలోని ప్రాణులలో బాహిరంగా ఆంతరంగా నిండి నిబిడీకృతుడై ప్రత్యక్షదైవముగా భాసిస్తున్నాడు. ప్రత్యక్షముగా నగుపడుచున్న దైవమును భజించుటచే ప్రత్యక్షఫలితములను పొందిన పరితృప్తి లభిస్తుంది.

మరియొక రహస్యము – సాంబుడు శ్లోకముయొక్క ఉత్తరార్థములో సర్వలోకములకు ప్రత్యక్షదైవముగా నున్న నీకెదురుగా నిలచి నీ ప్రత్యక్షసేవకు సముచితమైన ఫలితమును – **"తచ్చ యాచే యథా త్వామ్"** నీవలె ప్రత్యక్షముగా నున్న నిన్ను మాత్రమే యాచించుచున్నాను అంటాడు. తత్ ప్రత్యక్షముగా నిన్నర్చించిన సేవకు తగిన ఫలమును "**యథాత్వామ్–** నిన్నువలె అనగా నన్ను నీవనుగ్రహించాలి. నీ సాయుజ్యమును అనుగ్రహించాలి అని ఆత్మభావమును లేదా ఆత్మసాయుజ్యమును అభ్యర్థించినాడని తాత్పర్యంగా గ్రహించాలి. ప్రత్యక్షదైవము కావుననే ఆత్మానుసంధానమును అపరోక్షానుభవమును నేఱుగా ఆంతరముగా బాహిరముగా చిద్భానుడనుగ్రహించుచున్నాడని సాంబుని అభ్యర్థనలోని ఆంతర్యమును గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥ కనరాని దేవుల కలిమినర్చింపగా**
**పరమగు స్వర్గాది ఫలము కలుగు**
**కారణంబును బట్టి కార్యము కలుగుట**
**నియతిగా కనిపించు నిఖిలజగతి**
**ప్రత్యక్షదైవమై నిత్యమునుదయించి**
**భాసిలునట్టి చిద్భానుదేవ!**
**నిన్ను సేవింపగా నిత్యము ప్రత్యక్ష**
**ఫలితమైశ్వర్యమ్ము పరమగతిని**

**గీ॥ కరుణ గనవచ్చి యిత్తువు కలుములన్ని**
**ఇడుములను కూడ బాపెద వీద్య! నీవు**
**నీకు నీవ సాటియనుచు నీ చరణము**
**పట్టినాడను నీవె నా పట్టుకొమ్మ ! ॥**

---0---

## 49వ శ్లోకము

**అవతారిక:-** ఉపాసనలో తనకు సహకరించిన ఇంద్రియములకు ప్రత్యుపకార రూపముగా నైర్మల్యమును, నిశ్చలత్వమును అనుగ్రహింపమని కవి ఆదిత్యభగవానుని అభ్యర్థించుచున్నాడు.

**శ్లో॥ హిత్వా హిత్వా గురుచపలతా మప్యనేకాన్నిజార్థాన్**
**యైరేకార్థీకృతమివ భవత్సేవనం మత్ప్రియార్థమ్ ।**
**తేషా మిచ్ఛామ్యుపకృతి మహం స్వేంద్రియాణాం ప్రియాణా**
**మాదౌ తస్మాన్మమ దినపతే! దేహి తేభ్యః ప్రసాదమ్ ॥**

**అన్వయము:-** హేదినపతే! యై(రింద్రియై)ః మత్ప్రియార్థం గురు చపలతాం అనేకాన్ నిజార్థానపి హిత్వా భవత్సేవనం ఏకార్థీకృతం, తేషాం ప్రియాణాం తేషాం స్వ ఇంద్రియాణాం అహం ఉపకృతిం ఇచ్ఛామి తస్మాత్ మమ ఆదౌ తేభ్యః ప్రసాదం దేహి॥

**ప్రతిపదార్థము:**

| | |
|---|---|
| హే దినపతే! | – ఓ దిననాథా! |
| యైః (ఇంద్రియైః) | – ఏ ఇంద్రియములచే |
| మత్ప్రియార్థం | – నా సంతోషము కొరకు |
| గురుచపలతాం | – ప్రబలమైన (గొప్ప) చాంచల్యమును |
| అనేకాన్నిజార్థాన్అపి | – బహువిధములైన స్వప్రయోజనములు కూడ |
| హిత్వాహిత్వా | – విడచి, విడచి |
| భవత్సేవనం | – నీ సేవను మాత్రమే |

| | |
|---|---|
| ఏకార్థీకృతం | - ఒకేఒక ప్రయోజనము గావించబడెనో |
| ప్రియాణాం తేషాం | - అటువంటి ప్రియతరములైన |
| | స్వఇంద్రియాణాం -నా ఇంద్రియములకు |
| అహం ఉపకృతిం ఇచ్ఛామి | - నేనుపకారము చేయగోరుచున్నాను |
| తస్మాత్ | - అందువలన |
| ఆదౌ | - ముందుగా |
| మమ తేభ్యః | - నా యొక్క ఆ ఇంద్రియములకే |
| ప్రసాదం దేహి | - నీ యను గ్రహమునిమ్ము |

**భావము:** ఓ దివాకరుడా! నా ప్రియతరములైన ఇంద్రియములు నా ఆనందము కొరకు తమ స్వాభావికమైన బహువిధ స్వప్రయోజనములను, చాపల్యమును విడనాడినవై, నీయుపాసనను మాత్రమే తమ ఏకైక ప్రయోజనముగా సాధించినవి. కావున వానికి నేనిపుడుపకారమును చేయగోరుచున్నాను. అందువలన నాకన్న ముందుగా ఆ యింద్రియములనే అనుగ్రహించుము. (ఇంద్రియములకు సాయుజ్యము లభించినచో అదియే తనకు మోక్షమగునని సాంబుని ఆశయము.)

**శ్రీపాదుక:-** అల్పాక్షరములలో అనల్పార్థమునుపన్యసించుట కవి ప్రతిభకు గీటురాయి అనవచ్చును. మహాకవియైనవాడు తాను చెప్పదలచిన విషయమును సున్నితముగా మహార్థగర్భితముగా ఆలంకారిక భాషలో ధ్వనిగర్భితముగా ప్రతిపాదించును. అటువంటి వైదగ్ధ్యమునే సాంబుడీ శ్లోకములో ప్రతిపాదించినాడు.

ఉపకారమునకు ప్రత్యుపకారముచేసి, సజ్జనుడు తాను ఋణవిముక్తుడైనట్లు భావిస్తాడు. సాధారణమగు ఈ విషయమునే సాంబుడీ శ్లోకమున అనితరసాధారణమైన రీతిలో ప్రదర్శించినాడు. సాధన సిద్ధించుటకు మనస్సు నిశ్చలముగా నుండవలెను.అది ఇంద్రియములతో పాటు ఇంద్రియార్థముల వెంట పరుగిడుచుండును. అది సాధకుని ప్రజ్ఞను హరిస్తుంది. **'తదస్య హరతి ప్రజ్ఞాం' (గీ.2-7)** అట్టి ఇంద్రియములను

మనస్సును తాను నిగ్రహించి – ఆ విషయమును మరుగుపరచి **'తుష్యతు దుర్జన న్యాయము'** ననుసరించి – ఆ యింద్రియములు నా ఉపాసన సంసిద్ధినే తమ యేకైక లక్ష్యముగా భావించి, తమతమ వైషయిక ప్రవృత్తులను విడనాడి, స్వాభావికమైన చాంచల్యమును కూడ విడిచిపెట్టి, నాకు ఉపాసనాస్థైర్యమును, సుస్థిరమైన ప్రజ్ఞను సమకూర్చి నాకు ప్రియకరములైనవి. అని పూర్వార్థములో ఉపాసనావిరోధులగు వానిని గొప్పగా ప్రశంసించినాడు. ఇంకను ఉత్తరార్థములో తాను వానికి ప్రత్యుపకారమును చేయగోరుచున్నట్లు – **'తేషాం ఉపకృతిం ఇచ్ఛామి'** అంటాడు. మరియు తనకన్న ముందుగా ఆ ఇంద్రియ సమూహమునకే అనుగ్రహమును ప్రసాదింపవలసినదని తన స్వామిని వేడుకుంటాడు. 'కృతస్య ప్రతికర్తవ్యమేషధర్మః సనాతనః' అని పెద్దల ప్రవచనము. ఈ వేడికోలు ఇంకను చమత్కార భూయిష్టమైనది.

ఇంద్రియములు, ఇంద్రియార్థములతోకూడిన మనస్సు బుద్ధి ఇవే కామమనే అంతశ్శత్రువున కధిష్ఠానము. వీని ద్వారా అది స్వస్వరూపజ్ఞానమైన మోక్షమునకు ప్రతిబంధక మగుచున్నది. ఇంద్రియములు వానిననుసరించి మనోబుద్ధులు జ్ఞానమును ఆవరించి మరగున పడవేస్తున్నవి. **'ఏతైర్విమోహయత్యేషః జ్ఞానమావృత్యతిష్ఠతి' (గీ॥3/40)** కావున ప్రత్యుపకారమను మిషతో సాంబుడు ముందుగా ఇంద్రియములకు లయము (మోక్షము) ననుగ్రహింపవలసినదిగా భగవానుని ప్రార్థించినాడు. ఇంద్రియములు లయించిన మరుక్షణమే మనస్సు బుద్ధికూడ అంతరిస్తాయి. ఆవరణము తొలగి జ్ఞానము తద్వారా స్వస్వరూపానుసంధానాత్మకమైన జీవన్ముక్తీ లభిస్తాయి. ఈ పరమార్థము కోసమే ముందుగా ఇంద్రియములకు ముక్తిననుగ్రహింప వేడినాడని గ్రహించాలి.

ఇంద్రియములకు లయమునుపకాంక్షించుటద్వారా ఇంద్రియార్థముల పట్ల అనగా లౌకిక విషయములపట్ల వైరాగ్యము ధ్వనింపచేయబడినది. ఇంద్రియార్థముల పట్ల వైరాగ్యమే జ్ఞానముగా 13వ అధ్యాయంలో భగవానుడు

ముక్త కంఠముగా -

**"ఇంద్రియార్థేషువైరాగ్యం......ఏతద్ జ్ఞానమితిప్రోక్తం" (గీ 13/9-12)** అని వచించి యున్నాడు. ఈ విధముగా తనకుపకరించినట్లుగా ఇంద్రియములను ప్రశంసించి, వానికి ప్రత్యుపకారము చేయుచున్నట్లుగా ముక్తినిమ్మని భగవానుని వేడుచునే సాంబుడు పరోక్షముగా తన లక్ష్యసిద్ధియైన జ్ఞాన వైరాగ్యమోక్షములను సిద్ధింపచేసికొనినాడని తాత్పర్యార్థంగా గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥ తమదైన చపలత తాముగా త్యజియించి**
**స్వప్రయోజనముపశాంత పరచి**
**నీ సేవ లో తాము నియతితో చరియించి**
**నాయింద్రియమ్ములు నన్ను గాచి**
**తెన్ను జూపియు నాకు నిన్ను జూపించెను**
**వరద! వానికి ముందు వరము ముక్తి**
**నీయగోరెదనయ్య ఇచ్చియు రక్షింప**
**నానృణ్యమును నేను నందుకొనెద**

**తే॥ గీ॥ దేహ గేహేంద్రియంబుల మోహమదియ**
**తొలగిపోవును, నేనను తోడు కూడ**
**తొలగ జేయుము దయ, నది తొలగిపోవ**
**లీన మయ్యెద నీలోన లీలగాను ॥**

**---0---**

## 50వ శ్లోకము

**అవతారిక:-** సాంబుడు తానిట్లు స్తుతించుటకు సర్వాత్మనా పరమాత్మకే కర్తృత్వమును ఆపాదించి భక్తి యోగముచేతన ద్వారా వెలువడిన వాక్కులను ధన్యముగావింపవలసినదని ప్రార్థించుచు స్తోత్రమును ముగించుచున్నాడు.

**శ్లో॥ కిం త్వన్నామోచ్చరతి వచనం యస్య నోచ్చారక స్త్వం**
**కిం తద్వాచ్యం, సకలవచసాం విశ్వమూర్తే! న యత్త్వమ్ ।**
**తస్మాదుక్తం యదపి తదపి త్వన్నుతౌ భక్తియోగాత్**
**అస్మాభిస్తద్భవతు భగవన్! త్వత్ప్రసాదేన ధన్యమ్ ॥**

**అన్వయము:-** హే విశ్వమూర్తే! (అస్మిన్‌జగతి) (తత్ కిం నామవచనముచ్చరతి) (భవసి) యస్యఉచ్చారకః త్వం న ఏవం సకలవచసాం తస్మాత్ హే భగవన్! త్వత్ నుతౌ భక్తియోగాత్ యదపి తదపి అస్మాభిః ఉక్తం తత్ త్వత్ప్రసాదేన ధన్యం భవతు

**ప్రతిపదార్థము:**

| | |
|---|---|
| విశ్వమూర్తే! | - ఓ విశ్వాకారా! |
| అస్మిన్ జగతి | - ఈ లోకములో |
| యస్య ఉచ్చారకః | - దేనిని ఉచ్చరింపజేయువాడవు |
| త్వం న అసి | - నీవు కావో |
| తత్కిం వచనముచ్చరతి | - అట్టి వచనమేది ఉచ్చరింపబడుచున్నది? (అనగా మేముచ్చరించు వాక్కులన్నియు అంతర్యామివైన నీవు పలికించుచున్నవే యని భావము) |
| ఏవం | - అట్లే |
| యత్ త్వం న | - నీ స్వరూపముకన్నభిన్నమైనది |
| సకలవచసాం | - లోకములోని ప్రవచనములన్నింటిలో |
| తత్ కిం వాచ్యమ్ | - అట్టిదేమని చెప్పబడును గనుక (లోకములో నే విషయము చెప్పినను అది నీ స్వరూపమేనని భావము) |
| తస్మాత్ | - అందువలన |
| హే భగవన్! | - ఓ భగవత్స్వరూపా! |

| | |
|---|---|
| త్వత్ నుతౌ | – నిన్ను స్తుతించుటలో |
| భక్తియోగాత్ | – భక్తియుతమై |
| యదపి అస్మాభిః ఉక్తం | – మాచే పలుకబడినదేది కలదో |
| తదపి | – అది అంతయు |
| త్వత్ప్రసాదేన | – నీ యనుగ్రహముచే |
| ధన్యం భవతు | – చరితార్థమైనదగుగాక! |

**భావము:-** ఓ విశ్వాకారా! ఈ జగత్తులో నీవు పలికింపని వచనమేమున్నది గనుక. అనగా మేముచ్చరించు వచనజాతమంతయు అంతర్యామిగా నీవు పలికింపజేయుచున్నదేనని భావము. అట్లే ఆవచనములకు విషయమైన వస్తువు మాత్రము నీకు భిన్నమైనది అనగా నీవు కానిదేమి కలదు. కాగా ఈ స్తుతిని నాచే చేయించిన వాడవు (కర్త) స్తుతి ప్రతిపాద్యవిషయములు (కర్మ) రెండునూ నీవేనని భావము. కావున ఓ భగవత్స్వరూపా! భక్తి యోగముతో నాచే నుతింపబడిన విషయమేది యెట్లున్నను దానికి కర్త కర్మ నీవే అయినందున దానిని అన్వర్థమైనట్లుగా అనుగ్రహింపవేడుచున్నాను.

**శ్రీపాదుక:** శ్లోకం పూర్వార్థంలో చిద్భానుని విశ్వమూర్తిగా సంబోధించి వాచ్యవాచక స్వరూపమంతా భగవానుడే యన్న విషయాన్ని ప్రతిపాదించి, కర్తృభోక్తృత్వములు రెండూ ఆయనవేనని చమత్కరిస్తాడు సాంబుడు. నిజమే. సర్వమూ తానేయైనవాడాయన

**యస్మిన్ సర్వం యతస్సర్వం యస్సర్వం సర్వతశ్చ యః ।**
**యశ్చసర్వమయో నిత్యం తస్మై సర్వాత్మనే నమః ॥**

ఇదే విషయాన్ని తెలుగన్న పోతన్న **ఎవ్వనిచే జనించు జగమెవ్వనిలోపల నుండు లీనమై ...... సర్వము తానెయైన వాడెవ్వడు.....** ఇత్యాదిగా వర్ణించినాడు. ఉత్తరార్థములో మరల యతనిని **భగవన్!** అని సంబోధించి కృతిని సాన్తము చరితార్థము చేయవలసినదిగా ధన్యపదప్రయోగం చేసి అభ్యర్థిస్తాడు. విశ్వమూర్తి శబ్దము అతని సర్వాత్మకత్వమును సూచిస్తే,

నాలుగవ పాదంలోని భగవచ్ఛబ్దము అతని సర్వశక్తిమత్త్వము షడ్గుణైశ్వర్య సంపన్నత్వమును సూచిస్తుంది.
ఋభుగీతలో భగవచ్ఛబ్దం –

**"ఉత్పత్తిం చ వినాశం చ భూతానా మగతిం గతిమ్ ।**
**వేత్తి విద్యా మవిద్యాం చ సవాచ్యో భగవానితి ॥**

జగదుత్పత్తి వినాశములు, ప్రాణుల యొక్క ఆగమనిర్గమనముల విద్యావిద్యలను తెలిసినవాడు భగవానుడని ఋభుగీతలో చెప్పబడినది. మరియు

**" ఐశ్వర్యస్య సమస్తస్య వీర్యస్య యశసః శ్రియః ।**
**జ్ఞానవిజ్ఞానయోశ్చైవ షణ్ణాం భగ ఇతీరణా ॥** – అని భగవానుని షడ్గుణైశ్వర్య సంపన్నత్వము వర్ణింపబడినది. ఈ విధముగా చిద్భానుని విశ్వాత్మత్త్వమును భగవత్తత్త్వమును సంభావించి, తాను చేసిన కృతికి సాంతము భగవత్తత్త్వ ప్రతిపాదకమేనని సోపపత్తిగా నిర్ధారించి దానికి ధన్యతను సమకూర్చవలసినదిగా అభ్యర్థించి స్తుతి నీ శ్లోకముతో ముగించినాడని చెప్పవచ్చును.

## అనువాద పద్యము

**సీ॥ విశ్వాత్మ! జగతిని వినవచ్చు శబ్దము**
**లన్నియు వినబడ నర్క! నీవె**
**కారణమగుచున్న కారణముగ నీవు**
**కాని వచనమేది కానరాదు**
**నీకన్న భిన్నమై వాకొను వచనంబు**
**నేమని చెప్పెద నెట్టులైన ?**
**గాన నో దేవ! నీగాన కీర్తన భక్తి-**
**యోగంబులో నేవి యోజితముగ**

**సీ.గీ.॥** పలుక బడుచున్నవో యట్టి పలుకుబడులు
నీదు రూపము దాల్చియు నిలచి యెదుట
నిన్ను జూపును నీదయ కన్నులకును
ధన్యుడయితిని నానుతి ధన్యమయ్యె॥

---0---

# 51వ శ్లోకము

**అవతారిక:-** ఈ శ్లోకములో సాంబుడు తానాశించుచున్న స్తుతిఫలమును (ముక్తిని) వివరించు చున్నాడు.

**శ్లో॥ యా పంథానం దిశతి శిశిరాద్యుత్తరం దేవయానం**
**యా వా కృష్ణం పితృపథమథో దక్షిణం ప్రావృడాద్యమ్ ।**
**తాభ్యామన్యా విషువదభిజిన్మధ్యమా కృత్యశూన్యా**
**ధన్యా కాచిత్ప్రకృతి పురుషావన్తరామేఽస్తు వృత్తిః ॥**

**అన్వయము:** యా (ప్రాణవృత్తిః) శిశిరాద్యుత్తరం దేవయానం పంథానం దిశతి, అథవా యా (అపానవృత్తిః) కృష్ణం ప్రావృట్ ఆద్యం దక్షిణం పితృపథం దిశతి, తాభ్యాం అన్యా విషువత్ అభిజిద్రూపా ధన్యా కృత్యశూన్యా ప్రకృతిపురుషౌ అన్తరా కాచిత్ మధ్యమా వృత్తిః మే అస్తు.

**ప్రతిపదార్థము:-**

| | | |
|---|---|---|
| యా (ప్రాణవృత్తిః) | - | ఏ ప్రాణప్రవృత్తి |
| శిశిరాద్యుత్తరం | - | శిశిరాదిగ్రీష్మాన్త ఉత్తరాయణమునకు సంబంధించిన |
| దేవయానం పంథానం | - | దేవయానమార్గమును |
| దిశతి | - | సూచించుచున్నదో |
| వా యా | - | మరియునే అపానవృత్తి |
| కృష్ణం | - | కృష్ణగతి యనెడి |

| | | |
|---|---|---|
| ప్రావృడాద్యం | - | వర్షాదిహేమన్తపర్యన్తమగు |
| దక్షిణం పితృపథం | - | దక్షిణాయన పితృపథమును |
| దిశతి | - | సూచించునో |
| తాభ్యాం అన్యా | - | ఈ రెండుమార్గములకన్న భిన్నమైన |
| విషువత్ అభిజిత్ | - | విషువత్ మరియు అభిజిన్నామధేయముకల |
| ధన్యా | - | ప్రశంసనీయమైనదియు |
| కృత్యశూన్యా | - | కర్తవ్యశూన్యమైనదియు |
| ప్రకృతిపురుషౌ అన్తరా | - | ప్రకృతిపురుషుల నడుమనుండు |
| కాచిత్ | - | ఒకానొక అనిర్వచనీయమైన |
| మధ్యమావృత్తిః | - | మధ్యమస్థితి |
| మే అస్తు | - | నాకు ప్రాప్తించుగాక! |

**భావము:-** ఏ ప్రాణవృత్తి దేవయానమనెడి శిశిరాది గ్రీష్మాన్తమగు ఉత్తరాయణ మార్గమును సూచించునో, మరియునే అపానవృత్తి పితృయానమనబడు వర్షాది హేమన్తపర్యంతమగు దక్షిణాయన మార్గము కృష్ణగతి లేక ధూమాది మార్గమును సూచించునో, ఈ రెండు వృత్తులకన్న భిన్నముగా విషువదభిజిన్నామముచే వ్యవహరింపబడునది, మిక్కిలి ప్రశస్తమైనదియు కర్తవ్యశూన్యముగను ప్రకృతి పురుషాత్మకములైన ప్రాణాపాన వృత్తులనడుమ (ఉన్మనగా వెలుగొందు) ఒకానొక అలౌకికము అనిర్వచనీయమగు స్థితిని నాకనుగ్రహింపుము.

**శ్రీపాదుక:- "సోమం పూర్ణామృతచరుం.....** అనే శ్లోకవ్యాఖ్యానములో ప్రాణాపాన వృత్తులే శుక్లకృష్ణగతులలో ఆన్తరిక పూర్ణిమా అమాకళలనాస్వాదించి గృహపతి సంజ్ఞతో యోగిఆత్మయాగానుభవాన్ని పొందుతాడనే విషయాన్ని వివరించుకున్నాం. దాని కనుబంధంగా ప్రస్తుత శ్లోకంలో పూర్వార్థంలో సాంబుడు ప్రాణాపాన వృత్తులకు సంబంధించిన శుక్లకృష్ణగమనములను దేవయాన పితృయాన మార్గములుగా ఉత్తరాయణ దక్షిణాయనములుగా పేర్కొనినాడు. తరువాత ఉత్తరార్థములో వాని నడుమ

విషువదభిజిత్పుణ్యకాలమను నొకదానిని పేర్కొని అది ధన్యము కర్తవ్యశూన్యము, మరియు ప్రకృతి పురుషులనడుమ నున్నది యని ఆయవస్థను తనకను గ్రహింపుమని చిద్భానుని వేడుకొనినాడు.

సాధారణముగా విషువత్తును భూమధ్యరేఖగా వ్యవహరిస్తారు. కాని ఇక్కడ విషువత్తు అనునది దక్షిణాయనము తరువాత సూర్యుడుత్తరాయణములోనికి ప్రవేశించుటకు ముందున్న 48 నిముషముల పుణ్యకాలము అని తాత్పర్యము. అట్లే ఉత్తరాయణము తరువాత దక్షిణాయనము ప్రవేశించుటకు ముందున్న 48 నిమిషముల కాలము అభిజిత్తుగా గ్రహించాలి. ఈ విషయాన్ని **'మధ్యమా'** అనే పదం నిర్దేశిస్తున్నది.

యోగశాస్త్ర పరిభాషననుసరించి ప్రాణాపానములు ప్రకృతి పురుషులుగా చెప్పబడినవి. వాని నడుమనున్న వృత్తి లేక స్థితి 'ఉన్మనా' అనే అలౌకికమైన దివ్యమైన స్థితి. ఉన్మనావస్థను జీవన్ముక్తావస్థగా –

**తాభ్యామన్యా జీవన్ముక్తి ప్రదా ఉన్మనాఖ్యేత్యర్థః –** అని క్షేమరాజు తన వ్యాఖ్యానంలో పేర్కొనినాడు. ఆ స్థితి ఆత్మారామస్థితి. అదే బ్రాహ్మీస్థితి. **'ఏషా బ్రాహ్మీస్థితిః –** అని చెప్పి దానిని పొందినవాడు బ్రహ్మమే అయిపోతాడు. ఈ స్థితి **"కృత్యశూన్యా"** అని మూడవ పాదంలో సూచిస్తాడు సాంబుడు. బ్రహ్మవేత్త **'బ్రహ్మైవ భవతి'** బ్రహ్మమే అయినప్పుడు అతనికి బ్రహ్మజ్ఞానమే తద్గతమైన చిదానందానుభవమే తప్ప వేరొకటి భాసించదు. ఇదే విషయం గీతాస్మృతిలో–

**'యస్త్వాత్మరతి రూపస్యాత్ ఆత్మతృప్తశ్చమానవః'**

**ఆత్మన్యేవ చ సంతుష్టః తస్య కార్యం న విద్యతే ॥(గీత 3/17)**

అని చెప్పబడినది.

అటువంటి కర్తవ్యశూన్యమైన బ్రాహ్మీస్థితిని తన స్తుతిఫలముగా సాంబుడు చిద్భానునభ్యర్థించినాడని పరమార్థంగా గ్రహించాలి.

## అనువాద పద్యము

సీ॥ ఉత్తరాభిముఖత నూర్ధ్వము చరియించు
శిశిరాది గ్రీష్మాన్త శివగమనము
దేవయానమనగ దివ్యమర్చిర్గతి
ప్రాణప్రవృత్తియై త్రాణసేయు
దక్షిణదిశగాను దనరునపానంబు
ధూమాదిమార్గపు సేమమరయు
అంతరగామిగా నభిజిత్తు విషువత్తు
లను పేర ధన్యత నలరునట్టి

గీ॥ కృత్యశూన్యము భవ్యము నిత్యసత్య
మగుచు ప్రకృతిపురుషులకు నాంతరమున
మధ్యమాఖ్యను వెలుగొందు మాన్యమైన
సుస్థితిని నాకు దయనిమ్ము సూర్యదేవ! ॥

---0---

## 52వ శ్లోకము

**అవతారిక:** దేవయాన పితృయానములకు మధ్యగా యోగమార్గములో సాయుజ్యముక్తి ననుగ్రహింపవలసినదిగా నభ్యర్థించుచున్నాడు.

శ్లో॥ స్థిత్వా కిఞ్చిన్మన ఇవ పిబన్ సేతుబన్ధస్య మధ్యే
ప్రాప్యోపేయం ధృవపదమథో వ్యక్తముద్దాల్యతాలూ ।
సత్యాదూర్ధ్వం కిమపి పరమం వ్యోమ సోమాగ్నిశూన్యం
గచ్ఛేయం త్వాం సురపితృగతీ చాన్తరా బ్రహ్మభూతః ॥

**అన్వయము:** (అహం) కిఞ్చిత్ మనః పిబన్నివ సేతు బంధస్య మధ్యే స్థిత్వా, ఉపేయం ధృవపదం ప్రాప్య, అధఃవ్యక్తం తాలు ఉద్దాల్య, సురపితృగతీ అన్తరా బ్రహ్మభూతశ్చ(సన్) సత్యాదూర్ధ్వం సోమసూర్యాగ్నిశూన్యం కిమపి పరమం వ్యోమ త్వాం గచ్ఛేయమ్ ॥

**ప్రతిపదార్థము:**

అహం – నేను

కించిత్ మనః – శేషించిన కొద్దిపాటి సంకల్పములు కల మనస్సును

పిబన్నివ – త్రాగివేయు (లయము చేయు) చున్నవాడువలె

సేతుబంధస్య మధ్యే – ప్రాణాపానముల నడుమగల వారధిపై

స్థిత్వా – నిలచినవాడనై

ఉపేయం ధృవపదం ప్రాప్య – పొందదగిన ధృవస్థానమునుపొంది

అధఃవ్యక్తం – క్రిందుగా గోచరించిన

తాలు ఉద్దాల్య – తాలుభాగము (లంబికా చతుష్పథమును) భేధించి సురపితృగతీ అన్తరా– దేవయాన పితృయానముల నడుమ నాధారమై

బ్రహ్మభూతఃశ్చ (సన్) – బ్రహ్మీభూతుడనై

సత్యాదూర్ధ్వం – సత్యలోకమునకు కూడ నావలనున్న

సోమాగ్నిశూన్యం – సోమ, అగ్నులకుప్రతీకలైన ప్రాణాపానరహితమైన

కిమపి పరమం వ్యోమ – ఒకానొక అనిర్వచనీయమైన పరమాకాశమున

త్వాం గచ్ఛేయమ్ – నిన్ను పొందెదనుగాక! (నీలోలయించెదనని భావము)

**భావము:-** కొద్దిపాటి శేషించిన సంకల్పములు కల మనస్సును త్రాగివేయు (లయింపజేయు) చున్నవాడనై ప్రాణాపానముల నడుమ వారధివలెనున్న సేతుబంధమనెడి స్థానమున నిలచి, పొందదగిన ధృవపదమును (బ్రహ్మలోకమును చేరు మార్గమును) పొందినవాడనై అచట లంబికాచతుష్పథమైన తాలువును భేదించి దేవయాన పితృయానముల నడుమ, ఆధారభూతమైన బ్రహ్మసాక్షాత్కారమును పొంది, సత్యస్వరూపము

కన్న గొప్పదియు, అనగా సత్యలోకమున కావలనున్న సోమాగ్నిశూన్యమగు అనగా ప్రాణాపానములను నిరోధించి చిదాకాశమున ప్రకాశించుచున్న, నీ దివ్యస్వరూపమును పొందగోరుచున్నాను. అనగా నీ సాయుజ్యమునభిలషించుచున్నానని భావము.

**శ్రీపాదుకః-** పూర్వశ్లోకములో జ్ఞానమార్గమున బ్రహ్మప్రాప్తిని వర్ణించిన సాంబుడీ శ్లోకములో వివిధయోగ భూమికలను దాటుచు క్రమముగా బ్రహ్మసాక్షాత్కారమును పొందు సాధనక్రమమును తెలియజేసినాడు. **"బ్రహ్మభూతః అహం త్వాం గచ్ఛేయమ్"** అని ఉత్తమ పురుషలో చెప్పుటచే తాను స్వయముగా ననుభవించిన యోగభూమికల యనుభవములను సాంబుడీ శ్లోకమున సూత్రప్రాయముగా నిర్దేశించి నాడని గ్రహించాలి. ఈ శ్లోకమున సాంబుడు తన యోగసాధనానుభవమును క్లుప్తముగా మూడుదశలలో సంగ్రహించినట్లుగా **'స్థిత్వా, ప్రాప్య, ఉద్దాల్య'** అను మూడు అసమాపకక్రియలచే సూచించినాడు.

ప్రథమపాదములో కొద్దిపాటి శేషించిన సంకల్పములుకల మనస్సును లయింపజేయుటకై సేతుబంధము నడుమ **'స్థిత్వా'** నిలచినవాడనైయని ప్రథమావస్థానుభవము నభివ్యక్తీకరించినాడు. మనోలయమును సాధించాలంటే, దానిని నిర్వికల్పము అనగా సంకల్పవికల్పరహితముగా శూన్యముగా చేయాలి. అందుకు పరస్పరగ్రసనోన్ముఖములైన ప్రాణాపానములను ప్రాణాయామముచే నిరోధించి స్తంభింపచేయాలి. అదే సేతుబంధమునడుమ నిలచి మనస్సును పానము చేయడమనే మాటకర్థం. దీనికి పూర్వరంగంగా ప్రాణశక్తిని సుషుమ్నాపథంలో కుణ్డలినిగా జాగృతం చేసి స్వాధిష్ఠాన మణిపూర అనాహతముల ద్వారా విశుద్ధివద్ద నిలపాలి. అది మనోలయమువలన లభించిన ధ్రువపదము. అచట నిర్వికల్పస్థితిలో ప్రాణగతి సూక్ష్మస్థితిని పొందుతుంది. దీనిని శ్రుతి – **" నీవార శూకవత్ తన్వీ పీతా భాస్వత్యణూపమా'** అని వర్ణిస్తుంది. ఇలా తురీయావస్థను పొందిన యోగి లంబికాయోగము చేత తాలుకాస్థానముననున్న **'చతుష్పథము'**

నుదర్శిస్తాడు. చతుష్పథమనగా నాలుగు రోడ్లకూడలి. ప్రాణాపానములు రెండుమార్గములలో విడివిడిగా నచటకు చేరుకుని అవి విరుద్ధములై మూడవమార్గం గుండా సుషుమ్నలో ప్రవేశిస్తాయి. సాధకుల ప్రారంభదశలో అవి క్రమంగా నిర్వికల్పస్థితిని పొంది మనోలయ మయ్యేవరకు షట్చక్రములను భేదిస్తూ, ఆంతరబ్రహ్మాణ్డమునందు వ్యాపించి ప్రకాశిస్తాయి. ఈ దర్శనమునే క్షేమరాజు తన వ్యాఖ్యలో **దివ్యకరణబంధాశ్రయమని** పారిభాషికముగా నిర్దేశించినాడు. (క్షేమరాజీయవ్యాఖ్య పుట-161) ఈ ప్రకాశదర్శనమే యోగియొక్క చిదానందానుభవము. జన్మాంతరమున యోగభ్రష్టులై ఈ జన్మలో దానిని మరల సాధనచేయు ఉత్తమ యోగులకు నాలుగవ మార్గముద్వారా నేరుగా బ్రహ్మానందానుభవము కలుగుతుంది. ఆ సమయంలో ప్రాణాపానముల స్వరూపాలు చిత్ప్రకాశంలో లయిస్తాయి. ఈ యవస్థ **'సోమాగ్నిశూన్యం'** - అని మూడవపాదంలో నిర్దేశింపబడింది. సత్యలోకమును మించిన సహస్రారకర్ణికాంతరస్థమైన బ్రహ్మపదం. అచట చిద్భానుని పొందుతున్నానంటాడు సాంబుడు. అనగా స్వాత్మప్రకాశం చిద్భానుప్రకాశంలో లయించాలని అతని ఆశంస. ఈ విధంగా పారిభాషికమైన పదబంధముతో సాంబుడు తాను దర్శించిన యోగానందానుభవమును ప్రస్తుతశ్లోకములో ప్రబోధించినాడు.

## అనువాద పద్యము

**గీ॥** **అచ్చట ద్రావుచు నవశిష్ట సంకల్ప**
**యుతమైన మానస యోగసిద్ధి**
**సేతు బంధము మధ్య నాతురత నిలచి**
**పరమమైనది ధృవపదమునంది**
**క్రిందుగా నున్నట్టి యందమౌ లంబిక**
**భేదించి, గని దేవపితృగతులకు**
**నంతరాధారమై యలరు బ్రాహ్మీస్థితి**
**సత్యలోకాతీత నిత్యపదము**

**గీ॥ నందు సోమాగ్నిశూన్యమై యలరునట్టి**
**వాక్కులూహల కందని వంద్యమైన**
**పరమమౌ వ్యోమపథమున భాసమాను**
**నిన్ను పొంది లయింతును నిక్కమిదియ॥**

---0---

## 53వ శ్లోకము

**అవతారిక:-** సాంబుడు తనకు సంప్రాప్తించిన వ్యాధినివారణార్థమై సూర్యుని సంస్తుతించినట్లు ఐతిహ్యము ప్రసిద్ధముగానున్నను యోగారూఢస్థితిలో బ్రహ్మీభూతుడై చిద్భానునిలో లయించి సాయుజ్యము నందుటయే స్తుతిప్రతిపాద్యమని ముక్తకంఠముగా ఈ శ్లోకములో విశదీకరింపబడినది.

**శ్లో॥ సర్వాత్మత్వం సవితురితి యో వాఙ్మనఃకాయబుద్ధ్యా**
**రాగద్వేషోపశమ సమతా యోగమేవారురుక్షుః ।**
**ధర్మాఽధర్మగ్రసన రశనా ముక్తయే యుక్తియుక్తాం**
**స శ్రీసాంబః స్తుతిమితి రవేః సుప్రశాన్తాం చకార ॥**

**అన్వయము:** యః రాగద్వేషోపశమసమతాయోగం సవితుః సర్వాత్మత్వం ఆరురుక్షుః (ఆసీత్) సశ్రీసాంబః ధర్మాఽధర్మగ్రసనరశనాముక్తయే, వాఙ్మనఃకాయబుద్ధ్యా యుక్తియుక్తాం సుప్రశాన్తాం రవేః స్తుతిం-ఇతి (ఏవం) చకార॥

**ప్రతిపదార్థము:**

| | |
|---|---|
| యః రాగద్వేషోపశమ సమతాయోగం | -యే సాంబుడు రాగద్వేషముల- నుపశమింపచేయుటద్వారా సమత్వయోగమును పొందినవాడై |
| సవితుః | - సూర్యభగవానుని యొక్క |
| సర్వాత్మత్వం | - సర్వభూతాన్తరాత్మత్వమును |
| ఆరురుక్షుః | - పొందదలచినవాడో (అట్టి) |

| | |
|---|---|
| సః శ్రీసామ్బః | – అట్టి మోక్షలక్ష్మి సమన్వితుడైన సాంబుడు |
| ధర్మాధర్మగ్రసనరశనాముక్తయే | – పుణ్యపాపములను కబళించు పాపమునుండి ముక్తుడగుటకొరకు |
| వాఙ్మనఃకాయబుద్ధ్యా | – మనోవాక్ శరీరబుద్ధులతోడి |
| యుక్తియుక్తాం | – యోగముతో కూడిన |
| రవేః స్తుతిం | – చిద్భానుని యొక్క స్తోత్రమును |
| ఇతి | – ఈ విధముగా |
| సుప్రతిష్ఠాం/సుప్రశాన్తాం చకార | – సుప్రసిద్ధమైనదిగా లేక ఆత్మవిశ్రాంతి ననుగ్రహించునదిగా రచించినాడు. |

**భావము:** రాగద్వేషములను విడనాడి **'సమత్వం యోగ ఉచ్యతే' (గీ.2-48)** అని చెప్పబడిన సామ్యయోగము ద్వారా సూర్యభగవానుని యొక్క సర్వభూతాన్తర్యామిత్వమును పొందదలచిన, మోక్షలక్ష్మి సమన్వితుడైన సాంబుడు. పుణ్యపాపముల కర్మబంధ వినిర్ముక్తుడగుటకై మనోవాక్శరీరబుద్ధుల సమత్వయోగముతో ప్రకాశించుచున్న చిదాదిత్యభగవానుని స్తోత్రము నీవిధముగా జగద్విఖ్యాతమైనదిగా లేక ఆత్మశాంతినను గ్రహించునదిగా రచించెను.

**శ్రీపాదుక :** నాలుగవ పాదములో – 'శ్రీ సాంబుడీ చిద్భానుస్తుతినిట్లు జగద్విఖ్యాతమగునట్లు రచించెను.' – అని యుండుటచే ఈ శ్లోకము సాంబుని ఐతిహ్యమును అతడు గావించిన స్తుతి సమన్వితము వచించు వ్యాసునిదో లేక సూతుని వంటి వేరొక పౌరాణికునిదో కావచ్చునని తలంపరాదు. ఈ విషయమును సాంబునకు విశేషణముగా యీ శ్లోకములో మాత్రమే వాడబడిన 'శ్రీ' శబ్దము తెలియజేయును. **'శ్రయన్త్యేతాం యోగినః ఇతి శ్రీః'** యోగులచే నాశ్రయింపబడునది లేదా యోగులాశ్రయించునది అను వ్యుత్పత్తిననుసరించి శ్రీ శబ్దమునకు మోక్షలక్ష్మి యనే అర్థాన్ని వివక్షించిన పక్షంలో శ్రీసాంబుడనగా మోక్షలక్ష్మి సమన్వితుడైన సాంబుడు, అనే అర్థం సిద్ధిస్తుంది.

మోక్షలక్ష్మీ సమన్వితుడైనాడు కావుననే కృతిని **'స్వప్రశాన్తాం'** ఆత్మవిశ్రాంతి ననుగ్రహించునట్లుగా రచించినాడు. రాగద్వేష వినిర్ముక్తమైన యోగమునవలంబించినాడు. పుణ్యపాపకర్మల బంధము నుండి విడివడి – **'ముక్తశ్చాన్యాన్విమోచయేత్'** – అనగా తాను తరించి అందరినీ తరింపచేయాలనే మహత్వాకాంక్షతో పరమాత్ముడైన చిద్భానునభినుతించి కృతకృత్యుడైనాడని భావము.

ఇంకా ఈ విషయాన్ని ధృవ పరచునిమిత్తమై యత్తదుపపాదనముచే 'స శ్రీసాంబః" – అని శ్రీసాంబ శబ్దమునకు 'సః' – అనే మరో విశేషణమును ఉపనిబంధించినాడు. మోక్షలక్ష్మీ సమన్వితుడైన 'ఆ'సాంబుడని అర్థము. ఆ సాంబుడనగా ఏ సాంబుడు? అనే ఆశంకకు సమాధానముగా **'సవితుః సర్వాత్మత్వం – రాగద్వేషోపశమసమతాయోగం – ఆరురుక్షుః'** రాగద్వేషవినిర్ముక్తమైన వాఙ్మనః శరీరములతో కూడిన బుద్ధితో సర్వాత్మకుడైన చిదాదిత్యుని సాయుజ్యమును పొందగోరినవాడని – **సః** అనే తచ్ఛబ్దాన్ని సోపపత్తికముగా తానే విశదీకరించినాడు. మరియొక విశేషము. స్తుతి పూర్తయిన మరుక్షణమే తాను శ్రీ సాంబుడైనట్లు ప్రకటించుటచే, తనకు చిదాదిత్యుని సంపూర్ణానుగ్రహము లభించునట్లు, అట్లే పాఠకులకు కూడ ఆదిత్యానుగ్రహము సద్యఃఫలితముగా లభించునని ఈశ్లోకము ద్వారా మంగళాశాసనమును ధ్వనింపచేసినాడని చెప్పవచ్చును.

## అనువాద పద్యము

**సీ॥ రాగ విద్వేషాలు రయమున శాంతింప**
**సాధించి యోగము సమత యనగ**
**సావిత్ర మైనట్టి సర్వాత్మతత్త్వము**
**పొందదలచినట్టి పొంతనమున**
**శ్రీసాంబసుకవీశు డాసాంతముగ తాను**
**పుణ్యపాపవిముక్తి పూర్ణదముగ**
**వాఙ్మనః కాయనిబద్ధ బుద్ధులలరు**
**యుక్తి యుక్త నుతిని రక్తితోడ**

**గీ॥** సుప్రతిష్ఠితమౌ శాన్తి సూక్తమనగ
సర్వపాపౌఘ విధ్వంసి శాతనముగ
కర్మబంధ వినిర్ముక్తి మర్మమెరిగి
కర్మ సాక్షిని చిద్భాను గన రచించె॥

---0---

## 54వ శ్లోకము

**అవతారిక:-** పూర్వశ్లోకములో ధ్వన్యాత్మకముగనభివ్యక్తీకరించిన ఫలస్తుతిని శ్రీసాంబ శబ్దప్రయోగపురస్సరముగా **'ద్విర్బద్ధం సుబద్ధం భవతి'** అను నానుడి ననుసరించి రెండు శ్లోకములలో ఆశీరనుగ్రహముగా ప్రస్తావించుచున్నాడు.

**శ్లో॥** **భక్తిశ్రద్ధాద్యఖిలతరుణీ వల్లభేనేదముక్తం**
**శ్రీసాంబేన ప్రకటగహనం స్తోత్రమధ్యాత్మగర్భమ్ ।**
**యః సావిత్రం పఠతి నియతం స్వాత్మవత్సర్వలోకాన్**
**పశ్యన్ సోఽన్తే వ్రజతి శుకవన్మణ్డలం చణ్డరశ్మేః ॥**

**అన్వయము:-** యః భక్తి శ్రద్ధాద్యఖిల తరుణీవల్లభేన శ్రీ సాంబేన ఉక్తం ఇదం ప్రకటగహనం, అధ్యాత్మగర్భం సావిత్రం స్తోత్రం నియతం పఠతి, సః స్వాత్మవత్ సర్వలోకాన్ పశ్యన్, అన్తే శుకవత్ చణ్డరశ్మేః మణ్డలం వ్రజతి ।

**ప్రతిపదార్థము:-**

| | |
|---|---|
| యః | - ఎవడు |
| భక్తి శ్రద్ధాద్యఖిలతరుణీవల్లభేన | - భక్తి శ్రద్ధ ఉపరతి మొదలగు సద్గుణరూప యువతులచే కాంతుడుగా వరింపబడిన |
| శ్రీసాంబేన | - మోక్షలక్ష్మీ సమన్వితుడైన సాంబునిచే |
| ఉక్తం | - కీర్తింపబడినదియు |
| ప్రకటగహనం | - నిగూఢమైన బ్రహ్మ విద్యారహస్యములను ప్రకటించునదియును |

| | |
|---|---|
| అధ్యాత్మగర్భం | – ఆత్మజ్ఞాన రహస్య గర్భితమైనదియునగు |
| ఇదం సావిత్రం స్తోత్రం | – ఈ సూర్యసంబంధమైన స్తుతిని |
| నియతం పఠతి | – నియమబద్ధముగా పఠించునో |
| సః సర్వలోకాన్ | – అతడు సమస్తలోకములను |
| స్వాత్మవత్ పశ్యన్ | – తనకు అభిన్నముగా దర్శించుచు |
| అన్తే | – అవసానకాలమున |
| ప్రకట శుకవత్ | – శుకమహర్షివలెవైరాగ్యమును సాక్షాత్కరించుకుని |
| చణ్డరశ్మేః మణ్డలం | – మార్తాణ్డమణ్డలమును |
| వ్రజతి | – ప్రవేశించుచున్నాడు. |

**భావము:** తరుణీలలామలుగా పరిణమించిన భక్తిశ్రద్ధాది సద్గుణములచే కాంతుడుగా వరించబడిన, మోక్షశ్రీసమన్వితుడైన సాంబునిచే, అతి గహనములైన శాస్త్రవిషయములను సరళమైన రీతిలో ప్రకటించునదియు, ఆత్మవిద్యారహస్యగర్భితమును అగు ఈ సూర్యస్తోత్రమును నియమపూర్వకముగా (శ్రద్ధాభక్తులతో) పఠించు భక్తపాఠకుడు సమస్త లోకములను తన స్వస్వరూపముగా దర్శించుచు అన్తకాలములో శుకయోగీంద్రుని వలె పరమవైరాగ్యభాగ్య సంపన్నుడై చిద్భానుమణ్డలమును ప్రవేశించును.

**శ్రీపాదుక:–'ప్రయోజనమనుద్దిశ్య న మన్దోఽపి ప్రవర్తతే'** – ప్రయోజనము లేనిదే ఎవ్వరును ఏ పనిని చేయరనే లోకప్రవృత్తి ననుసరించి సాంబుడీ శ్లోకములో స్వ పర ప్రయోజనములను రెంటినీ ఫలస్తుతి రూపమున ప్రతిపాదించుచున్నాడు. 'స్వయంతీర్ణః పరాంస్తారయేత్' తాను తరించి ఇతరులను తరింపచేయాలని పెద్దల ప్రవచనము. స్తుతి సమనంతరమే అనగా స్తుతించిన మరుక్షణములోనే దయాసముద్రుడగు చిద్భానుని యను గ్రహమును పొంది తాను 'శ్రీసాంబు'డైనట్లుగా పూర్వశ్లోకములో సాంబుడు తెలిపి యున్నాడు. దానినే మరల ఈశ్లోకమున ధృవీకరించుచు

శ్రీసాంబకృతమైన ఈ సూర్యస్తుతిని నియమపూర్వకముగా పఠించు భక్తుడు ఆదిత్యసముడై సర్వాత్మభావమునంది పరమ వైరాగ్య శ్రీ సమన్వితుడైన శుక యోగీంద్రుని వలె స్వస్వరూపాను సంధానముతో నేరుగా ఆదిత్యమణ్డలమును ప్రవేశించి ముక్తుడౌతాడని ఫలస్తుతిని నిర్దేశించినాడు. బ్రహ్మవిదుడగు కవి బ్రహ్మ యొక్క వాక్కు బ్రహ్మవాక్కే. కావున శ్రద్ధాభక్తులతో ఈ స్తుతినిపఠించువారు అందరూ తప్పక బ్రహ్మాత్మజ్ఞానమును పొంది ఆదిత్యానుగ్రహపాత్రులై సూర్యసాయుజ్యమును పొందుతారని భావం.

మరోవిశేషం – ఆదిత్యభగవానుడు తనను స్తుతించిన సాంబునకు మాత్రమే ఆత్మజ్ఞానమును, బ్రాహ్మీస్థితిని, సాయుజ్యమును అనుగ్రహించేడు. ఆ యనుగ్రహముతో వాక్శుద్ధిని వాక్సిద్ధిని పొందిన సాంబుడు పరమ కరుణామయుడై కేవలమీ స్తుతిని భక్తితో నియమపూర్వకము పఠించినంతమాత్రమున యోగీశ్వరేశ్వరుడైన శుకబ్రహ్మముతో సమానమైన స్థితి కలిగి శుకయోగీంద్రుని వలె నేరుగా ఆదిత్యమండల ప్రవేశము చేసి ముక్తులైతరించు భాగ్యమును అస్మదాదులకందరకు అనుగ్రహించినాడని గ్రహించాలి. ఇది మోక్షలక్ష్మీ సమన్వితుడైన సాంబుని శ్రీసూక్తి అనే విషయాన్ని ద్వితీయపాదాదిలో పునరావృత్తమైన శ్రీసాంబ శబ్దం ధ్వనింపజేస్తున్నదని గ్రహించాలి.

## అనువాద పద్యము

**సీ॥** భక్తి శ్రద్ధాదులౌ భద్ర గుణంబులు
కాంతా లలామలై కాంతు గాను
ముక్తికాంతను గూడి రక్తితో సాంబుని
దరిచేర వారితో దనరుచుండి
యధ్యాత్మగర్భిత మాత్మవిద్యామర్మ
బోధకంబగు నుతి బోధజేసె
సావిత్రమైనట్టి సంస్తుతి దీనిని
నియతిని పఠియించు నీతిపరుడు

**ఆ.వె॥అన్నిలోకములను ఆత్మరూపములుగా**
**తనకభిన్నముగను దనరజూచి**
**సూర్యమండలమును శుకయోగి వలె తాను**
**అంతకాలమందు నా(శ్రయించు ॥**

---0---

## 55వ శ్లోకము

**అవతారిక:-** పఠితలకే కాకుండా (శ్రోతలకుకూడ చిద్భానుస్తవము తల్లివలె శుభములను చిదానందరూపమైన సాయుజ్యమును అను(గహించాలని సాంబుడు మంగళాశాసనపూర్వకముగా స్తుతిని పూర్తిగావించుచున్నాడు.

**శ్లో॥ ఇతి పరమరహస్య శ్లోకపఞ్చాశదేషా**
**తపననమనపుణ్యా సాగమ (బ్రహ్మచర్చా ।**
**హరతు దురితమస్మ ద్వర్ణితాऽऽకర్ణితా వో**
**దిశతు చ శుభసిద్ధిం మాతృవద్భక్తిభాజామ్ ॥**

**అన్వయము:** ఇత్యేషా తపననమనపుణ్యా సాగమ(బ్రహ్మచర్చా పరమరహస్య శ్లోకపఞ్చాశత్, అస్మద్వర్ణితా వః ఆకర్ణితా భక్తి భాజాం వః దురితం హరతు చ శుభసిద్ధిం దిశతు

**ప్రతిపదార్థము:**

ఇతి తపననమనపుణ్యా - ఈ విధముగా ఆదిత్యుని నమస్కరించుటచే పుణ్య(పదమైనది

సాగమ(బ్రహ్మచర్చా - వేదాగమశాస్త్ర(పతిపాదితములైన (బ్రహ్మవిద్యా సంబంధివిషయముల వివేచనము కలదియు

| | | |
|---|---|---|
| పరమరహస్యశ్లోకపఞ్చాశత్ | – | పరమ రహస్యగర్భితములైన యేబది శ్లోక మంత్రముల సంపుటి |
| అస్మద్వర్ణితా ఏషా | – | మా చే వచింపబడినదైన ఈ స్తుతి |
| వః ఆకర్ణితా | – | మీ చే శ్రవణము చేయ(విన)బడినదై |
| భక్తిభాజాం | – | భక్తి పాత్రులైన |
| వః మాతృవత్ | – | మీకు తల్లి వలె |
| దురితం హరతు | – | పాపక్లేశములను నశింపచేయుగాక |
| చ | – | మరియు |
| శుభసిద్ధి | – | కల్యాణరూపమైన మోక్షసిద్ధిని |
| దిశతు | – | అనుగ్రహించుగాక! |

**భావము:** ఈ విధముగా వేదశాస్త్రాదులలో వివరింపబడిన బ్రహ్మవిద్యా వివేచనములతో పరమరహస్యగర్భితములైన యేబదిశ్లోకములలో చిదాదిత్యసంస్తుతి పరముగా నాచే రచింపబడిన **'సాంబపంచాశిక'** యనెడి స్తుతికావ్యము, భక్తిశ్రద్ధాపురస్సరముగా శ్రవణము చేసిన మీకు (పఠితలకు శ్రోతలకు కూడ) తల్లివలె మీ క్లేశములను దురితములను ఉపశమింపజేసి శుభప్రదయై శాశ్వతానందరూపమగు చిద్భానుసాయుజ్యమును సమకూర్చుగాక యని మంగళాశాసనము.

**శ్రీపాదుక:** 'భక్తి జననీ భక్తార్భకం రక్షతి' అనగా భక్తి తల్లివలె భక్త శిశువును సదా సంరక్షిస్తూ ఉంటుందని శివానందలహరి (62వ) శ్లోకములో శంకరులునుడివినట్లుగనే భక్తిజననిగా తన యీ సూర్యస్తుతి **మాతృవత్-తల్లివలె** శ్రోతల పాపముల నడచి శుభములను చేకూర్చాలని మంగళాశాసనం చేసినాడు సాంబుడు. తనకు సిద్ధించిన వాక్సిద్ధిని, వాక్శుద్ధిని ఈ విధమైన పరహితకామనతో చరితార్థము చేసికొనిన సాంబుని మహామహిత్వము, ఔదార్యము పరమకారుణ్యము మాటలచే వర్ణింపశక్యము కానిది. ఇటువంటి మహితాత్ముల చారిత్రిక మాహాత్మ్యమును శ్రీ శంకరులు తమ వివేకచూడామణిలో –

**శ్లో॥శాంతామహాన్తో నివసన్తి సన్తః వసన్తవల్లోకహితం చరన్తః ।**
**తీర్ణాః స్వయం భీమ భవార్ణవం జనానహేతునాన్యానపి తారయన్తః॥**

బాహ్యోపరతిని పొంది లోకహితైక కాంక్షులగు మహితాత్ములు తాము స్వయంగా తరించి భయంకరమైన సంసారసాగరాన్ని అందరూ తరించాలని లోకకల్యాణకాంక్షతో ఎవ్వరినుండి ఏ విధమైన ప్రతిఫలమును కాంక్షించకుండా, వసన్తఋతువు కాలానుగుణంగా ప్రవేశించి లోకమునకు ఆనందమును చేకూర్చి నిష్క్రమించినట్లుగా అంతరిస్తూ ఉంటారు. – అని వర్ణిస్తారు. అలాంటి వ్యాసుడు, శుకబ్రహ్మల వంటి మహామహితాత్ముల కోవకు చెందినవాడు **"శ్రీసాంబుడు"** అనడం అతిశయోక్తి కాదు. తానాస్వాదించిన చిద్ఘనానంద రసాన్ని **'సాంబపంచాశిక'** అనే స్తుతికావ్యంగా **'ఆనందామృతరసకలశం'** గా లోకానికందించి తరింపచేసిన రససిద్ధుడు సాంబుడు సుకృతి. **"జయన్తితేః సుకృతినః రససిద్ధాః కవీశ్వరాః"** అని భర్తృహరి ప్రవచించినట్లు **"సాంబుడు – అతని పఞ్చాశిక"** లోకంలో సుకృతులు, చిరంజీవులే !

## అనువాద పద్యము

**సీ॥** నిగమాగమ రహస్య నిఖిల శాస్త్రంబుల
విషయగర్భితమైన వినుతితతికి
శ్రీ ప్రదంబగునట్లు శ్రీసాంబవిరచిత
శ్లోకపంచదశక మాకరంబు
చిద్గగనమునందు చిద్భాను జూపించి
యుత్తలంబుగ నిచ్చు చిత్తశాంతి
విషయ వాంఛలనుండి విముఖుల జేయుచు
బ్రహ్మవిద్యారతి పరుని జేయు

**గీ॥** వినిన చదివిన దీనిని విభుధులగుదు
రట్టులే భుక్తిముక్తుల నందగలరు
భయములను బాపి దాటించు భవమునిద్ది
అద్వయాసిద్ధి నందిచ్చు నమ్మ యగుచు ॥

శుభం భూయాత్

ఓం భాస్కరాయ నమః

# అధర్వణ వేదోక్త నేత్రోపనిషత్

ఓం అధాతశ్చాక్షుషీం పఠతి । స్థిరాంచక్షు రోగహరాం
వ్యాఖ్యాస్యామః । యధాచక్షురోగాః సర్వతోనశ్యంతి ।
చక్షుషోర్దీప్తిర్భవతి । తస్యాః చక్షుషీ విద్యాయాః ।
అహిర్బుధ్న్య ఋషిః । గాయత్రీఛందః । సూర్యోదేవతా ।
చక్షురోగ నివృత్తయే జపే వినియోగః ॥
ఓం చక్షుశ్చ క్షుశ్చ క్షుస్తేజః । స్థిరోభవ । మాం పాహి పాహి ।
చక్షురోగాన్ శమయ శమయ । మమజాత రూపం
తేజో దర్శయ దర్శయ ॥ యథాహమంధోనశ్యాం ।
తధా కళ్యాణం కురు కురు । యేన పూర్వజన్మో పార్జితాని
చక్షుః ప్రతిరోధక దుష్కృతాని । తాని సర్వాణి నిర్మూలయ నిర్మూలయ ॥
ఓం నమశ్చక్షుస్తే జోధాత్రే దివ్య భాస్కరాయ ।
ఓం నమః కరుణాకరాయ । అమృతాయ । శ్రీ సూర్యాయ ।
ఓం నమో భగవతే శ్రీ సూర్యాయాక్షి తేజసే నమః
ఓం తపసే నమః । రజసే నమః ।
అసతోమా సద్గమయ తమసోమా జ్యోతిర్గమయ ।
మృత్యోర్మా అమృతం గమయ ।
ఉష్ణోభగవాన్ శుచిరూపః । హంసోభగవాన్ శుచిర ప్రతి రూపః ।
యద్రూపాం చాక్షుష్మతీం విద్యాం । బ్రాహ్మణో నిత్యమధీతే । తస్యకులే అంధోనభవతి ।
నతస్య అక్షిరోగో భవతి । అష్టౌబ్రాహ్మణాన్ గ్రాహయిత్వా । విద్యా సిద్ధిర్భవతి ।
విశ్వరూప ఘృణితే । జాతవేదసే హిరణ్మయం పురుషం జ్యోతి రూపం సహస్ర
రశ్మి తేజోమయం । శతధావర్తమాన ప్రాణః ప్రజానా ముదయుత్యేషః సూర్యః ।
శ్రీ సూర్యాయ నమః ॥

## మూలమంత్రం

**ఓం నమో భగవతే ఆదిత్యాయ అహోవాహిన్యహోవాహినీస్వాహా ॥**

(108 సార్లు జపించవలెను)

ఓం తత్సత్

శ్రీ సూర్యనారాయణస్వామి పరబ్రహ్మార్పణమస్తు

ఓం భాస్కరాయ నమః

# శ్రీ చాక్షుష్మతీవిద్యా

ధ్యానమ్ ॥

ఓం చక్షుస్తేజోమయం పుష్పకందుకం బిభ్రతీం కరే ।
రౌప్యసింహాసనా రూఢాం దేవీంచాక్షుష్మతీం భజే ॥

మనుః ॥

ఓం సూర్యాయాక్షి తేజసే నమః । ఓం ఖేచరాయ నమ: ।
అసతోమా సద్గమయ । తమసోమా జ్యోతిర్గమయ ।
మృత్యోర్మా అమృతం గమయ । ఉష్టోభగవాన్ శుచిరూపః
హంసో భగవాన్ శుచిరప్రతి రూపః ।
విశ్వరూపం ఘృణినం సూర్యం జాతవేదసం హిరణ్మయం ।
జ్యోతిరేకం, తపనంతం సహస్ర రశ్మి శ్శతధావర్తమానః
ప్రాణః ప్రజానా ముదయత్యేష సూర్యః॥
ఓం నమో భగవతే సూర్యాయాహోవాహిన్యహో వాహినీ స్వాహా॥
వయస్సు పర్ణా ఉపసేదురింద్రం ప్రియమేధా ఋషయోనాథ
మానాః । అపధ్వాంత మూర్ణుహి పూర్ధి చక్షు ర్మము
ధ్యస్మాన్ నిధయేవ బద్ధాన్ । ఓం పుండరీకాక్షాయ నమః ।
ఓం పుష్కరేక్షణాయ నమః । ఓం అమలేక్షణాయ నమః ।
ఓం కమలేక్షణాయ నమః । ఓం విశ్వరూపాయ నమః ।
ఓం మహావిష్ణవే నమః ।
షోడశ మన్త్ర సమష్టి రూపిణీ దూరదృష్టి సిద్ధి ప్రదా ॥
చాక్షుష్మతీ విద్యా సమాప్తమ్ ॥ సర్వం శ్రీ ఉషా పద్మినీ ఛాయా
సమేత సూర్యనారాయణ పరబ్రహ్మార్పణమస్తు ॥
ఓం నమో భగవతే సూర్యాయ ॥
॥ సర్వేజనా స్సుఖినోభవంతు ॥

# అరసవల్లి క్షేత్ర మాహాత్మ్యము

మన ఆంధ్రప్రదేశ్ నందు – శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం పట్టణమునకు దగ్గరగా అరసవల్లి (హర్షవల్లి) అను శ్రీ సూర్యనారాయణస్వామి వారి పుణ్య క్షేత్రము కలదు. ఇది పురాణ ప్రసిద్ధమైనది. మనకు ప్రత్యక్షదైవతమగు శ్రీ సూర్యభగవానుని దేవాలయము – భక్తుల పుణ్యముల పంటయోయనునట్లు విరాజిల్లుచున్నది.

మన దేశమంతటను శ్రీ లక్ష్మీనారాయణులు, శ్రీ సీతారాములు, శ్రీ పార్వతీపరమేశ్వరులు, శ్రీ ఆంజనేయస్వామి మొదలగు దేవతల యొక్క దేవాలయములు బహుళముగాను, శ్రీ కనకదుర్గాంబ, శ్రీ కాళికాదేవి, శ్రీ మీనాక్షి, శ్రీ కామాక్షి మొదలగు దేవతల యొక్క ఆలయములు అవిరళముగానున్నవి. కాని, ప్రత్యక్షదైవమగు శ్రీ సూర్యభగవానుని దేవాలయము ఇచ్చటను దక్షిణ భారతదేశమున నొకటియు మాత్రమే కలదు.

దీనులు అంధులు, కుష్ఠరోగులు, బొల్లి మొదలగు మచ్చలు గలవారు ఈ క్షేత్రమునకు వచ్చి "త్వమేవ శరణం మమ" అని సూర్యుని శరణు జొచ్చి, పూజలు, అభిషేకములు, సూర్యనమస్కారములు జరిపించుకొని, తమ కోర్కెలు ఫలించగా హర్షభరితులై తమ యిండ్లకు వెళ్ళుదురు. గాన, ఈ క్షేత్రమునకు "హర్షవల్లి" అని సార్థకనామము గలిగెను. అది వ్యవహార వశమున "అరసవల్లి" గా మారినది. ఇప్పటికిని గ్రుడ్డివారు, కుష్ఠు మచ్చలుగలవారు రోగములు పోయి, భగవదనుగ్రహ పాత్రులగుట ప్రత్యక్షానుభవమైయున్నది. ఈ క్షేత్రస్వామి గ్రహాధిపతి యగుటచే దర్శనమాత్రముచేతనే సర్వగ్రహారిష్ట శాంతి లభించును. ఈ క్షేత్రమందు జరిపిన పూజలు మొదలగునవి కోటిరెట్లు ఫలితమిచ్చునని పురాణములు ఘోషించుచున్నవి. ఈ క్షేత్ర మాహాత్మ్యమును యాత్రికులు సంశయింపక మిక్కిలిగా నమ్ముదురు.

శ్రీకృష్ణభగవానుడు గీతలో

***"యదాదిత్యగతం తేజో జగద్భాసయతేఽఖిలమ్***
***యచ్చంద్రమసియచ్చాగ్నౌ తత్తేజోవిద్ధి మామకమ్"***

లోకములను ప్రకాశింపజేయు సూర్యునియందైన తేజస్సు నాదే యనియు "జ్యోతిషాం రవి రంశుమాన్" నేనే సూర్యభగవానుడనని సెలవిచ్చెను కనుక పరమాత్మయే ఈ క్షేత్రమున యాత్రికులకును భక్తులకును దర్శనమిచ్చును. అనేక జన్మార్జిత పాపములను పోగొట్టి పునీతులుగా చేయుచున్నాడు. "ఆదిత్య మమ్బికాం విష్ణుం గణనాథం మహేశ్వరం" అని పంచాయతన పూజలో సూర్యభగవానునికే ప్రథమస్థానం.

"సూర్య ఏవత్రైలోక్యస్యమూలం పరమదైవతమ్" అనగా సూర్యుడే మూడు లోకములకు కారణము. ముఖ్యదేవుడు రవే. కరసహస్రం యత్ప్రాజ్ఞయా సముదాహృతమ్, తేషాం శ్రేష్ఠా పున: సప్తరశ్మయో గ్రహసంజ్ఞితా:" అనుటచే సూర్యుని వేయి కిరణములలో ముఖ్యమైన ఏడు కిరణములే నవ గ్రహములని తెలియుచున్నది. కనుక, గ్రహపతియగు సూర్యభగవానుని యనుగ్రహమువలన భక్తుల సర్వ గ్రహారిష్టశాంతి తప్పక కాగలదనుట నిస్సందేహము. ఈ సూర్యదేవుని విశిష్టత ఆదిత్య హృదయములో వర్ణింపబడెను. ఆతడే లోకముల సృష్టి, స్థితి, లయముల గావించుచున్నాడు. త్రిమూర్తి స్వరూపుడు, వేదస్వరూపుడు గాన త్రయీమూర్తి - సర్వదేవాత్మకుడు మరియు కర్మసాక్షి. తానీ క్షేత్రమున సాకారుడై భక్తులననుగ్రహించుచున్నాడు. ప్రత్యక్ష దైవతమై తన కిరణములచే లోకములను రక్షించుచున్నాడు.

*శ్లో॥ ఏష బ్రహ్మాచ విష్ణుశ్చ శివ: స్కంద: ప్రజాపతి:*
*మహేంద్రో ధనద: కాలో యమస్సోమో హ్యాపాంపతి:*
*పితరోవసవస్సాధ్యా హ్యశ్వినౌ మరుతోమను:*
*వాయుర్వహ్ని: ప్రజా ప్రాణా ఋతుకర్తా ప్రభాకర: ॥*

అని, ఆదిత్యహృదయమున వర్ణింపబడుటచే ఈ సూర్యుడు బ్రహ్మ విష్ణు మహేశ్వరులేకాక - మహేంద్రుడు, కుబేరుడు, కాలము, చంద్రుడు, వాయువు, అగ్నిదేవుడు, సముద్రుడు, అశ్వినీదేవతలు, యముడు, వరుణుడు, కుమారస్వామి, దేవతలు, మనువు. ప్రజల ప్రాణము, ఋతువుల నడుపువాడు మొదలగు రూపములు గలవాడని పరమాత్మయని తెలియుచున్నది - ఇందుకు సందేహములేదు. "తత్సృష్ట్వా తదేవాను ప్రావిశత్" అని వేద ప్రమాణము. దేవుని మహిమ అవాఙ్మానసగోచరము - వాక్కు అతనిని వర్ణింపలేదు. మనస్సు వాని గుణముల నూహింపలేదని భావము.

పగలు తన కిరణములచే మనకు చైతన్యము కలిగించును. గాన, దివాకరుడని పేరు. సాయంకాలమున సూర్యకిరణములు చంద్రమండలమును ప్రవేశింపగా, చంద్రుడు రాత్రియందలి అంధకారమును పోగొట్టునట. కాళిదాస మహాకవి "దినాంతే నిహితం తేజస్సవిత్రేవ హుతాశన:" అని సాయంకాలమున సూర్యునిచే నీయబడిన కాంతిని పొంది అగ్నిదేవుడు మిక్కిలి ప్రకాశించునని వర్ణించెను. కనుక చంద్రాగ్నుల తేజస్సులు సూర్యునివే. రాత్రి సూర్యుడు మనకు గానరాకున్నను, దేశాంతరమున పగలుగా చేయుచున్నాడట.

మయూరుని సూర్యశతకములో 97వ శ్లోకములో
"ద్వీపే యో2స్తాచలో2స్మిన్భవతి ఖలు సపేవాపరత్రోదయాద్రి: ।
యా యామిన్యుజ్జ్వలేందు ద్యుతిరిహ దివసో2న్యత్ర తీవ్రా2తపస్స: ।

యద్వశ్యౌ దేశ కాలావితి నియమవతో నోతు యం దేశకాలౌ । అవ్యాత్సస్వ ప్రభుత్వాహిత భువన హితో హేతురహ్నామినోవ:॥ అని వ్రాసారు. సూర్యదర్శనము లేనిదినము మనకు దుర్దినము. అట్టి దుర్దినములుండిన మనకు అనారోగ్యముకలుగును. మృగ పక్షి క్రిమి కీటకాదులు మడియును, ప్రజలెన్నో ఇబ్బందుల నొందుదురు. ఈ ప్రత్యక్షదైవము మన రోగములను పోగొట్టును. చరాచర ప్రపంచమునకు చైతన్యప్రదాత సవితయేకదా – కనుక మహాకవి "లోకేన చైతన్య మివోష్ణ రశ్మే:" అని వర్ణించెను. ఆదిత్యుడు లేని రాత్రియందు నిద్రయేగదా, పగలాతని చైతన్యము వలన పురుషార్థ సాధకములగు సత్కార్యముల నాచరింతుము. ఇట్టి మన అనుభవమే సూర్యుని విశిష్టతను వెల్లడించుచుండగా, నితర ప్రమాణములేల ? నారాయణుడంతట నిండియున్నాడు. చరాచరములందీ భాస్వంతుడు విరాజిల్లుచుండుటచే నీతని భక్తులు "సూర్యనారాయణస్వామి" యని కీర్తించుదురు. దేవతలందరు ఉదార భావముతో "పత్రం పుష్పం ఫలం తోయమ్" అనువానినే భక్తితో సమర్పింపగోరగా "నమస్కారప్రియో భాను:" అని ఈ ప్రత్యక్ష దైవమును మ్రొక్కినమాత్రముననే భక్తులననుగ్రహించుట చిత్రమేకదా?

*శ్లో॥ ఉదయే బ్రహ్మణోరూప: । మధ్యాహ్నేతు మహేశ్వర:*
*సాయంకాలే స్వయం విష్ణు: త్రిమూర్తిస్తు దివాకర: ॥*

అనునది సహితమీ యాదిదేవుని త్రిమూర్తిత్వమునే చాటుచున్నది. కరుణామయుడగు ఆ పరమాత్మయే ఎల్లవేళలయందు ఈ క్షేత్రమున సన్నిహితుడై సకల జీవులననుగ్రహించుచున్నాడు. అదియును గాక, జగత్తునందు చరాచరములందీతడే వెలుగుచున్నాడు. కనుక ఎల్లవేళల, అన్నింటియందు ఆదిత్యునే మనము చూడవలెను. ఇట్లు ఆసత్తునందు సత్తగు సూర్యునిజూచు సుకృతి సూర్యలోకమును బొందుటయేగాక, భవబంధమునుండి విముక్తినొందును. ఈ దేవ దేవుని కిరణములను సేవించి రోగములను పోగొట్టుకొనుట ప్రత్యక్ష నిదర్శనము. సృష్టి, స్థితి లయ కర్తయగు సూర్యుని ఆరాధించు భక్తులు చతుర్విధ పురుషార్థములను పొందుచున్నారు.

## బలరామ పంచక్షేత్రాలు

ద్వాపరయుగ చరిత్రను వర్ణించు పురాణమునుండి ఈ క్రింది విషయము గ్రహింపబడినది. శ్రీ మహావిష్ణువుయొక్క అవతారమగు బలరామస్వామి ద్వాపరయుగంబున జీవులనుద్ధరింప తన నాగేటిచాలుతో నాగావళి నదినితెచ్చి తత్తీరమున దేవాలయములను ప్రతిష్ఠించెను. అప్పుడే శ్రీకాకుళమున శ్రీ ఉమారుద్రకోటేశ్వరస్వామి ప్రతిష్ఠింపబడెను. ఆ వింతను విలోకింప దేవతలందరు స్వర్గమునుండి వచ్చి, శ్రీ స్వామిని దర్శించి, అర్చించి, ఆనందించి స్వస్థానమును బొందిరి.

తరువాత దేవతాసార్వభౌముడగు నింద్రుడు నిశీథమందు దేవుని సందర్శింప దేవాలయమున కేతెంచెను – ద్వారపాలకులగు నందీశ్వర మహాకాళు లాతనిగాంచి యయ్యది ఉమారుద్రుల కేళీ సమయమని మహేంద్రునడ్డగించిరి. తనకు గల్గిన ఉత్సాహభంగమును సహింపక సురసార్వభౌముడు సాహసింపదొడగెను. ఉగ్రుడై నందీశ్వరుడు హుంకారముగావింప గోత్రభిదుడు గాత్రోపఘాతము నొందెను. ఆ బాధతో తూర్పుదిక్కునకు దూలిపోయెను. దానివలన శక్తిలేని శచీపతి సూర్యభగవానుని స్మరించెను. వెంటనే స్వస్థశరీరుడైన సహస్రాక్షుడు సహస్రరశ్మిని సర్వవిధముల స్తుతించి ప్రసన్నునిగావించెను. ఇట్లు సుఖమును సూర్యునివలన పొంది జీవకారుణ్యముగలవాడు గాన సర్వజీవులును సూర్యుని సేవించి తనవలె దు:ఖమునుండి సౌఖ్యమునొందవలెనని సంకల్పించి సూర్యదేవునిజూచి కృతజ్ఞతతో నమస్కరించుచు "ఓ ఛాయాపతి ! అందరికి నీవేగతివి. నిన్ను స్మరించిన నాకు బాధపోయి సుఖము కలిగినది. నిన్ను అహర్నిశము దర్శించుచు నమస్కరించుచు సకల జనులు బాధలులేక సౌఖ్యమొందుటకు నీవిచ్చోట ఉషాపద్మినీఛాయా దేవులతో నిత్యనివాసము జేసికోవలెనను నా కోరికను సఫలము జేయుము" అని వేడుకొనుచున్న ప్రజాసౌఖ్యమునకు పర్వతముల రెక్కలు నరికిన యీ వజ్రహస్తుని నిస్స్వార్థమగు కోరికకు సంతసించి, అనాథనాథుడు, దయామయుడగు ఆదిత్యదేవుడు "తథాస్తు" అని పలికి అంతర్ధానము నొందెను.

సంతుష్టాంతరంగుడగు పాకశాసను డచ్చటనే తన వజ్రాయుధముతో త్రవ్వగా నాతనిపేర నిప్పటికిని వ్యవహరింపబడుచున్న "ఇంద్రపుష్కరిణి" నిర్మింపబడెను. యాత్రికులిందు స్నానమాడిన దేవదేవుడగు సూర్యభగవానుని యనుగ్రహము

సులభమగునని వేయికన్నుల దేవుడెదుర చూచుసరికి  ఈ కర్మసాక్షి యొక్క దివ్య మంగళ విగ్రహము ప్రత్యక్షమయ్యెను. దానియందు వెలయు ధృతకనకచేలు. నవరత్న ఖచిత కిరీటము, పద్మలాంఛితములగు హస్తపద్మములు, విశాలనేత్రములు, మకరకుండలములు గల ప్రసన్న గంభీరవదనంబును, భక్తులకు కార్యసిద్ధినందించు కల్పవృక్షమువలె విలసిల్లు లోకకళ్యాణకరమగు చరణ సరోజ యుగ్మంబును, ధైర్యమును, అపరిమితానందమును విస్మయంబునుద్భవింపజేయుచు దేవేంద్రుని సాహస్రాక్షులకు పండగజేసినవి.  తన సంకల్పము సిద్ధించుటచే సంతోష సముద్రముననున్న సురపతి కత్యంతాశ్చర్యమును కలిగించు విశ్వకర్మ నిర్మితము అపూర్వమును  అద్భుతమగు ఆదిత్యుని దేవాలయ మక్షిగోచరమయ్యెను. అందు పింగళ మాఠరులు ద్వారపాలకులుగా, అనూరుడేకచక్రరథసారథిగా ప్రత్యక్షమైరి. త్రయస్త్రింశత్కోటి దేవతల జయజయధ్వనులు  మిన్నుముట్టె.  సనకసనందనాదులు ఛత్రచామరములతో దేవుని సేవింపవచ్చిరి – నారదముని బృందగానము శ్రోత్రపేయమయ్యెను సంతోషక్రాంతచిత్తలగు నప్సరసలు నృత్యములు సలుపుచుండిరి. సకలజీవులహర్నిశము దివాకరుని దర్శించి కైంకర్యముగావించి తరించుటకై తదాలయమున బృహస్పతి మొదలగువారు వేదపఠనముగావించుచు దేవేంద్రునిచే ఆ దివ్య మంగళ విగ్రహమును ప్రతిష్ఠ చేయించిరి అని పురాణమున వర్ణింపబడెను. ఇట్లు అరసవల్లిలో సర్వలోక శరణ్యుడు ఐహికా ముష్మిక సుఖప్రదాతయగు సూర్యభగవానుడు, మన పూర్వపుణ్యవశమున దర్శనమిచ్చుచున్నాడు.

ఆ పరమేష్ఠి మనల నిట్లను గ్రహించుటచేతనే తృప్తిపడక తన కత్యంత ప్రియులనేక జన్మలనుండి తన భక్తులైనవారినే తనకు అర్చకులుగా నియమించి మనలననుగ్రహించెను. వారాకాలమున ముఖలింగక్షేత్రమున నివసించు ఇప్పిలివారు – శ్రీ సూరప్పగారు, శ్రీ అక్కన్నగారు ఇర్వురు సోదరులు. సదాచార పరాయణులు. సద్గురు సంప్రదాయసిద్ధ శ్రీ పూజా దురంధరులు, పంచాయతన దేవతోపాసకులు. బ్రహ్మతేజోవిరాజితులు – వారికి ఆదిత్యుడు ప్రథమారాధ్యుడు గాన, శ్రీ సూర్యనారాయణ పదపంకజ సేవాసక్తచిత్తులు, అరసవల్లిలో వెలసిన తననర్చించుటకు వారే సర్వ విధముల సమర్థులు, యోగ్యులనియెంచి ఒకే కాలమున స్వప్నమున సాక్షాత్కరించి – హర్షవల్లీపురమున వెలసిన నన్ను సేవింపవలెనని

శాసించెనట. వెంటనే ఆశ్చర్యానంద సంభ్రమములు ముప్పిరిగొన వారు మేల్కొని స్వప్నవృత్తాంతము నన్యోన్యము ముచ్చటించుకొని మహాభాగ్యమగు దైవానుగ్రహమునకు నభినందించి ధన్యవాదములతో కృతజ్ఞతాభి వందనములాచరించిరి.

ఆ స్వప్నమును విశ్వసించుచు భగవదాజ్ఞను శిరసావహించుచు స్మరించుచు, కళ్యాణగుణముల గీర్తించుచు - మానసపూజలు గావించుచు తన్మయులై తత్క్షేత్రమునుండి బయలదేరివచ్చుచు వారు వంశధారా మహానదిలో తమ వద్దకు కొట్టుకొని వచ్చుచున్న తాళపత్ర సంపుటిని గ్రహించి కళ్ళకద్దుకొనగా ఆనందబాష్పములు కాలువలయ్యెను. "భగవంతుడు భక్తపరాధీనుడు, మనకు కావలయు సామగ్రి నందజేయుచున్నాడ"ని హర్షభరితాంతరంగులైరి. దానిని పరిశీలింప వేదోక్త కల్పోక్త సకల పూజా విధానములు గలవు.

వాని ననుసరించి త్రిసంధ్యల పూజలు, కైంకర్యముల చేయుచు - ఇది దైవసంకల్పమని దేవదేవుని అర్చకులుగాను, దేవాలయ ధర్మకర్తలుగానుండిరి. అప్పటినుండి వారి వంశస్థులుగూడ నవీనముగా వెలువడిన గ్రంథజాతమును సేకరించుచు అనూచాన సంప్రదాయ ప్రవర్తకులై పూజ్యులై ఉన్నారు. అర్చకత్వము, ధర్మకర్తృత్వము వారి హక్కై విలసిల్లుచున్నది. వీరి పూర్వులసామాన్యమయిన మహిమగలవారు. వారి పద్ధతి ననుసరించు సచ్ఛ్రోత్రియులగు ఈ ఇప్పిలివారు మహనీయులు.

ఈ క్షేత్ర ప్రాధాన్యమునకు చరిత్రాధారములును గలవు. ఏడవశతాబ్ది రెండవభాగమున మనదేశమును గంగరాజులలో దేవేంద్రవర్మ పరిపాలించెను. అతడీ దేవాలయ ఔన్నత్యమునకు మిక్కిలి ఆదరముజూపెను. త్రికాలముల క్షేత్రస్వామి నారాధించుచుండెను. నిత్యభోగ, ధూప దీపములు, విశేష పూజలు, పర్వదినమున వేడుకలు, కళ్యాణాద్యుత్సవములు ప్రతి సంవత్సరమున నవరాత్రాదులకై భూవసతి మొదలగు భూరివిరాళములిచ్చెను. ఏతన్ని రూపణమునకు వలయు శిలాశాసనములు గలవు. 16వ శతాబ్దిలో మతావేశపరులగు దుండగులు దేవాలయ పరిసర ప్రాంతములు ధ్వంసము చేసిరి. అప్పుడు గర్భాలయమున శ్రీచక్ర ప్రతిష్ఠితుడైన భగవంతుడంతర్ధానమహిమతో నొప్పుచుండ వారిని జూడజాలకపోయిరి.

తరువాత క్రీ.శ. 1788లో శ్రీ యలమంచిలి పుల్లాజీ పంతులుగారు ఆలయ పునరుద్ధరణమునకై దీక్షవహించి కృతార్థులైరి. ఇట్లే పుణ్యాత్ములెందరో దేవాలయాభివృద్ధిగావించి ధన్యులైరి. (గాని, విస్తరణభీతిచే విడువవలసివచ్చినది). శైథిల్యావస్థలోనున్న ప్రాచీన ఆలయంతే 23-2-1999 న తీసివేసి వరుదు బాబ్జీరావు దంపతులచే పున:నిర్మింపబడితే 21-6-1999 దిన మహాకుంభాభిషేకం, మహాసౌరయాగం జరిగినది. ఆనాటి నుండి మరల స్వామివారు భక్తులకు దర్శనభాగ్యం కల్గించారు.

"భగవాన్భక్తిభావన:" భక్తితో భావనజేసి భజించినగాని, భగవత్సాక్షాత్కారము కలుగదని విందుముగాని, ఈ దేవదేవుడు ప్రత్యక్షదైవముగా మనకు సాక్షాత్కరించుచున్నాడు. కనుకనే అందరికంటే సులభుడు. ఆదిత్యహృదయము సూర్యభగవానుని స్వరూప స్వభావముల స్పష్టపరచును - కనుక, ప్రతి దినమున నందఱు ఆదిత్యహృదయ పారాయణము గావింతురు. అది విశేష ఫలములనిచ్చును. మఱియు సూర్యనమస్కారములను జేయువారు సూర్యుని సత్కృపాపాత్రులు, సూర్య ప్రీత్యర్థము, క్షీరాన్నభోగము గావింతురు. ఈ పూజలు,నమస్కారములు, భోగములు తమ గృహములో జరుపుటకంటె పురాణ ప్రసిద్ధమగు ఈ దేవాలయమున జరుపుట కోటిరెట్లు ఫలితమునొసంగును.

*శ్లో॥ హర్షవల్లీ పురీవాసం ఛాయోషా పద్మినీయుతమ్*
*సర్వదేవనుతం నౌమి భాస్కరం మంగళాకరమ్ ॥*

అని భక్తులు భజింతురు. రాజ్య భ్రష్టులగు మహారాజులు సూర్యానుగ్రహము వలన విజయముపొందిరని పురాణములలో గలదు. భాగవతము "తేజస్కామో విభావసుమ్'' అని తేజస్సునుగోరువారు సూర్యునారాధింపవలెనని బోధించుచున్నది - మత్స్యపురాణమున "ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్" అని ఉండుటచే సూర్యుడు సకల రోగములను బోగొట్టి ఆరోగ్యమును ప్రసాదించునని నిరూపింపబడెను. శ్రీమద్వాల్మీకి రామాయణము శ్రీరామునకు రావణుని వధించుటకై ఆదిత్యహృదయము నుపదేశించి దీనిని ముమ్మారు పఠించి యుద్ధమునకు వెళ్ళినచో రావణుని జయింతువని అగస్త్యమహర్షి చెప్పగా శ్రీరాముడు ఆవిధముగా చేసి విజయమునొందెనని తెలుపుచున్నది. శ్రీమద్భాగవతమున సత్రాజిత్తు సూర్యభగవానునారాధించియే వాని అనుగ్రహమున శ్యమంతకమణిని పొందెనని సూర్యమహిమ వర్ణింపబడెను.

స్కందపురాణము "దినేశం సుఖార్థం" అని సకల సుఖములకు సవితృసమారాధనే నిదానమని వక్కాణించెను. సాంబపురాణము దుర్వాసుని శాపమువలన ప్రాప్తించిన కుష్ఠురోగమును సాంబుడు సూర్యోపాసనవలన పోగొట్టుకొనెను అని ప్రతిపాదించెను. మహాభారతములో ధర్మరాజు అరణ్యవాస సమయమున దరిద్రుడై యుండి – ఆదిత్యునుపాసించియే వాని అనుగ్రహమున అక్షయపాత్రనుబొంది – పొగడదగిన అతిథి సత్కారముజేసి యశస్సాంద్రుడయ్యెనని వివస్వంతుని మహిమను వెల్లడించెను. ఋగ్వేదము ఋక్కులనేకముతో భాస్కరుని ప్రభావము ప్రస్తుతించెను. అధర్వణ వేదమేయే ఋక్కులచే నేయేవిధముగా ధ్యానించిన యేయే రోగములుపశమించునో స్పష్టీకరించెను. అరుణ తృచసౌరములలో పెక్కు ఋక్కులు సూర్యోపాస్తినే ఉగ్గడించుచున్నవి. అంధుడగు అమర మహాకవి తన అంధత్వమును సూర్యస్తుతి చేసి పోగొట్టుకొనెను. మయూరుడు సూర్యశతకమును విరచించి కుష్ఠువ్యాధిని పోగొట్టుకొనెను. శ్రోత్రియులు ప్రతిదినమును ఆదిత్యహృదయ పారాయణము చేయనిదే భోజనము చేయరు.

ఇవి పూర్వకాలపు పలుకులుగాని, ఈ కాలమున నిట్టిఫలితములు పొందలేమని నిరాశ లొందకూడదు. "క్షిప్రంహి మానుషే లోకే సిద్ధిర్భవతి కర్మజా" అని గీతాచార్యుల సూక్తి. పూర్వము వలె ఆలస్యములేక వేగముగా కర్మల ఫలితమును మనుష్యలోకమున మానవులు పొందుదురని అర్థము.

ఈ క్షేత్రస్వామి ప్రత్యక్షదైవతము – ఫలితములు వెంటనే కలుగుట ప్రత్యక్షానుభవము. ఇప్పుడు కూడ భక్తులు యాత్రికులు విశ్వాసముకలవారై పూజలు, అభిషేకములు, నమస్కారములు, అష్టోత్తర–శత–సహస్రనామార్చనలు, తృచ, అరుణ, సౌరములలోని ఋక్కులతో నమస్కారములు, భోగములు భక్తిపూర్వకముగా జరుపుచు, జరిపించుచు – అంధులు, ఆధివ్యాధి బాధితులు కుష్ఠు రోగులు, క్షయవ్యాధి గలవారు, బొల్లి – మచ్చలు గలవారును సంపూర్ణారోగ్యము గలవారై, కృతార్థులై సూర్యానుగ్రహమునకు సంతసించుచు కృతజ్ఞతతో స్వస్థలములకు వెడలుచుండుట కన్నులారా గాంచుచున్నాము. ఇది మాకు ప్రత్యక్షము. యింకను విశేష నిదర్శనములు గలవు.

ఇప్పటికీ ఉత్తరాయణ దక్షిణాయణ సమయములయందు శ్రీ సూర్యభగవానుని కిరణములుదయించు సమయమున ఈ క్షేత్ర స్వామి యొక్క పాదపద్మములపై బడును. మఱియు శ్రీస్వామి వారి విగ్రహముయొక్క నడుమనందు ఛురిక (చిరుకత్తి) యొకటి కలదు. దీనికి సూర్యకతారి యని ప్రసిద్ధిగలదు. శ్రీ తిరుమలేశుని విగ్రహమందుగూడ నిట్లేకలదు. ఈ ఆలయమందు ఐరావతము నధిష్ఠించిన దేవేంద్రునియొక్క విగ్రహము విలసిల్లుచున్నది. ఇంకనెన్నో నిదర్శనములతో ఆలయమలరారుచున్నది. కర్మసాక్షి. ప్రత్యక్షదైవతమగు నీతడు గ్రహాధిపతి గాన దర్శనమాత్రముచే సర్వ గ్రహారిష్టములు శాంతించును. ఆదిదేవుడగు నీతని అనుగ్రహమునకై ధర్మశాస్త్రము ఆదివారమున ఏకభుక్తము (ఒకపూట భోజనము)ను విధించెను. ఆదివార నియమములు పాటించు భక్తులు శోకదారిద్ర్యములు, ఆధివ్యాధులు లేక సుఖజీవితము గడుపుదురని తరువాత సూర్యలోకమును పొందుదురని "స్త్రీ తైల మధుమాంసాని యస్త్యజేత్తు రవేర్దినే నవ్యాధి శోకదారిద్ర్యం సూర్యలోకం సగచ్ఛతి" అను ప్రమాణము గలదు.

పురాణ ప్రసిద్ధమయిన ఈ క్షేత్రమున భక్తులింద్రపుష్కరిణిలో స్నానముచేసి శ్రీసూర్యనారాయణస్వామిని దర్శించి సేవించి భవ్యమగు భగవంతుని అనుగ్రహమును జన్మసాఫల్యమును బొందుదురుగాక.

# ఆదిత్యహృదయ స్తోత్రము

ఓం తతో యుద్ధ పరిశ్రాంతం । సమరేచింతయాస్థితం
రావణం చాగ్రతో దృష్ట్వా । యుద్ధాయసముపస్థితం ॥
దైవతైశ్చసమాగమ్య । ద్రష్టుమభ్యాగతోరణం
ఉపాగమ్యాబ్రవీద్రామం । అగస్త్యో భగవాన్ ఋషిః ।

రామ! రామ! మహాబాహో! శృణుగుహ్యం సనాతనం
ఏన సర్వానరీన్వత్స! సమరే విజయిష్యసి ॥
ఆదిత్యహృదయం పుణ్యం । సర్వశత్రు వినాశనం
జయావహం జపేన్నిత్యం । అక్షయ్యం పరమం శివం ॥
సర్వమంగళ మాంగల్యం । సర్వపాపప్రణాశనం
చింతాశోక ప్రశమనం । ఆయుర్వర్ధనముత్తమం ॥

రశ్మిమంతం సముద్యంతం । దేవాసుర నమస్కృతం
పూజయస్వ వివస్వంతం । భాస్కరం భువనేశ్వరం ।

సర్వదేవాత్మకోహ్యేష । తేజస్వీ రశ్మిభావనః
ఏషదేవా సురగణాన్ । లోకాన్ పాతిగభస్తిభిః ॥

ఏషబ్రహ్మాచ విష్ణుశ్చ । శివస్కందః ప్రజాపతిః ॥
మహేంద్రోధనదః కాలో । యమస్సోమోహ్యా పాంపతిః ॥

పితరో వసవస్సాధ్యా । హ్యశ్వినౌ మరుతోమనుః
వాయుర్వహ్నిః ప్రజా ప్రాణా । ఋతుకర్తాప్రభాకరః ॥

ఆదిత్యస్సవితా సూర్యః । ఖగః పూషాగభస్తిమాన్
సువర్ణ సదృశోభానుః। స్వర్ణ రేతా దివాకరః ॥
హరిదశ్వ స్సహస్రార్చిః । సప్తసప్తిర్మరీచిమాన్ ।
తిమిరోన్మథనశ్శంభుః । త్వష్టామార్తాండ అంశుమాన్ ॥

హిరణ్యగర్భశ్శిశిరః । తపనోభాస్కరో రవిః
అగ్నిగర్భో ౖదితేః । పుత్రః శంఖశ్శిశిర నాశనః ॥

వ్యోమనాథస్త మోభేదీ । ఋగ్యజుస్సామపారగః
ఘనవృష్టి రపాంమిత్రో। వింధ్య వీథీప్లవంగమః ॥
అతపీ మండలీ మృత్యుః । పింగళః సర్వతాపనః
కవిర్విశ్వో మహాతేజా । రక్త స్సర్వభవోద్భవః ॥
నక్షత్ర గ్రహతారణాం । అధిపో విశ్వభావనః
తేజసామపి తేజస్వీ । ద్వాదశాత్మన్ ! నమోస్తుతే ॥

నమః పూర్వాయగిరయే । పశ్చిమాయాద్రయేనమః
జ్యోతిర్గణానాం పతయే । దినాధి పతయే నమః ॥

జయాయ జయభద్రాయ । హర్యశ్వాయ నమోనమః
నమోనమస్సహస్రాంశో । ఆదిత్యాయ నమోనమః ॥

నమ ఉగ్రాయ వీరాయ । సారంగాయ నమో నమః
నమః పద్మప్రబోధాయ । మార్తాండాయ నమోనమః ॥

బ్రహ్మేశానాచ్యుతేశాయ । సూర్యాయాదిత్య వర్చ సే
భాస్వతే సర్వభక్షాయ । రౌద్రాయ వపుషేనమః
తమోఘ్నాయ హిమఘ్నాయ । శత్రూఘ్నాయామితాత్మనే
కృతఘ్నఘ్నాయ దేవాయ । జ్యోతిషాం పతయే నమః ॥

తప్త చామీకరాభాయ । వహ్నాయే విశ్వకర్మణే
నమస్తమోభినిఘ్నాయ । రుచయే లోకసాక్షిణే ॥

నాశయత్యేష వైభూతం । తదేవసృజతిప్రభుః
పాయత్యేష తపత్యేష । వర్షత్యేష గభస్తిభిః ॥

ఏషసుప్తేషు జాగర్తి । భూతేషు పరినిష్ఠితః
ఏషచైవాగ్ని హెూత్రంచ । ఫలం చైవాగ్ని హెూత్రిణాం ॥

వేదాశ్చ క్రతవ శ్చైవ । క్రతూనాం ఫలమేవచ
యానికృత్యానిలోకేషు । సర్వ ఏషరవిప్రభుః ॥

ఏనమాపత్సు కృచ్ఛ్రేషు । కాంతారేషు భయేషుచ
కీర్తయన్ పురుషః కశ్చి । న్నావసీదతి రాఘవ !

పూజయ స్వైనమేకాగ్రో । దేవదేవం జగత్పతిం
ఏతత్త్రి గుణితం జప్త్వా ॥ యుద్ధేషు విజయిష్యసి ॥

ఆస్మిన్ క్షణే మహాబాహెూ ॥ రావణం త్వంవధిష్యసి
ఏవముక్త్వా తదాగస్త్యో । జగామచ యథాగతమ్ ॥
ఏతచ్ఛ్రుత్వా మహాతేజా । నష్టశోకోఽభవత్తదా
ధారయామాస సుప్రీతో రాఘవః ప్రయతాత్మవాన్ ॥

ఆదిత్యం ప్రేక్ష్య జప్త్వాతు । పరం హర్షమవాప్తవాన్
త్రిరాచమ్య శుచిర్భూత్వా ॥ ధనురాదాయ వీర్యవాన్ ॥
రావణం ప్రేక్ష్య హృష్టాత్మా । యుద్ధాయ సముపాగమత్
సర్వయత్నేన మహతా ॥ వధేతస్యధృతోఽభవత్ ॥

అధరవిరవద న్నిరీక్ష్య రామం
ముదితమనాః పరమం ప్రహృష్యమాణః
నిశిచరపతి సంక్షయం విదిత్వా
సురగణమధ్యగతో వచస్త్వరేతి ॥

*॥ ఆదిత్య హృదయ స్తోత్రం సమాప్తం ॥*

**॥ ఇతిశమ్ ॥**

## శ్రీ సాంబ పంచాశికా

# శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానం, అరసవల్లి
## పారంపర్య అర్చక ధర్మకర్తలు - ఇప్పిలి వంశీకులు



శ్రీ ఇప్పిలి చిన్నసన్యాసులు గారు
1938 వరకు



శ్రీ ఇప్పిలి పెద్దసన్యాసులు గారు
1939 వరకు



శ్రీ ఇప్పిలి సూర్యనారాయణ గారు
1944 వరకు



శ్రీ ఇప్పిలి వేంకటరామశర్మ గారు
1975 వరకు



శ్రీ ఇప్పిలి జోగారావు గారు
1989 వరకు



శ్రీ ఇప్పిలి శంకరశర్మ గారు
ధర్మకర్త 1989 నుండి
ప్రస్తుత ప్రధాన అర్చకులు



శ్రీ ఇప్పిలి జోగిసన్యాసిరావు గారు
ప్రస్తుత వ్యవస్థాపక ధర్మకర్త మరియు అధ్యక్షులు, ధర్మకర్తల మండలి
2009 నుండి

**ఇప్పిలి వంశీయుల స్వగృహం అరసవల్లిలో 2017 ఏప్రిల్ 12-14 శ్రీ హేవళంబి చైత్ర బహుళ పాడ్యమి తదియలలో జరిగిన నూతన శ్రీచక్ర ప్రతిష్ఠా కార్యక్రమ సందర్భంగా అందుబాటులో ఉన్న కుటుంబ సభ్యులు, బంధువుల ఛాయాచిత్రం. (ఎడమ నుంచి కుడికి)**



నేలపై కూర్చున్న చిరంజీవులు : దార్లపూడి హర్షిత, దార్లపూడి హరిణి, మురపాక జ్యోత్స్న, ఇప్పిలి సూర్య ప్రకాష్, ఇప్పిలి చరణ్ కార్తిక్, ఇప్పిలి శ్రీరామ యశస్వి, ఇప్పిలి శ్రీ ప్రణవి, ఇప్పిలి సిద్ధేంద్ర, ఇప్పిలి శ్రీరాగ, ఇప్పిలి అమృత, ఇప్పిలి సుషుమ్న, వనమాలి అశ్విన్‌కుమార్, వనమాలి అరుణ, మురపాక వసంత, ఇప్పిలి శిరీష

కుర్చీలో కూర్చున్నవారు : దార్లపూడి ప్రసాదరావు, ఇప్పిలి శంకరశర్మ, భోగాపురపు వెంకటరమణమూర్తి, సుసరాపు వెంకటేశ్వరభుక్త, భాస్కరభట్ల నరసయ్య, జోశ్యుల సీతాపతి, ఇప్పిలి రామకృష్ణారావు, ఇప్పిలి వేణురత్నం, ఇప్పిలి జోగి సన్యాసిరావు, ఇప్పిలి ప్రభాకరరావు, ఇప్పిలి రాజేశ్వరకాశ్యప, ఇప్పిలి సుబ్బలక్ష్మి, ఇప్పిలి శాంతారావు, ఇప్పిలి మాధవరావు

మూడవ వరుసలో కూర్చున్నవారు : కొండేపూడి శాంతి, దార్లపూడి శ్రీవిద్య, ఇప్పిలి దుర్గాభాను, భోగాపురపు హైమావతి, సుసరాపు సుమతి, వనమాలి సీతమ్మ, జోశ్యుల సూర్యకుమారి, జోశ్యుల శాంతామణి, ఇప్పిలి పార్వతి, ఇప్పిలి విజయలక్ష్మి, ఇప్పిలి వల్లీసుందర భవాని, ఇప్పిలి శ్రీలత, వనమాలి లలితాంబ, ఇప్పిలి శాంతామణి, ఇప్పిలి లక్ష్మి

నాల్గవ వరుసలో నిల్చున్నవారు : ఇప్పిలి రాజశేఖర్, ఇప్పిలి రోహిణి, ఇప్పిలి రంజిత్‌కుమార్, ఇప్పిలి సింహ ప్రదీప్, ఇప్పిలి ప్రశాంతి, ఇప్పిలి రిషిత, ఇప్పిలి సాందీప్, ఇప్పిలి ఉష, ఇప్పిలి శ్రీహర్ష, ఇప్పిలి శ్రీవాణి, ఇప్పిలి ఫణీంద్రశర్మ, ఇప్పిలి సుస్మిత, ఇప్పిలి సంధ్యశ్రీ, ఇప్పిలి శ్రీకాంత్ ప్రసాద్, ఇప్పిలి సంయుక్త, ఇప్పిలి శారదా నంది సాత్విక, వనమాలి రమాదేవి, వనమాలి కళ్యాణి,

అయిదవ వరుసలో నిల్చున్నవారు : ఇప్పిలి షణ్ముఖ, ఇప్పిలి మార్తాండ, ఇప్పిలి క్షేమేంద్ర, ఇప్పిలి శరత్‌కుమార్

# శ్రీ సాంబ పంచాశికా

శ్రీ విద్యాభాస్కర, శ్రీ శుకానందనాథ
ఇప్పిలి వేంకటరామశర్మగారు
ధర్మపత్ని మంగళాంబ శ్రీమతి శశిరేఖమ్మగారు





ఇప్పిలి వేంకటరామశర్మ గారి ప్రధమ పుత్రుడు బాలసుబ్రహ్మణ్యశాస్త్రి, వారి కుటుంబ సభ్యుల ఛాయాచిత్రము



ఇప్పిలి వేంకటరామశర్మ గారి కనిష్ఠ పుత్రుడు ప్రభాకరరావు, వారి కుటుంబ సభ్యుల ఛాయాచిత్రము



శ్రీశ్రీశ్రీ సూర్యనారాయణస్వామి వారి నిజరూపం



మూలవిరాట్‌పై సూర్యకిరణ స్పర్శ

కృష్ణా గ్రాఫిక్స్, శ్రీకాకుళం, 9440002025

శ్రీ సాంబ పంచాశికా

# మిత్ర దంపతులతో వ్యాఖ్యాతృ దంపతులు



బ్రహ్మశ్రీ కొల్లూరు అవతారశర్మగారు, శ్రీమతి వెంకటరమణమ్మ గారు

కీ॥శే॥ ఇప్పిలి బాలసుబ్రహ్మణ్యశాస్త్రి గారు,  శ్రీమతి కామేశ్వరిగారు

# గ్రంథకర్త పరిచయం



పేరు :

**'శ్రీపాదుక' ఆచార్య కొల్లూరు అవతారశర్మ**

భార్య :

**శ్రీమతి కొల్లూరు వెంకటరమణమ్మ**

భాషాప్రవీణ, రాష్ట్రభాషాప్రవీణ, సంస్కృతభాషాకోవిద,

యం.ఏ.,తెలుగు, పి.ఓ.యల్.(సంస్కృతం)

విశ్రాంత ప్రథమశ్రేణి తెలుగుపండితురాలు

జననీ జనకులు :

**స్వర్గీయ కొల్లూరు లక్ష్మీసోమిదమ్మ**

**స్వర్గీయ శ్రీ కొల్లూరు లక్ష్మణమూర్తిశర్మ** (ఆంధ్రవిశ్వవిద్యాలయ స్వర్ణపతకగ్రహీత)

(న్యాయ మీమాంసాలంకార వేదాంతశాస్త్ర పండితులు)

విజయనగర మహారాజా సంస్కృతకళాశాల మఱియు ఆంధ్ర విశ్వవిద్యాలయం

జన్మస్థలం : విజయనగరం

విద్యాభ్యాసం : డిగ్రీస్థాయి వరకు విజయనగర మహారాజావారి విద్యాసంస్థలు.

ఉన్నతవిద్య : ఆంధ్రవిశ్వవిద్యాలయం

విద్యార్హతలు : ఓరియంటల్ టైటిల్స్ – **సాహిత్యవిద్యాప్రవీణ, రాష్ట్రభాషాప్రవీణ, సంస్కృతభాషా కోవిద, విద్యావారిధి** (పి.హెచ్.డి.వ్యాకరణ– శిక్షాశాస్త్రములు)

డిగ్రీలు : ఎం.ఏ. (సంస్కృతం) ఎం.ఏ (తెలుగు), బియస్సీ., బి.యి.డి.,

పి.హెచ్.డి.(సంస్కృతం – అలంకారశాస్త్రం)

వృత్తి : రిటైర్డ్ రీడర్ (సంస్కృత విభాగాధ్యక్షుడు)

శ్రీపీఠికాపురాధీశ ప్రభుత్వడిగ్రీకళాశాల, కాకినాడ.

గ్రంథములు : పాణినీయ శిక్ష (తెలుగు) ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమీవారి ఆర్థిక సహాయంతో ముద్రింపబడినది. ఆంధ్రదేశీయద్రావిడులచరిత్ర మఱియు సంస్కృతి, శ్రీ సారంగధరేశ్వరాలయచరిత్ర, 'జ్ఞానపూర్ణిమ' శివోఽహం శివోఽహం శివఃకేవలోహమ్, ఐశ్వర్యవిద్యాసర్వస్వము, ఆంజనేయము పాస్మహే, అయ్యప్పదర్శనం, శ్రీపాదుకాకల్పము, హనుమత్తత్త్వరహస్యోపనిషత్తు, సంపాదకీయాల షష్టిపూర్తిసంచిక, సూర్య శతకము, అమ్మతో ముఖాముఖి, ఐశ్వర్యశ్రీకల్పము, శివశతకము, ఉపనయనం ఎందుకు?, శ్రీపాదుకా కామేశ్వరమ్, శ్రీపాదుకాసత్యదేవమ్, పూర్ణమీమాంస, విశ్వనాథపంచశతి. శ్రీపాదుకాన్నపూర్ణమ్, శ్రీపాదుకా విశ్వనాథమ్, శ్రీఅన్నపూర్ణావ్రతము – శ్రీపాదుకాకల్పము. కాశీకేదారేశ్వరశ్రీపాదుకా , **యజ్ఞ ప్రసాదము 1 మరియు 2 భాగములు**

అముద్రితములు : శ్రీబాలాశతకము, శ్రీచక్రసంచారిణీశతకము, సౌందర్యలహరి (తెలుగు పద్యానువాదము), శివానందలహరి (తెలుగు పద్యానువాదము) మందాక్రాన్తా సౌందర్యలహరి (సంస్కృతం), దశమహావిద్యాదిస్తోత్ర కదంబము, 'భగవద్గీత – శంకరహృదయము', 'మంగళచండీశతకము'. శ్రీ హనుమత్ శతకము, శ్రీరామ శతకము.